
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 100
సోమవారం 1-7-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



'అద్భుత క్షణాలివి'

టి20 వరల్డ్‌కప్ టైటిల్ సాధించడం తన కెరీర్‌లోనే అతి పెద్ద ఘనత అని భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు. ఈ విజయాన్ని ఎంతగానో కోరుకున్నామని, అందుకే ఇది మరింత ఆనందాన్ని పంచుతోందని అతను అన్నాడు. మరోవైపు టి20 వరల్డ్‌కప్ నెగ్గిన భారత జట్టుకు బీసీసీఐ ఏకంగా రూ. 125 కోట్లు నజరానాగా ప్రకటించింది.

16లో



జన స్పందనకు వందనం

ఎన్నికల్లో 65 కోట్ల మంది ఓటు వేశారని, దేశ ప్రజాస్వామ్య ప్రక్రియల పట్ల తిరుగులేని విశ్వాసం వ్యక్తం చేశారని మోదీ అన్నారు.


వివరాలు 6లో ▸



నేటి నుంచి కొత్త నేర చట్టాలు

బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు తెరపడింది. భారత న్యాయ వ్యవస్థలో మూడు కొత్త నేర చట్టాలు నేటినుంచి అమల్లోకి రానున్నాయి.

వివరాలు 6లో ▸



బైడెన్ తప్పుకోవాలంటూ ఒత్తిళ్లు

డొనాల్డ్ ట్రంప్‌కు మాటకుమాట దీటుగా బదులివ్వలేక చేతులెత్తేసిన జో బైడెన్‌పై సొంత పార్టీలోనే వ్యతిరేకత ఎక్కువవుతోంది.

వివరాలు 6లో ▸



విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా..

రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

వివరాలు 18లో ▸



స్మార్ట్ సిటీ మిషన్
గడువు పెంపు

- వివిధ రాష్ట్రాల్లోని నగరాల్లో పూర్తికాని స్మార్ట్ సిటీల పనులు
- గడువు పెంచాలన్న విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్రం

- వివరాలు 18లో

ప్రజా'వాణి' వినిపించదా?



ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం

- సీఎం ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుల్లో 70 శాతానికిపైగా పెండింగ్
- రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సిబ్బందికి వెళ్లిన దరఖాస్తులు 13,513
- పరిష్కరించినవి 3,147 దరఖాస్తులే.. సీఎం జిల్లాలోనూ ఇదే పరిస్థితి
- హైదరాబాద్, హనుమకొండ, వరంగల్‌ల పరిధిలో పరిష్కారం సున్నా
- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనూ భారీగా పేరుకుపోతున్న అర్జీలు
- కలెక్టర్లు, తహసీల్దార్లు పట్టించుకోవడం లేదనే విమర్శలు
- చాలా పనులు ఉన్నాయంటూ అర్జీలను పక్కన పెడుతున్న రెవెన్యూ సిబ్బంది!

సాక్షి, హైదరాబాద్: ఇబ్బంది ఏదైనా, పరిష్కార వేదిక ఏదైనా.. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు మాత్రం పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. భూసంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టినా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది. ఎక్కడికక్కడ ప్రజా సమస్యల అర్జీలు పేరుకుపోతూనే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ వర్గాలు పరిష్కరించినవి 30శాతం కూడా దాటలేదు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఇప్పటివరకు రెవెన్యూ శాఖకు 13,513 దరఖాస్తులు రాగా.. అందులో పరిష్కారమైనవి 3,147 దరఖాస్తులు మాత్రమే. మిగతా 10,366 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రెవెన్యూ శాఖకు వెళ్లే దరఖాస్తుల్లో ఎక్కువశాతం ధరణి సంబంధిత సమస్యలే ఉంటాయని.. కొన్నిచోట్ల పింఛన్లు, షాదీముబారక్, కల్యాణలక్ష్మి వంటి దరఖాస్తులు వచ్చాయని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

కేవలం విచారణతోనే సరి!

ప్రజావాణి కింద వస్తున్న దరఖాస్తుల్లో ఎక్కువగా ధరణికి సంబంధించినవే ఉంటున్నాయని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. ధరణి పోర్టల్‌లో తమకు వచ్చిన లాగిన్‌ల ఆధారంగా సదరు దరఖాస్తులను పరిశీలించి, విచారణ జరిపి రిపోర్టు పంపించే అధికారం మాత్రమే తమకు ఉందని తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. నిజానికి ఈ దరఖాస్తులను విచారించేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది కూడా లేరని.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఛిన్నాభిన్నమైన

మిగతా 3వ పేజీలో ▶

ఆర్మీ చీఫ్‌గా జనరల్ ఉపేంద్ర ద్వివేది

- చైనా, పాకిస్తాన్‌లతో సరిహద్దుల్లో సుదీర్ఘ కార్యాచరణ అనుభవమున్న లెఫ్టినెంట్ జనరల్
- దేశ సైనిక చరిత్రలోనే మొదటిసారిగా ఆర్మీకి, నేవీకి సారథ్యం వహిస్తున్న ఇద్దరూ క్లాస్‌మేట్స్

- వివరాలు 6లో


నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి


ఆదివారం ఢిల్లీలో జనరల్ మనోజ్ పాండే నుంచి 30వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జనరల్ ఉపేంద్ర ద్వివేది

అంగన్‌వాడీల్లో రిటైర్మెంట్ లొల్లి!

65 ఏళ్లు దాటితే పదవీ విరమణ తప్పనిసరన్న ప్రభుత్వం

- విధులకు రావొద్దని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు స్పష్టీకరణ..
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ
- రిటైర్మెంట్ ప్యాకేజీలో టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ. 50 వేలు ఇస్తామన్న సర్కారు.. ప్యాకేజీ పెంచకుండా రిటైర్మెంట్ కుదరదంటున్న సంఘాలు

- వివరాలు 3లో

విద్యుత్ కేంద్రాల రక్షణపై పిడుగు!


బీటీపీఎస్‌లోని జీటీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎగిసిపడుతున్న మంటలు (ఫైల్)

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో పిడుగుల నుంచి రక్షణకు పటిష్ట వ్యవస్థలు

- అయినా అవి విఫలం కావడంతోనే భద్రాద్రి కేంద్రంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగుపాటు
- డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలే కారణమని అనుమానాలు
- రూ. వేల కోట్లతో నిర్మించిన కొత్త విద్యుత్ కేంద్రాల భద్రతపై సందేహాలు..
- శ్రీశైలం పవర్ హౌస్ ప్రమాదం నుంచి జెన్‌కో ఏమీ నేర్చుకోలేదని విమర్శలు

2లో



NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Venkobb CHICKEN
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate ₹ 70	Ex Farm Live Bird	112 kg	Dressed with Skin	194 kg
	Retail Live Bird	134 kg	Skin Less	221 kg

Issued in the interest of consumers



‘పల్లె’కూ బ్యాటరీ బస్సులు

పల్లెవెలుగుతోపాటు ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ సర్వీసులకూ వినియోగం

- ‘నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రాజెక్టు’ కింద టీజీఎస్ ఆర్టీసీకి 450 ఎలక్ట్రిక్ బస్సులు
- ఢిల్లీకి చెందిన జేబీఎం సంస్థకు కాంట్రాక్టు.. అద్దె ప్రాతిపదికన ఆర్టీసీలో నిర్వహణ
- హైదరాబాద్ - నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, సూర్యాపేట మధ్య ప్రయాణం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ వెలుపలా ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెట్టబోతున్నాయి. ఇప్పటి వరకు హైదరాబాద్‌లో పరిమితంగా తిరుగుతున్న ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తేవాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇటీవల హైదరాబాద్–విజయవాడ మధ్య ప్రయోగాత్మకంగా పది ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను గరుడ ప్లస్ కేటగిరీలో ప్రారంభించారు. ఇప్పుడు తొలిసారి రాష్ట్రపరిధిలో హైదరాబాద్‌తో ఇతర ప్రధాన పట్టణాలను ఎలక్ట్రిక్ బస్సులతో అనుసంధానించే బృహత్తర కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. ఇవి సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు కేటగిరీలో సేవలందించనున్నాయి. ఇప్పటివరకు నగరం వెలుపలి ప్రాంతాలకు ఎలక్ట్రిక్ బస్సులు లేవు. ఆ లోటును భర్తీ చేస్తూ 450 బస్సులు ఆర్టీసీ బస్సు శ్రేణిలో చేరబోతున్నాయి. మరో వారం తర్వాత నుంచి ఈ బస్సులు దశలవారీగా రోడ్డెక్కనున్నాయి. హైదరాబాద్–నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, సూర్యాపేట మధ్య ఇవి తిరగనున్నాయి.

ఒకసారి చార్జింగ్ చేస్తే 350 కి.మీ. వరకు ప్రయాణం

నేషనల్ ఎలక్ట్రిక్ బస్సు ప్రోగ్రాం కింద సరఫరా..

దేశవ్యాప్తంగా వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటానని భారత్ ఐక్యరాజ్య సమితికి హామీ ఇచ్చి, ఆమేరకు చర్యలు ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో ఉంచుకునే మోదీ ప్రభుత్వం గతంలో ‘ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యూఫాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఫేమ్)’పేరుతో పథకాన్ని ప్రారంభించింది. రెండుదశల్లో దీన్ని అమలు చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ విమానాశ్రయానికి నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు ఈ పథకం కింద వచ్చినవే. రెండోదశలో మరో 500 బస్సుల కోసం ఆర్టీసీ ప్రతిపాదించగా, అవి కూడా మంజూరయ్యాయి. కానీ కొన్ని కారణాలతో ఆ కాంట్రాక్టు వ్యవహారం న్యాయస్థానానికి చేరింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉండటంతో ఆ బస్సులు రాలేదు. ఇప్పుడు ఫేమ్ స్థానంలో కేంద్రప్రభుత్వం నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రాజెక్టు(ఎన్ఈబీపీ)ను ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు కింద తెలంగాణ ఆర్టీసీకి 450 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయి. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) పద్ధతిలో బస్సులు సరఫరా చేసే ఆ టెండర్‌ను ఢిల్లీకి చెందిన జేబీఎం కంపెనీ దక్కించుకుంది.

వారంరోజుల్లో తొలిదశ బస్సులు

బ్యాటరీ బస్సులకు జేబీఎం సంస్థ మరో వారంరోజుల్లో శ్రీకారం చుట్టనుంది. ఆ సంస్థనే అద్దె ప్రాతిపదికన బస్సుల నిర్వహణ చూసుకుంటుంది. డ్రైవర్ల బాధ్యత జేబీఎందే కాగా,కండక్టర్ మాత్రం ఆర్టీసీ నుంచి విధుల్లో ఉంటాడు. ఈ బస్సులను నడిపినందుకుగాను ప్రతి కి.మీ.కు రూ.40 చొప్పున అద్దెను ఆర్టీసీ ఆ సంస్థకు చెల్లిస్తుంది. వీటికి అవసరమైన చార్జింగ్ వ్యవస్థను ఆ సంస్థనే ఏర్పాటు చేసుకుంటుంది. హైదరాబాద్‌తోపాటు ఆయా పట్టణాల్లోని సంబంధిత డిపోల్లో వీటిని ఏర్పాటు చేస్తుంది. తొలుత 20 బస్సులు రానున్నాయి. అలా విడతలవారీగా వచ్చే రెండు నెలల్లో మొత్తం బస్సులు రోడ్డెక్కే అవకాశముంది. 450 బస్సులను సరఫరా చేయాల్సి ఉండగా, 400 బస్సులకు సంబంధించిన షెడ్యూళ్లను ఆర్టీసీ ఆ సంస్థకు అందించింది. ఇప్పుడు ఆ 400 బస్సులు వీలైనంత త్వరలో అందుబాటులోకి తేవాలని ఆర్టీసీ ఆ సంస్థకు సూచించింది. వీటిల్లో 245 ఎక్స్‌ప్రెస్ బస్సులు, 85 సూపర్ లగ్జరీ బస్సులు, 70 పల్లెవెలుగు సర్వీసులు ఉంటాయి. దాదాపు వేయి వరకు డీజిల్ బస్సులను ఆర్టీసీ దశలవారీగా సమకూర్చుంటుండగా, వాటికి అదనంగా ఈ ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తున్నాయి.

గతంలో ఎలక్ట్రిక్ బస్సులు ఒకసారి ఫుల్‌చార్జ్ చేస్తే 225 కి.మీ.వరకు తిరిగేవి. దీంతో వాటిని దూర ప్రాంతాలకు నడపటం కష్టంగా మారింది. హైదరాబాద్ నుంచి గమ్యం చేరి తిరిగి సిటీకి వచ్చేలోపు చార్జింగ్ అయిపోయే పరిస్థితి ఉండేది. ఈ సమస్యను అప్పటికిప్పుడు అధిగమించలేక ఇతర పట్టణాలకు తిప్పేందుకు ఆర్టీసీ సాహసించలేదు. ఇప్పుడు కొత్తగా వస్తున్న బస్సులు ఫుల్‌చార్జ్ చేస్తే 350 కి.మీ.వరకు నడుస్తాయి. దీంతో దూరప్రాంత పట్టణాలకు వాటిని తిప్పేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఆయా పట్టణాల్లో కూడా చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నందున, తిరుగు ప్రయాణంలో మళ్లీ ఫుల్ చార్జింగ్‌తో వస్తాయి. దీంతో మధ్యలో చార్జ్ చేయాల్సిన అవసరం ఉండదు.

క్లుప్తంగా...

పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవం

ఎమ్మెల్యే తలసాని



సనత్‌నగర్ (హైదరాబాద్): తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, కార్యకర్తలు, నాయకులు అయోమయానికి గురికావద్దని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద ఆదివారం నిర్వహించిన సనత్‌నగర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన సోదరుడు శంకర్ యాదవ్ మరణం విషాదం నుంచి తాము ఇంకా కోలుకోలేదన్నారు. శంకర్‌యాదవ్‌తో తనకున్న ప్రత్యేక బంధం సికింద్రాబాద్ ప్రజలందరికీ తెలుసునన్నారు. తమ కుటుంబం తీవ్ర దుఃఖంలో ఉందని, ఆ కారణంగానే రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనలేకపోతున్నట్లు వివరించారు.

కార్టూనిస్టుల కోసం మెగా వర్క్‌షాప్

హాజరైన రెండు రాష్ట్రాల కార్టూనిస్టులు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న కార్టూనిస్టులు

పంజగుట్ట (హైదరాబాద్): యువ కార్టూనిస్టులకు ఉపయోగపడేలా ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలుగు కార్టూనిస్టుల మెగా వర్క్‌షాప్ నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు వందకు పైగా కార్టూనిస్టులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పొలిటికల్, సోషల్ కార్టూనిస్టులు తమ అనుభవాలను పంచుకున్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ కార్టూనిస్టు శంకర్, సుభాని, నర్సిం, మృత్యుంజయ్, శంకు, సురేంద్రలు పాల్గొన్నారు. సైలెంట్ కార్టూన్లు ఎందుకు వెయ్యాలి, కార్టూన్‌కు బొమ్మ ముఖ్యమా లేక ఐడియా ముఖ్యమా? సోషల్ కార్టూన్లు వేసేవారు పొలిటికల్ కార్టూన్లు వెయ్యాలంటే ఎలాంటి సాధన చెయ్యాలి, కార్టూన్ సిండికేషన్ అంటే ఏమిటి, అది కార్టూనిస్టులకు ఎలా ఉపయోగపడుతుంది, లైవ్ డ్రాయింగ్, పాకెట్ కార్టూన్ వంటి అంశాలను యువ కార్టూనిస్టులకు వారు వివరించారు. ప్రముఖ యోగా శిక్షకురాలు సంగీత నిర్వహించిన ఈ కార్టూన్ పోటీలో బెస్ట్ ఎంట్రీలు ప్రదర్శనలో ఉంచారు. విజేతలకు జ్ఞాపిక, బహుమతులు అందించారు. కార్యక్రమ నిర్వహణకు దోహదపడిన కార్టూనిస్టులు రాజశేఖర్, హరికృష్ణ, నాగేశ్వరం, అశ్వక్, సి.ఆర్.రాజు, హరగోపాల్, నందులను ఘనంగా సత్కరించుకున్నారు.

నేటి భవితలో..

- బ్యాంక్ జాబ్స్:
  బ్యాంక్ ఆఫ్ బరోడా.. కొలువుల పిలుపు
  ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసి బ్యాంకింగ్ రంగంలో కెరీర్ కోరుకుంటున్న వారికి ప్రభుత్వ రంగ బ్యాంకు.. బ్యాంక్ ఆఫ్ బరోడా స్వాగతం పలుకుతోంది! ఎంఎంజీఎస్–2, 3, ఎస్ఎంజీఎస్–4 హోదాలో.. 168 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది మేనేజ్‌మెంట్ పీజీ, సీఏ తదితర కామర్స్ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు చక్కటి అవకాశం!! ఈ ఉద్యోగాలను సొంతం చేసుకోవడానికి బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్వహించే ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా జాబ్ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, కెరీర్ స్కోప్, ఎంపిక ప్రక్రియలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..
- గ్రూప్1, గ్రూప్ 2 ప్రత్యేకం:
  ఇండియన్ పాలిటీ స్టడీ మెటీరియల్‌తో పాటు, విద్యా ఉద్యోగ సమాచారం..

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఇదండీ సంగతి




విద్యుత్ కేంద్రాల రక్షణపై పిడుగు!

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో పిడుగుల నుంచి రక్షణకు పటిష్ట వ్యవస్థలు

- అయినా అవి విఫలం కావడంతోనే భద్రాద్రి కేంద్రంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగుపాటు
- డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలే కారణమని అనుమానాలు
- రూ.వేల కోట్లతో నిర్మించిన కొత్త విద్యుత్ కేంద్రాల భద్రతపై సందేహాలు
- శ్రీశైలం పవర్ హౌస్ ప్రమాదం నుంచి జెన్‌కో ఏమీ నేర్చుకోలేదని విమర్శలు

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెం జిల్లా మణుగూరులోని 1,080 (4x270) మెగావాట్ల భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై శనివారం రాత్రి పిడుగు పడటం రాష్ట్రంలోని కీలక థర్మల్ విద్యుత్ కేంద్రాల భద్రతపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. పిడుగుల నుంచి రక్షణ కల్పించే పటిష్ట ఏర్పాట్లు ఉన్నా భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పిడుగు పడటం అనేక సందేహాలకు తావిస్తోంది. పిడుగుల నుంచి రక్షణ కల్పించేందుకు జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ లైట్నింగ్ అరెస్టర్‌లు, ఎర్తింగ్ టవర్లు, ఎర్త్‌పిట్‌ల వంటి రక్షణ వ్యవస్థలన్నీ విఫలం కావడంతోనే భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుందని తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) ఇంజనీరింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడినా మంటలు వ్యాప్తి చెందకుండా నియంత్రించడానికి నైట్రోజన్ ఇంజెక్షన్, స్ప్రింక్లర్ల వ్యవస్థలు సైతం అనుకున్న రీతిలో పనిచేయలేదన్న చర్చ జరుగుతోంది. దీంతోనే భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని ఒకటో యూనిట్‌కు సంబంధించిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా దగ్ధమైనట్లు కొందరు ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. పిడుగుల నుంచి రక్షణ కల్పించడానికి ఏర్పాటు చేసిన వ్యవస్థల డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణలో లోపాలతోనే ఈ ఘటన చోటుచేసుకొని ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. దీంతో రూ. వేల కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 2020 ఆగస్టులో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 9 మంది ఇంజనీర్లు, ఇతర సిబ్బంది మృతిచెందడం తెలిసిందే. నాటి ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించినా వారిపై జెన్‌కో యాజమాన్యం చర్యలు తీసుకోలేదు. అందువల్లే ఆ తరహాలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కొత్తగూడెం జిల్లా మణుగూరులో పిడుగుపాటుకు ధ్వంసమైన యూనిట్1 జీటీ

ముగిసిన డిఫెక్ట్ లయబిలిటీ కాలం

జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 2020లో ప్రారంభించగా ఇప్పటికే డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ ముగిసింది. ఇన్సూరెన్స్ చేయించి ఉంటేనే జెన్‌కోకు నష్టం తప్పనుంది. లేకుంటే సొంత ఖర్చుతో మరమ్మతులు నిర్వహించక తప్పదు. బీహెచ్ఈఎల్–భోపాల్ ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తయారు చేసింది.

రక్షణ వ్యవస్థలన్నీ విఫలం...

భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని ఒక్కో యూనిట్‌లో 16.8 కేవీ సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఆ విద్యుత్‌ను 400 కేవీ సామర్థ్యానికి పెంచి తేనే గ్రిడ్‌కు సరఫరా చేయడానికి వీలవుతుంది. ఆ పనిని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్లు చేస్తాయి. విద్యుత్ కేంద్రంలో జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండే ప్రాంతాన్ని స్విచ్‌యార్డ్‌గా పిలుస్తారు. అక్కడ సబ్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని పరికరాలు ఉంటాయి. పిడుగుల నుంచి రక్షణ కల్పించడానికి స్విచ్‌యార్డ్ చుట్టూ రక్షణ వలయం ఉంటుంది. జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 400 కేవీ విద్యుత్ బయటకు సరఫరా అయ్యే చోట ఓ లైట్నింగ్ అరెస్టర్ ఉంటుంది. వెలుపలి ప్రాంతాల్లో ఎక్కడైనా పిడుగు పడినా స్విచ్‌యార్డ్‌కి అధిక వోల్టేజీ సరఫరా కాకుండా ఈ లైట్నింగ్ అరెస్టర్ రక్షణగా పనిచేస్తూ ఉంటుంది. ఇక పిడుగు నేరుగా స్విచ్‌యార్డ్ మీద పడినా ప్రమాదం ఉండకుండా దాని చుట్టూ టవర్లు ఉంటాయి. ఆ టవర్లన్నింటినీ వైర్లతో అనుసంధానించి భూమిలోకి ఎర్తింగ్ చేస్తారు. దీంతో స్విచ్‌యార్డ్‌పై పిడుగు పడినా అందులోంచి హై వోల్టేజీ విద్యుత్ భూమిలోకి వెళ్లిపోయేలా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ మీద పిడుగు పడకుండా దారిమళ్లించడానికి దానికి రెండు వైపులా లైట్నింగ్ అరెస్టర్‌లు ఏర్పాటు చేస్తారు. ఒకవేళ పిడుగు పడినా దాని ప్రభావం భూమిలోకి వెళ్లిపోతుంది. ఇక స్విచ్‌యార్డ్ కింద భూగర్భంలో అర మీటర్ లోపల మెటాలిక్ ప్లేట్లతో ఫెన్సింగ్ మెష్ తరహాలో వలయం ఏర్పాటు చేస్తారు. లైట్నింగ్ అరెస్టర్లను వాటితో అనుసంధానిస్తారు. స్విచ్‌యార్డ్ లోపుల ఎర్త్ పిట్‌లు కూడా ఉంటాయి. భూగర్భంలో 5 మీటర్ల లోతు వరకు రాడ్డును పాతి ఎర్తింగ్ వ్యవస్థతో కనెక్ట్ చేస్తారు. వాటన్నింటికీ తోడుగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ భూగర్భంలో సొంత ఎర్తింగ్ వ్యవస్థను కలిగి ఉంటుంది. ఈ వ్యవస్థలన్నీ ఏకకాలంలో విఫలం కావడం వల్లే భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని జనరేటింగ్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగుపడి తీవ్ర నష్టాన్ని కలిగించిందన్న చర్చ జరుగుతోంది.

సరిగ్గా పనిచేయని రక్షణ వ్యవస్థలు..

పిడుగుపాటు లేదా ఇతర కారణాలతో జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగితే తక్షణమే మల్సిఫైయర్ యాక్టివేట్ అయి మంటలకు ఆక్సిజన్ అందకుండా నిరంతరం నీళ్లను చల్లుతుంది. దీంతో ఆక్సిజన్ అందక మంటలు ఆగిపోతాయి. ఇక ట్రాన్స్‌ఫర్మర్ వద్ద మరో రక్షణ వ్యవస్థగా నైట్రోజన్ ఇంజెక్షన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తారు. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ మరుగుతూ వేడిగా ఉంటుంది. ఆయిల్ ఉష్ణోగ్రతలు గరిష్టానికి చేరితే ట్రాన్స్‌ఫార్మర్లలో మంటలు చెలరేగి దగ్ధమయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే నిరంతరం ఆయిల్ ఉష్ణోగ్రతలను నైట్రోజన్ ఇంజెక్షన్ సిస్టమ్ కనిపెడుతూ ఉంటుంది. ఒకవేళ మంటలు చెలరేగే స్థాయికి ఉష్ణోగ్రతలు పెరిగితే తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రిప్ చేయడంతోపాటు అందులోని ఆయిల్ లో 10 శాతాన్ని బయటకు పంపిస్తుంది. అలా ఏర్పడే ఖాళీ ప్రదేశాన్ని నైట్రోజన్‌తో నింపేస్తుంది. దీంతో ఆక్సిజన్ అందక ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగవు. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఈ రక్షణ వ్యవస్థలు సైతం సరిగ్గా పనిచేయలేదనే చర్చ జరుగుతోంది.

బీటీపీఎస్‌కు రూ.25 కోట్ల నష్టం!

- జాగ్రత్తలన్నీ తీసుకున్నా పిడుగు పడిందన్న అధికారులు
- జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణకు 45 నుంచి 60 రోజులు!

మణుగూరు టౌన్: భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో శనివారం రాత్రి పిడుగు పడటంతో జరిగిన అగ్ని ప్రమాదంతో రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలంగాణ జెన్‌కో అధికారులు అంచనాకు వచ్చారు. జెన్‌కో థర్మల్ విభాగం డైరెక్టర్ బి.లక్ష్మయ్య, సీఈ బి.రత్నాకర్... బీటీపీఎస్ సీఈ బిచ్చన్నతో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ పిడుగు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నా పిడుగుపడినట్లు సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయినట్లు గుర్తించామని తెలిపారు. ఇందుకుగల కారణాలపై విచారణ చేపడుతున్నామన్నారు. మరోవైపు 270 మెగావాట్ల ఒకటో యూనిట్‌లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్, ఇతర పరికరాలు దగ్ధమవగా పునరుద్ధరించడానికి 45 నుంచి 60 రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను విడదీసే పనిలో నిమగ్నమయ్యారు.

తప్పిన భారీ ప్రమాదం..

జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో 80 వేల లీటర్ల లిక్విడ్ ఆయిల్ ఉండగా పిడుగుపాటుతో దాని బుష్‌ల నుంచి ఆయిల్ లీక్ అయి మంటలు ఎగసిపడ్డాయని అధికారులు చెబుతున్నారు. మంటలు దగ్గరలోని జనరేటర్‌కు వ్యాపించి ఉంటే మొత్తం యూనిట్–1 దగ్ధమై ఊహించలేని ప్రమాదం జరిగేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర నివేదిక సమర్పించండి

జెన్‌కో అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో అగ్నిప్రమాదంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా ప్రమాదానికి లోనైన యూనిట్–1ను పునరుద్ధరించి విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించాలని స్పష్టం చేశారు. మధిరలో జెన్‌కో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అగ్నిప్రమాదాన్ని తనిఖీ చేయడానికి సోమవారం భోపాల్ నుంచి బీహెచ్ఈఎల్ నిపుణుల బృందం వస్తున్నట్లు అధికారులు ఆయనకు తెలిపారు. ఆ తర్వాతే నష్టంపై పూర్తి అంచనాకు రాగలుగుతామన్నారు.



మధిరలో ఆదివారం జెన్‌కో అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విద్యుత్‌రంగాన్ని ప్రైవేట్‌పరం చేసే దిశగా అడుగులు

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్‌రంగాన్ని ప్రైవేట్ పరం చేసేదిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే తొలిదశలో విద్యుత్ బిల్లుల వసూలును ప్రైవేట్ కంపెనీలకు అప్పగించేవిధంగా రేవంత్ సర్కారు నిర్ణయాలు తీసుకోబోతుందన్నారు. తెలంగాణభవన్‌లో ఆదివారం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పైలట్ ప్రాజెక్టు కింద పాతబస్తీలో విద్యుత్ బిల్లుల వసూలును ఆదానీ కంపెనీకి అప్పగించారని చెప్పారు. ఇది పాతబస్తీకే పరిమితం కాదని, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూళ్లను ప్రైవేట్‌సంస్థలకు అప్పగించనున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేస్తే భవిష్యత్‌లో విద్యుత్ సబ్సిడీలు, రైతులకు ఉచిత కరెంటు ఇక రాష్ట్రంలో ఉండదని, రైతుల విద్యుత్ మోటార్లకు మీటర్లు పెడతారన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంపై ఒత్తిడి వచ్చినా విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పడానికి అంగీకరించలేదన్నారు. మోదీ, ఆదానీ విధానాలను తెలంగాణలో రేవంత్ అమలు చేస్తున్నారని, విద్యుత్ సంస్థ ప్రజల ఆస్తి అని, దీనిని ప్రైవేట్‌కు అప్పచెప్పడం సరికాదన్నారు. ఓల్డ్ సిటీలో 45% మాత్రమే కరెంటు బిల్లులు వసూలు అవుతున్నాయని, అందుకే ప్రైవేటు వ్యక్తులకు వసూళ్ల బాధ్యతలు అప్పగిస్తున్నామని రేవంత్ అంటున్నారని, ఇది పాతబస్తీ ప్రజలను అవమానించడమేనని వ్యాఖ్యానించారు. సింగరేణి బొగ్గు గనులను వేలం వేస్తుంటే డిప్యూటీ సీఎం భట్టి వేలంలో పాల్గొన్నారని, శ్రావణపల్లి బొగ్గు గనిని వేలం నుంచి ఎందుకు తీసివేయించలేదని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది

బీజేపీ ఎమ్మెల్యేలకు నిధులివ్వకపోవడం దుర్మార్గం

- పార్టీ ఫిరాయింపుల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు తేడా లేదు
- జనసేనతో పొత్తుపై పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుంది
- కేంద్రమంత్రి బండి సంజయ్



కరీంనగర్ టౌన్: ఎమ్మెల్యేల ఫిరాయింపులు, నిధుల కేటాయింపు, సింగరేణి ప్రైవేటీకరణ దుష్ప్రచారం సహా అన్ని అంశాల్లోనూ కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నిధుల కేటాయింపు, అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో బీజేపీ ఎమ్మెల్యేల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ప్రజలు ఓట్లేస్తేనే గెలిచారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరిస్తే పరిస్థితి ఎట్లుంటుందో ఆలోచించాలని సూచించారు. కరీంనగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంజయ్ మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని, అందులో భాగంగా రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు తమ వద్దకు వస్తే సహకరిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మాత్రమే నిధులిచ్చి బీజేపీ ఎమ్మెల్యేలకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. కేంద్రం పార్టీలకతీతంగా ఎంపీలకు నిధులిస్తుందని, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాగే చేస్తే ప్రజలు బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. పవన్‌కల్యాణ్ తన ప్రతిపాదనను బీజేపీ ముందుంచారని, దీని పై జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షులు సహా పార్టీ నాయకత్వం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. టీ 20 ప్రపంచ కప్‌లో భారత్ విజయం సాధించడం సంతోషకరమని, 140 కోట్లమంది ఆనందంతో ఉన్నారని తెలిపారు.

అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

నిరుద్యోగ యువతకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది : మాజీమంత్రి హరీశ్‌రావు



గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరహార దీక్ష చేస్తున్న విద్యార్థి నేత మోతీలాల్ నాయక్‌ను పరామర్శిస్తున్న హరీశ్‌రావు

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): నిరుద్యోగులు, నిరుద్యోగ సమస్యలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నిరుద్యోగ సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఏడు రోజులుగా గాంధీఆస్పత్రిలో ఆమరణ నిరాహారదీక్ష కొనసాగిస్తున్న నిరుద్యోగ జేఏసీనేత మోతీలాల్‌నాయక్‌ను ఆదివారం హరీశ్‌రావు పరామర్శించి మద్దతు ప్రకటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మోతీలాల్‌నాయక్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని, నిరుద్యోగ యువతతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో మోతీలాల్‌నాయక్ దీక్షను విరమించాలని, కలిసి ప్రభుత్వంపై పోరాడుదామని పిలుపునిచ్చారు. నిరుద్యోగుల హక్కుల పట్ల ప్రొఫెసర్ కోదండరాం పూర్తి బాధ్యత తీసుకొని, హామీలు అమలు చేసేవిధంగా కృషి చేయాలని కోరారు. ఏడు రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు అయినా లేకపోవడం తెలంగాణ ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులపై కపట ప్రేమ చూపించి అవసరం తీరిన తర్వాత వారి గుండెల మీద తన్నిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు నిరుద్యోగుల ఓట్ల కోసం కోదండరాం, రియాజ్, బల్మూరి వెంకట్, మురళి, రేవంత్‌రెడ్డి తదితరులు కోచింగ్ సెంటర్ల చుట్టూ చక్కర్లు కొట్టారని, బస్సుయాత్రలు చేశారని, రాహుల్‌గాంధీని అశోక్‌నగర్ తీసుకొచ్చి ప్రమాణం చేయించారని గుర్తు చేశారు. వారికి ఉద్యోగాలు వచ్చాయి, నిరుద్యోగులకు రాలేదన్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టే విధంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాసయాదవ్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఇవీ నిరుద్యోగ డిమాండ్లు..

- గ్రూప్–1 మెయిన్స్ ఎలిజిబిలిటీ 1: 50 నుంచి 1:100కు పెంచాలి.
- గ్రూప్–2కు రెండువేలు, గ్రూప్–3కి 3 వేల ఉద్యోగాలు కలుపుతామనే హామీ నిలబెట్టుకోవాలి. రెండు పరీక్షల మధ్య 2 నెలల సమయం ఉండాలి
- ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామనే హామీ నిలబెట్టుకోవాలి.
- జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి.
- మొదటి కేబినెట్ మీటింగ్‌లోనే మెగా డీఎస్సీ ప్రకటన హామీ నిలబెట్టుకోవాలి. 11 వేలతో కాకుండా 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలి
- గురుకుల టీచర్ల పోస్టులను బ్యాగ్‌లాగ్‌లో పెట్టకుండా, హైకోర్టు తీర్పు ప్రకారం పోస్టులు భర్తీ చేసి అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయాలి
- జీఓ నంబరు 46 రద్దు చేయాలి. ఆ జీఓ ద్వారా ఏర్పడిన సమస్యలను పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలి.
- రాష్ట్రంలోని నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఏడు నెలల బకాయితో సహా ప్రతినెల క్రమం తప్పకుండా నిరుద్యోగభృతి చెల్లించాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్లులపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం

గవర్నర్ రాధాకృష్ణన్‌కు సర్పంచ్‌ల సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లుల గురించి పట్టించుకోవడం లేదని తెలంగాణ సర్పంచుల జేఏసీ ఆందోళన వ్యక్తం చేసింది. జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డి, 8మంది ప్రతినిధుల బృందం ఆదివారం గవర్నర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. సర్పంచుల కాలపరిమితి అయిపోయి ఆరు నెలలు గడుస్తున్నా, వారి సమస్యలపై, గ్రామ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని గవర్నర్‌కి తెలిపినట్లు యాదయ్యగౌడ్ పేర్కొన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, రైతు వేదికలు వంటి వాటిని తమ సొంత డబ్బులతో ఖర్చు పెట్టి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామచిలుక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్, గోవా గవర్నర్ శ్రీధరన్

గోవా గవర్నర్ సాహితీ నైపుణ్యం భేష్

గవర్నర్ రాధాకృష్ణన్

పంజగుట్ట (హైదరాబాద్): గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లై రచనల్లో తన సాహిత్య నైపుణ్యాన్ని ప్రదర్శించడమే కాకుండా, ఆలోచింపజేసే కథలతో పాఠకులను కట్టిపడేశారని తెలంగాణ, జార్ఖండ్ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ అన్నారు. గోవా గవర్నర్, రచయిత శ్రీధరన్ పిళ్లై రచించిన 'రామచిలుక'తెలుగు అనువాద పుస్తకాన్ని ఆదివారం రాజ్‌భవన్‌లో రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఎల్.ఆర్.స్వామి తెలుగు అనువాదం, అసలు రచన సారాంశాన్ని పూర్తిగా ప్రతిబింబించిందని చెప్పారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రధానకార్యదర్శి బుర్రా వెంకటేశం, గోవా గవర్నర్ కార్యదర్శి ఎం.ఆర్.ఎం.రావు, ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, కవి శివారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, ఎల్.ఆర్.స్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో రిటైర్‌మెంట్ లొల్లి!

65 ఏళ్లు దాటితే పదవీ విరమణ తప్పనిసరన్న ప్రభుత్వం

- విధులకు రావొద్దని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు స్పష్టీకరణ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ
- రిటైర్మెంట్ ప్యాకేజీలో భాగంగా టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ. 50 వేలు ఇస్తామన్న సర్కారు
- ప్యాకేజీ పెంచకుండా రిటైర్మెంట్ కుదరదంటున్న సంఘాలు



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణను రాష్ట్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్లు పూర్తి చేసుకున్న టీచర్లు, హెల్పర్లు తప్పకుండా రిటైర్ అవ్వాలని ఆదేశించింది. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ సంచాలకులు నిర్మల కాంతి వెస్లీ తరఫున సంయుక్త సంచాలకులు కేఆర్ఎస్ లక్ష్మీదేవి మెమో విడుదల చేశారు. ఈ మెమోను రాష్ట్రవ్యాప్తంగా జిల్లా సంక్షేమాధికారులు, సీడీపీఓలు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులకు ఆదివారం పంపించారు.

ప్యాకేజీపై పెదవి విరుపు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రిటైర్మెంట్ ప్యాకేజీపై అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పెదవి విరుస్తున్నారు. పదవీ విరమణ ప్యాకేజీ కింద అంగన్‌వాడీ టీచర్లకు రూ. లక్ష, హెల్పర్లకు రూ. 50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు గత ప్రభుత్వం జీఓ 10ని జారీ చేసింది. అయితే దీనిపై అప్పట్లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో ప్యాకేజీపై మార్పులు చేస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాలు సద్దుమనిగాయి. తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్యాకేజీ సవరణల ఊసు లేదు. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పదవీవిరమణ ప్రక్రియ అమల్లోకి వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్లు నిండిన వారు విధుల నుంచి తప్పుకోవాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సూచించింది. అదేవిధంగా 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ సమాచారాన్ని అంగన్‌వాడీల యాప్ (ఎన్‌హెచ్‌టీఎస్–ఈఎంఎస్) నుంచి కూడా తొలగించాలని ఆదేశించింది. దీనిపై అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిటైర్మెంట్ ప్యాకేజీని మార్చు చేయాలని కోరుతూ ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకు విధుల నుంచి తప్పుకోబోమని చెబుతున్నారు. ఈ అంశంపై త్వరలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు చెబుతున్నారు.

టీచర్‌కు రూ.2లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష ఇవ్వాలి



అంగన్‌వాడీ టీచర్, హెల్పర్లు సగటున 30-40 ఏళ్లపాటు సేవలందించి 65 ఏళ్లకు పదవీ విరమణ పొందుతున్నారు. అంతకాలం సేవలందించే వారికి ప్రభుత్వం అత్తెసరు ఆర్థిక సాయం ఇవ్వాలనుకోవడం సరి కాదు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆర్థిక సాయంలో మార్పులు చేయాలి. కనీసం అంగన్‌వాడీ టీచర్‌కు రూ. 2 లక్షలు, హెల్పర్‌కు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించాలి. అప్పటివరకు పదవీ విరమణ పొందకుండా విధులు నిర్వహించేందుకు అంగీకరించాలి. దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనకు దిగుతాం.

– ఎం.సాయిశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్

నాటి హామీలు ఏమయ్యాయి?



గౌరవవేతనం పెంపు కోసం గతేడాది మేం సమ్మె చేస్తున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గౌరవ వేతనాలు పెంచడంతో పాటు పదవీ విరమణ ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా వేతన పెంపు, రిటైర్మెంట్ ప్యాకేజీ మాటెత్తడం లేదు.

– పి.రజిత, అంగన్‌వాడీ టీచర్, కరీంనగర్

ప్రభుత్వం స్పందించకుంటే తదుపరి కార్యాచరణ



అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు మెరుగైన పదవీవిరమణ ప్యాకేజీ ఇస్తామని, వేతనాలు కూడా పెంచుతామని అప్పట్లో సమ్మె చేసిన చోటుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలు హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు వారు పట్టించుకోవడం లేదు. టీచర్లకు రూ. 18 వేలు జీతం ఇస్తామని, రిటైర్మెంట్ ప్యాకేజీ రెట్టింపు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినప్పటికీ అమల్లోకి రాలేదు.

– టేకుమళ్ల సమ్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు, ఏఐటీయూసీ

నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఉద్యోగాల భర్తీ ఎలా?

ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీని ప్రశ్నించిన కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న అంశంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిరుద్యోగులను కలిసి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని, అన్ని ప్రధాన పత్రికల్లో పెద్దఎత్తున జాబ్ క్యాలెండర్ పేరుతో ప్రకటనలను సైతం విడుదల చేసిన అంశాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన జాబ్ క్యాలెండర్లో ప్రకటించిన ప్రకారం ఇప్పటికే 7 నెలల కాలం గడిచిపోయిందని, కానీ ఒక్క కొత్త ప్రభుత్వ ఉద్యోగానికి నోటిఫికేషన్ జారీ కాలేదన్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 10 నోటిఫికేషన్ తేదీల గడువు ముగిసిపోయిందని పేర్కొన్నారు. ఐదు నెలల కాలంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఏ విధంగా జారీ చేస్తారో చెప్పాలన్నారు.

బాధితులకు సంపూర్ణ న్యాయం కోసమే..

- కొత్త నేర చట్టాలపై ఫోరం ఫర్ నేషనల్ థింకర్స్ వర్క్‌షాప్‌లో వక్తలు
- కొత్త నేర చట్టాలను గుడ్డిగా వ్యతిరేకించే వారికి భయపడబోమన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- ఎంపీ రఘునందన్‌రావు సహా పలువురు హైకోర్టు జడ్జీలు, న్యాయవాదులు హాజరు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జస్టిస్ నరసింహారెడ్డి, రాంచందర్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్: బాధితులకు సంపూర్ణ న్యాయమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నూతన నేర చట్టాలను తీసుకొచ్చినట్లు పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బ్రిటిష్ కాలంనాటి వలసపాలనను ప్రతిబింబించే నేర చట్టాలకు మోదీ సర్కారు స్వస్తిపలికిందని చెప్పారు. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు వీలుగా భారతీయ న్యాయ సంహిత (పాత ఐపీసీ స్థానంలో), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (పాత సీఆర్పీసీ స్థానంలో), భారతీయ సాక్ష్య అధినియం (పాత ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో)ను కేంద్రం తెచ్చిందన్నారు. ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో నూతన నేర చట్టాలపై ఆదివారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ లాలో వర్క్‌షాప్ నిర్వహించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. సురేందర్, జస్టిస్ మాధవీదేవి, జస్టిస్ ఎ. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మహిళా భద్రత విభాగం డీఐజీ రెమా రాజేశ్వరి, కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ వాణి అక్కపెద్ది, సీనియర్ న్యాయవాది జె.ప్రభాకర్, పలువురు సీనియర్ న్యాయవాదులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ. నర్సింహారెడ్డి అధ్యక్షతన, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు జి.రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు అడిషనల్ సోలిసిటర్ జనరల్ బి.నరసింహ శర్మ, సీనియర్ అడ్వొకేట్‌లు ప్రభాకర్ రెడ్డి, బి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

'కొత్త చట్టాల్లో లోపాలుంటే సరిదిద్దుకుంటాం'

దేశ న్యాయవ్యవస్థలోనూ మార్పులు రావాల్సి ఉందని, అందులో భాగంగానే నూతన నేర చట్టాలను కేంద్రం అమల్లోకి తెస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కొత్త చట్టాల్లో లోపాలు ఏమైనా ఉంటే భేషజాల్లేకుండా సరిదిద్దుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గతంలో తాను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పటి నుంచే కొత్త నేర చట్టాల కసరత్తు ప్రారంభమైనట్లు చెప్పారు. ప్రజాహితం కేంద్రం కోసం తీసుకొనే నిర్ణయాలను గుడ్డిగా వ్యతిరేకించే వారికి తాము భయపడబోమని స్పష్టం చేశారు. ఇదే ప్రధాని మోదీ విధానమన్నారు.

లోపాలపై ప్రతిపక్షాలు చర్చకు రావాలి: ఎంపీ రఘునందన్‌రావు

ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాలు నూతన నేర చట్టాల అమలును నిరసిస్తూ బంద్‌కు పిలుపునివ్వడం భావదారిద్ర్యానికి నిదర్శనమని విమర్శించారు. కొత్త చట్టాలను గుడ్డిగా వ్యతిరేకించకుండా, లోపాలపై చర్చకు రావాలని ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు. కాగా, వర్క్‌షాప్‌లో భాగంగా న్యాయవాది ఎ.పి. సురేష్ రచించిన 'న్యూ క్రిమినల్ మేజర్ యాక్ట్స్'పుస్తకాన్ని రఘునందన్‌రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ. నర్సింహారెడ్డి ఆవిష్కరించారు.

వెంకయ్య రాజకీయ జీవితం

భావితరాలకు స్ఫూర్తి





కార్యక్రమంలో వెంకయ్యనాయుడు దంపతులు. ఢిల్లీలో 'మహానేత' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని

- ఉపరాష్ట్రపతిగా, కేంద్రమంత్రిగా ఆయన సేవలు అపూర్వం: ప్రధాని నరేంద్రమోదీ
- వెంకయ్యనాయుడుపై రచించిన మూడు పుస్తకాలను వర్చువల్‌గా ఆవిష్కరించిన పీఎం

సాక్షి, హైదరాబాద్: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాజకీయ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. గ్రామీణస్థాయి నుంచి రాజకీయాల్లోకి వచ్చి జాతీయస్థాయిలో ఉన్నత పదవులు అనుభవించిన ఆయన మార్గదర్శకులన్నారు. వెంకయ్యనాయుడు జీవితంపై రచించిన మూడు పుస్తకాలను ఆవిష్కరించే కార్యక్రమం హైదరాబాద్‌లోని అన్వయ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగింది. ప్రధాని మోదీ ఈ పుస్తకాలను న్యూఢిల్లీలోని తన కార్యాలయం నుంచి వర్చువల్‌గా ఆవిష్కరించి ప్రసంగించారు. సోమవారంతో 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వెంకయ్యనాయుడును అభినందించారు. ఆయనపై రచించిన పుస్తకాలు ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని, దేశానికి సేవ చేయడానికి ప్రేరణగా ఉంటాయని చెప్పారు. వెంకయ్యతో సుదీర్ఘకాలం కలిసి పనిచేసే అవకాశం తనకు లభించిందన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా, కేంద్రమంత్రిగా, ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభలో సభాపతిగా సేవలు అందిస్తున్నప్పుడు ఆయన అనుభవం నుంచి తాను చాలా నేర్చుకున్నానని చెప్పారు. ఏపీ, తెలంగాణలో బీజేపీ ఎదుగుదలకు బలమైన పునాది వేశారన్నారు. దేశంలో 50 ఏళ్ల క్రితం ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి వెంకయ్యనాయుడు 17 నెలల పాటు జైలుశిక్ష అనుభవించారని గుర్తు చేశారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా వెంకయ్య తనను తాను నిరూపించుకున్నారన్నారు. గ్రామాలు, పేదలు, రైతులకు సేవ చేయాలనే ఆలోచనతో పనిచేశారని తెలిపారు.ఆయన ప్రారంభించిన స్వచ్ఛభారత్ మిషన్, స్మార్ట్ సిటీమిషన్, అమృత్ యోజన దేశానికి ఎంతో మేలు చేశాయని మోదీ గుర్తు చేశారు. వాజ్‌పేయి ప్రభుత్వం ఏర్పాటు సమయంలో వెంకయ్య రూపొందించిన 'ఏక్ హాత్ మే బీజేపీ కా ఝుండా, ఔర్ దుస్రే హాథ్ మే ఎన్డీఏ కా ఎజెండా అనే నినాదాన్ని గుర్తు చేసుకున్నారు. మోదీ కోసం 'మేకింగ్ ఆఫ్ డెవలప్డ్ ఇండియా'అనే సంక్షిప్తపదాన్ని రూపొందించారని చెప్పారు. రాజ్యసభలో 370 ఆర్టికల్ రద్దు బిల్లు ఆమోదం విషయంలో వెంకయ్య కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ది హిందూ మాజీ రెసిడెంట్ ఎడిటర్ ఎస్.నగేష్ కుమార్ రచించిన వెంకయ్యనాయుడు లైఫ్ ఇన్ సర్వీస్‌తోపాటు మాజీ ఉపరాష్ట్రపతి కార్యదర్శి డాక్టర్ ఐవీ.సుబ్బారావు రూపొందించిన ఫొటో క్రానికల్ 'సెలబ్రేటింగ్ భారత్ – ది మిషన్ అండ్ మెసేజ్ ఆఫ్ ఇండియా', సంజయ్ కిషోర్ రచించిన మహానేత – లైఫ్ అండ్ జర్నీ ఆఫ్ ఎం. వెంకయ్యనాయుడు పేరుతో జీవిత చరిత్ర పుస్తకాలను ప్రధాని ఆవిష్కరించారు.

ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు కృషి

గనుల వేలాన్ని నిరసిస్తూ 5న కోల్‌బెల్ట్ బంద్: కూనంనేని



ఖమ్మం మయూరిసెంటర్: తెలంగాణలో రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేలా ప్రణాళికాయుతంగా ముందుకు సాగేందుకు కార్యాచరణ రూపొందించనున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఖమ్మంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల్లో కమ్యూనిస్టు పార్టీ అంతర్భాగంగా ఉన్నందున చైతన్యవంతమైన ఈ రాష్ట్రంలో బీజేపీకి అవకాశం దక్కదని స్పష్టం చేశారు. ఇక నిర్మాణం లేకుండా కేవలం సెంటిమెంట్‌పై ఆధారపడిన బీఆర్ఎస్ అధికారంలో లేకుండా బతకడం కష్టమని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, ఇతర పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు సీపీఐకి అవకాశమున్నందున బలమైన ప్రాంతాలు, పార్టీ విస్తృతికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి కార్యకలాపాలను విస్తృతం చేస్తామని కూనంనేని తెలిపారు. బొగ్గు బ్లాక్‌ల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్‌ది ఒకటే వైఖరి అని.. ఈ వేలాన్ని అడ్డుకుంటామన్నారు. ఈ మేరకు జూలై 5న కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో బంద్ చేపట్టడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1న కలెక్టరేట్లను ముట్టడించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జాతీయ, రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, భాగం హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు

వ్యతిరేకంగా కొత్త చట్టాలు

- న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కొత్త చట్టాలు
- కేంద్ర హోం శాఖ, న్యాయ శాఖ మంత్రులకు లేఖ
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొస్తుందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన సోమ భరత్‌కుమార్, గెల్లు శ్రీనివాస యాదవ్, లలితారెడ్డితో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. జూలై 1 నుంచి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కొత్త చట్టాలను తీసుకువస్తుందని అన్నారు. కేంద్రం తెచ్చిన ఈ కొత్త చట్టాలు ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగేలా వున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సూచనలను కేంద్రం పట్టించుకోకుండా బిల్లును కేంద్రం పాస్ చేయించుకుందన్నారు. దేశవ్యాప్తంగా సీనియర్ న్యాయవాదులు కొత్త చట్టాలను వ్యతిరేకిస్తున్నారని, కొత్త చట్టాలను రద్దు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి, న్యాయ శాఖ మంత్రులకు లేఖ రాసినట్లు తెలిపారు.

దక్షిణాది రాష్ట్రాల భాషకు వ్యతిరేకంగా...

చట్టాలను ఇంగ్లిష్‌లో ప్రవేశపెట్టాలని రాజ్యాంగంలో వుందని, కేంద్రం మాత్రం కొత్త చట్టాలను ఇండియన్ పీనల్ కోడ్‌కు భారతీయ న్యాయ సంహిత అని పేరు పెట్టారని, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కు భారతీయ నాగరిక సురక్ష సంహిత అనే పేరు పెట్టారని వినోద్ కుమార్ తెలిపారు. కొత్త చట్టాలకు హిందీ,సంస్కృతంలో పేర్లు పెట్టారని, కొత్త చట్టాల పేర్లు దక్షిణ భారత రాష్ట్రాల భాషకు వ్యతిరేకంగా వున్నాయని చెప్పారు. న్యాయవాదులు ఎక్కడా ఆందోళన చేయవద్దని అన్ని బార్ అసోసియేషన్లకు కేంద్రం ముందుగానే లేఖలు రాసిందని వివరించారు. ఎఫ్ఐఆర్‌ను రిజిస్టర్ చేయకుండా ప్రిలిమినరీ ఎంక్వైరీ చేసే విధంగా కొత్త చట్టం తెచ్చారని అన్నారు.

ఓటింగ్ శాతం పెరిగినందునే ఎనిమిది సీట్లు సాధించాం

మన్ కీ బాత్‌లో పాల్గొన్న కేంద్రమంత్రి పీయుష్ గోయల్



యాకుత్‌పురా (హైదరాబాద్): తెలంగాణలో బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగినందునే ఎనిమిది లోక్‌సభ సీట్లు సాధించామని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ అన్నారు. పాత బస్తీ ఉప్పుగూడ కందికల్ గేట్‌లోని నందనవనం ఇస్కాన్ దేవాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్'కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులతో కలసి కార్యక్రమాన్ని వీక్షించి ఆలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు మూడవసారి బీజేపీని గెలిపించారని తెలిపారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారన్నారు. పార్టీ జాతీయాధ్యక్షుడిగా, ఉప రాష్ట్రపతిగా సేవలందించిన వెంకయ్య నాయుడు జన్మదినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించాలని పీయుష్ గోయల్ పార్టీ నాయకులకు సూచించారు.

ప్రజా'వాణి' వినిపించదా?

▶ మొదటి పేజీ తరువాయి

రెవెన్యూ వ్యవస్థ ఇంకా కోలుకోలేదని అంటున్నారు. మండలంలో ఉన్న ఒకరిద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లే (ఆర్ఐలే) ఈ దరఖాస్తులన్నింటినీ విచారించాల్సి వస్తోందని చెప్తున్నారు. విచారణ అనంతరం రిపోర్టులను పంపినా పైస్థాయిలో పరిష్కారం కావడం లేదని.. కొన్ని దరఖాస్తులు పరిష్కారమైనా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కావడం లేదని వివరిస్తున్నారు. తహసీల్దార్ల స్థాయిలోనే చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. పైస్థాయికి పంపిన వాటిని కలెక్టర్లు పట్టించుకోకపోవడంతో అక్కడా ఆగిపోతున్నాయని అంటున్నారు.

నాలుగు జిల్లాల్లోనే కాస్త మెరుగు..

'సీఎం ప్రజావాణి' దరఖాస్తుల గణాంకాలను పరిశీలిస్తే.. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జిల్లాల్లో మాత్రమే పరిష్కార కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. జగిత్యాల, కరీంనగర్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో 80శాతానికిపైగా దరఖాస్తులను పరిష్కరించారు. ఆరు జిల్లాలు వరంగల్, హన్మకొండ, హైదరాబాద్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, భువనగిరి జిల్లాల్లో అయితే 100శాతం దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. అంటే ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు ఆ జిల్లాల్లో ఒక్క రెవెన్యూ అర్జీ కూడా పరిష్కారం కాకపోవడం గమనార్హం. మిగతా జిల్లాల్లో మొక్కుబడిగా ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార కార్యక్రమం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో కూడా దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండటం రెవెన్యూ యంత్రాంగం నిర్లిప్తతకు అద్దం పడుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

వారానికి వెయ్యి దాకా దరఖాస్తులు

రాష్ట్రస్థాయిలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణికి వెయ్యి వరకు దరఖాస్తులు వస్తున్నాయి. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయి. గత శుక్రవారం 494 దరఖాస్తులురాగా.. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 125, హౌసింగ్ 43, పౌరసరఫరాల శాఖ 71, హోంశాఖ 45, పంచాయతీరాజ్ శాఖ 47, ఇతర శాఖలకు సంబంధించి 48 దరఖాస్తులు ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

అర్జీలు భారీగా పేరుకుపోయిన జిల్లాలు

జిల్లా	దరఖాస్తులు	పెండింగ్
మహబూబ్‌నగర్	302	251
సిరిసిల్ల	161	138
కొత్తగూడెం	249	232
గద్వాల	177	153
మహబూబాబాద్	235	216
మేడ్చల్	1,194	1,154
నల్లగొండ	646	637
పెద్దపల్లి	192	172
రంగారెడ్డి	2,033	1,763

ప్రజావాణి పరిష్కారం మెరుగ్గా ఉన్న జిల్లాలివీ..

జిల్లా	దరఖాస్తులు	ఇంకా పెండింగ్
జగిత్యాల	144	27
కరీంనగర్	422	102
సంగారెడ్డి	549	161
సూర్యాపేట	402	104

ఒక్క దరఖాస్తు కూడా పరిష్కారం కాని జిల్లాలివీ..

జిల్లా	దరఖాస్తులు
వరంగల్	354
హనుమకొండ	379
హైదరాబాద్	596
కామారెడ్డి	272
నాగర్‌కర్నూల్	396
భువనగిరి	836

టోల్‌ప్లాజాల నిర్వహణ నుంచి

వైదొలిగిన జీఎంఆర్

హైదరాబాద్-విజయవాడ హైవేపై నేటి నుంచి ఎన్‌హెచ్ఏఐ టోల్ వసూలు

చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజాల నిర్వహణ బాధ్యతల నుంచి జీఎంఆర్ సంస్థ తప్పుకుంది. జూన్ 2025 వరకు గడువు ఉన్నా, ఏడాది ముందే ఆ బాధ్యతల నుంచి వైదొలగింది. ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)కి జీఎంఆర్ సంస్థల నడుమ ఒప్పందం కుదిరింది. ముందుగానే తప్పుకుంటున్నందుకు జీఎంఆర్ సంస్థకు హైవే అథారిటీ నష్టపరిహారం చెల్లించనుంది. సోమవారం నుంచి ఎన్‌హెచ్ఏఐనే టోల్ రుసుము వసూలు చేయనుంది.

2012 నుంచి జీఎంఆర్

రెండు వరుసల్లో ఉన్న హైదరాబాద్–విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారిని బీఓటీ పద్ధతిలో నాలుగు వరుసలుగా విస్తరించేందుకు 2010లో అప్పటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఏపీలోని కృష్ణా జిల్లా నందిగామ వరకు 181 కిలోమీటర్ల దూరానికి టెండర్లు పిలవగా, రూ.1,740కోట్లకు జీఎంఆర్ సంస్థ పనులు దక్కించుకుంది. 2012 సంవత్సరం చివరలో రోడ్డు పనులు పూర్తయ్యాయి. తెలంగాణలో పంతంగి, కొర్లపహాడ్, ఏపీలోని చిల్లకల్లు వద్ద జీఎంఆర్ సంస్థ టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేసింది.



వాటి ద్వారా టోల్ రుసుము వసూలు చేసింది.

ఏడాదికి ముందే స్వాధీనం చేసుకున్న హైవే అథారిటీ

టోల్ వసూలు చేసుకునేందుకు వాస్తవానికి జీఎంఆర్ సంస్థకు మరో ఏడాది గడువు ఉంది. అయినా, ఆ బాధ్యతలను హైవే అథారిటీ ఆఫ్ ఇండియా స్వాధీనం చేసుకుంది. నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం సమయంలోనే ఆరు వరుసలకు సరిపడా స్థలం సేకరించారు. ఆ ప్రకారంగా 2024 వరకు ఈ మార్గాన్ని జీఎంఆర్ సంస్థనే ఆరు వరుసలుగా విస్తరించాలని అప్పట్లో నిర్ణయించారు. కానీ తమకు అనుకున్న మేరకు ఆదాయం రాలేదని, నష్టాలు వస్తున్నందున తాము విస్తరణ చేయలేకపోతున్నామంటూ జీఎంఆర్ సంస్థ కోర్టును ఆశ్రయించింది. దీంతో విస్తరణ నిలిచిపోవడం, వాహనాల రద్దీతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఓ వైపు కోర్టులో కేసు ఉండడం, మరోవైపు విస్తరణ అనివార్యం కావడంతో ఎన్‌హెచ్ఏఐ ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. అందులో భాగంగా జీఎంఆర్‌తో చర్చించి నష్టపరిహారం చెల్లించేందుకు సిద్ధమైంది. దీంతో ఏడాది ముందుగానే టోల్ వసూలు బాధ్యతల నుంచి వైదొలిగేందుకు జీఎంఆర్ కూడా రెడీ అయ్యింది. నష్టపరిహారం ఎంత ఇవ్వాలి..ఎప్పటిలోగా ఇవ్వాలి అనే విషయంలో ఇంకా పూర్తిస్థాయిలో స్పష్టత రావాల్సి ఉంది. జీఎంఆర్ సంస్థను పక్కకు తప్పించడంతో జాతీయరహదారిని ఆరు వరుసలుగా విస్తరించే ప్రక్రియకు అన్ని అడ్డంకులు తొలగినట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

టోల్ వసూలుకు ఏజెన్సీల ఎంపిక

మూడు టోల్‌ప్లాజాల వద్ద రుసుము వసూలు చేసేందుకు మూడు నెలల కాలపరిమితితో తాత్కాలిక పద్ధతిన హైవే అధికారులు రెండు ఏజెన్సీలను ఎంపిక చేశారు. పంతంగి, కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలను స్కైలాబ్ ఇన్‌ఫ్రా, చిల్లకల్లు బాధ్యతలను కోరల్ ఇన్‌ఫ్రా సంస్థలకు దక్కాయి. మూడు నెలల గడువు ముగిసే వరకు ఆయా ఏజెన్సీల పనితీరును పర్యవేక్షిస్తారు. ఆ తర్వాత ఏజెన్సీలను యథావిధిగా కొనసాగించాలా లేక కొత్తగా మరేదైనా సంస్థను ఎంపిక చేయాలా అనేది దానిని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది.

సీఎం రేవంత్‌ను సొంత పార్టీ ఎమ్మెల్యేలే వ్యతిరేకిస్తున్నారు

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



హన్మకొండ: మెజారిటీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వ్యతిరేకిస్తున్నారన్నారని బీఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హన్మకొండలో బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిని సొంత పార్టీ ఎమ్మెల్యేలు విశ్వసించకపోవడంతో ప్యాకేజీలతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను ఆకర్షించాలని చూస్తున్నారని ఆరోపించారు. మంత్రులు పొంగులేటి, దుద్దిళ్ల చెబితేనే ప్రభుత్వ నిర్ణయంగా భావించాలని సీఎం చెప్పారంటే ఇతర మంత్రులపై ఆయనకు విశ్వాసం లేదని స్పష్టమవుతోందని తెలిపారు.



ప్రశ్నించలేని జవాబుల కన్నా, జవాబు లేని ప్రశ్నలు ఉండటానికి నేను ఇష్టపడతాను.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మన్

సాక్షి
సోమవారం, 1 జూలై 2024

చదువుల తొలకరి

వర్షరుతువు ఊరికే రాదు, చదువుల ఋతువును వెంటబెట్టుకుని వస్తుంది. వేసవి కర్ఫ్యూ నుంచి బయటపడి ఆడా, మగా పిల్లలు గుంపులుగా, అనేక రంగుల పూదోటల్లా వీథుల్లోకి ప్రవహించే దృశ్యం- దేహానికి తొలకరి లానే చూపులకు చందనమవుతుంది. పుస్తకాల బరువుతో బుడిబుడి అడుగుల బాలసరస్వతుల నవ్వుల తళతళలు, మాటల గలగలలు పరిసరాలకు సరికొత్త బాల్య శోభనిస్తాయి. చదువుల నిచ్చెన మీద పిల్లలూ, వాళ్లపై పెట్టుకున్న ఆశల నిచ్చెనపై కన్నవారూ ఏక కాలంలో కొత్తమెట్టు ఎక్కడం ఎల్లెడలా కనిపిస్తుంది.

చదువుల చరిత్రనే రాస్తే, అది మెరుపులు; మంచి చెడుల మలుపుల మీదుగా సాగిపోతుంది. ప్రాచీనకాలంలో ఋష్యాశ్రమాలే విద్యాలయాలు. అధికార, ధనబలాలలో తేడాలున్న క్షత్రియుల పిల్లలూ, బ్రాహ్మణుల పిల్లలూ కలసి చదువుకునేవారు. అలా చదువుకున్న ద్రుపద, ద్రోణాచార్యుల మధ్య ఆ తర్వాత వచ్చిన అంతస్తుల తారతమ్యాలు శత్రుత్వానికి దారితీసి మహాభారతంలో కొన్ని కీలక పరిణామాలకు కారణమయ్యాయి. వేటకొచ్చిన రాజులు పరివారాన్ని దూరంగా విడిచి పాదచారులై వెళ్ళి గౌరవప్రపత్తులతో ఋషిని దర్శించుకోవడం గురించి వింటాం. అలాంటి గురుస్థానం చిరుస్థానమై బతకలేని బడిపంతుల స్థాయికి కుదించుకోవడమూ చూశాం. అయితే, నాటి చదువుల వ్యవస్థలోని ఏ కాస్త వెలుగునూ హరించే చీకట్లూ లెక్కలేనన్నే. కొన్ని చదువుల్ని సార్వత్రికం చేయకపోవడం ఒకటైతే; చదువుల్లో ఎక్కువ, తక్కువ తేడాలు ఇంకొకటి. 'కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీరకష్టం స్ఫురింపజేసే గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి, సహస్రవృత్తుల సమస్త చిహ్నా'లలో వేటికవే చదువుల తల్లి సిగ పువ్వులన్నది నేటి అవగాహన. సాధారణ విద్యపై సాంకేతిక విద్యది పైచేయి కావడం చూస్తూనే ఉన్నాం.

అలా కాలక్రమంలో చదువుల నిర్వచనమూ, ప్రయోజనమూ కూడా మారిపోయాయి. హిరణ్యకశిపుడు రాక్షసుడే అనుకున్నా చదువుల ప్రయోజనం గురించి ఆనాటి అవగాహనతోనే మాట్లాడతాడు. 'చదవనివాడు అజ్ఞాని అవుతాడు, చదివితే సదసద్వివేచన కలుగుతుంది' అని కొడుకు ప్రహ్లాదుడితో అంటాడు. 'సదసద్వివేచన' అనే మాటకు ఎన్ని అర్థాలైనా చెప్పుకోవచ్చు. మంచి చెడుల వివేచన ఒక అర్థమైతే; పారలౌకికంగా సత్యాసత్యాలు, నిత్యానిత్యాలనేవి మరి కొన్ని. చదువుకుని వచ్చి ప్రహ్లాదుడు తండ్రికి చెప్పిన సమాధానమూ దానికి దీటుగానే ఉంటుంది. 'ధర్మార్థాలతో సహా ముఖ్యశాస్త్రాలనే కాదు, చదువులలోని మర్మమంతా చదివేశా'నంటాడు. చదువులలోని మర్మమంటే అతని ఉద్దేశం – భక్తి, ఆధ్యాత్మికతలనే!

ఆనాడు చదువంటే కేవలం ఉద్యోగానికి ఓ అర్హత కాదు; బ్రహ్మచర్యం, గృహస్థం,వానప్రస్థం, సన్యాసమనే నాలుగు ఆశ్రమాల మీదుగా సాగాల్సిన జీవనయానంలో తొలి అంకం. నాడు రాజాస్థానాల్లో గణకులు, వ్రాయసకాండ్ర వంటి ఉద్యోగాలున్నా వాటి అందుబాటు పరిమితం. దాచుకున్న ధనమూ; పురుషుడికి రూపమూ, కీర్తీ, భోగమూ కలిగించేదీ, విదేశబంధువూ, విశిష్ట దైవమూ, రాజపూజితమూ అంటూ ఏనుగు లక్ష్మణకవి చేసిన అభివర్ణన అన్ని విద్యలకూ వర్తించేదే అయినా పెద్ద పీట వేదశాస్త్రాలదే. ఈ విద్యార్హతలున్నవారు 'సర్టిఫికెట్' పుచ్చుకుని ఉద్యోగం వేటలో పడాల్సిన అవసరమే లేదు; గుర్తింపు, గౌరవం, మడిమాన్యాలు అన్నీ వాళ్ళ దగ్గరికే వచ్చేవి. భాషలో అపర శేషువూ; యజ్ఞయాగాదుల్లో, వేదాధ్యాపనలో మునిగితేలేవాడే అయినా సంపన్నుడు కనుక; రాజులేమైనా ఇవ్వబోతే సాలగ్రామాన్ని సైతం పుచ్చుకోడానికి నిరాకరించే 'మనుచరిత్ర'లోని ప్రవరాఖ్యుడూ కనిపిస్తాడు. వేదాలకు గాదెగా, శాస్త్రాలకు పుట్టిల్లుగా, కళాకలాపాల రచ్చగా తెనాలి రామకృష్ణుడు తన 'పాండురంగ మాహాత్మ్యం'లో పరిచయం చేసిన సభాపతి అనే ఆయన పశు శిశు దాసీజనం కలిగిన ధనికుడు; ఆపైన వడ్డీవ్యాపారం, సేద్యం కూడా చేస్తూ రాజు దగ్గరికి రాకపోకలు సాగిస్తూ ఉంటాడు. తన పేరును నేతిబీరను చేస్తూ చెడు తిరుగుళ్ల మరిగిన నిగమశర్మ ఇతని కొడుకే! ఈ పండితపుత్రుడు ఆగమవాదాల్లో నోరువిప్పడు కానీ విటుల వివాదాలను తీర్చడంలో మాత్రం మహా చురుకని- కవి చురక.

బ్రిటిష్ ఏలుబడిలో డిగ్రీ చదువులొచ్చి ఉద్యోగంతో లంకె పడ్డాయి. స్వతంత్ర భారతంలో ఆ లంకె ఇంకా బిగిసింది తప్ప సడలలేదు. అదే సమయంలో దాదాపు అన్ని చదువులూ సార్వత్రికమై మేలూ చేశాయి. సంధిదశలో రెంటికీ చెడ్డ రేవళ్ళను గిరీశం, వెంకటేశం పాత్రల ద్వారా గురజాడ 'కన్యాశుల్కం'లో బొమ్మ కట్టారు. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు నేర్చి రికామీగా తిరిగేవాడు గిరీశమైతే, 'మీ వల్ల నాకు ఒచ్చిందల్లా చుట్ట కాల్చడం ఒక్కటే. పాఠం చెప్పమంటే ఎప్పుడూ కబుర్లు చెప్పడమే' నని వాపోయినవాడు వెంకటేశం. ఇంగ్లీషు చదువులు కుదురుకొని చదువు బదులు సమాజాన్ని చదువుకునే బదులుగా మారుతున్న వైనాన్ని కొడవటిగంటి కుటుంబరావు 'చదువు' నవలలో అద్భుతంగా చిత్రిస్తారు. చదువుల సారమైన సదసద్వివేచన అడుగంటి చదువు వ్యాపారమై వందలాది కోచింగ్ సెంటర్లను, వేలాది చీటింగ్ తుంటర్లను సృష్టించింది. నీతి తప్పిన 'నీట్' ద్రోహంతో కొత్త విద్యాసంవత్సరం మొదలవడం ఈ దుఃస్థితికి ప్రతీకాత్మక అభివ్యక్తి. నిఖిలదేశం హర్షించే మంచికాలం రహించాలని చదువులమ్మను కోరుకుందాం.

కల్తీ మద్యం కట్టడి ఎప్పుడు?!

కామెంట్



కరణ్ థాపర్

తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లా కరుణాపురంలో కల్తీ సారా తాగి 60 మందికి పైగా మృతి చెందటం, మృతుల సంఖ్య నానాటికీ పెరుగుతూ ఉండటం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. జూన్ మూడో వారంలో వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి సీబీసీఐడీ పోలీసులు ఇప్పటి వరకు అనేక మందిని అరెస్టు చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఉంచారు. ప్రజలు, పలు రాజకీయ పార్టీలకు చెందిన వారు, సామాజిక కార్యకర్తలు కల్తీ సారా విక్రయాలను అడ్డుకోటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంతకీ – దేశంలో తరచూ జరుగుతున్న ఇలాంటి దుర్ఘటనలకు బాధ్యులెవరు? తప్పు... కల్తీ సారా తాగిన వారిదా? లేక కల్తీ సారాను కట్టడి చేయలేకపోతున్న వారిదా?

నిజం ఏమిటంటే కల్తీ సారా సేవించటం వల్ల సంభవించే మరణాలు రెట్టింపుగా విషాదకరమైనవి. అవి భయానకమైనవి మాత్రమే కాదు, పూర్తిగా నివారించగలిగినవి కూడా! మనిషి వల్ల సంభవించే ఆ మరణాలను మనిషే సంభవించకుండానూ చూడగలడు. అందుకు కావలసిందల్లా వాస్తవికతలోని పచ్చి నిజాన్ని అంగీకరించటమే! అందరు మనుషులూ మద్యం సేవించనివాళ్లు కాదు. చాలా మంది తాగాలనుకుంటారు. తాగటంలో ఆనందాన్ని అనుభవిస్తారు. ముసుగు లేకుండా చెప్పాలంటే – ఏ పరిణతి చెందిన, వివేకవంతమైన, ప్రజాస్వామ్య సమాజంలోనైనా అందుకు వారికి కాదనలేని హక్కు ఉంది. ఆ హక్కును నిరాకరించటానికి, ఆమోదయోగ్యం కాని ఆంక్షలు విధించటానికి ఆ సమాజం చేసే ప్రయత్నాలు సమస్యకు కారణం అవుతాయి.



బాధితుల్ని పరామర్శిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్

మద్యం కనుక సురక్షితమైన, నాణ్యత గలిగిన, చవకైన లేదా సరసమైన ధరలో... చట్టం అంగీకరించిన, ఆమోదించిన నియమ నిబంధనలకు లోబడి వయోజనులందరికీ లభించినట్లయితే కల్తీ సారాకు ప్రాణాన్ని పణంగా పెట్టుకునేవారెవరూ ఉండరు. మద్యం సేవించేవారిలో అత్యధికులు తీవ్ర అసంతృప్తితో నిరాశకు గురై ఆత్మహత్యను ఆశ్రయించే మనఃస్థితిని కలిగి ఉన్నవారు కాదు. వారు కేవలం ఉపశమనాన్ని కోరుకునేవారు. ఒత్తిడి నుంచి, అలసట నుంచి కాస్త సేదతీరాలని, లేదా ఆహ్లాదకరమైన సాయంత్రాలను గడపాలనీ అనుకునేవారు. వారు కోరుకున్నది కొనలేకపోయినందు వల్లనే ప్రమాదకరమైన, ప్రాణం తీసే అవకాశం ఉన్న వాటిని వారు ఆశ్రయిస్తారు. అంతేతప్ప, మరణించటం ఎప్పుడూ కూడా వారి ఉద్దేశం కాదని గుర్తుంచుకోండి. అది కేవలం ఉద్దేశపూర్వకం కాని పరిణామం. పరిస్థితులు బలవంతంగా వారిపై వచ్చి పడ్డ పర్యవసానం.

అసలు సమస్యంతా మద్యం చెడ్డదని, అందువల్ల మద్యపానాన్ని నిలువరించాలని, కనీసం తీవ్రస్థాయిలో అందుకు విముఖత కలిగించాలని ఉన్న మన మూల భావనలోనే ఉంది. ''ఔషధాల విని యోగానికి మినహా... ఆరోగ్యానికి హాని కలిగించే మత్తుపానీయాలు, మత్తు పదార్థాల వాడకాన్ని నిషేధించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి'' అని రాజ్యాంగంలోని 47వ అధికరణం చెబుతోంది.

మితిమీరిన మద్యపానం చెడు చేస్తుందనటంలో సందేహం లేదు. బుద్ధిహీనులైన వారు మాత్రమే ఈ మాటను కాదంటారు. మితిమీరితే మద్యమేం కర్మ... పంచదార, వెన్న, మీగడ, అంతెందుకు వ్యాయామం కూడా ఆరోగ్యానికి హానికరమైనవే! మోతాదుల్లో తీసుకుంటే అది వేరే సంగతి. సరే, ఏదైనా ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. వారి సొంత తప్పుల్ని కూడా! అయితే మద్యనిషేధం అన్నది ఒక ప్రభుత్వ విధానంగా (బిహార్, గుజరాత్‌లలో మాదిరిగా) పౌర హక్కులను ఉద్దేశపూర్వకంగా నిరాకరించటం మాత్రమే కాదు, పౌర 'శిశుపాలన' కూడా చేస్తుంది. పౌరుల్ని పిల్లలుగా చూసే దేశానికి ఏది సరైనదో తెలియదు. అయితే ప్రజల్ని నర్సరీ పిల్లల్లా చూసే ప్రభుత్వాలు ఈ మాటను అంగీకరించవు.

ఏదేమైనా ఇక్కడొక లోతైన సమస్య ఉంది. మద్యం పట్ల అది మన వైఖరిని వివరిస్తుంది. అందుకే మహాత్మా గాంధీ వంటి నాయకులు, కొన్నిసార్లు మన వంటి రాజ్యాంగాలు మానవ బలహీనతగా లేదా అనైతికమైనదిగా భావించే వాటి నుంచి ప్రజల్ని దూరంగా ఉంచాలని కోరుకోవటం జరుగుతుంది. ప్రజల్ని సద్వర్తన కలిగినవారిగా తీర్చిదిద్దాలనుకోవటం, కనీసం అలా చేయటానికి ప్రయత్నించాలనుకోవటం నా దృష్టిలో ఒక తప్పుడు అభిప్రాయపు తపన. నైతిక కోణం నుంచి చూసినప్పుడు ఆ ప్రయత్నం అర్థవంతమైనదిగా కనిపించవచ్చు. బహుశా ఆచరణాత్మక దృక్కోణం నుంచి అది కొన్ని సమస్యల్ని నివారించవచ్చు. కానీ మానవ దృక్కోణం నుండి చూసినప్పుడు అధికారంలో ఉన్న వ్యక్తి సరైనదని నిర్ణయించినదాన్ని మీరు విభేదించినప్పుడు మీరు సరికాదు అనే భావన ఏర్పడుతుంది.

మహాత్మా గాంధీ; బిహార్, గుజరాత్ ప్రభుత్వాలు మద్యాన్ని ఎలా చూడటం జరిగిందన్న విషయంలో ఇది నిజం. ఫలానా సంవత్సరం తర్వాత పుట్టిన వాళ్లందరికీ ధూమపాన నిషేధం విధించాలన్న రిషీ సునాక్ మూర్ఖపు ప్రతిపాదన విషయంలో కూడా ఇది నిజం. మనుషుల్ని వారి స్వీయాకర్షణల నుంచి రక్షించగలిగితే పరివర్తన చెందుతారని వారి నమ్మకం. కానీ అది తప్పు.

నిజమైన పరివర్తన మీ తప్పుల నుండి మీరు నేర్చుకోవటం వల్ల వస్తుంది. అయితే నేర్చుకోటానికి ముందుగా మీరు ఆ తప్పుల్ని చేసి ఉండాలి. పొగ తాగటం మానేసినవారికి, మానేయాలని ఎప్పుడూ అనుకోనివారికి మధ్య వ్యత్యాసం ఇదే! అదిలిస్తే కదిలిన దాని కన్నా అనుభవం నుండి నేర్చుకున్నది గట్టి పాఠం అవుతుంది. ఎప్పటికీ మనసులో ఉండిపోతుంది.

మద్యానికి సంబంధించి నిజంగా విచిత్రమైన సంగతి... మన సంస్కృతిలో, ప్రాచీన సంప్రదాయాలలో అది భాగమై ఉండటం! సోమరసం దేవతలకు అమృతం. ముఖ్యంగా ఇంద్రుడికి ప్రీతికరమైనది. మరోవైపు నిషేధం అన్నది విదేశీయులది. అమెరికా 1920లలో మద్య నిషేధానికి ప్రయత్నించి విఫలం అయింది. అది మనం పరిష్కరించవలసిన మరికొన్ని సమస్యల్ని ఉత్పన్నం చేసింది. మనమెందుకు దేవతల మార్గాన్ని అనుసరించకూడదు? అలా చేయటం సంపూర్ణ స్వదేశీ అవుతుంది. అందుకు బదులుగా మనం ఎందుకని అమెరికా మార్గాన్ని అనుకరిస్తున్నాం?

ఈ వ్యాసంలోని నీతి సరళమైనది, సూటియైనది. చట్టం రాసి ఉంచిన 'మందు' చీటీని అనుసరించి ప్రజలు నిజాయితీగా, సురక్షితమైన మద్యాన్ని సేవించేలా చూడటంలో సుపరిపాలన ఉంటుంది. దుష్పరిపాలన దానిని కష్టతరం చేస్తుంది, లేదంటే అసాధ్యమైనదిగా మార్చి ప్రజల్ని తరచూ తమ ప్రాణాల్ని హరించే ప్రత్యామ్నాయాల వైపు నెట్టివేస్తుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పాపం అమెరికా!



అమెరికన్ల దుస్థితి పట్ల మనం బాధపడాలి. అధికారంలో ఉన్న అధ్యక్షుడు ఒక వాక్యాన్ని సరిగ్గా పూర్తిచేయలేడు; ఆయన పోటీదారేమో శిక్షపడిన మహాపరాధి.

– టెంజింగ్ లామ్‌సాంగ్, సంపాదకుడు

పురోగామి వైఖరి



మత సహనంతో కూడిన అక్బర్ యుగపు పాలనతో పోల్చినప్పుడు, అదే కాలంలో యూరప్‌లో మత నరమేధాలు, పీడన చోటు చేసుకున్నాయి. మత సామరస్యం పట్ల గల అక్బర్ పురోగామి వైఖరిని ఇది నొక్కి చెబుతోంది.

– డి.ఎన్.ఝా, చరిత్రకారుడు

వెనకబడిపోయాం!



యుద్ధాలు, వివాహాలు, ముజ్రా నాట్యాలు, రాజసౌధాల మీద మొఘలులు (1526–1757) దృష్టి పెట్టిన కాలంలో, పాశ్చాత్య ప్రపంచం పునరుజ్జీవనం, శాస్త్రీయ విప్లవం, పారిశ్రామిక విప్లవాలకు లోనై అమితమైన పురోగతిని సాధించింది. ఈ భారీ చారిత్రక బకాయిని మనం దాటాల్సి ఉంది.

– దిలీప్ మండల్, సంపాదకుడు

ఎందుకు లాగుతారు?



సభలో నెహ్రూను ప్రధాని మోదీతో పోల్చడం దుర్మార్గమైనది. వాళ్లిద్దరూ భిన్నమైన వ్యక్తులు, భిన్న కాలాల్లో పనిచేశారు. ఒకాయన స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని పునాది నుంచి నిర్మించారు; మరొకాయనేమో దాన్ని కొనసాగించడానికి సతమతం అవుతున్నారు. నెహ్రూను బరిలోకి లాగకుండా పాలించండి.

– ఎస్.ఇర్ఫాన్ హబీబ్, చరిత్రకారుడు

మాట్లాడతారంతే!



ముఖ్యంగా రాజధాని ఢిల్లీ ప్రాంతంలో నేను మాట్లాడే యువతీ యువకుల సంగతి మీరు వినాలి. వాళ్లు జమ్ము కశ్మీర్‌లో ఏ జిల్లానూ గుర్తించలేరు; కానీ కశ్మీర్‌కు ఆజాదీ ఉండాలంటారు. తాజ్ ముంబయి దాడులు లోలోపలి పని అనుకుంటారు; కానీ కసబ్ వాజ్మూలం పట్ల కలవరపడతారు. బ్రాహ్మణీయ పితృస్వామ్య ఆధిపత్యం అంటూ పదజాలం గుప్పిస్తారు; కానీ రాజకీయ రాడికల్ ఇస్లాం మాత్రం పితృస్వామికం అనుకోరు.

– అర్మియా మాలిక్, కాలమిస్ట్

పాశ్చాత్య జాబితా



దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కూడా నెల్సన్ మండేలా అమెరికా తీవ్రవాద జాబితాలో ఉన్నారు. పాశ్చాత్య ప్రపంచానికి... ఆఫ్రికా స్వాతంత్ర్య సమరయోధులు తీవ్రవాదులు.

– అడేమోలా, పాన్-ఆఫ్రికనిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గొత్తికోయల ఘోష వినరా?

'స్వేచ్ఛా ఫలాలు సామాన్యులకూ అందాలి... అన్నింట్లో అందరికీ సమానావకాశాలు దక్కాలి. స్వతంత్ర భారతం సుసంపన్న, ప్రజాస్వామ్య, పురోగామి దేశం కావాలి'. తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో తొలి ప్రధాని నెహ్రూ అభిలాష ఇది. అలాగే డా॥ అంబేడ్కర్ కూడా రాజ్యాంగ ప్రవేశికలోనే ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందాలని కోరుకొన్నారు. రాజ్యాంగంలోని 38 (1)వ అధికరణ ప్రజలందరి సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని, న్యాయబద్ధమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను నెలకొల్పాలని చెబుతున్నది. చట్టం అందరికీ సమానమే అని రాజ్యాంగం చెబుతోంది. కానీ అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఈ పదేళ్ల కాలంలో గొత్తికోయల వంటి ఆదివాసీలకు కనీస అవసరాలను కూడా తీర్చకుండా అన్యాయం చేశాయి.

తెలంగాణలో పదేళ్లు పాలించిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 'గొత్తికోయలు మన వారు కాద'ని ప్రకటించింది. వారిపై దాడులు చేసింది. 2006లో వచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని 'తలా తోక లేని చట్టం' అని ప్రకటించారాయన. గొత్తికోయలను శత్రువులుగా చూశారు. పోలీసులు, అటవీ అధికార్లు వారిని దాడులు చేసి వేధించారు. ఇది అన్యాయం. గొత్తికోయలు విదేశీయులేం కాదు. భారతీయులే. ఒకప్పటి సిరివంచ సంస్థానంలో, ఆ తరువాత మధ్యప్రదేశ్ రాష్ట్రంలో, నేటి ఛత్తీస్‌గఢ్‌లో వారు ఎస్టీలుగా గుర్తింపు ఉన్నవారు. అటువంటివారు... నేడు తెలుగు రాష్ట్రాల్లో 60 వేల మంది ఏ గుర్తింపూ లేకుండా వందలాది గ్రామాల్లో అడ్రసులేని వారుగా బిక్కుబిక్కుమని బతుకుతున్నారు. రోగాలు, నొప్పులతో, ఉపాధిలేక, పోడు భూములపై హక్కులు లేకుండా అటవీ అధికార్ల దాడులు, దౌర్జన్యాలు భరిస్తూ బతుకుతున్నారు.

వారికి కుల ధృవీకరణ (ఎస్టీ) సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల ఎస్టీ నియోజక వర్గాల్లో ఎన్నికల్లో పోటీ చేసే హక్కు లేదు. పైచదువులు చదవడానికీ, ఉద్యోగాలు పొందడానికీ అవకాశాలు సన్నగిల్లాయి. వారు నివసించే చోట రహదారి సౌకర్యాలు కానీ, వైద్య సౌకర్యాలు కానీ లేవు. కరెంటు అసలే లేదు. రక్షిత మంచినీరు కాదు... కనీసం బోరు నీరు కూడా లేక కొండ కాల్వల్లోని కలుషిత నీరు తాగి రోగాల పాలవుతున్నారు. అటవీ అధికార్లు బోర్లు వేయనీయరు. వేస్తే కేసు పెడతారు. ధ్వంసం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో బాటన్న నగర్‌లో ఇదే జరిగింది. మనసున్న రెవెన్యూ అధికార్లు ప్రయత్నిస్తే, అటవీ అధికార్లు అడ్డగిస్తున్నారు. ఇలా చేయటమేకాక, కొండ కాల్వల్లో నీళ్ల సెలిమెలు (గుంటలు) తీసుకొని నీళ్లు వాడుకుంటే వాటిల్లో మానవ విసర్జితాలు వదలి దుర్మార్గాన్ని చాటిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్ర కొండ మండలంలో జరిగింది. ఇలా చెబుతూ పోతే చాలా వున్నాయి. ఈ అమానవీయ పరిస్థితుల నుంచి గొత్తికోయలు బయటపడేదెప్పుడు?

– కెచ్చెల రంగారెడ్డి, సీపీఐ (ఎమ్ఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు

రాచరికం నుంచి ప్రజాస్వామ్యం దాకా...


కర్నూలు ప్రాంతాన్ని పరిపాలించని ఉత్తర, దక్షిణ భారత ప్రసిద్ధ రాజవంశాలు లేవంటే అతిశయోక్తి కాదు. క్రీస్తుపూర్వం ఈ ప్రాంతాన్ని మౌర్యులు పాలించారు. తర్వాతి కాలంలో చాళుక్యులు, పల్లవులు, చోళులు, రాష్ట్రకూటులు, కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగర రాజులు పాలించారు. విజయనగర రాజుల పాలన ఈ ప్రాంతానికి స్వర్ణయుగంగా చెప్పవచ్చు. 1565లో జరిగిన తళ్ళికోట యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం ఓటమి తరువాత ముస్లిం పాలకులు: బీజాపుర్ సుల్తానులు, మొఘల్ చక్రవర్తులు, గోల్కొండ నవాబులు, కర్నూలు నవాబులు దాదాపు 275 ఏళ్లు పాలించారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనపై మొదట 1801లో ముత్తుకూరు గౌడప్ప నాయకత్వంలో తెర్నేకల్ గ్రామం పన్నులు కట్టడానికి నిరాకరించింది. బ్రిటీష్ సైనికుల ముట్టడిలో అనేకమంది గ్రామస్థులు మరణించారు. బ్రిటీష్ వారిని ఎదిరించి తిరుగుబాటు చేసిన మొదటి గ్రామంగా తెర్నేకల్‌ను చెప్పవచ్చు.

ప్రసిద్ధి చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిన్నవయసులోనే బ్రిటిష్ ప్రభుత్వ కఠినమైన పరిపాలనా విధానానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటు అతి త్వరగా 66 గ్రామాలకు వ్యాపించింది. 1846–1847 మధ్య కాలంలో ఈయన సాహసోపేతమైన ప్రతిఘటన జనరల్ ఆండర్సన్ ఆధ్వర్యంలోని ఆంగ్లేయ దళాలను గడగడ లాడించింది. అయితే అపారమైన బ్రిటిష్ సైన్యం ముందు ఓటమి తప్పలేదు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని బంధించి ఉరితీసింది కంపెనీ ప్రభుత్వం.

1800వ సంవత్సరంలో నిజాం నవాబు ఈస్టిండియా కంపెనీ వారికి సైనిక ఖర్చుల కోసం ఇవ్వవలసిన సొమ్ముకు బదులుగా బళ్ళారి, కడప జిల్లాలను పూర్తిగానూ; కర్నూలు జిల్లాలోని కంభం, మార్కాపురం, కోయిలకుంట్ల, పత్తికొండ తాలూకాలను ఇచ్చాడు. ఇలా వారికి ధారాదత్తం చేయడంతో ఈ ప్రాంతాలకు 'దత్త మండలాలు' అనే పేరు వచ్చింది. ఈస్టిండియా కంపెనీ పాలనలో కర్నూలు ప్రాంతం 1800వ సంవత్సరం నుంచి 1857వ సంవత్సరం వరకు కొనసాగింది.

దత్తమండలాలకు ప్రధాన కలెక్టరుగా థామస్ మన్రో 1800–1807 వరకు సేవలను అందిచాడు. కర్నూలు ప్రాంతాన్ని పాలించిన మొదటి కలెక్టరు ఆయనే. రైత్వారీ భూవిధానం వంటి వ్యవస్థాగతమైన మార్పులతో ఉత్తమ పాలన సాగింది. మన్రో నివేదికను అమలు



చేస్తూ రెవిన్యూ పరిపాలన సౌలభ్యం కోసం 1808వ సంవత్సరంలో రెండు జిల్లాలు ఏర్పడ్డాయి. అవి కడప, బళ్ళారి జిల్లాలు. అనంతపురం ప్రాంతం బళ్ళారి జిల్లాలో, కర్నూలు ప్రాంతం కడప జిల్లాలో భాగంగా ఉండేవి. కర్నూలు పరిధిలోని రామళ్లకోట, నంద్యాల, సిరివెల్, నందికొట్కూరు తాలూకాలతో పాటు కడప జిల్లా నుంచి దూపాడు (మార్కాపురం), కంభం, కోయిలకుంట్ల; బళ్లారి జిల్లా నుంచి పత్తికొండ తాలూకాను కలిపి మొత్తం 8 తాలూకాలతో 1858 జూలై 1న కర్నూలు జిల్లా అవతరించినది. స్వాతంత్ర్యం సిద్ధించే వరకు ఈ జిల్లాలో ఎలాంటి మార్పులూ సంభవించలేదు. అయితే 2022 ఏప్రిల్ 4న జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత కర్నూలు జిల్లా రెండుగా... అంటే కర్నూలు, నంద్యాల జిల్లాలుగా విభజితమయ్యింది.

ప్రస్తుతం జనాభా విషయంలో నంద్యాల జిల్లా కంటే ఎక్కువగా, వైశాల్యం, రెవిన్యూ విషయంలో నంద్యాల జిల్లా కంటే తక్కువ స్థాయితో కర్నూలు మారిన పరిస్థితిని గమనించగలం.

– ఆచార్య మన్సూర్ రహ్మాన్
సామాజిక – ఆర్థిక విశ్లేషకులు । 9441067984
(కర్నూలు జిల్లా 166వ అవతరణ దినోత్సవం నేడు)

వరమైన జీవిత సత్యం

జెన్ గురువుల ఉపదేశాలు, బోధనలు విని వాటి పట్ల ఆకర్షితులైన వారందరూ వారిని తమ జీవితకాలంలో ఒక్కసారైనా చూడాలనుకోవడం అతిశయోక్తి కాదు. అంతేకాదు, వారిని కలిసి వారితో తమ సమస్యలకు పరిష్కారాన్ని ఆశించడమూ కద్దు. అటువంటివారిలో రాజులూ ఉంటారు.

ఒక రోజు షెన్‌హాయ్ అనే గురువును వెతుక్కొంటూ ఓ రాజు వచ్చి 'నాకు ఓ అంతిమమైన మాట రాసివ్వండి. ఆ మాట ఎలా ఉండాలంటే జీవిత సత్యాన్ని ప్రతిఫలించేట్టుగా ఉండా'లన్నాడు. రాజు చెప్పిందంతా విన్న జ్ఞాని ఓ కాగితంపై ఈ కింది చిన్న కవిత రాసిచ్చాడు:



'తండ్రీ మరణిస్తాడు / కొడుకూ మరణిస్తాడు
ఆ తర్వాత మనవడూ మరణిస్తాడు'

అది చదివి రాజు ఆశ్చర్యపడి దీని అంతరార్థం చెప్పమన్నాడు.

అప్పుడు జ్ఞాని ఓ నవ్వు నవ్వాడు. 'నువ్వు అడిగింది జీవిత సత్యాన్ని! ఇది ఎప్పటికీ చెరిగిపోని జీవిత సత్యం. మీ తాత ఎప్పుడో చనిపోయాడు. నీ తండ్రీ కొన్ని రోజుల క్రితం చనిపోయాడు. నువ్వూ ఓ రోజు చనిపోబోతున్నావు. నీ కుమారుడూ ఓ రోజు కచ్చితంగా చనిపోతాడు' అన్నాడు. 'పుట్టిన వారందరూ మరణిస్తారు అనేది అందరికీ తెలుసు. కానీ మీ వంటి జ్ఞాని ప్రజలకు వరప్రసాదం లాంటి మాట చెప్పకుండా శాపం లాంటి అపశకునపు మాటల్ని రాసివ్వడం బాధ కలిగిస్తోంద'న్నాడు రాజు.

'ఇది శాపమా... ఇది పెద్ద వరం. శుభశకునం. బాగా ఆలోచించి చూడు. ముందుగా తండ్రి మరణిస్తాడు. ఆ తర్వాత బిడ్డలు చనిపోతారు. అనంతరం మనవళ్ళు మరణిస్తారు. ఇదేగా ఓ క్రమపద్ధతి. నీ పెద్దలు తమ అంత్యక్రియలను నువ్వు చెయ్యాలనేగా అనుకుంటారు. నువ్వు మరణించి నీ కొడుకు నీకు అంతిమ సంస్కారాలు చేయడం సహజం. అలా కాకుండా నువ్వుండి నీ కొడుకు మరణించి నువ్వు అతని అంత్యక్రియలు చెయ్యవలసి వస్తే అది ఎలా ఉంటుందో ఆలోచించు! అలా జరిగితే అది శాపం. కానీ నువ్వు మరణించి నీ అంత్యక్రియలు నీ కొడుకు చెయ్యడం అనేది వరం. మరణం అనేది సహజం. అందులో వింతేమీ లేదు. పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఓ రోజు మరణించాల్సిందే. అయితే అది సహజ పద్ధతిలో జరిగితే వరం. అది దైవమిచ్చిన వరం. అంతా శుభమే!' జ్ఞాని వివరంగా చెప్పిన మాటలన్నీ విన్న తర్వాత రాజు ఆ కవితను కళ్ళకు అద్దుకుని ఒకటికి రెండు సార్లు చదువుకుని ఆయనకు నమస్కరించి వెనుతిరిగాడు. ఇటువంటి జెన్ గురువులు సమకాలీన సమాజం ప్రశాంతంగా నడవడానికి ఎంతగానో తోడ్పడ్డారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; జ్యేష్ఠ మాసం; తిథి: బ.దశమి ఉ.10.59 వరకు, తదుపరి ఏకాదశి; నక్షత్రం: అశ్విని ఉ.7.40 వరకు, తదుపరి భరణి; వర్జ్యం: సా.4.46 నుండి 6.17 వరకు; దుర్ముహూర్తం: ప.12.30 నుండి 1.22 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు; అమృత ఘడియలు: రా.1.44 నుండి 3.12 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు; సూర్యోదయం: 5.32; సూర్యాస్తమయం: 6.14

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

మాపై అసత్య ప్రచారం మానుకోండి

మావోయిస్టుల పేరిట లేఖ విడుదల

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టులు నకిలీ నోట్లను ముద్రిస్తున్నారంటూ పోలీసులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని మావోయిస్టు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి సమత డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఓ లేఖ జారీ చేయగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లోని కుంట ఏరియాలో చేపట్టిన తనిఖీల్లో మావోయిస్టులకు చెందిన ప్రింటింగ్ మెషీన్, కాగితాలు లభించాయని పోలీసులు తమపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులు నకిలీ నోట్లు ముద్రిస్తున్నారంటూ తమపై విష ప్రచారం చేస్తున్నారని ఇప్పటివరకు వివిధ దాడుల్లో పట్టుబడిన మావోయిస్టుల దగ్గర ఒక్క నకిలీ నోటు కూడా ఎందుకు లభించలేదో చెప్పాలని ఆమె సవాల్ విసిరారు. జూన్ 23న టేకులగూడ దగ్గర మావోయిస్టులు పేల్చిన మందుపాతరలో ఐదుగురు జవాన్లు మరణించగా 15 మందికి గాయాలయ్యాయని ప్రకటించారని, అయితే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వాస్తవాలను ప్రభుత్వ వర్గాలు దాస్తున్నాయని ఆరోపించారు. ఈ దాడిలో చనిపోయిన జవాన్ల కుటుంబాలకు మావోయిస్టు పార్టీ సానుభూతి ప్రకటించిందన్నారు. ఈ మరణాలకు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్ బాధ్యత వహించాలని లేఖలో డిమాండ్ చేశారు.

పాలనలో ప్రణాళిక శాఖదే కీలకపాత్ర

రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ప్రణాళిక శాఖ పాత్ర కీలకమని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. ఖైరతాబాద్‌లోని అర్థగణాంక శాఖ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆ శాఖ డైరెక్టర్ దయానంద్ ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్నారెడ్డి దయానంద్‌ను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. 35 ఏళ్ల ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన దయానంద్ దక్షతకు ప్రభుత్వం నుంచి రానున్న రోజుల్లో తగిన గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దయానంద్‌ను ఉద్యోగ సంఘాల నాయకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

శుభకార్యానికి తీసుకెళ్లలేదని విద్యార్థిని ఆత్మహత్య



కాచిగూడ(హైదరాబాద్): శుభకార్యానికి తల్లిదండ్రులు తీసుకెళ్లకపోవడంతో ఓ విద్యార్థిని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న గణేశ్ భార్య, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె రుకిత(12) 7వ తరగతి చదువుతోంది. బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి కుటుంబ సభ్యులంతా కలిసి వెళ్లాల్సి ఉండగా గణేశ్ ఒక్కడే వెళ్లాడు. భార్య ఇళ్లలో పనిచేయడానికి వెళ్లడంతో చెల్లెలు ఆడుకోవడానికి బయటకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రుకిత ఇంటి పైకప్పునున్న ఇనుప కడ్డీకి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి పని ముగించుకుని తలుపు కొట్టగా ఎంతకు తీయలేదు. కిటికీలో నుంచి చూడగా కుమార్తె వేలాడుతూ కనిపించింది. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

ప్లాస్టిక్ కాలుష్యానికి చెక్ పెట్టేదెలా?

గతేడాది జూన్‌లో రాష్ట్రంలో సగటున రోజుకు 1,082 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి

- ప్రస్తుతం రోజుకు సగటున 1,448 టన్నులకు చేరిక
- రీసైక్లింగ్, ఇతర మార్గాల ద్వారా రోజుకు 1,140 టన్నుల శుద్ధి
- అయినా నిత్యం సగటున పేరుకు పోతున్న 308 టన్నుల ప్లాస్టిక్ చెత్త
- రెండేళ్ల క్రితమే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించినా ఫలితమివ్వని వైనం



2022 జూలై 1 నుంచి తెలంగాణలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు ఇవే...

- ప్లాస్టిక్ పుల్లలతో కూడిన ఇయర్‌బడ్స్
- ప్లాస్టిక్ పుల్లలతో కూడిన బెలూన్లు
- ప్లాస్టిక్ జెండాలు
- క్యాండీ స్టిక్కులు
- ఐస్‌క్రీమ్ పుల్లలు
- అలంకరణకు ఉపయోగించే పాలిస్టెరీన్ (థర్మోకోల్)
- ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్క్‌లు, స్పూన్లు, కత్తులు, స్ట్రాలు, ట్రేలు వంటి కట్లరీ వస్తువులు
- స్వీట్‌బాక్స్‌ల ప్యాకింగ్‌కు వాడే ఫిల్మ్‌లు, ఆహ్వానపత్రికలు, సిగరేట్ ప్యాకేట్లు
- ప్లాస్టిక్ లేదా పీవీసీ బ్యానర్లు (వంద మైక్రాన్ల లోపు), స్టిరర్‌లు
- వస్తువుల దిగుమతి, నిల్వ, పంపిణీ, విక్రయం, వినియోగం వంటి వాటిపై నిషేధం అమల్లో ఉంది.

సాక్షి, హైదరాబాద్: ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన కాలుష్యం పెరుగుదల సమస్య రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతోంది. యావత్ ప్రపంచంతోపాటు దేశంలో కూడా ఈ సమస్య విషమంగా మారుతోంది. కానీ నియంత్రణ చర్యలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. తెలంగాణ కూడా ఇందుకు మినహాయింపుగా లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు హైదరాబాద్ మహానగరంలో ప్లాస్టిక్ కాలుష్యం సమస్య అంతకంతకూ పెరుగుతోంది. 2018లో ఐసీఎల్ఈఐ సౌత్ ఏషియా సంస్థ నిర్వహించిన అధ్యయనంలో హైదరాబాద్‌లో ఉత్పత్తి అయ్యే చెత్త, వ్యర్థాల్లో ప్లాస్టిక్కే 20 శాతంగా ఉన్నట్లు వెల్లడైంది. గతంలో అంటే ఈ సర్వే నిర్వహించిన కాలంలో నగరంలోని నివాసిత ప్రాంతాల్లో రోజుకు 365 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవగా తగిన నియంత్రణ చర్యలు చేపట్టకపోతే 2025కల్లా అది రోజుకు 500 మెట్రిక్ టన్నులకు చేరుకుంటుందని ఈ నివేదిక ద్వారా హెచ్చరికలు జారీ అయ్యాయి. మొత్తంగా చూస్తే గతేడాది జూన్ నాటికి రాష్ట్రంలో రోజుకు ఉత్పత్తయ్యే 1,082 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి నేడు రోజుకు 1,448 మెట్రిక్ టన్నులకు వాటి ఉత్పత్తి చేరుకోవడాన్ని బట్టి చూస్తే సమస్య తీవ్రత అర్థమవుతోంది. ప్లాస్టిక్ ద్వారా వస్తున్న చెత్త లేదా వ్యర్థాల్లో ఒకసారి వాడి పారేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ వస్తువులే అధిక శాతం ఉంటున్నట్లు పలు అధ్యయనాల్లో ఇప్పటికే వెల్లడైంది. దుకాణాలు మొదలు సముద్రాల దాకా వాటి జాడ కనిపిస్తుండడాన్ని బట్టి ఇవి ఎంత ప్రమాదకరంగా మారాయో స్పష్టమవుతోంది. నేటి ఆధునిక జీవనశైలి అవసరాలు, అలవాట్లకు తగ్గట్లుగా వివిధ రూపాల్లో ప్లాస్టిక్ కవర్లు అందుబాటులోకి రావడంతో ఇవి తప్పక వాడని పరిస్థితి ఎదురవుతోంది. దీంతో వాటి వినియోగం అంతకంతకూ పెరుగుతూ పర్యావరణం, మనుషుల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలిగిస్తోంది.

పర్యవేక్షణకు సిబ్బంది ఏరి?

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ బాధ్యత హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, జిల్లాల్లో మున్సిపాలిటీలు/కార్పొరేషన్లకు, గ్రామీణ ప్రాంతాల్లో పీఆర్ శాఖ, స్థానిక సంస్థలకు ప్రభుత్వం అప్పగించింది. అయితే ఈ సమస్యపై రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షణకు సంబంధించి సిబ్బంది లేమి, ఇతర సమస్యలతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు (పీసీబీ) పూర్తిస్థాయిలో సమాయత్తం కాలేకపోతోంది. 2022 జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా 19 సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, పంపిణీ, నిల్వ, విక్రయం, వినియోగంపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఇది జరిగి రెండేళ్లు కావొస్తున్నా సింగల్ యూజ్ క్యారీ బ్యాగ్‌ల వాడకం యథేచ్ఛగా కొనసాగుతోంది.

గతేడాది నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రిజిస్ట్రార్ జనరల్‌కు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నివేదిక

- జీహెచ్ఎంసీ ఏరియాలో 38 డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్లు (డీఆర్‌సీసీ) ఏర్పాటు
- 142 పట్టణ స్థానికసంస్థల్లో 247 డీఆర్‌సీసీలు (141 సంస్థల్లో 209, జీహెచ్ఎంసీలో 38 కలిపి)
- 12,770 గ్రామ పంచాయతీల్లో 100 శాతం కంపోస్ట్ కమ్ సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం పూర్తి

టీపీసీబీ తాజా నివేదిక ప్రకారం చూస్తే

ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి	1,448 (టన్స్ పర్ డే (టీపీడీ)
రీసైక్లింగ్‌కు ఉపయోగిస్తున్న ప్లాస్టిక్	224 (టన్స్ పర్ డే)
సిమెంట్ బట్టీలలో కో-ప్రాసెస్ చేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు	130 (టీపీడీ)
వ్యర్థాల నుంచి ఆయిల్ ఉత్పత్తికి ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ వేస్ట్	92 (టీపీడీ)
రిఫ్యూస్ డిరైవ్డ్ ఫ్యూయల్స్ (ఆర్‌డీఎఫ్)లో ఉత్పత్తికి వాడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు	734 (టీపీడీ)
మొత్తంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ	1,140 (టీపీడీ)
ఏ రూపంలోనూ పునర్ వినియోగించని, ఉపయోగపడని ప్లాస్టిక్ వ్యర్థాలు (గ్యాప్)	308 (టీపీడీ)

- జవహర్‌నగర్‌లో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ (ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్) ఏర్పాటు
- డీఆర్‌సీసీల వద్ద ప్లాస్టిక్‌ను విడదీసి వివిధ రీసైక్లింగ్ సెంటర్లకు చేరవేత
- రీసైకిల్ చేయలేని ప్లాస్టిక్‌ను కో-ప్రాసెసింగ్ కోసం, తేలికైన ప్లాస్టిక్‌ను రిఫ్యూస్ డిరైవ్డ్ ఫ్యూయల్స్ (ఆర్‌డీఎఫ్)లో స్టోర్ చేస్తున్నాం
- 120 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ బ్యాగ్‌లు, ప్లాస్టిక్ షీట్స్‌పై పూర్తిగా నిషేధం
- ప్రత్యామ్నాయ వినియోగంలేని, రీసైకిల్ చేయలేని, ఏ ఇంధనంగా మార్చలేని మల్టీలేయర్ల ప్లాస్టిక్ దశలవారీగా ఉత్పత్తి మానేయాలని ఉత్పత్తిదారులకు ఆదేశాలు జారీ
- నిషేధం అమలు, పర్యవేక్షణకు స్పెషల్ ఎన్విరాన్‌మెంటల్ స్క్వాడ్ ఏర్పాటు

సింగరేణి సీఎండీకి ట్రీమ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డు



అవార్డు అందుకుంటున్న సీఎండీ బలరామ్

సింగరేణి (కొత్తగూడెం),గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థను పర్యావరణహితంగా మార్చడమే కాకుండా పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు తానే స్వయంగా 18 వేలకు పైగా మొక్కలు నాటిన సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్‌కు 'ట్రీమ్యాన్ ఆఫ్ తెలంగాణ'అవార్డు వరించింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్–2024 సంస్థ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులు ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ కంపెనీలు, అందులోని ప్రభావశీల వ్యక్తులకు గ్రీన్ మ్యాపుల్ ఏటా ప్రోత్సాహక అవార్డులు అందజేస్తోంది. సివిల్ సర్వీసెస్ అధికారిగా ఉన్నతస్థాయిలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ కోసం 6 జిల్లాల్లో 35 చిన్న అడవులును సృష్టించడం దేశంలోనే అత్యంత అరుదని బలరామ్ కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ...ప్రతీ అడుగు పచ్చదనం నినాదంతో సింగరేణిలో మొక్కలు నాటే యజ్ఞాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఈ ఏడాది వనమహోత్సవంలో మరో 2 వేల మొక్కలు నాటాలని వ్యక్తిగత లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు వివరించారు. కంపెనీలో ఈ ఏడాది 40 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. అలాగే పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు వీలుగా సింగరేణి పాఠశాలల్లో పర్యావరణ సిలబస్‌ను బోధిస్తున్నామని, ప్రతీక్లాస్‌లోనూ ఎన్విరాన్మెంట్ కెప్టెన్లను నియమించి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నట్లు చెప్పారు.

గూడ్స్ రైలు నుంచి పొగలు

జనగామ స్టేషన్‌లో హాల్టింగ్.. విద్యుత్ సరఫరా నిలిపి వేత



గూడ్స్ రైలు బోగీ నుంచి వస్తున్న పొగలు

జనగామ: జనగామ రైల్వేస్టేషన్ వ్యాగన్ పాయింట్‌లో ఓ గూడ్స్ రైలుకు చెందిన గార్డుబోగీ పట్టాలు తప్పిన ఘటన మరువక ముందే..సింగరేణి బొగ్గు లోడ్‌తో వెళ్తున్న మరో రైలులో పొగలు వచ్చిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కాజీపేట నుంచి సికింద్రాబాద్ సనత్‌నగర్‌కు బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలులోని ఓ బోగీ నుంచి పొగలు రావడాన్ని గార్డు గమనించి డ్రైవర్‌కు సమాచారం ఇవ్వంగా జనగామ స్టేషన్ అప్ మెయిన్ లైన్‌లో నిలిపి వేశారు. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే ట్రాఫిక్ (విద్యుత్ పర్యవేక్షణ) సిబ్బంది అక్కడికి చేరుకుని అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ముందుగానే ట్రాక్ లైన్‌లోని విద్యుత్ సరఫరాను రఘునాథపల్లి నుంచి పెంబర్తి వరకు నిలిపి వేసి బోగీలోని బొగ్గు కింద భాగం నుంచి వస్తున్న పొగలను ఆర్పివేశారు. ఈ క్రమంలో కాజీపేట-సికింద్రాబాద్ లైన్లలో అప్ అండ్ డౌన్‌లో నడిచే ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఆయా స్టేషన్ల పరిధిలో ట్రాక్ పైనుంచి ఉన్న పుట్‌ఓవర్ బ్రిడ్జిపై వెళ్లే ప్రయాణికుల్లో ఎవరో ఒకరు సిగరెట్ తాగి విసిరేయడంతో బోగీలోని బొగ్గు అంటుకుని పొగలు రావచ్చని అధికారులు భావిస్తున్నారు.

RECEPS RECEPS LIMITED

Parawada Industrial Area,Jawaharlal Nehru Pharmacity, Visakhapatnam, Andhra Pradesh-531021

SEALED TENDER NOTICE

RECEPS Invites Global Tender for the following work (2nd call)

Description of Work	Global Tender for Supply of Pharmaceutical Analytical Equipment

Date of Tender Submission: 08.07.2024

Date of Opening Bids

Technical Bid	10.07.2024
Commercial Bid	15.07.2024

RECEPS, a Pharmaceutical Research & Development company invites Global tender for supply of Analtyical Equipment as described in the Request For Proposal (RFP - 2nd call) document uploaded in the website of the company http://receps.org .Interested and eligible agencies to download the RFP from the company website under Tender tab and submit their most competive quote as per the terms & conditions of RFP

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలు పూర్తి

- పార్టీలకతీతంగా హాజరైన ప్రజలు... బీజేపీ నేతలు



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి సంజయ్

ఉట్నూర్‌రూరల్: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలు ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలకేంద్రంలోని ఎక్స్‌రోడ్డు సమీపంలో ముగిశాయి. ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి రాథోడ్ అంతిమయాత్రలో పాల్గొని అభిమాన నేతకు కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా, శనివారం రాత్రి 2 గంటలకు కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ఉట్నూర్ చేరుకుని ఆయన పార్థీవ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. అంతకుముందు రమేశ్ రాథోడ్ భౌతికకాయానికి పార్టీలకతీతంగా రాష్ట్ర, జిల్లా ప్రజా ప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు. రాథోడ్ అంతిమయాత్రలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, జాదవ్ అనిల్, వెడ్మ బొజ్జు, రామారావు పటేల్, మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరీబాయి, మాజీ మంత్రులు ఐకేరెడ్డి, జోగు రామన్న హాజరయ్యారు.

డీఎస్‌కు అంతిమ వీడ్కోలు

- అధికార లాంఛనాలతో నిజామాబాద్‌లో అంత్యక్రియలు
- ఆయన నివాసం నుంచి వ్యవసాయ క్షేత్రం వరకు అంతిమయాత్ర
- హాజరై నివాళులు అర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు
- గాలిలోకి కాల్పులు జరిపి అధికార లాంఛనాలు పూర్తిచేసిన పోలీసులు
- చితికి నిప్పు పెట్టిన పెద్ద కుమారుడు ధర్మపురి సంజయ్



డీఎస్ భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో రాజ్యసభ మాజీ ఎంపీ వీహెచ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీఎస్ కుటుంబ సభ్యులు

ఖలీల్‌వాడి (నిజామాబాద్ అర్బన్): పీసీసీ మాజీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు, అభిమానులు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ఆదివారం మధ్యాహ్నం నిజామాబాద్‌లోని వ్యవసాయ క్షేత్రంలో డీఎస్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. సీఎం రేవంత్, మంత్రులు, ఇతర నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళి అర్పించారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

శనివారం తెల్లవారుజామున 3 గంటలకు డీఎస్ కన్నుమూసిన విషయం తెలిసిందే. శనివారం సాయంత్రమే ఆయన భౌతికకాయాన్ని నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లో ఉన్న నివాసానికి తరలించారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు డీఎస్ అంతిమయాత్ర ప్రారంభమైంది. కోర్టు చౌరస్తా, రైల్వే కమాన్, కంఠేశ్వర్ ప్రాంతాల మీదుగా వ్యవసాయ క్షేత్రం వరకు యాత్ర సాగింది. డీఎస్ అభిమానులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వ్యవసాయక్షేత్రంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు. డీఎస్ పెద్ద కుమారుడు ధర్మపురి సంజయ్ చితికి నిప్పంటించారు.

నివాళి అర్పించిన ప్రముఖులు


సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీలు మధుయాష్కీ, లగడపాటి రాజగోపాల్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ తదితరులు డీఎస్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

తెలంగాణ సాధనలో డీఎస్‌ది కీలకపాత్ర: సీఎం

తెలంగాణ రాష్ట్ర సాధనలో పీసీసీ మాజీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్‌ది కీలకపాత్ర అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోనియాగాంధీని ఒప్పించి తెలంగాణ ఏర్పాటుకు బీజం వేశారని చెప్పారు. సీఎం రేవంత్ ఆదివారం ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్‌కు చేరుకున్నారు. డీఎస్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. డీఎస్ కుమారులు సంజయ్, అర్వింద్‌లను ఓదార్చారు. తర్వాత మాట్లాడారు. 2004లో కరీంనగర్‌లో జరిగిన సభలో సోనియాగాంధీతో తెలంగాణపై ప్రకటన చేయించినదీ డీఎస్ అని చెప్పారు. ఆయన క్రమశిక్షణ గల కార్యకర్త అని, అందుకే పార్టీ మారినా సోనియాగాంధీ కుటుంబం ఆయనకు గౌరవం ఇచ్చిందని పేర్కొన్నారు. ''ఇటీవల డీఎస్ ఫోన్ చేసి కాంగ్రెస్‌లోకి వస్తానని చెప్పారు. మరి ఎలాంటి పదవులు ఆశిస్తున్నారని మేం అడిగాం. తాను అన్ని రకాల పదవులు అనుభవించానని, ఎలాంటి పదవులు అవసరం లేదని డీఎస్ చెప్పారు. తాను మరణిస్తే కాంగ్రెస్ జెండా కప్పాలని కోరారు. దీంతో ఆయన మరణవార్త తెలియగానే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబును పంపి.. డీఎస్ దేహంపై కాంగ్రెస్ కండువా కప్పించాం..'' అని రేవంత్ తెలిపారు. డీఎస్ మరణం పట్ల సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంతాపం తెలిపారని వివరించారు.

డీఎస్ మృతికి మున్షీ సంతాపం

సాక్షి, హైదరాబాద్: పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మృతిపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సంతాపం వ్యక్తం చేశారు. సిద్ధాంతాన్ని నమ్మిన క్రమశిక్షణ గల నేత, కాంగ్రెస్ అధిష్టానానికి సుదీర్ఘ కాలం పాటు నమ్మినబంటుగా పనిచేసిన నాయకుడు డీఎస్ అని ఆదివారం ఒక ప్రకటనలో ఆమె కొనియాడారు. ఉమ్మడి ఏపీ అధ్యక్షునిగా ఆయన పనిచేసిన రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. డీఎస్ మరణం తెలంగాణ ప్రాంతానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ ప్రకటనలో మున్షీ కోరారు.



ఆర్మీ చీఫ్‌గా జనరల్ ఉపేంద్ర ద్వివేది



న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్‌లతో సరిహద్దుల్లో సుదీర్ఘ కార్యాచరణ అనుభవమున్న లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది 30వ ఆర్మీ చీఫ్‌గా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందించిన ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే రిటైరయ్యారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీ నుంచి ఆర్మీ వైస్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు 2022–2024 సంవత్సరాల మధ్య ఆయన జనరల్ ఆఫీసర్ కమాండ్ ఇన్ చీఫ్ ఆఫ్ నార్తర్న్ కమాండ్‌గా ఉన్నారు. మధ్యప్రదేశ్‌లోని రేవా సైనిక స్కూల్ విద్యార్థి అయిన జనరల్ ద్వివేది 1984లో జమ్మూకశ్మీర్ రైఫిల్స్ రెజిమెంట్‌లో చేరారు. పరమ విశిష్ట సేవ, అతి విశిష్ట సేవ పతకాలు పొందారు.

ఆర్మీ చీఫ్, నేవీ చీఫ్ క్లాస్‌మేట్స్

దేశ సైనిక చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఆర్మీకి, నేవీకి సారథ్యం వహిస్తున్న ఇద్దరూ క్లాస్‌మేట్స్ కావడం విశేషం. లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, అడ్మిరల్ దినేశ్ త్రిపాఠీ మధ్యప్రదేశ్‌లోని రేవా సైనిక్ స్కూల్‌లో సహాధ్యాయులు. 1970లలో వీరిద్దరూ అక్కడ ఐదో తరగతి నుంచి కలిసి చదువుకున్నారు. వీరిద్దరి రోల్ నంబర్లు కూడా దగ్గరదగ్గరగా ఉన్నాయి. జనరల్ ద్వివేది రోల్ నంబర్ 931 కాగా, అడ్మిరల్ త్రిపాఠీ నంబర్ 938. పాఠశాల దశలో మొదలైన వీరి స్నేహబంధం ఇప్పటికీ కొనసాగుతోంది. వేర్వేరు బాధ్యతల్లో ఉన్నప్పటికీ వీరి మైత్రి చెక్కుచెదరలేదు. రెండు నెలల వ్యవధిలోనే ఈ ఏడాది మేలో అడ్మిరల్ త్రిపాఠీ నేవీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టగా, తాజాగా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆర్మీ చీఫ్ అయ్యారు.

మహారాష్ట్ర తొలి మహిళా సీఎస్‌గా సుజాతా సౌనిక్ రికార్డు



ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారిణి సుజాతా సౌనిక్ నియమితులయ్యారు. ఐఏఎస్ అధికారి నితిన్ కరీర్ పదవీ విరమణ అనంతరం సుజాతా సౌనిక్‌కు బాధ్యతలు అప్పగించారు. దక్షిణ ముంబైలోని రాష్ట్ర సచివాలయం మంత్రాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సౌనిక్ బాధ్యతలను స్వీకరించారు. రాష్ట్ర చరిత్రలో అత్యున్నత పదవిని చేపట్టిన మొదటి మహిళగా రికార్డు సృష్టించారు. 1987 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సుజాత మరో ఏడాది పాటు పదవిలో ఉంటారు. ఆమె భర్త మనోజ్ సౌనిక్ కొన్నేళ్ల క్రితం ప్రధాన కార్యదర్శిగా చేశారు. ఇప్పుడు రాష్ట్ర హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

అంటార్కిటికాలో 'కరిగిన నీటి' ముప్పు

లండన్: వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలతో సముద్రాలు వేడెక్కుతున్నాయి. మంచు కరిగిపోతోంది. సముద్ర మట్టాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ పరిణామం ఇలాగే కొనసాగితే మరికొన్ని దశాబ్దాల్లో సముద్ర తీర ప్రాంతాల్లోని నగరాలు జల సమాధి కావడం తథ్యమన్న హెచ్చరికలు ఇప్పటికే వినిపిస్తున్నాయి. అతిపెద్ద మంచు కొండలకు నిలయమైన అంటార్కిటికా సముద్రంలో వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అంటార్కిటికా మంచు కొండలపైనా, అంతర్భాగంలో కరిగిన నీరు, మంచు మిశ్రమం(స్లష్) గతంలో అంచనా వేసిన దానికంటే అధికంగా ఉన్నట్లు బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ పరిశోధకులు తాజా అధ్యయనంలో గుర్తించారు. ఈ అధ్యయనం పూర్తి వివరాలను నేచర్ జియోసైన్స్ పత్రికలో ప్రచురించారు. కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతతో స్లష్ పరిమాణాన్ని తేల్చారు. అంటార్కిటికాలో వేసవి తీవ్రత అధికంగా ఉన్న సమయంలో కరిగిన నీరు 57 శాతం స్లష్ రూపంలో, మిగతా 43 శాతం చెరువులు, కుంటల పైభాగంలో ఉన్నట్లు గుర్తించారు. మంచు కొండలపై ఉన్న నీరంతా సముద్రంలోకి చేరితే అంటార్కిటికా నీటి మట్టం మరింత పెరుగుతుందని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన స్కాట్ పోలార్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి డాక్టర్ రెబెక్కా డెల్ వివరించారు. ఇప్పటిదాకా ఉన్న అంచనాల కంటే 2.8 రెట్లు అధికంగా స్లష్ ఉన్నట్లు తెలిపారు. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే మంచు కొండలపై కరిగిన నీటి



పరిమాణం వేగంగా పెరుగుతుంది. దాంతో బరువు పెరిగి మంచు కొండలు కూలిపోవడం, ముక్కలు కావడం మొదలవుతుంది. నీరంతా సముద్రంలోకి చేరుతుంది.

జన స్పందనకు వందనం

సార్వత్రిక ఎన్నికల్లో 65 కోట్ల మందికిపైగా ఓటేశారు • రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రక్రియల పట్ల విశ్వాసం వ్యక్తం చేశారు

మన్ కీ బాత్‌లో ప్రధాని

- పారిస్ ఒలింపిక్స్‌కు వెళ్తున్న మన ఆటగాళ్లను ప్రోత్సహించాలని ప్రజలకు సూచన
- తల్లి పేరిట మొక్కలు నాటాలని పిలుపు

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలైన భారత సార్వత్రిక ఎన్నికల్లో 65 కోట్ల మందికిపైగా ప్రజలు ఓటు వేశారని, దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రక్రియల పట్ల తిరుగులేని విశ్వాసం వ్యక్తం చేశారని ప్రధాని మోదీ కొనియాడారు. ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. విజయవంతంగా ఎన్నికలు నిర్వహించిన కేంద్ర ఎన్నికల సంఘానికి అభినందనలు తెలిపారు. వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ ఆదివారం తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి దాదాపు 30 నిమిషాలపాటు మాట్లాడారు. విభిన్నమైన అంశాలను ప్రస్తావించారు. తన అభిప్రాయాలు పంచుకున్నారు. వచ్చే నెలలో పారిస్ ఒలింపిక్స్‌లో పోటీ పడబోతున్న భారత క్రీడాకారులకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. మన ఆటగాళ్లను ప్రోత్సహిస్తూ సోషల్ మీడియాలో 'ఛీర్4భారత్' హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టులు పెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టోక్యోలో జరిగిన గత ఒలింపిక్స్‌లో భారత ఆటగాళ్ల ప్రదర్శన ప్రతి ఒక్కరి హృదయాలను దోచుకుందని ప్రశంసించారు. పారిస్ ఒలింపిక్స్‌కు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతున్న మనవాళ్లకు మద్దతు తెలపాలని సూచించారు. ఎన్నో రకాల క్రీడల్లో భారత ఆటగాళ్లు విశేషమైన ప్రతిభ చూపుతున్నారని హర్షం వ్యక్తంచేశారు. ఒలింపిక్స్‌కు వెళ్తున్న మన వాళ్లను త్వరలో కలుస్తానని, భారతీయులందరి తరపున వారికి ప్రోత్సాహం అందిస్తానని పేర్కొన్నారు. మన్ కీ బాత్‌లో మోదీ ఇంకా ఏమన్నారంటే..

నా తల్లి పేరిట మొక్క నాటాను

''పర్యావరణ పరిరక్షణ కోసం అడవుల పెంపకంపై



మనమంతా దృష్టి పెట్టాలి. ఇందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా 'తల్లి పేరిట ఒక మొక్క' కార్యక్రమం ప్రారంభించుకున్నాం. నా మాతృమూర్తికి గుర్తుగా మొక్క నాటాను. తల్లి పేరిట, తల్లి గౌరవార్థం మొక్కలు నాటే కార్యక్రమం వేగంగా ప్రజల్లోకి వెళ్తుండడం ఆనందంగా ఉంది. అమ్మతో కలిసి మొక్కలు నాటిన చిత్రాలను జనం సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. కన్నతల్లిలాంటి భూగోళాన్ని కాపాడుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుంది.

సంస్కృత భాషను గౌరవించుకుందాం

ఆలిండియా రేడియోలో సంస్కృత వార్తల బులెటిన్‌కు 50 ఏళ్లు నిండాయి. ప్రాచీన భాషకు ప్రాధాన్యం ఇస్తున్న ఆలిండియా రేడియోకు నా అభినందనలు తెలియజేస్తున్నా. భారతీయ విజ్ఞానం, శాస్త్రాల పురోగతి వెనుక సంస్కృత భాష కీలక పాత్ర పోషించింది. సంస్కృత భాషను మనమంతా గౌరవించుకోవాలి. నిత్య జీవితంలో ఈ భాషతో అనుసంధానం కావాలి. బెంగళూరులోని ఓ పార్కులో స్థానికులు ప్రతి ఆదివారం కలుసుకుంటారు. సంస్కృత భాషలోనే మాట్లాడుకుంటారు. మరోవైపు దేశవ్యాప్తంగా గిరిజనులు ఈరోజు(జూన్ 30) 'హూల్ దివస్' జరుపుకుంటున్నారు. 1855లో సంథాల్ గిరిజన యోధులు వీర్ సింధూ, కాన్హూ అప్పటి బ్రిటిష్ పాలకులపై తిరగబడ్డారు. పరాయి పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించారు. వీర్ సింధూ, కాన్హూకు నివాళులు అర్పిస్తున్నా.

మన సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ

భారతీయ సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగాఎనలేని ఆదరణ లభిస్తోంది. ఇండియన్ కల్చర్‌పై కువైట్ ప్రభుత్వం కువైట్ నేషనల్ రేడియోలో ప్రతి ఆదివారం అరగంటపాటు హిందీ భాషలో ప్రత్యేక కార్యక్రమం ప్రసారం చేస్తోంది. మన సినిమాలు, కళలపై అక్కడ పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తుర్కమెనిస్తాన్‌లో ఈ ఏడాది మే నెలలో ఆ దేశ అధ్యక్షుడు 24 మంది ప్రపంచ ప్రఖ్యాత కవుల విగ్రహాలను ఆవిష్కరించారు. అందులో గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం కూడా ఉంది. ఇది గురుదేవ్‌తోపాటు భారత్‌కు కూడా ఒక గొప్ప గౌరవమే. కరీబియన్ దేశాలైన సురినామ్, సెయింట్ విన్సెంట్, గ్రెనాడైన్స్‌లో ఇటీవల భారతీయ వారసత్వ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అంతేకాదు 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న ప్రపంచమంతటా అమితోత్సాహంతో నిర్వహించుకున్నారు. సౌదీ అరేబియా, ఈజిప్టులో మహిళలు యోగా కార్యక్రమాలను ముందుండి నడిపించారు'' అన్నారు.

వోకల్ ఫర్ లోకల్

మన స్వదేశీ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. మన వద్ద తయారైన ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నాయంటే అది మనందరికీ గర్వకారణమే. కేరళలోని అట్టప్పాడీ గ్రామంలో గిరిజన మహిళలు తయారు చేస్తున్న కార్తుంబీ గొడుగులకు అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. ఈ గొడుగుల ప్రస్థానం ఒక చిన్న కుగ్రామం నుంచి బహుళజాతి సంస్థల దాకా చేరుకుంది. 'వోకల్ ఫర్ లోకల్'కు ఇంతకంటే పెద్ద ఉదాహరణ ఏముంటుంది? లోకల్ ఉత్పత్తులను గ్లోబల్‌కు చేర్చడంలో జమ్మూకశ్మీర్ కూడా తక్కువేం కాదు. చలి వాతావరణంలో పండించే బఠాణీలు పుల్వామా నుంచి గత నెలలో లండన్‌కు ఎగుమతి అయ్యాయి. జమ్మూకశ్మీర్ సాధించిన ఈ ఘనత అందరికీ స్ఫూర్తిదాయకం. ఈ విజయం జమ్మూకశ్మీర్ అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తుంది.

ప్రజా సమస్యలపై ప్రస్తావనేది: విపక్షాలు

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రజా సమస్యలను ప్రస్తావించలేదని కాంగ్రెస్ పార్టీ మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా ఆదివారం విమర్శించారు. నీట్–యూజీ పరీక్షల్లో అక్రమాలు, రైల్వే ప్రమాదాలు, మౌలిక సదుపాయాల ధ్వంసంపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పైకప్పు కూలిపోయి ఒకరు మరణించారని, దీనిపై మోదీ నోరెత్తలేదని మండిపడ్డారు. నీట్–యూజీ పేపర్ లీకేజీ, అక్రమాలపై జనం దృష్టిని మళ్లించడానికి కేరళలో తయారయ్యే గొడుగుల గురించి మోదీ ప్రస్తావించారని విమర్శించారు. ప్రజల మనసులో మాటను మోదీ తెలుసుకోవాలని పవన్ ఖేరా హితవు పలికారు.

నివాసాలు ఖాళీ చేయండి

- ఓడిపోయిన ఎంపీలకు కేంద్రం ఆదేశాలు
- జాబితాలో తెలుగు రాష్ట్రాల ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన పార్లమెంటు సభ్యులు తమ అధికార నివాసాలను ఖాళీ చేయాలని కేంద్రప్రభుత్వం ఆదేశించింది. జూలై 11వ తేదీ లోపు ప్రభుత్వం కేటాయించిన బంగ్లాలను ఖాళీ చేయాలని ఎంపీలకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల్లో ఓడిపోయిన సిట్టింగ్ ఎంపీలు నెల రోజుల్లో బంగ్లాను ఖాళీ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రెగ్యులర్ నోటీసులు జారీ చేస్తారు. ఈ నోటీసు అందిన 30 రోజుల్లోగా ఖాళీ చేయాలి. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన సిట్టింగ్ ఎంపీలు తమకు క్రితం కేటాయించిన నివాసాల్లో అలాగే కొనసాగుతారు. ప్రభుత్వ బంగ్లాలను ఖాళీ చేయాల్సినవారి జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలతోపాటు కేంద్ర మంత్రులు కూడా ఉన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన కేంద్ర మంత్రుల్లో స్మృతీ ఇరానీ, ఆర్.కె. సింగ్, అర్జున్ ముండా, రాజీవ్ చంద్రశేఖర్, వి.మురళీధరన్, సాధ్వి నిరంజన్ జ్యోతి, భగవంత్ ఖుబా, భారతీ పవార్ తదితరులతోపాటు ఈ సారి బీజేపీ నుంచి టికెట్ దక్కని కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి లాంటి వారు కూడా ఉన్నారు.



ఫ్రాన్సు ముందస్తు ఎన్నికల తొలి రౌండ్‌లో ఆదివారం పారిస్‌లో ఓటేస్తున్న అధ్యక్షుడు మాక్రాన్. రెండో రౌండ్ పోలింగ్ జులై 7న జరగనుంది. ఈ ఎన్నిక ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రతిపక్ష నాయకురాలు లీ పెన్ సారథ్యంలోని నేషనల్ ర్యాలీ పార్టీదే పైచేయి కావచ్చని పరిశీలకులు భావిస్తున్నారు.

హిందూ ధర్మమే నాకు స్ఫూర్తి

బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ • భార్య అక్షతతో స్వామి నారాయణ్ మందిర్‌లో పూజలు

లండన్: హిందూ ధర్మమే తనకు ప్రేరణను, సాంత్వనను అందిస్తుందని భారత సంతతికి చెందిన బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ చెప్పారు. ''భగవద్గీతపై పార్లమెంట్ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసినందుకు గర్వంగా ఉంది. ఫలితాన్ని గురించి ఆలోచించకుండా మన కర్తవ్యాన్ని నిర్వర్తించాలని భగవద్గీత బోధిస్తుంది' అని ఆయన అన్నారు. ఆదివారం రిషి సునాక్ భార్య అక్షతా మూర్తితో కలిసి లండన్‌లోని నియాస్డెన్ ప్రాంతంలో ఉన్న స్వామి నారాయణ్ మందిరాన్ని సందర్శించుకున్నారు. వచ్చే 4వ తేదీన బ్రిటన్ పార్లమెంట్‌కు ఎన్నికలు జరగనున్న వేళ వారు ఆలయంలో పూజలు చేశారు. అంతకుముందు రిషి సునాక్ దంపతులకు ఆలయంలోకి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జై స్వామినారాయణ్ అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన సునాక్ టీ20 ప్రపంచ కప్‌ను భారత జట్టు గెలుచుకున్న విషయాన్ని ప్రస్తావించడం విశేషం. చీర ధరించిన అక్షతా మూర్తి అక్కడి మహిళలు, చిన్నారులతో ముచ్చటించారు. ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుకుంటున్న వేళ ప్రతిపక్ష లిబరల్ పార్టీ నేత కీర్ స్టార్మర్ హిందూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు శుక్రవారం లండన్‌లోని కింగ్స్‌బరీ ప్రాంతంలో ఉన్న స్వామి నారాయణ్ ఆలయాన్ని సందర్శించుకున్నారు. జై స్వామి నారాయణ్ అంటూ స్టార్మర్ ప్రసంగించారు. అధికారంలోకి వస్తే భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం



చేస్తామని ప్రకటించారు. 2021 గణాంకాల ప్రకారం బ్రిటన్‌లో హిందువులు సుమారు 10 లక్షల మంది ఉన్నారు. దాంతో ప్రధాన పార్టీలు హిందువుల ఓట్లపై కన్నేశాయి.

జార్ఖండ్‌లో కూలిన గిర్డర్

ఆర్గా నదిపై నిర్మిస్తున్న వంతెనపై ఘటన

జార్ఖండ్: జార్ఖండ్‌లో పెను ప్రమాదం తప్పింది. గిరిడ్ జిల్లాలోని ఆర్గా నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన గిర్డర్ ఒకటి కూలిపోయింది. రాష్ట్ర రాజధాని రాంచీకి 235 కిలోమీటర్ల దూరంలో ఉన్న డియోరీ బ్లాక్‌లో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. భారీ వర్షం కారణంగా గిర్డర్ కూలిపోయిందని, పిల్లర్ కూడా వంగిపోయిందని ఈఈ వినయ్‌కుమార్ తెలిపారు. 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ వంతెన జార్ఖండ్‌లోని గిరిడ్, బిహార్‌లోని జమూయి జిల్లాలను కలుపుతుంది.

మహారాష్ట్రలో జలపాతంలో కొట్టుకుపోయిన కుటుంబం

పుణె: మహారాష్ట్రలో ప్రముఖ పర్యాటక ప్రాంతం భూషీ ఆనకట్ట దిగువన ఉన్న జలపాతంలో వద్ద ఒక కుటుంబం కొట్టుకుపోయింది. ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురవడంతో వరదనీటి ప్రవాహం జలపాతం వద్ద పోటెత్తింది. హదాప్సార్ నుంచి వచ్చిన అన్సారీ కుటుంబం ఇదే సమయంలో జలపాతం వద్ద ఉంది. ప్రవాహం ధాటికి అంతా కొట్టుకుపోయారు. ఈ ఘటనలో 36 ఏళ్ల శహిష్త అన్సారీ, 13 ఏళ్ల అమీమీ, ఎనిమిదేళ్ల ఉమేరాల మృతదేహాలను దిగువన కనుగొన్నారు. ఇద్దరి జాడ గల్లంతైంది.

తప్పుకోవాలంటూ బైడెన్‌పై ఒత్తిళ్లు

నసేమిరా అంటున్న అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్: అట్లాంటాలో టీవీలో ముఖాముఖి చర్చలో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ధాటికి చేతులెత్తేసిన డెమొక్రటిక్ అభ్యర్థి, అధ్యక్షుడు జో బైడెన్‌పై సొంత పార్టీలోనే వ్యతిరేకత ఎక్కువవుతోంది. 81 ఏళ్ల వయసున్న ఆయన అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. ఆయన మాత్రం తాను తప్పుకునే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు! ట్రంప్‌తో చర్చలో బైడెన్ పేలవ ప్రదర్శనను పలు మీడియా సంస్థలు సంపాదకీయాల్లో ఏకిపారేశాయి. సోషల్ మీడియాలో మీమ్స్‌కు కొదువే లేదు. ఈ విమర్శలపై బైడెన్ స్పందించారు. ''బరాక్ ఒబామా మాదిరి ప్రత్యర్థిని నేను వాగ్ధాటితో ఇరుకున పెట్టలేకపోయిన మాట వాస్తవమే. దీనిపై నా మద్దతుదారులు, పార్టీలోనూ కొంత అసంతృప్తి నెలకొందని తెలుసు. కానీ ట్రంప్‌పై మరింతగా పోరాడతా' అని అన్నారు.



డెమొక్రటిక్ ముఖ్యుల్లో పెరిగిన అసంతృప్తి

ట్రంప్‌తో డిబేట్ తర్వాత బైడెన్ అభ్యర్థిత్వంపై చాలా మంది డెమొక్రటిక్ నేషనల్ కమిటీ(డీఎన్‌సీ) సభ్యుల్లో అసమ్మతి పెరిగింది. యువనేతకు అవకాశమిప్వాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. షికాగోలో ఆగస్టు 19న జరిగే డెలిగేట్ల భేటీలో దీనిపై కీలక నిర్ణయం తీసుకోవచ్చని పార్టీ వర్గాల కథనం.

భారత జీవజాలం జాబితా సిద్ధం

ప్రపంచంలోనే తొలిసారిగా ఆవిష్కరించిన ఇండియా

న్యూఢిల్లీ: దేశంలోని అన్ని జాతుల జీవుల జాబితాను కేంద్ర ప్రభుత్వం సిద్ధంచేసింది. ఇలా 1,04,561 జాతుల జీవాల జాబితాను రూపొందించిన తొలి దేశంగా భారత్ రికార్డ్ నెలకొల్పింది. జీవవైవిధ్యాన్ని డాక్యుమెంట్ రూపంలోకి తెచ్చిన ఘనత భారత్‌కే దక్కిందని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం కోల్‌కతాలో జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా 109వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 'ఫౌనా ఆఫ్ ఇండియా చెక్‌లిస్ట్ పోర్టల్'ను మంత్రి ఆవిష్కరించారు. డాక్యుమెంట్‌లో 36 జంతు కుటుంబాలకు చెందిన 121 జీవ వర్గాలను విభజించి వాటి సంఖ్యను లెక్కగట్టారు. స్థానిక జాతులు, పరిరక్షించాల్సిన జంతువుల వివరాలు, అంతరించిపోతున్న జాతులకు డాక్యుమెంట్‌లో చోటు కల్పించారు.

భూస్వామ్య శక్తులను తరిమేద్దాం: సోరెన్

భోగ్‌నదిహ్ (సాహిబ్‌గంజ్): జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భూస్వామ్య శక్తులపై తిరుగుబాటు ప్రకటించారు. బీజేపీని ఇండియా కూటమి దేశం నుంచే తరిమికొడుతుందన్నారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన సోరెన్ ఆదివారం సాహిబ్‌గంజ్‌లో ర్యాలీలో మాట్లాడారు. ''బ్రిటిష్ పాలకులపై సంథాల్‌ల మాదిరిగానే హూల్ తిరుగుబాటుతో భూస్వామ్య శక్తులను జార్ఖండ్ నుంచే గాక దేశం నుంచే వెళ్లగొట్టాలి'' అని సోరెన్ పిలుపునిచ్చారు. ''నేను జైలు నుంచి వచ్చి రెండు రోజులే. బీజేపీలో ఇప్పటికే వణుకు మొదలైంది. నాపై మళ్లీ కుట్రలు పన్నుతున్నారు'' అని ఆరోపించారు.

గూగుల్ మ్యాప్స్ అనుసరిస్తూ నదిలోకి..

కాసర్‌గోడ్: అత్యవసరంగా ఆస్పత్రికి బయల్దేరిన ఇద్దరు యువకులు అనూహ్యంగా మృత్యువు అంచులదాకా వెళ్లొచ్చారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలోని ఆస్పత్రికి గూగుల్ మ్యాప్స్‌లో చూపించే మార్గంలో బయల్దేరి మార్గమధ్యంలో కారును నదిలోకి పోనిచ్చారు. నది ప్రవాహంలో కారు అదృష్టవశాత్తు ఒక చెట్టుకు చిక్కుకోవడంతో బయటికొచ్చి ప్రాణాలు కాపాడుకోగలిగారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేరళలోని కాసర్‌గోడ్ జిల్లాలోని పల్లాంచి ప్రాంతంలో ఇద్దరు యువకులు ఆదివారం తెల్లవారుజామున కర్ణాటకలోని ఆస్పత్రికి కారులో బయల్దేరారు. ''గూగుల్ మ్యాప్స్ ప్రకారం వెళ్తుంటే ఎదురుగా నీళ్లు కనిపించాయి. రోడ్డుపై నీళ్లు నిలిచాయేమోనని అలాగే వెళ్లాం. అది నదిలో లోతట్టు ప్రాంతంలో కట్టిన వంతెన అని తర్వాత అర్థమైంది. ఇరువైపుల రక్షణ గోడ లేదు. నది ఉప్పొంగి పై నుంచి ప్రవహిస్తోంది. ప్రవాహం ధాటికి మా కారు కొట్టుకుపోయింది. ఒడ్డువైపుగా ఒక చెట్టుకు చిక్కుకుని ఆగింది. పోలీసులకు మా లొకేషన్ షేర్ చేయడంతో సమయానికి వచ్చి కాపాడారు. మాకిది నిజంగా పునర్జన్మ'' అని యువకుల్లో ఒకరైన అబ్దుల్ రషీద్ చెప్పారు. సంబంధిత వీడియో వైరల్‌గా మారింది.

నేటి నుంచి అమల్లోకి కొత్త నేర చట్టాలు

- రాజద్రోహం నుంచి దేశద్రోహంగా మార్పు
- ఉగ్రవాద కార్యకలాపాలకు కొత్త నిర్వచనం
- ఫిర్యాదుల నుంచి సమన్ల వరకు ఆన్‌లైన్‌లోనే
- ఇక స్టేషన్‌తో సంబంధం లేకుండా జీరో ఎఫ్ఐఆర్



న్యూఢిల్లీ: బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు తెర పడింది. భారత న్యాయ వ్యవస్థలో మూడు కొత్త నేర చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం నేటినుంచి అమల్లోకి రానున్నాయి. భారత శిక్షా స్మృతి (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్(సీఆర్‌పీసీ), భారత సాక్ష్యాధార చట్టాల స్థానంలో ఇవి అమలు కానున్నాయి. కొత్త చట్టాలతో జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ పద్ధతిలో సమన్లు పంపడం, హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్లను తప్పనిసరి వీడియోల్లో బంధించడం వంటి ఆధునిక పద్ధతులు న్యాయ వ్యవస్థలో రానున్నాయి. బ్రిటిష్ కాలం నాటి చట్టాల మాదిరిగా శిక్షకు కాకుండా, న్యాయం అందించేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. చట్టాల పేరు మాత్రమే కాదు, వాటి సవరణలు పూర్తి భారతీయ ఆత్మతో రూపొందించామన్నారు. కొత్త చట్టాలు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయాన్ని అందిస్తాయని చెప్పారు.

- భారతీయ శిక్షాస్మృతిలోని రాజద్రోహాన్ని ఇప్పుడు దేశద్రోహంగా మార్చారు. కులం, మతం వంటి కారణాలతో సామూహిక దాడులు, హత్యకు పాల్పడితే ఐపీసీ ప్రకారం ఏడేళ్ల శిక్ష పడుతుంది. దీన్నిప్పుడు యావజ్జీవంగా మార్చారు. హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్ల వీడియో చిత్రీకరణ తప్పనిసరి చేశారు.
- నకిలీ నోట్ల తయారీ, వాటి స్మగ్లింగ్ ఉగ్రవాదం పరిధిలోకి వస్తుంది. విదేశాల్లో మన ఆస్తుల ధ్వంసాన్నీ ఉగ్రవాదంగా నిర్వచించారు. డిమాండ్ల సాధనకు వ్యక్తులను బంధించడం, కిడ్నాప్ చేయడాన్ని ఉగ్రవాదం పరిధిలోకి చేర్చారు.
- మహిళలు, పిల్లలపై నేరాలపై కొత్త అధ్యాయాన్ని జోడించారు. పిల్లల్ని కొనడం, అమ్మడం ఘోరమైన నేరంగా మార్చారు. మైనర్‌పై సామూహిక అత్యాచారానికి మరణశిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన తెచ్చారు. పెళ్లి చేసుకుంటానన్న తప్పుడు వాగ్దానాలతో లైంగిక సంబంధాలు పెట్టుకుని మహిళలను వదిలేయడం వంటి కేసులకు కొత్త నిబంధన పెట్టారు. మహిళలు, పిల్లలపై నేరాల్లో బాధితులకు అన్ని ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స లేదా ఉచిత వైద్యం అందించాలి. మహిళలు, 15 ఏళ్ల లోపు, 60 ఏళ్లు పైబడిన వ్యక్తులు, వికలాంగులు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఇంటినుంచే పోలీసు సాయం పొందవచ్చు. కోర్టు అనుమతి లేకుండా లైంగిక దాడి గురించి ప్రచురిస్తే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా నిబంధన చేర్చారు.
- కొత్త చట్టాల ప్రకారం ఫిర్యాదుల నుంచి సమన్లదాకా అన్నీ ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. పోలీసు స్టేషన్‌కు వెళ్లే పని లేకుండా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఎస్ఎంఎస్ ద్వారా కూడా సమన్లు పంపవచ్చు. పరిధితో సంబంధం లేకుండా ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఎఫ్ఐఆర్ దాఖలు చేసే జీరో ఎఫ్ఐఆర్ విధానం ప్రవేశపెట్టారు. అరెస్టయిన వ్యక్తి కుటుంబానికి, స్నేహితులకు సమాచారాన్ని పంచుకునే వీలు కల్పించడంతో పాటు వివరాలను పోలీస్ స్టేషన్లలో ప్రదర్శిస్తారు.

కేదార్‌నాథ్ సమీపంలో భారీ హిమపాతం

రుద్రప్రయాగ్: కేదార్‌నాథ్‌లో దైవదర్శనం కోసం విచ్చేసిన భక్తులకు అద్భుత దృశ్యం ఆహ్వానం పలికింది. హిమాలయ పర్వత శిఖరాల నుంచి భారీ ఎత్తున మంచు కిందకు కూలుతున్న 'హిమపాతం' దృశ్యం అక్కడి వారిని ఆశ్చర్యం, ఒకింత ఆందోళనకు గురిచేసింది. ఆదివారం ఉదయం ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయం వెనకవైపు నాలుగు కిలోమీటర్లదూరంలోని పర్వతం నుంచి ఒక్కసారిగా భారీ ఎత్తున మంచు విరిగిపడటం ప్రారంభమైంది. భక్తులు ఒకింత భయపడుతూనే ఆ దృశ్యాలను మొబైళ్లలో బంధించేందుకు పోటీపడ్డారు. మేరు–సుమేరు పర్వతశ్రేణుల్లోని చోరాబారీ హిమానీనదం పరిధిలో గాంధీ సరోవర్‌పై హిమపాతం పడింది. మంచంతా లోయలో పడిపోవడంతో కేదార్‌నాథ్ ఆలయం దాకా దూసుకురాలేదు. దీంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు. దాదాపు ఐదు నిమిషాలపాటు గుట్టలకొద్దీ మంచు కిందకు పడుతున్న వీడియో వైరల్‌గా మారింది.

అమెరికాలో పోలీసుల కాల్పులు.. 13 ఏళ్ల బాలుడి దుర్మరణం

న్యూయార్క్: అమెరికాలో 13 ఏళ్ల పిల్లాడు పోలీసు తూటాకు బలయ్యాడు. తుపాకీ చూపించి డబ్బులు దోచుకుంటున్న ఒక ముఠా గురించి గాలిస్తున్న పోలీసు బృందం అనూహ్యంగా పిల్లాడిని పొట్టనబెట్టుకుంది. స్థానిక మీడియా, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యుటికాలో శుక్రవారం రాత్రి సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు టీనేజర్లను పోలీసులు ఆపి 'మీ దగ్గర ఎలాంటి ఆయుధాలు లేవు కదా?' అని అడిగారు. వారిలో 13 ఏళ్ల న్యాహ్ ఎంవా ఒక్కసారిగా పరుగెత్తడంతో పోలీసులు వెంటపడ్డారు. దాంతో పిల్లాడు తన దగ్గరున్న బొమ్మ పెల్లెట్ గన్‌తో బెదిరించాడు. దాన్ని నిజమైన గన్‌గా భావించి ప్యాట్రిక్ హష్నే అనే పోలీసు పిల్లాడిని కిందపడేసి పట్టుకోబోయాడు. మరో ఇద్దరు పోలీసులు పిడిగుద్దులు కురిపించారు. పెనుగులాటలో పిల్లాడిని ప్యాట్రిక్ షూట్ చేశాడు. ఛాతిలో తూటా దిగడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పిల్లాడు చనిపోయాడు. మొత్తం ఉదంతం పోలీసు అధికారి బాడీ కెమెరాలో రికార్డయింది. వారి అతి జాగ్రత్తలు అమాయక పౌరులను బలితీసుకుంటున్నాయని పిల్లాడి సంతాప సభలో స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై నిష్పాక్షిక దర్యాప్తు జరుపుతామని సిటీ మేయర్ హామీ ఇచ్చారు. అంతర్గత కలహాలతో రగిలిపోతున్న మయన్మార్ నుంచి పిల్లాడి కుటుంబం ఎనిమిదేళ్ల క్రితం అమెరికాకు వలసవచ్చింది.



ప్రాణాలు పోతున్నా పట్టదా!

ప్రమాదహేతువుగా మారుతున్న ట్రిపుల్ రైడింగ్

సాంకేతికంగానూ ఈ డ్రైవింగ్‌తో ఇబ్బందులు ఎన్నో...

నగరంలో తరచుగా జరుగుతున్న ఈ తరహా ప్రమాదాలు

ఈ నెల్లోనే జరిగిన ఇలాంటి ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత

'టూ వీలర్ ఫర్ టూ ఓన్లీ'... మోటారు వాహనచట్టం స్పష్టం చేస్తున్న ఈ విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ద్విచక్ర వాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించడం రాజధానిలో సాధారణమైంది. ప్రధానంగా యువతే ఈ ఉల్లంఘనకు పాల్పడుతూ నిత్యం ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ నెల్లోనే జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు యువకులు కన్నుమూశారు. ట్రాఫిక్ విభాగం అధికారులు ఏటా వేల కేసులు నమోదు చేస్తున్నా వీరి వ్యవహారశైలిలో మార్పు రావట్లేదు.

...::: సాక్షి, హైదరాబాద్:::...

15.06.2024

నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఉదయ్‌కుమార్, శివదీక్షిత్, మరో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలుడు ఒకే ద్విచక్ర వాహనంపై మాదాపూర్ తీగల వంతెన వద్దకు బయలుదేరారు. ఫోరం మాల్ నుంచి కూకట్‌పల్లి వైపు వచ్చారు. అదుపు తప్పిన వీరి వాహనం ఆగి ఉన్న డీసీఎం వ్యానును వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఉదయ్, దీక్షిత్ అక్కడికక్కడే మరణించగా.. బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు.

21.06.2024

ఛత్రినాక జయ ప్రకాశ్ నగర్‌కు చెందిన ఏసీ మెకానిక్ ఠాకూర్ రాధా కిషన్, సోను, నిఖిల్ ఒకే ద్విచక్ర వాహనంపై చాంద్రాయణగుట్ట వెళ్లారు. అక్కడ మండి బిర్యానీ తిని తిరిగి వస్తున్నారు. ట్రిపుల్ రైడింగ్‌తో ఉన్న వీరి వాహనం కందికల్ ఆర్‌ఓబీ పైన అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాధాకిషన్, సోను చనిపోగా... నిఖిల్ తీవ్రంగా గాయపడ్డాడు.

దూసుకుపోతూ..



ద్విచక్ర వాహనాలపై రెండు కంటే ఎక్కువ మంది ప్రయాణించే వారిలో యువకులే ఎక్కువగా ఉంటున్నారు. సాధారణంగా టూ వీలర్స్ వినియోగించేది వీరే ఎక్కువ కావడంతో ప్రమాదాలబారిన పడుతున్న వారిలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటోంది. బంధువుల కంటే స్నేహితులతో కలిసే ఎక్కువగా ట్రిపుల్ రైడింగ్‌కు వెళ్తుంటారు. ఎక్కడైనా ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు కనిపించినా... జంక్షన్ వచ్చినా... ఆఖరులో కూర్చున్న యువకుడు తక్షణం దిగిపోయి నడుస్తూ ముందుకు వెళ్లడం చూస్తుంటాం. ఇలా చేస్తూ ట్రిపుల్ రైడర్లు అనేక సందర్భాల్లో పోలీసుల్నీ పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా దూసుకుపోతూ తరచూ ప్రమాదాలకు లోనవుతున్నారు. బాధితుల్లో ఎక్కువ శాతం అవివాహితులే కావడంతో కన్నవారికి పుట్టెడు దుఃఖం మిగిలిస్తున్నారు.

యాక్సిలరేటింగ్ కెపాసిటీ

ఓ వాహనం ఎంత వేగంతో దూసుకుపోవాలనేది స్పష్టం చేసేదే యాక్సిలరేటింగ్ కెపాసిటీ. సదరు వాహనంపై పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కినప్పుడు ఈ కెపాసిటీ తగ్గుతుంది. సాధారణంగా గంటకు 60 కి.మీ. వేగంతో దూసుకుపోయే వాహనం ఇలాంటప్పుడు 40 కి.మీ. మించదు. ఈ ప్రభావం ఓవర్‌టేకింగ్ తదితర సమయాల్లో ప్రమాదాలకు కారణమవుతుంది.

వాహనం అదుపు చేయడం అసాధ్యం...

ప్రతి వాహనానికీ దాన్ని తయారు చేసే కంపెనీ కొన్ని ప్రమాణాలు నిర్దేశిస్తుంది. ఇందులో భాగంగానే టూ వీలర్‌ను కేవలం ఇద్దరు వినియోగించడానికి వీలుగానే రూపొందిస్తుంది. ముందు డ్రైవర్, వెనుక పిలియన్ రైడర్ మాత్రమే ప్రయాణించాలంటూ తమ నిబంధనల్లో స్పష్టం చేస్తుంది. దీనికి సాంకేతికంగానూ ప్రత్యేక కారణాలు ఉన్నాయి.

ఇంజన్ కెపాసిటీ

మోటారు వాహనాలకు ఉండే ప్రతి ఇంజన్‌కూ ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. దీన్నే సాంకేతికంగా ఇంజన్ కెపాసిటీ అంటారు. ఆ వాహనం ఎందరు ప్రయాణించడానికి అనువుగా రూపొందిస్తారో... అదే సామర్థ్యంలో ఇంజన్ అభివృద్ధి చేస్తారు. నిర్దేశించిన ప్రయాణికుల కంటే ఎక్కువ మంది ఆ వాహనంపై ప్రయాణిస్తే దాని ప్రభావం ఇంజన్‌పై పడుతుంది.

బ్రేకింగ్/బ్యాలెన్సింగ్ కెపాసిటీ

ఏదైనా వాహనం ప్రమాదానికి లోనుకాకుండా ఉండాలంటే ఈ రెండూ అత్యంత కీలకం. సరైన సమయానికి బ్రేక్ వేయగలగటం, అవసరమైన స్థాయిలో బ్యాలెన్స్ చేసుకోవడం తప్పనిసరి. అయితే ట్రిపుల్ రైడింగ్ వంటివి చేసినప్పుడు ఈ ప్రభావం ఈ రెండు కెపాసిటీలపైనా పడి... ఎదురుగా ముప్పును గుర్తించినా తక్షణం స్పందించి వాహనాన్ని ఆపలేరు.

సిటీలో ట్రిపుల్ రైడింగ్ కేసులిలా...



సంవత్సరం	
2021	1,19,987
2022	95,225
2023	1,21,956

కఠిన చర్యలు అవసరం

ప్రస్తుతం నగరంలో డ్రంకెన్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపటం వంటివి చేస్తే కఠినంగా వ్యవహరిస్తున్నారు. వాహనం స్వాధీనం చేసుకోవడంతోపాటు కౌన్సెలింగ్ తర్వాతే అప్పగిస్తున్నారు. అనేక సందర్భాల్లో కోర్టుల్లోనూ అభియోగపత్రాలు దాఖలు చేస్తున్నారు. యువతను బలి తీసుకుంటున్న ట్రిపుల్ రైడింగ్ విషయంలోనూ ఇలాంటి కఠిన చర్యలు అవసరం. డ్రంకెన్ డ్రైవర్ల విషయంలో అనుసరిస్తున్న మాదిరిగా కుటుంబీకులతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విధానం అవలంబించాలి. అప్పటి వరకు వాహనాన్ని విడిచిపెట్టకూడదు. ఎందరో తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిస్తున్న ట్రిపుల్ రైడింగ్‌ను అదుపు చేయడానికి కుటుంబీకుల సహకారం కూడా ఎంతో అవసరం.

-రవాణా రంగ నిపుణులు


ప్రత్యేక డ్రైవ్స్ చేపడుతున్నాం

నగరంలో ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించే ఉల్లంఘనను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ప్రస్తుతం సిటీవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తున్నాం. దీనికోసం స్పెషల్ టీమ్స్ కూడా రంగంలోకి దిగాయి. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ చిక్కిన వారికి జరిమానా విధించడంతోపాటు కౌన్సెలింగ్ ఇస్తారు. ఈ ఉల్లంఘనల వల్ల జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని మరికొన్ని కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నాం. వీటిలో భాగంగా ట్రిపుల్ రైడింగ్ చేస్తూ చిక్కిన వారి నుంచి వాహనం స్వాధీనం చేసుకోవడం, వారికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో (టీటీఐ) సమగ్ర కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా కట్టించుకుని వాహనం తిరిగి ఇవ్వడం లాంటి చర్యలు చేపడుతున్నాం.

-సిటీ ట్రాఫిక్ పోలీసులు

కాంక్రీట్ జంగిల్‌గా మారిన హైదరాబాద్ మహానగరంలో వాతావరణ కాలుష్యం నానాటికీ పెరిగిపోతోంది. లక్షల సంఖ్యలో వాహనాలు వెదజల్లే పొగ ప్రజల ఆరోగ్యానికి పెను ముప్పుగా మారుతోంది. నగరవాసులు దీర్ఘ కాలంలో వివిధ రకాల వ్యాధులు, అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. అక్కడో పార్కు, ఇక్కడో పార్కు మినహా పచ్చదనమే కరువై పోతున్న పరిస్థితుల్లో.. నగర శివారుల్లో ఏర్పాటైన పల్లె ప్రకృతి వనాలు, లంగ్స్ స్పేస్ (ఆక్సిజన్ పార్కులు)లు నగర వాసులకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. ఉద్యోగం, వ్యాపారంతో బిజీ బిజీగా గడిపే నగరవాసి సాయంత్రం వేళ లేదా సెలవు రోజుల్లో మానసిక ఒత్తిడికి దూరంగా పచ్చదనంతో కూడిన వాతావరణంలో స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ సేద తీరేందుకు ఇవి దోహదపడుతున్నాయి.

...::: సాక్షి, హైదరాబాద్:::...



ఆహ్లాదం.. ఆరోగ్యం

కాంక్రీట్ జంగిల్ చుట్టూ పరుచుకున్న పచ్చదనం

నగర వాసుల్ని అలరిస్తున్న లంగ్స్ స్పేస్‌లు, ప్రకృతి వనాలు	కాలుష్యానికి దూరంగా ప్రకృతి ఒడిలో సేద తీరుతున్న జనం	మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఏడు అర్బన్ లంగ్స్ స్పేస్‌లు	వీటికి అదనంగా 72 చోట్ల పల్లె ప్రకృతి వనాలు	అనేక వృక్ష జాతుల మధ్య వాకింగ్ పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లు, చిల్డ్రన్ కార్నర్లు, యోగా సెంటర్లు

చక్కని వాతావరణం.. స్వచ్ఛమైన గాలితో నానాటికీ పెరుగుతున్న ఆదరణ



7 అలరిస్తున్న లంగ్స్ స్పేస్‌లు

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఏడు అర్బన్ లంగ్స్ స్పేస్‌లు ఉన్నాయి. మేడిపల్లి ఫారెస్టు బ్లాకులో 100 ఎకరాల్లో శాంతివనం పేరుతో అర్బన్ లంగ్స్ స్పేస్ ఉంది. కండ్లకోయలోని ఆక్సిజన్ పార్కు, దూలపల్లి ఫారెస్టు బ్లాకులోని ప్రశాంత వనం ,బహదూర్‌పల్లి ఫారెస్టు బ్లాకులోని 50 ఎకరాల్లో ఏర్పాటైన అర్బన్ లంగ్స్ స్పేస్ నగర వాసులకు ఆహ్లాదం పంచుతున్నాయి. అలాగే నారపల్లిలోని భాగ్యనగరం నందన వనం పార్కు, నాగారం ఫారెస్టు బ్లాకులో 70 ఎకరాల్లో ఏర్పాటైన పార్కు, నారపల్లి-పర్వతాపూర్ ఫారెస్టు బ్లాకులోని 60 ఎకరాల్లో ఉన్న అర్బన్ లంగ్స్ స్పేస్ నగరంలోని వృద్ధులు, మధ్య వయస్కులతో పాటు పిల్లలకు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులను పచ్చదనంతో అలరిస్తున్నాయి.

పచ్చని చెట్లు.. పక్షుల కిలకిలరావాలు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా అటవీ విభాగం, హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రకృతి వనాలు, లంగ్స్ స్పేస్‌ల్లో వివిధ రకాల వృక్ష జాతులు పచ్చదనాన్ని పంచుతున్నాయి. వివిధ రకాల పక్షులు, జంతువులు పెద్దలు, పిల్లల్ని అలరిస్తున్నాయి. ఫిట్‌నెస్ కోరుకునే వారి కోసం వాకింగ్ పాత్‌లు కూడా ఉండగా, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ వాకింగ్ చేసిన తర్వాత అలసట తీర్చుకునేందుకు వీలుగా ఎక్కడికక్కడ సిమెంట్ బెంచీలు కూడా ఉన్నాయి. పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు (చిల్డ్రన్స్ కార్నర్) ఉన్నాయి. పచ్చదనంతో కూడిన ప్రశాంత వాతావరణంలో సేద తీరాలనుకునే వారికి ప్రకృతి వనాలు, లంగ్స్ స్పేస్‌లు నెలవుగా మారాయి. ఆహ్లాదాన్ని పంచడంతో పాటు స్వచ్ఛమైన గాలితో మంచి ఆరోగ్యానికి ముఖ్యంగా ఊపిరితిత్తుల మెరుగైన పనితీరుకు దోహద పడుతుండటంతో లంగ్స్ స్పేస్‌లను ఆ పేరుతో పిలుస్తున్నారు.

రక్షణ, పర్యవేక్షణ

అర్బన్ లంగ్స్ స్పేస్‌ల అభివృద్ధి పనుల్లో భాగంగా అటవీ శాఖ ఫారెస్టు బ్లాకుల చుట్టూ ఫెన్సింగ్(రక్షణ కంచెలు), కందకాలు, ఫైర్ లైన్లు ఏర్పాటు చేసింది.

ఎప్పటికప్పుడు కలుపు మొక్కలను ఏరివేయటం, మొక్కల పెరుగుదలను మెరుగుపర్చటం, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కొమ్మల కత్తిరింపు వంటివి నిరంతరం కొనసాగిస్తున్నారు.	వర్షాకాలంలో సతత హరిత జాతులతో ఫారెస్టు బ్లాకు చెట్ల మధ్య ఖాళీలను భర్తీ చేస్తున్నారు.	ఒక్కొక్క అర్బన్ లంగ్స్ స్పేస్ నిర్మాణానికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు జిల్లా అటవీ శాఖ ఖర్చు చేస్తోంది.

వాకింగ్ పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లు, చిల్డ్రన్ కార్నర్లు, యోగా సెంటర్లు, భారీ వృక్షాలు, రచ్చ బండలు, వాష్‌రూమ్‌లు, గజేబో (గుడిసె)లతో పాటు ప్రకృతి అందాలను పైనుంచి తిలకించేందుకు వీలుగా వాచ్ టవర్లు అందుబాటులో ఉన్నాయి. భద్రతా సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. సందర్శకుల నుంచి నామ మాత్రపు రుసుం వసూలు చేస్తున్నారు.

ఆక్సిజన్ పార్కులు భళా..

ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక్కో పార్కులో సగటున 300 మంది వాకింగ్ చేస్తుండగా, ఆహ్లాదకరమైన వాతావరణం కోరుకుంటూ ప్రతిరోజూ 500 మందికి పైగా సందర్శిస్తున్నారు.

72 చోట్ల ప్రకృతి వనాలు

గ్రేటర్ హైదరాబాద్ శివారు మేడ్చల్ జిల్లాలోని 61 గ్రామ పంచాయతీల పరిధిలో 72 చోట్ల దాదాపు 200 ఎకరాల్లో పల్లె ప్రకృతి వనాలు (పార్కులు) ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించి ఎకరానికి 2,500 మొక్కల చొప్పున పెంచటం వల్ల ఇప్పుడవి చిన్న వృక్షాలుగా అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం శివారు పల్లెలతో పాటు నగర వాసులకు ఈ వనాలు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. శామీర్‌పేట మండలంలో 10 వనాలు ఉండగా, ఘటకేసర్ మండలంలో 18, కీసర మండలంలో 9, మూడు చింతలపల్లి మండలంలో 13, మేడ్చల్ మండలంలో 22 పల్లె ప్రకృతి వనాలు ఉన్నాయి. ఈ పార్కుల నిర్వహణ బాధ్యతలను సంబంధిత గ్రామ పంచాయతీలు చూస్తుండగా, జిల్లా పంచాయతీ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు.

ఆర్థిక వనరులకు ప్రకృతి వనాలు

శివారుల్లోని ప్రతి మండలంలో 'పల్లె బృహత్ ప్రకృతి వనాలు' పెంచటం ద్వారా ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. మండలాల పరిధిలో ప్రభుత్వ భూములను గుర్తించి రూ.45 లక్షల వ్యయంతో సంపద వనాలను పెంచుతోంది. మేడ్చల్ జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో 8 నుంచి 10 ఎకరాల లోపు ప్రభుత్వ భూములున్న గ్రామ పంచాయతీలను గుర్తించి పచ్చదనానికి తోడుగా పండ్లు, కలప, టేకు, సుగంధ ద్రవ్యాలను గంధం, నీలగిరి, ఉసిరి, జామ, మామిడి తదితర మొక్కలు పెంచేందుకు కార్యాచరణ రూపొందించింది. ఘటకేసర్ మండలంలోని కాచవాని సింగారంలో 8 ఎకరాలు, శామీర్‌పేట్ మండలం బొమ్మరాసిపేట్‌లో 10, మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరంలో 10, మూడు చింతలపల్లి మండలంలోని జగన్‌గూడలో 9, కీసర మండలంలోని చీర్యాలలో 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ శాఖ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు అప్పగించగా, సంపద వనాల పెంపునకు చర్యలు చేపట్టింది.





ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది

నారపల్లి నందనవనంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం జింకలు, ఇతర జంతువులు, రకరకాల పక్షులు ఉన్నాయి. విశాలంగా ఉన్న ఈ ఆక్సిజన్ పార్కు స్థానికులకు ఆహ్లాదాన్ని పంచుతోంది.

- కొండా శ్రీనివాస్, నారపల్లి

స్వచ్ఛమైన ప్రాణవాయువు లభిస్తోంది

నందనవనంలో వాకింగ్ ట్రాక్ బాగుంది. ట్రాక్‌కు ఇరువైపులా పచ్చని చెట్లు ఉండటం వల్ల ఆహ్లాదంతో పాటు స్వచ్ఛమైన ప్రాణవాయువు లభిస్తోంది. మేం ప్రతి ఆదివారం, అలాగే పిల్లలకు సెలవులు ఉన్నప్పుడల్లా ఇక్కడికి వస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు వస్తుండటంతో సందడి వాతావరణం నెలకొంటోంది.

-తదూరి మమత, సప్తగిరి కాలనీ





సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి

లంగ్స్ స్పేస్‌లు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. నందనవనం, కండ్లకోయ పార్కులు సందర్శకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. వీటిల్లో కొన్ని వరంగల్, నిజామాబాద్ జాతీయ రహదారుల్లో ఉండటం వల్ల వాహనదారులు కూడా సేద తీరుతున్నారు.

-అమూల్యారెడ్డి, శ్రీరాంనగర్

సాక్షి హైదరాబాద్

సోమవారం । 1 । జూలై । 2024



వాళ్లను వదలకండి

ఆయా కేసుల్లో అరెస్టు అయిన వారితో పాటు నిందితుల జాబితాలో గుర్తించిన, గుర్తించని 'ఇతరులు' వాంటెడ్‌గా ఉండిపోతున్నారు. ఇతర నిందితులపై పోలీసులు దృష్టి కేంద్రీకరించట్లేదు. -10లో



ఎన్‌హెచ్‌-44లో ఎన్నాళ్లిలా?

పాతబస్తీ నుంచి వెళ్లే జాతీయ రహదారి-44లో ట్రాఫిక్ ఇక్కట్లు అన్నీ ఇన్నీకావు. ట్రాఫిక్ సమస్య నివారణకు ఉద్దేశించిన ఫ్లైఓవర్లు నత్తకు నడక నేర్పుతున్నాయి. -12లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చు. గరిష్ఠ ఉష్ణోగ్రత 32, కనిష్ఠ ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్ ఉండే అవకాశం ఉంది.

'రోటరీ క్లబ్' సేవలు భేష్

• మంత్రి శ్రీధర్‌బాబు



విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ నార్త్ హైదరాబాద్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాజకీయాల్లో 5 ఏళ్లు మాత్రమే ప్రజలకు సేవ చేసుకునే అవకాశం లభిస్తుందని, మంచి చేస్తే ప్రజలు మళ్లీ అవకాశం ఇస్తారని తెలిపారు. అదే స్వచ్ఛంద సంస్థల్లో 60 ఏళ్ల పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా సేవ చేయాలనుకునే వారికి విభిన్నమైన మార్గాలు ఉన్నాయన్నారు. అందులో రోటరీ క్లబ్ సేవలు మరో రేంజిలో ఉంటాయని, క్లబ్ సేవలను కొనియాడారు. సేవా రంగంలో ఉన్న సంఘాలు ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి ముందు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో 130 సైకిళ్లను పంపిణీ చేశారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా సుశీల్‌కుమార్, కార్యదర్శిగా కె.వెంకటమురళి, ఉప కార్యదర్శిగా శ్రీధర్ బొప్పన్న, ట్రెజరర్‌గా నరేష్, క్లబ్ ట్రైనర్ ఎస్.మణికంఠన్, డైరెక్టర్లుగా ఎ. కామేశ్వరరావు, గిరీష్ జోషి, జీఎం రావు, పవన్‌కుమార్, రఘుచంద్ర, ఎ.రామకృష్ణ, టెక్ అడ్వైజర్ సెక్రటరీగా హరిహర ప్రసాద్‌లు ఎన్నికయ్యారు.

తెలంగాణది ఘనమైన సాంస్కృతిక చరిత్ర

• గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న భగవంత్‌రావు తదితరులు

గోల్కొండ: తెలంగాణకు ఘనమైన సాంస్కృతిక చరిత్ర ఉందని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. గోల్కొండ కోట బోనాల్లో పాల్గొనాల్సిందిగా కోరుతూ భాగ్యనగర్ బోనాల ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంత్‌రావు ఇతర బీజేపీ నాయకులతో ఆదివారం గవర్నర్‌ను కలిశారు. బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. బోనాలు అనగానే తనకు తెలంగాణ రాష్ట్రం గుర్తుకు వస్తుందన్నారు. బోనాలను రాష్ట్ర ప్రజలు ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారని, అందువల్లే తెలంగాణ ప్రభుత్వం దీనిని రాష్ట్ర పండుగగా గుర్తించిందని పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో భాగ్యనగర్ బోనాల ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రాహుల్ స్వాగత్, శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, బాబూరావు, బీజేపీ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, వీర్ సింగ్, యాదగిరిచారి తదితరులున్నారు.

పబ్‌ల్లో డ్రగ్స్‌పై స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు



పబ్‌లో స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: పబ్‌ల్లో డ్రగ్స్‌ను అరికట్టేందుకు, వాటి ఆనవాళ్లు గుర్తించేందుకు పోలీసులు సరికొత్త చర్యలకు శ్రీకారం చుట్టారు. శిక్షణ పొందిన నార్కోటిక్ ట్రైన్డ్ స్నిఫర్ డాగ్స్‌తో పబ్‌ల్లో తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాలను నిరోధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. పబ్‌ల్లో ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటే వెంటనే గుర్తించేందుకు స్నిఫర్ డాగ్స్‌ను రంగంలోకి దింపారు. జూబ్లీహిల్స్‌లోని పలు పబ్‌ల్లో వారాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు.



సైక్లథాన్‌ను ప్రారంభిస్తున్న పుల్లెల గోపీచంద్ తదితరులు

ఉత్సాహంగా సైక్లథాన్

రసూల్‌పురా: పర్యావరణం, శారీరక దృఢత్వంపై అవగాహన పెంపొందించేందుకు రాష్ట్రపతి నిలయం అధికారుల ఆధ్వర్యంలో హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఆదివారం సైక్లథాన్ నిర్వహించారు. మేజర్ జనరల్ రాకేష్ మనోచా, జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ జెండా ఊపి సైక్లథాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సైక్లథాన్ ఔత్సాహికులు, పర్యావరణ వేత్తలు, బొల్లారం ఆర్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రియదర్శిని, హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్ రెడ్డి, రాష్ట్రపతి భవన్ ప్రత్యేక అధికారి స్వాతి షాహీ, పరిపాలనాధికారి రజనీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఔత్సాహిక సైక్లిస్టులు

6వ స్థానం.. హైదరాబాద్ బిర్యానీకి..

దేశంలో తనకంటూ ప్రత్యేక ప్రాచుర్యం పొందిన హైదరాబాద్ బిర్యానీ మరోసారి తన ఘనతను నిర్ధారించుకుంది. సంప్రదాయ వంటకాలకు సంబంధించిన పరిశోధన, సమీక్షలకు పర్యాటక ప్రదేశాల గురించిన సమాచారానికి పేరొందిన ఆన్‌లైన్ వేదిక టేస్ట్ అట్లాస్.. అత్యున్నత భారతీయ వంటకాల్లో హైదరాబాద్ బిర్యానీకి 6వ స్థానాన్ని కట్టబెట్టింది. గతేడాది ఇదే సంస్థ అందించిన ర్యాంకుల్లో మన బిర్యానీకి చోటు దక్కని నేపథ్యంలో ఈ ఏడాది తన పాపులారిటీని తిరిగి నిలబెట్టుకోగలిగింది.

– సాక్షి, సిటీబ్యూరో



- ఉత్తమ భారతీయ రుచుల్లో తొలి స్థానంలో మ్యాంగో లస్సీ
- గతేడాది టాప్ 10 జాబితాలో చోటు దక్కని బిర్యానీ
- ఫుడ్ ట్రావెల్ గైడ్ టేస్ట్ అట్లాస్ ర్యాంకుల్లో వెల్లడి

సిటీజనులకు అత్యంత ప్రీతిపాత్రమైన వంటకంగానే కాక నగర సంప్రదాయ వంటకాల విశిష్టతను నలుదిశలా చాటేదిగా, దేశ విదేశీ ప్రముఖులకు నగర సందర్శనలో తప్పనిసరిగా 'రుచి'ంచే మన బిర్యానీ టేస్ట్ అట్లాస్ జాబితాలో టాప్ 10లో నిలవగా.. మన నగరంలో విరివిగా ఇష్టపడే బటర్ చికెన్, తందూరీ చికెన్ వంటివి కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

నెం-1 గా మ్యాంగో లస్సీ...

ఈ జాబితాలో మ్యాంగో లస్సీ నెంబర్ 1 గా నిలిచింది. వేసవిలో విరివిగా జనం ఆస్వాదించే ఈ లస్సీకి జాబితాలో అగ్ర స్థానం దక్కింది. అదే విధంగా దాని తర్వాతి స్థానంలో మసాలా చాయ్ నిలిచింది. ఇది అనేకమందికి, నగర వాసులకు రోజువారీ అవసరం అనేది తెలిసిందే. ఫుడ్ లవర్స్ ఇష్టపడే బటర్ గార్లిక్ నాన్‌కు మూడో ర్యాంక్ దక్కింది. ఆ తర్వాత అమృత్ సర్ కుల్చా, బటర్ చికెన్ వరుసగా నాలుగు, ఐదు ర్యాంక్‌లు దక్కాయి. ఆ తర్వాత మన హైదరాబాద్ బిర్యానీ ఆరు, షాహి పనీర్ ఏడు, చోలే భటూర్ ఎనిమిది, తందూరీ చికెన్ తొమ్మిది, కోర్మా పదో ర్యాంకును దక్కించుకున్నాయి.



నేడే విడుదల!

సోమవారం నుంచి అమలులోకి కొత్త చట్టాలు

- పెండెన్సీ భారం తగ్గింపునకు అనేక అవకాశాలు
- శిక్షణ సహా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పోలీసులు
- మూడు కమిషనరేట్ల పరిధిలో మార్గదర్శకాల అమలుకు సన్నాహాలు
- కంప్యూటర్లు, ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులు పూర్తి
- తీవ్రమైన నేరాల్లో గణనీయంగా పెరగనున్న శిక్షలు



సాక్షి, సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా సోమవారం నుంచి కొత్త చట్టాలు అమలులోకి రానున్నాయి. పోలీసులు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత్ (బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఏ) స్థానంలో భారత సాక్ష్య అధినియం (బీఎస్ఏ) వినియోగించనున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత జరుగుతున్న ఈ కీలక మార్పుచేర్పుల నేపథ్యంలో పోలీసు విభాగం ఇప్పటికే అప్రమత్తమైంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ అధికారులు అన్ని స్థాయిల అధికారులకు శిక్షణ పూర్తి చేశారు. కొత్త చట్టాల్లోని కీలక సెక్షన్లు, ముఖ్యమైన మార్గదర్శకాలతో ప్రత్యేక బుక్‌లెట్స్ సైతం ముద్రించి అందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. కంప్యూటర్లు, ఆన్‌లైన్‌లో అవసరమైన మార్పుచేర్పులు పూర్తి చేశారు. ఈ కొత్త చట్టాల అమలుతో తీవ్రమైన నేరాల్లో శిక్షలు గణనీయంగా పెరగనున్నాయి.

పోలీసు కస్టడీ కష్టాలకు చెల్లు..

ఏదైనా ఓ నేరంలో నిందితుడిగా ఉన్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేస్తే 24 గంటల్లోగా కోర్టులో ప్రవేశపెట్టాలి. ఆపై జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లిపోయే ఆ నిందితుడి నుంచి నేరానికి సంబంధించిన మరిన్ని వివరాలు సేకరించాలంటే కోర్టు అనుమతితో పోలీసు కస్టడీలోకి తీసుకోవాలి. ఇప్పటి వరకు అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఈ కస్టడీ అనేది అతడిని అరెస్టు చేసిన 14 రోజుల్లోపు మాత్రమే తీసుకోవడానికి ఆస్కారం ఉంది. ఈ కాలంలో దర్యాప్తు అధికారికి నేరం జరిగిన తీరు, పాత్రధారులు, సూత్రధారులపై పూర్తి క్లారిటీ రాకపోవచ్చు. నిందితుడిని అరెస్టు చేసిన 30 రోజుల తర్వాత ఓ కొత్త విషయం తెలిస్తే.. అప్పటికి నిందితుడు జైలులోనే ఉన్నా దానిపై ప్రశ్నించడానికి కస్టడీలోకి తీసుకోవడానికి ఆస్కారం ఉండేది కాదు. కొత్త చట్టాలు ఈ సమస్యకు చెక్ పెడతాయి. కేసు తీరును బట్టి 40 రోజులు, 60 రోజులకు దీన్ని పొడిగించారు. దర్యాప్తు అధికారి తనకు అవసరమైన సందర్భంలో కస్టడీలోకి తీసుకునేందుకు ఆస్కారం ఏర్పడింది.

పెండెన్సీ తగ్గింపునకు ఆస్కారం...

పోలీసు విభాగంతో పాటు న్యాయస్థానాలపై పని ఒత్తిడి తీవ్ర స్థాయిలో పెరిగిపోవడానికి అనేక కారణాలు ఉంటున్నాయి. కేసుల నమోదు సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో పాటు అప్పటికే నమోదైనవి పెండింగ్‌లో ఉండిపోవడమూ ప్రధాన కారణమే. దర్యాప్తు, విచారణ దశల్లో ఉన్న అనేక కేసులు ఇలా పెండింగ్‌లో ఉండిపోవడంలో సాక్షులు, బాధితులు/ఫిర్యాదుదారుల పాత్ర కూడా ఉంటోంది. వీరంతా న్యాయమూర్తి పోలీసుల ద్వారా సమన్లు జారీ చేసినప్పుడు కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వడం, సాక్ష్యం చెప్పడం చేయాల్సి ఉంటుంది. అలా కాని సందర్భాల్లో కేసుల విచారణను వాయిదా వేయడం అనివార్యంగా మారింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఓ కేసు నమోదైన తర్వాత విచారణ దశకు రావడానికి నెలలు, సంవత్సరాలు పడుతోంది. ఈ కాలంలో బాధితులు, సాక్షుల్లో అనేక మంది చిరునామాలు మారిపోతున్నాయి. కొత్తవి పోలీసు రికార్డుల్లో అప్‌డేట్ కావట్లేదు. ఈ కారణంగా పోలీసులు సమన్లు తీసుకువెళ్లి వారికి అందించడం పెద్ద సంక్లిష్టమైన ప్రక్రియగా మారింది. కొత్త చట్టాలను అనుసరించి వీటిని నేరుగా ఇవ్వాల్సిన అవసరం లేదు. వాట్సాప్ ద్వారా ఎలక్ట్రానిక్ రూపంలో పంపినా సరిపోతుంది.

అర్ధరాత్రి తర్వాత నమోదైన వాటికే..

- ఇలా సమన్లు అందుకున్న సాక్షులు నిర్దీత తేదీల్లో కోర్టుకు రాలేని పరిస్థితి ఉంటుంది. దీన్ని ఉదహరిస్తూ వాళ్లు న్యాయమూర్తిగా అభ్యర్థిస్తే మరో వాయిదా ఇవ్వడం అనివార్యం. ఈ కారణంగానూ కేసుల విచారణలో జాప్యం జరుగుతోంది. కొత్త చట్టాల ప్రకారం బయటి ఊళ్ల నుంచి రాలేని సాక్షులు తాము ఉన్న ప్రాంతంలోని గెజిటెడ్ అధికారి సమక్షంలో సాక్ష్యాన్ని వీడియో రికార్డు చేయవచ్చు. దీన్ని కోర్టుకు పంపే సౌలభ్యం కొత్త చట్టాలు ఇస్తున్నాయి. చిన్నారులపై జరిగే లైంగిక నేరాలకు సంబంధించి పోక్సో కేసుల విషయంలోనూ కీలక మార్పులు రానున్నాయి.
- ఇప్పటి వరకు ఈ కేసుల్లో వాంగ్మూలాలను పోలీసులే రికార్డు చేయాల్సి వచ్చేది. దీని వల్ల సాంకేతికంగా అనేక ఇబ్బందులు వచ్చేవి. కొత్త చట్టాల ప్రకారం పోక్సో బాధితురాళ్ల వాంగ్మూలాలను మహిళా ప్రభుత్వ అధికారి నమోదు చేసే ఆస్కారం వస్తోంది. ఇలాంటి అనేక కీలకాంశాలతో కూడిన, అటు పోలీసులు, ఇటు బాధితులకు ఉపయుక్తంగా మారే కొత్త చట్టాలు సోమవారం నుంచి అమలులోకి వస్తున్నాయి. ఇప్పటికే నమోదై, దర్యాప్తు, విచారణ దశల్లో ఉన్న కేసులకు ఇవి వర్తించవు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత (సోమవారం తెల్లవారుజామున) నమోదయ్యే కేసులకే వర్తిస్తాయని అధికారులు చెబుతున్నారు. పాత కేసులను పాత చట్టాల ప్రకారమే విచారణ చేస్తారు.

మద్యం మత్తులో మృతికి కారణమైతే.. పదేళ్ల జైలు!

మందుబాబులూ.. పారా హుషార్.. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కొత్త చట్టం ప్రకారం కేసులు నమోదు కానున్నాయి. మద్యం మత్తులో ఎవరి మృతికైనా కారణమైతే ఇప్పటివరకు పోలీసులు 304 పార్ట్ 2 ఐపీసీ కింద కేసులు నమోదు చేసేవారు. ఆయా కేసుల్లో వాహనదారులకు న్యాయస్థానం గరిష్ఠంగా రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించేవి. కానీ, ఇక నుంచి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేయనున్నారు. ఈ కొత్త చట్టంతో నిషాచరులకు గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష, జరిమానా ఉంటుందని సైబరాబాద్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్వాసన

- ప్రభుత్వ శాఖల్లో దశలవారీగా తొలగింపు
- మైనార్టీ గురుకులాల్లో విజిలెన్స్ అధికారుల సేవల ఉపసంహరణ

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్వాసన ప్రక్రియ ప్రారంభమైంది. వివిధ విభాగాల ఆదేశాల మేరకు ఔట్ సోర్సింగ్ సిబ్బంది సేవలను ఉపసంహరించుకుంటున్నట్లు ఆయా ఏజెన్సీలు ఆదివారం ప్రకటించాయి. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వందల సంఖ్యలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది రోడ్డున పడ్డారు. ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో వివిధ విభాగాలు ఆయా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు సూచించాయి. దీంతో తక్షణమే అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బంది సేవలను ఉపసంహరించుకుంటున్నట్లు ఏజెన్సీలు సంబంధిత విభాగాలకు లేఖ రాశాయి. దశలవారీగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలను రద్దు చేసి వారి స్థానంలో దినసరి వేతనం కింద సేవలను వినియోగించేందుకు సంబంధిత విభాగాలకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మొదటి విడతగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సేవలను ఉపసంహరించుకుంటున్నట్లు సమాచారం.

మైనారిటీ గురుకులాల్లో...

తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (టెమ్రీస్)లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న సుమారు 22 మంది విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ల సేవలను ఉపసంహరించుకుంది. ఈమేరకు టెమ్రీస్ అడ్మినిస్ట్రేటివ్ ప్రాతిపదికన వారి సేవలను ఉపసంహరించడంతో పాటు రద్దు చేస్తున్నట్లు సంబంధిత ఏజెన్సీ ప్రకటించింది. ఇందులో హైదరాబాద్ జిల్లాలో విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లుగా పని చేస్తున్న ముగ్గురు, రంగారెడ్డి, మెదక్ జిల్లాలో ఇద్దరు చొప్పున సేవలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. మిగతా జిల్లాల్లో సైతం వారి సేవలను ఉపసంహరించుకుంది. మరోవైపు ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను సైతం తొలగించారు. అత్యవసరం ఉన్న గురుకులాల్లో మాత్రం ఔట్ సోర్సింగ్ సేవలు రద్దు చేసి దినసరి భత్యంపై నియమించుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డిజిటల్ డాక్టర్!



- సంబంధిత అంశాల్లో రోగులకు అవగాహన
- స్ఫూర్తిమంతంగా నిలుస్తున్న భాగ్యనగర డాక్టర్లు
- నేడు ప్రపంచ డాక్టర్ల దినోత్సవంపై ప్రత్యేక కథనం

సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్లుగా పలువురు వైద్యులు

సాక్షి, సిటీబ్యూరో: డాక్టర్ దగ్గరకు వెళ్లాలంటే ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాలి.. లైన్‌లో ఉండాలి.. మన టోకెన్ నంబర్ వచ్చే దాకా ఎదురుచూడాలి.. ఆ తర్వాత గానీ డాక్టర్ దగ్గరకు వెళ్లలేం.. వెళ్లినా మనకు వచ్చిన సమస్య గురించి కొన్నిసార్లు పూర్తిగా డాక్టర్‌తో చెప్పుకోలేం. కొన్నిసార్లు చిన్నచిన్న సమస్యలే కదా అని ఊరుకుంటాం. వాటి గురించి డాక్టర్ దగ్గరికి వెళ్లాలా అని సంకోచం కూడా ఉంటుంది. మరికొందరికి కొన్ని అపోహలు ఉంటాయి. వాటి గురించి సరైన అవగాహన ఉండదు. ఎవరిని అడగాలో తెలియదు. ఇలాంటి వారికోసమే కొందరు డాక్టర్లు సోషల్ మీడియాను వేదికగా చేసుకుని వేలాది మందికి సేవలు అందిస్తున్నారు. అలాంటి వారి సేవలు సమాజానికి ఎంతో అవసరం. సోమవారం ప్రపంచ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమాల ద్వారా సేవలు అందిస్తున్న పలువురు స్ఫూర్తిదాయక వైద్యులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

సంతానంపై అవగాహన కల్పించేందుకు..



– డాక్టర్ శిల్పికారెడ్డి, ఫర్టిలిటీ నిపుణురాలు

సంతాన లేమితో చాలా మంది దంపతులు బాధపడుతున్నారు. సరైన చికిత్స అందకపోవడం.. సంతానం కలగకపోవడంతో మానసికంగా ఎంతో కుమిలిపోతుంటారు. వాళ్లు చెప్పారని, వీళ్లు చెప్పారని ఆస్పత్రులన్నీ తిరుగుతుంటారు. కానీ అసలు సమస్య తెలియదు. కొందరిలో సమస్య ఒకటైతే.. మరొక దానికి ట్రీట్‌మెంట్ ఇస్తుంటారు. అలాంటి వారి అనుమానాలను, సందేహాలను తీర్చేందుకు ప్రముఖ ఫర్టిలిటీ నిపుణురాలు శిల్పికారెడ్డి ఇన్‌స్టాగామ్, యూట్యూబ్‌ను వేదికగా చేసుకున్నారు. తన వద్దకు ఎంతో మంది పేషెంట్లు వస్తుంటారని, వారికి సలహాలు చెబుతుంటానని, తన వద్దకు రాలేని వారికి కూడా అపోహలను పోగొట్టాలనేదే ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

వైద్య వృత్తిలో భాగంగానే..



– డాక్టర్ విరించి విరివింటి, క్లినికల్ కార్డియాలజిస్టు

మనం చెబుతున్న మాటలే భవిష్యత్తులో సంస్కృతిగా మారుతాయన్న ప్లేటో చెప్పిన మాటలే ఆయనకు స్ఫూర్తి. వైద్య రంగం గురించి సమాజంలో చాలా విస్తృతంగా చర్చ జరగాలనేదే ఆయన ఆశయం. అప్పుడే వైద్య రంగం, చికిత్సలు సమాజంలో భాగం అవుతాయనేది ఆయన నమ్మకం. ప్రజలకు ఉన్న అనుమానాలను ఫేస్‌బుక్ ద్వారా ఆయన వైద్య రంగానికి సంబంధించిన అపోహలను నివృత్తి చేయాలని కరోనా సమయంలో నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు స్వయంగా రచయిత కూడా అయిన డాక్టర్ విరించి ఎన్నో రచనలను పోస్టు చేస్తూ అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలనేదే తన ప్రధాన ఉద్దేశమని చెబుతున్నారు. ఆయన స్ఫూర్తిదాయకమైన మాటలు, రచనలకు ఎంతో మందికి మేలుకొలుపు అయింది.

అపోహలు పోగొట్టేందుకే..



ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ప్రభావం ఎంతో ఉంది. అయితే.. సమాచారం కూడా ఎక్కువగా ఉంది. ఏది నిజమో ఏది అబద్ధమో తెలియకుండా ఉంది. కొన్ని సమస్యలకు గూగుల్‌లో వెతుకుతున్నారు. వారికి సరైన సమాచారం ఇవ్వడం తమ బాధ్యత అంటున్నారు ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ దీపక్. యూరాలజీకి సంబంధించి ప్రజల్లో ఎన్నో అపోహలు ఉన్నాయని, ఆఖరికి రోజుకు ఎన్ని లీటర్ల నీళ్లు తాగాలనే విషయంలో కూడా అనుమానాలు ఉన్నాయని చెబుతున్నారు. అందుకే ఒక నిపుణుడిగా చెబితే ప్రజలకు కూడా నమ్మకం కలుగుతుందని పేర్కొంటున్నారు. ఎవరెవరో ఆరోగ్యం గురించి చెబుతున్నప్పుడు తన లాంటి నిపుణులు ఎందుకు సమాజానికి ఎందుకు చెప్పకూడదనే ఉద్దేశంతో సామాజిక మాధ్యమాల్లోకి వచ్చానని చెబుతున్నారు.

– డాక్టర్ దీపక్ రగూరి, యూరాలజిస్టు

ఎలాంటి అనుమానాలొద్దు..



– డాక్టర్ మానస, డెంటిస్టు

దేశవ్యాప్తంగా ప్రజలకు దంతాల గురించి సరైన అవగాహన లేదు. దీనిపై అనుమానాలను తగ్గించేందుకు సోషల్ మీడియాను ఎంచుకున్నానని చెబుతున్నారు ప్రముఖ దంత వైద్యురాలు మానస. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని, ఆరు నెలలకు ఒకసారి డెంటిస్టును కలిస్తే సమస్యలు ఉండవనే విషయంపై అవగాహన చాలా మందిలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లల్లో కూడా దంత సమస్యల గురించి ఎప్పటికప్పుడు చెక్ చేయిస్తూ ఉండాలని, దీని వల్ల వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని చెబుతున్నారు. ఇక, పన్ను తొలగిస్తే అనేక సమస్యలు వస్తాయన్న అపోహలు ఇప్పటికీ పల్లెటూర్లలో ఉన్నాయని, వారి కోసం తాను సామాజిక మాధ్యమాన్ని ఎంచుకున్నానని చెబుతున్నారు డాక్టర్ మానస.

80 గ్రాముల హాషిష్ స్టిక్స్ స్వాధీనం



సనత్‌నగర్: హాషిష్ స్టిక్స్ విక్రయించేందుకు ప్రయత్నించిన ఒకరిని సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 80 గ్రాముల హాషిష్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జగన్మోహన్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఉత్తరాఖండ్ నుంచి హాషిష్ మాదకద్రవ్యాన్ని నగరానికి తరలిస్తున్నారన్న సమాచారం సమాచారం మేరకు రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఈ ఎస్.ప్రదీప్‌రావు నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్, ఎక్సైజ్ అధికారులు బాలరాజు, నవనీత ఇతర సిబ్బంది సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న చేర్యాల సమీపంలోని కుందన్‌పల్లికి చెందిన రిత్విక్‌నాయుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద లక్షన్నర రూపాయల విలువ చేసే హాషిష్ స్టిక్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నా చావుకు ఎవరూ బాధ్యులు కాదు

- జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య
- సెల్ఫీ వీడియో తీసుకొని బలవన్మరణం



రమేష్ (ఫైల్)

జవహర్‌నగర్: తప్పంతా నాదే ..నా చావుకు ఎవరు బాధ్యులు కాదు అంటూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన మేరకు.. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీలో నివసించే సీహెచ్ రమేష్ (43) జిమ్ కోచ్‌గా పనిచేస్తూ అతని సోదరుడి ఇంట్లో నివాసముంటున్నాడు. రమేష్‌కు 2011లో స్వాతితో వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు ఉంది. 8 ఏళ్ల క్రితం రమేష్ స్వాతితో విడాకులు తీసుకుని ఇంటి కింది అంతస్తులో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆరు నెలలుగా ఏ పనిచేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. శనివారం రాత్రి రమేష్‌ను భోజనం చేయడానికి అతని సోదరుడు ఆనంద్ పిలవగా క్రికెట్ మ్యాచ్ చూస్తున్నాను అని చెప్పి భోజనానికి రాకుండా ఉండిపోయాడు. ఆదివారం ఉదయం ఆనంద్ తన పనికి వెళ్లిపోగా అతని భార్య భాగ్యలక్ష్మి, కూతురు జ్యోతిలు గ్రౌండ్ ఫోర్‌లో ఉన్న రమేష్ దగ్గరికి వెళ్లిచూడగా ఆత్మహత్య చేసుకుని విగతజీవిగా కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి చేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆత్మహత్యకు ముందు రమేష్.. తన చావుకు ఎవరూ బాధ్యులు కాదని సెల్ఫీ వీడియో తీసుకున్నాడు.

వాళ్లను వదలకండి

'అదర్స్'నూ పట్టుకోవాల్సిందే! | దర్యాప్తులో ఉన్న కేసులపై ప్రత్యేకంగా నజర్ | పరారీ నిందితులనూ పట్టుకోవాల్సిందే | స్పష్టం చేస్తున్న ఉన్నతాధికారులు



సాక్షి, హైదరాబాద్: విశాఖ ఏజెన్సీకి చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయి ఖరీదు చేసిన ఇరువురు...దానిని ఎవరి కంటా పడకుండా హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలోకి మార్చి అమ్ముతున్నారు.

- బెంగళూరులో ఉంటున్న ఓ నైజీరియన్ నుంచి మాదకద్రవ్యమైన ఎండీఎంఏ ఖరీదు చేసిన కర్ణాటక వాసి ఇక్కడకు తీసుకువచ్చాడు. నగరానికి చెందిన ముగ్గురితో కలిసి అమ్మడానికి ప్రయత్నించాడు.
- నాందేడ్‌కు చెందిన యువకుడి నుంచి నాటు తుపాకీ ఖరీదు చేసిన పాత నేరగాడు దాన్ని ఇక్కడకు తీసుకువచ్చాడు. ఆధిపత్యపోరు నేపథ్యంలో తన ప్రత్యర్థిని హత్య చేయడానికి పథకం వేసి పట్టుబడ్డాడు.
- ఈ వ్యవహారాలపై సమాచారం అందుకున్న పోలీసులు గంజాయి అమ్ముతున్న, ఎండీఎంఏ విక్రయించేందుకు ప్రయత్నించిన, హత్యకు కుట్ర పన్నిన వారిని అరెస్టు చేశారు. ఆ సందర్భంలో నమోదు చేసిన కేసుల్లో గంజాయి, ఎండీఎంఏ వీరికి వారికి పరారీలో ఉన్న నిందితులుగా చూపుతారు. ఆయా ఎఫ్ఐఆర్‌ల్లో వీరిని 'అదర్స్'గా చూపుతారు.
- ఒకప్పుడు నెలకొన్న పరిస్థితులతో కేసుల దర్యాప్తు, విచారణ పూర్తయినా... పరారీలో ఉండే అదర్స్ వాంటెడ్‌గానే మిగిలే వాళ్లు. అయితే ప్రస్తుత పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న ఉన్నతాధికారులు పరారీగా చూపిన ప్రతి నిందితుడినీ అరెస్టు చేయాల్సిందిగా స్పష్టం చేస్తున్నారు.

స్పెషల్ కేసుల్లో ఇది పరిస్థితి...

- ఇతర రాష్ట్రాల నుంచి మారణాయుధాలు, మాదకద్రవ్యాలను అక్రమ రవాణా ద్వారా నగరానికి తీసుకువస్తున్న నేరగాళ్లపై టాస్క్‌ఫోర్స్, సీసీఎస్‌లతో పాటు జోన్లకు చెందిన స్పెషల్ టీమ్స్ సైతం నిఘా ఉంచి పట్టుకునేవి. ఆ సందర్భాల్లో వాటిని తీసుకువచ్చి వాళ్లు మాత్రమే చిక్కేవాళ్లు. వీరికి ఆయుధాలు, డ్రగ్స్ అందించిన, సహకరించిన 'మూల పురుషులు' ఆయా రాష్ట్రాల్లోనే ఉండిపోవడంతో చిక్కట్లేదు.
- దుండగుల్ని అరెస్టు చేస్తున్న టాస్క్‌ఫోర్స్, స్పెషల్ టీమ్స్ వారు చిక్కిన పరిధిలోని ఠాణాలకు అప్పగించి కేసులు నమోదు చేయిస్తున్నారు. ఈ కేసుల్లోనే పరారీలో ఉన్న నిందితుల జాబితాలో అరెస్టు అయిన వారు చెప్పిన పేర్లతో పాటు మరికొందరు (అండ్ అదర్స్) అని పొందుపరుస్తున్నారు.

ఇప్పుడు అదిరిపోతున్న సిబ్బంది

ఈ కారణాల నేపథ్యంలో కొన్ని కేసులో కొలిక్కి వచ్చి, విచారణ పూర్తయ్యే దశకు చేరినా పరారీలో ఉన్న వారు వాంటెడ్‌గానే మిగిలిపోతున్నారు. మరికొన్ని సందర్భాల్లో దర్యాప్తులో ఉన్న కేసులు పూర్తి స్థాయిలో కొలిక్కి చేరక పెండెన్సీ పెరిగిపోతోంది. కేసుల భారం తగ్గించేందుకు పోలీసు విభాగం గడిచిన కొన్నేళ్లుగా క్రమం తప్పకుండా దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించి సమీక్షలు చేస్తున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ (యూఐ) కేసులపై మేళాలు కూడా నిర్వహిస్తున్నారు. వీటికి హాజరవుతున్న దర్యాప్తు అధికారులు 'అదర్స్' అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. దీంతో ఆయా కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను పట్టుకుని తీరాల్సిందే అని సిబ్బందికి అధికారులు స్పష్టం చేశారు.

నేరాల నిరోధంలో భాగంగానే..

- ఏ రకంగా అయితే అమాయకుడిని శిక్ష పడకూడదో... అదే రకంగా నేరం చేసిన వ్యక్తి సైతం తప్పించుకోకూడదనేది చట్టం చెబుతున్న కీలకాంశం. కొన్ని కేసుల్లో వాంటెడ్‌గా ఉన్న వ్యక్తులు ఇక్కడో, మరోచోటో నిత్యం నేరాలు చేస్తూనే ఉంటున్నారు. అది వారికి ప్రవృత్తిగా మారిపోయింది. అలాంటి వారిలో ఇక్కడ నమోదైన కేసుల్లో వాంటెడ్‌గా ఉన్న వారిని గుర్తించి, వెతికి పట్టుకోగలిగితే... ఆ మేరకు నేరాలు నిరోధించినట్లే అవుతుందని ఉన్నతాధికారులు చెప్తున్నారు.
- తప్పు చేసిన వ్యక్తిని న్యాయస్థానం ముందు నిలపాల్సిన బాధ్యత పోలీసుల పైనే ఉందంటున్నారు. కేసుల పెండేన్సీ తగ్గాలన్నా వాంటెడ్స్‌గా ఉన్న ఈ అదర్స్ భారం తగ్గించుకోవాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

లోకల్ కేసుల్లోనూ..

కేవలం పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన నేరగాళ్లకు సంబంధించిన కేసుల్లో మాత్రమే కాదు... స్థానిక ఉదంతాలపై నమోదైన వాటిలోనూ 'అండ్ అదర్స్' ఉంటున్నారు. సిటీలో జరిగిన ఓ భారీ చోరీ, హత్య, హత్యాయత్నం కేసుల్లో స్థానికులే నిందితులుగా ఉన్నప్పటికీ వారికి ఆయుధాలు అందించడం వంటి 'సహాయాలు' చేస్తున్న వారిలో ఇతర రాష్ట్రాల వారితో పాటు గుర్తుతెలియని వ్యక్తులు ఉంటున్నారు. దీంతో ఆయా కేసుల్లోనూ అరెస్టు అయిన వారితో పాటు నిందితుల జాబితాలో గుర్తించిన, గుర్తించని 'ఇతరులు' వాంటెడ్‌గా ఉండిపోతున్నారు. ప్రధాన, కీలక నిందితులు చిక్కిన తర్వాత ఇతర నిందితులపై పోలీసులు దృష్టి కేంద్రీకరించట్లేదు.



నగరంలో కుండపోత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. వరద నీటితో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రోడ్లపై నీరు వచ్చి చేరడంతో వాహనదారులు నరకయాతనకు గురయ్యారు. పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాటిగడ్డ, బంజారాహిల్స్, మల్కాజిగిరి, వెస్ట్ మారేడుపల్లి. బన్సీలాల్ పేట, కూకట్‌పల్లి, మూసాపేట్, సనత్ నగర్, జూబ్లీ హిల్స్, ముషీరాబాద్, ఉప్పల్, ఫిలింనగర్‌లో భారీగా వర్షపాతం నమోదైంది. ఈదురు గాలులతో కూడిన వర్షం ధాటికి చాలా చోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జీహెచ్ఎంసీ, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బల్దియా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించిన నేపథ్యంలో మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.



బంజారాహిల్స్‌లో..

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

రూ.25.55 లక్షల నగదు స్వాధీనం

సంతోష్‌నగర్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఐ.ఎస్.సదన్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.25.55 లక్షల నగదు, ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకట్రామయ్య తెలిపిన మేరకు.. శ్రీనగర్ కాలనీ ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ సోహేల్ (28) ప్రధాన బుకీగా... చంపాపేట్ మారుతీనగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫర్హతుల్లా (55) కలెక్షన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఐసీసీ టీ-20 వరల్డ్ కప్-2024లో శనివారం రాత్రి ఇండియా, సౌతాఫ్రికా మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌పై చంపాపేట్ మారుతినగర్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయమైన సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఐఎస్‌సదన్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ప్రధాన బుకీ మహ్మద్ అబ్దుల్ సోహేల్, కలెక్షన్ ఏజెంట్ మహ్మద్ ఫర్హతుల్లాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడిన రూ.25.55 లక్షల నగదు, ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారణ నిమిత్తం ఐఎస్‌సదన్ పోలీసులకు అప్పగించారు.

బాలికపై గ్యాంగ్ రేప్ కేసు.. 10 మంది అరెస్ట్

అల్వాల్ : మైనర్ బాలికను కిడ్నాప్ చేసి గంజాయి తాగించి..అత్యాచారానికి పాల్పడిన పదిమందిని నిందితులను నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. కాచిగూడ లో నివాసముండే ఓ మహిళ భర్త మూడు సంవత్సరాల క్రితం మరణించగా 12 సంవత్సరాల వయస్సు గల కూతురుతో కలిసి నివసిస్తోంది. ఆమె ఇండ్లలో పనిచేస్తుండగా కూతురు నాలుగో తరగతి వరకు చదువుకొని మానేసింది. ఈ క్రమంలో నేరేడ్‌మెట్ వినాయక నగర్ కు చెందిన కొల్లు నరేష్, విజయ్ కుమార్‌లు బాలికకు పరిచయమయ్యారు. ఆమెను కొంతకాలం నుండి నేరేడ్‌మెట్‌కు తీసుకువచ్చి కూల్‌డ్రింక్ లో గంజాయి కలిపి మత్తులోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం మరో ఎనిమిది మంది స్నేహితులను సైతం లైంగిక దాడికి పాల్పడేలా సహకరించారు. కూతురు అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లగా ఐదు నెలల గర్భవతి అని తెలిసింది. దీంతో బాధితురాలు తల్లి కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్న కాచిగూడ పోలీసులు కేసును ఈ నెల 25వ తేదీన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు శనివారం నిందితులు నేరేడ్‌మెట్ వినాయక్ నగర్ కు చెందిన కొల్లు నరేష్(26) విజయ్ కుమార్ (23) బాలాజీ (23) కృష్ణ (22) కిరణ్ కుమార్ (26) అజయ్ (23) జేమ్స్ జేవియర్ (24) ఇంజమూరి మధు (30) దీపక్ (25)తోపాటు మరొకరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

లారీ ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి

చాదర్‌ఘాట్: గుర్తు తెలియని వాహనం ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్‌కు చెందిన శారవ్ (23) నగరంలోని అరోరా కాలేజ్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శారవ్ చదువుకుంటూనే రాపిడో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం దిల్‌సుఖ్‌నగర్ నుంచి కోఠికి డ్రాపింగ్ రాగా క్లయింట్‌ను పికప్ చేసుకొని బయలుదేరాడు. మలక్‌పేట అక్షయ్ హోటల్ వద్దకు రాగానే గుర్తుతెలియని లారీ ఢీకొంది. దీంతో శారవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తమ్ముడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల పరస్పర దాడులు



ఎమ్మెల్యే సమక్షంలో గొడవ పడుతున్న దృశ్యం

రాజేంద్రనగర్: హరితహారం కార్యక్రమంలో ఫొటోలు దిగే సమయంలో రెండు పార్టీలకు చెందిన నాయకుల మధ్య గొడవ కాస్త ముదిరి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఒకరిపై ఒకరు రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఎమ్మెల్యే సమక్షంలోనే ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ ఆరో డివిజన్ సన్‌సిటీలో ఆదివారం కార్పొరేషన్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, కార్పొరేషన్ చైర్మన్ లతా ప్రేమ్ గౌడ్‌తో పాటు కార్పొరేటర్లు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మొక్కలు నాటి ఫోటోకు ఫోజు ఇచ్చే సమయంలో పరస్పరం ఒకరికొకరు తోసుకున్నారు. ఇది కాస్తా మాటా మాటా పెరిగి పరస్పరం దాడుల వరకు వెళ్లింది. ఎమ్మెల్యే సమక్షంలోనే ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. అనంతరం ఒకటవ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ చంద్రశేఖర్ తనను కులం పేరుతో దూషించడంతో పాటు దాడికి పాల్పడ్డారంటూ రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో తనతో పాటు ఐదవ డివిజన్ కార్పొరేటర్ శ్రీనాథ్ రెడ్డికి గాయాలయ్యాయని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకుడు హరీష్ గౌడ్ తనపై దాడి చేశారంటూ ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నట్లు ఏసీపీ తెలిపారు. మాజీ మేయర్ మహేందర్ గౌడ్‌పై అవిశ్వాస తీర్మానంపై కలెక్టర్‌కు లేఖ అందించినప్పటికీ ఇరు గ్రూపుల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. గత ఎంపీ ఎలక్షన్‌లో సైతం రెండు వర్గాలు పోటాపోటీగా వ్యవహరించారు. వారి మధ్య ఉన్న విబేధాలు ఆదివారం బహిర్గతమై దాడుల వరకు వచ్చింది.

ట్రేడింగ్ పేరిట భారీ మోసం

రూ.14 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



హిమాయత్‌నగర్: ఇన్‌స్టాగామ్‌లో ట్రేడింగ్ ప్రకటనల చూసి అధిక లాభాలకు ఆశచూపి ఓ ప్రైవేట్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన మేరకు.. నగరానికి చెందిన 35 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగికి ఇన్‌స్టాగామ్‌లో ట్రేడింగ్‌కు సంబంధించిన ప్రకటనను చూశాడు. ఆ లింక్‌ను క్లిక్ చేసి వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ఆ గ్రూప్‌లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని ఆశచూపారు. ఒక నెల పాటు స్టాక్ ట్రేడింగ్‌లో ఉన్నట్లు చూపించారు. అనంతరం సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత వివరాలను నమోదు చేయించారు. మొదట ట్రేడింగ్ అప్లికేషన్‌ను ఉపయోగించి లాభాలను ఆర్జించి, మళ్లీ పెట్టుబడులు పెట్టాడు. ఈ విధంగా విడతల వారిగా బాధితుడు వద్ద నుంచి రూ.13,96,640 కాజేసి మోసం చేశారు. డబ్బు తిరిగి రాకపోవడంతో అకౌంట్ బ్లాక్ అవడంతో మోసపోయానని బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నారంటూ మహిళకు టోకరా

డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నారంటూ ఓ మహిళా ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు భారీ మోసం చేశారు. నగరానికి చెందిన 24 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగినికి ఫెడెక్స్ ఇంటర్నేషనల్ కొరియర్ నుండి కాల్ వచ్చింది. డ్రగ్స్‌తో కూడిన ఒక ప్యాకేజీ తన పేరుతో ఉందని, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసు నమోదైందని ముంబైకి కాల్ బదిలీ చేస్తున్నామన్నారు. అనంతరం స్కైప్ ద్వారా వీడియో కాల్‌లో పోలీస్ అధికారుల మారువేషంలో ఉన్న సైబర్ నేరగాళ్లు మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారని బెదిరించారు. ఆమెకు సంబంధించిన ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలతో వ్యక్తిగత వివరాలను, ఐదున్నర సంవత్సరాల బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను చూపించారు. దీంతో భయాందోళనకు గురైన బాధితురాలు వారు చెప్పిన విధంగా రూ.9 లక్షలు వారి ఖాతాకు బదిలీ చేసింది. అనంతరం మోసపోయానని గ్రహించి బాధితురాలు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు పిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

భూగర్భ జలాల పెంపుదలకు కృషి చేయాలి

గచ్చిబౌలి: జల సంరక్షణకు, భూగర్భ జలాల పెంపుదలకు అందరూ కృషి చేయాలని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి సూచించారు. డాక్టర్స్ డే సందర్భంగా 5కే వాక్ కార్యక్రమం ఆదివారం దుర్గంచెరువు పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జలసంరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఖాదీబోర్డు సభ్యుడు పేరాల శేఖర్‌రావు మాట్లాడుతూ జల కాలుష్యాన్ని నివారించాలని, నదులు లేకపోతే నాగరికత ఉండదన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



నాగప్ప (ఫైల్)

మూసాపేట: దేవాలయానికి వెళుతున్న వారిని కారు ఢీకొనడంతో ఓ వృద్ధుడు చనిపోగా మరో మహిళ గాయపడింది. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. నాగప్ప (70) కూకట్‌పల్లిలో నివాసముంటున్నాడు. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని రంగనాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి కళ్యాణం ఆదివారం జరిగింది. ఈ కళ్యాణం చూటానికి నాగప్ప వెళుతుండగా ఇంటి పక్కనే ఉండే లక్ష్మీ (54) తాను కూడా ఆలయానికే వస్తున్నానని చెప్పగా ఇద్దరూ కలిసి స్కూటీపై బయలుదేరారు. కూకట్‌పల్లి మిలటరీ రాజన్న హోటల్ ముందు ఓ కారు ఢీ కొట్టడంతో నాగప్ప, లక్ష్మీలకు గాయాలయ్యాయి. స్థానికులు అమోర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా నాగప్ప చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. లక్ష్మీ ఆసుపత్రిలో గాయాలతో చికిత్స పొందుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సందడి చేసిన సత్యదేవ్, విజయ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ టాలివుడ్ హీరోలు విజయ్ దేవరకొండ, సత్యదేవ్‌లు శ్రీ చక్ర మిల్క్ ప్రొడక్ట్స్ పదో వార్షికోత్సవంలో పాల్గొని సందడి చేశారు. మియాపూర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీ చక్ర మిల్క్ కమర్షియల్ యాడ్‌ను లాంచ్ చేశారు. పాల ఉత్పత్తుల రంగంలో పదేళ్ల పాటు సేవలందించడం అభినందనీయమని విజయ్ దేవరకొండ అన్నారు. మరిన్ని మంచి ఉత్పత్తులతో సంస్థ ఎదగాలని విజయ్ ఆశించారు. ఒక ఉత్పత్తికి అంబాసిడర్‌గా మారడం ఇదే తొలిసారని, నాణ్యమైన ఉత్పత్తులకే తను ప్రచారం చేస్తానని శ్రీ చక్ర మిల్క్ ప్రొడక్ట్స్‌కు బ్రాండ్ అంబాసిడర్, సినీ నటుడు సత్యదేవ్ తెలిపారు. సంస్థ ఎండీ రామ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఆర్టిస్ట్‌పై దాడి

వెంగళరావునగర్ : నిద్రిస్తున్న జూనియర్ ఆర్టిస్ట్‌పై మాజీ ప్రియుడు దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. వెంగళరావునగర్ డివిజన్ యాదగిరినగర్ సాయిబాబా దేవాలయం వద్ద ఒక జూనియర్ ఆర్టిస్ట్ తన స్నేహితురాళ్ళతో కలిసి నివసిస్తోంది. కొంతకాలంగా జూనియర్ ఆర్టిస్ట్ మాజీ ప్రియుడు శివ అనే యువకుడు ఆమెను హింసిస్తూ వస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున శివ మద్యంతాగి తన గదికి వచ్చి తీవ్రంగా దుర్భాషలాడాడు. అంతేగాకుండా ఆమెపై దాడి చేసి గొంతు నులిమి హత్య చేయడానికి ప్రయత్నించాడు. దాంతో గదిలోని వారంతా భయంతో కేకలు వేయడంతో శివ పరారయ్యాడు. అతనిపై చర్యలు తీసుకోవాలంటూ జూనియర్ ఆర్టిస్ట్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నృత్యాభినయం.. నయన మనోహరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం శ్రీ నటరాజ నృత్య నికేతన్, శ్రీ లలిత కళా నృత్య నికేతన్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన సంగీత నృత్య ప్రదర్శనలు ఆహూతులను అమితంగా ఆకట్టుకున్నాయి. బాల నృత్యకారిణులు తమ నాట్యాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో చిన్మయ కల్చరల్ సంస్థ వ్యవస్థాపకులు, ప్రముఖ కవి, విమర్శకులు పీఎన్ మూర్తి, నటరాజ నృత్య నికేతన్ వ్యవస్థాపకులు జట్ల దిన వీరభద్రరావు, శ్రీ లలిత కళా నికేతన్ నాట్య గురువు డాక్టర్ అరవ ఆంజనేయులు పాల్గొన్నారు.

– సుందరయ్య విజ్ఞాన కేంద్రం



సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

- Luxury 3 BHK Ready To Occupy Flats, Near Habsiguda / Mallapur. Last Few Flats For Sale. Highrise Gated Community. Modern Amenities. Must Visit ! Call: Ph: 08069045562 [HA-311]
- 39 lakhs only Nagole & Boduppal East & West Facing 2 BHK & 3 BHK 1000, 2000 Sft In Prime Location. Car Park Avail. Ph: 6309345838, 9502937289. [HA-15729]

PLOT FOR SALE

- నాదర్‌గుల్ MVSR కాలేజ్ దగ్గరలో 150, 200 గజముల ప్లాట్లు E / Face, W / Face అమ్మకమునకు కలవు. ఫోన్: 9603061171 / 8179212346 [H-189677]
- VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 18,500/- సంప్ర: ✆ 63028 55524 [B-31]
- గజం॥ 2500/- కే విజయవాడ హైవే నార్కట్‌పల్లి దగ్గర 4 లైన్స్‌రోడ్డు ప్రక్కన, ఫామ్‌ల్యాండ్ వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, ఫామ్ హౌస్, ఎర్రచందనం & పండ్ల మొక్కలతో 1210 గజాలు (10 గుంటలు) ప్లాట్స్ కలవు. 96666 95886 [G-3155]
- 500 / 1000 Sq.yds Commercial Plot / Shed For Sale at Sanathnagar Industrial Area. Near SBI Bank. Only Serious Buyers. Ph: 7675855508 [H-778876]
- OPEN PLOTS FOR SALE, in Shamshabad, 6k.m from ORR, @ 5500/- & 9000/- Per.yds. Clr Title, Spot Reg. Sawera Township PVT ltd. Ph. 7386777380 [HA-847]

Services

BUSINESS SERVICE

- మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [H-800419]

BUSINESS OFFER

- బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ ✆ 99516 88858 [B-1264600]

PERSONAL CARE

CHANGE OF NAME

- I, Y. Harika W/o Y. Rajasekhara Reddy, R/o Plot No. 138, Ista Homes, Road No.3, Kakatiya Hills, Madhapur, Hyderabad - 500081, have changed our Daughter name from Yarram Manaswi to MANASWI YARRAM REDDY for all record purpose [H-796236]
- I, Khozema Hassan R/o 20-2-545, Saifee Street, Hussaini Alam, Hyderabad, Telangana -500064, have changed my minor daughter name from Insiyah to Insiyah Husainy. [WB-13413]

OLD AGE HOME

- వృద్ధులు & భార్యాభర్తలు, Rtd ఎంప్లాయీస్, సింగిల్ & షేరింగ్ రూమ్స్, మేడిపల్లి / ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు. Ecil, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతి, 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్:7981467086, 9391039990, 8074327715 [H-778817]

Wanted

- అన్నపూర్ణ హోమ్ కేర్‌లో కేర్ టేకర్స్, పేషెంట్ కేర్, పెద్దవారికి సేవ చేయడానికి ఆయాలు, స్త్రీ/ పురుషులు కావలెను. జీతం: 16000 to 30000 రూమ్ + మీల్స్ ఫ్రీ. ఫోన్: 9390427694 [H-788097]
- RTC 'X' రోడ్స్, అశోక్‌నగర్ బాయ్స్ హాస్టల్ వంట మనుషులు, హౌస్‌కీపింగ్‌కు స్త్రీ/ పురుషులు భార్యాభర్తలు కావలెను. మంచి జీతము, ఉచిత వసతి+భోజనం. Ph: 9292101119 [HA-15738]
- రిసెప్షన్, టెలికాలర్స్, డ్రైవర్స్, డెలివరీ బాయ్స్, ఆఫీస్ బాయ్, డ్రైవర్లు, సూపర్వైజర్స్, చిన్న పాప కేర్ టేకర్, ఆయాలు, కుక్స్, హెల్పర్స్, గార్డెన్ వర్కర్లు, వాచ్‌మెన్, Age: 16-72, జీ: 15-25K బాచుపల్లి, బాలాపూర్, ఉప్పల్. ఫోన్: 9605288777 [H-778748]
- ఉప్పల్ డిపో వద్ద మా ఫార్మా కంపెనీకి అనుభవం గల క్లర్క్ విత్ కంప్యూటర్ ఆపరేటర్, టూరింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫోన్: 7989823219 [H-796308]
- Wanted Female Receptionist Age: 20 to 30 Yrs, Timing: 9AM to 6PM, Salary: 15K- 20K At Santosh Nagar. Ph : 9346218562 [HA-13694]
- Wanted Females For Front Office Executive, Accountant, BDE For VLMS IT Hardware Service Co., Sec-bad. www.vlms.in. Ph: 9885581121, 9848412744 [H-799898]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు | జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

షూటింగ్‌లో గోల్డ్‌మెడల్‌

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర షూటింగ్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో నగరానికి చెందిన డాక్టర్‌ వంశీధర్‌ నాటి హ్యాట్రిక్‌ గోల్డ్‌ మెడల్‌ సాధించారు. ఇటీవల నగరంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని అగ్రశ్రేణి షూటర్లు పాల్గొనగా 10 మీటర్ల రైఫిల్‌ మాస్టర్మెన్‌ ఇండివిజల్‌ విభాగంలో 380/400 స్కోర్‌ సాధించారు. ఇది అతనికి వరుసగా మూడో గోల్డ్‌మెడల్‌. తెలంగాణ రైఫిల్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు అమీత్సంఘీ, కిరణ్‌ ఇతర ప్రముఖులు హాజరై మెడల్స్‌ అందజేశారు. నిరంతర సాధన, కుటుంబ సహకారం, కోచ్‌ల ప్రోత్సాహంతోనే విజయం సాధించినట్లు వంశీధర్‌ తెలిపారు.

యువతీయువకుడిపై దాడి

వెంగళరావునగర్‌: యువతీయువకులపై దాడి చేసిన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి ప్రాంతానికి చెందిన ఎస్‌.లక్ష్మి అనే యువతి బేగంపేటలోని ఓ ప్రైవేట్‌ సంస్థలో టెలీకాలర్‌గా విధులు నిర్వహిస్తుంది. శనివారం సాయంత్రం తన స్నేహితుడు యువరాజ్‌తో కలిసి కృష్ణకాంత్‌పార్క్‌కు వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న మరో స్నేహితుడు గోపిరెడ్డి భరత్‌ భూషణ్‌ అక్కడికి వచ్చి యువతి ఫోన్‌ లాక్కుని పగులకొట్టాడు. అంతేగాకుండా ఇరువురిపై దాడి చేశాడు. రెండు నెలలుగా ఆమెను వెంబడిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తూ మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో యువతి ఆదివారం మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

లిబర్టీ: బీసీల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 2 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని బీసీ దళ్‌ జాతీయ అధ్యక్షుడు దండ్రు కుమారస్వామి కోరారు. దళ్‌ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలపై కపట ప్రేమ ప్రదర్శించడం కాదని బడ్జెట్‌లో నిధులు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. బీసీ జనగణనపై కేంద్ర ప్రభుత్వం వైఖరి స్పష్టం చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి చొరవ తీసుకుని జాతీయ స్థాయిలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి మంత్రిని నియమించాలని ఆయన డిమాండ్‌ చేశారు.

యువతితో అసభ్య ప్రవర్తన

వెంగళరావునగర్‌: యువతితో కొందరు యువకులు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన మధురానగర్‌ పీఎస్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కాలనీలో నివసించే ఆర్‌.సాయికుమార్‌ శనివారం రాత్రి తన స్నేహితురాలితో కలిసి కాలనీ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఆమె ఛాతీ భాగంపై చేయివేసి అసభ్యంగా మాట్లాడి పారిపోయారు. యువకుల కోసం చుట్టుపక్కలా గాలించినా కనిపించలేదు. దాంతో సాయికుమార్‌ మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి అదృశ్యం

వెంగళరావునగర్‌: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన టి.రాంబాబు, రాజేశ్వరి దంపతులు ఏడేళ్లుగా కార్మికనగర్‌లో నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈనెల 28న కుమార్తె స్కూల్‌కు, తల్లిదండ్రులు విధులకు వెళ్లారు. సాయంత్రం 5 గంటలకు కుమార్తె పాఠశాల నుంచి ఇంటికి రాగా తాళం వేసి ఉంది. చుట్టుపక్కల వారిని విచారించగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో సోదరుడు తాళం వేసి వెళ్లినట్లు తెలిపారు. దీంతో ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఇంట్లో బీరువాలోని రూ.400 కనిపించలేదు. తన కుమారుడు మహేశ్‌ గ్రామంలోని స్కూల్‌లో చదువుతానని చెప్పాడని, అందుకు తాము ఒప్పుకోలేదని అందుకే ఇంటి నుంచి వెళ్లాడని తల్లి రాజేశ్వరి మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియామకాలు

లిబర్టీ: రిపబ్లికన్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కరణం కిషన్‌ను, గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యదర్శిగా పగడం శ్రీనివాసును ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేశ్‌బాబు నియమించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో వారికి నియామక పత్రాలను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి సి.బాలకృష్ణ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గప్రసాద్‌, ఉపాధ్యక్షుడు గెద్దం శంకర్‌, నగర అధ్యక్షుడు జే.ఎల్‌ సుధీర్‌ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ట్రాఫిక్‌ ఎస్‌ఐలకు సత్కారం

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ ట్రాఫిక్‌ ఎస్‌ఐలుగా పనిచేసిన సయ్యద్‌ హుస్సేన్‌ భాషా, బాల్‌రెడ్డి, పంజగుట్ట ట్రాఫిక్‌ ఎస్‌ఐగా పనిచేసిన శ్రీనివాసరావులు పదవీ విరమణ చేశారు. దీంతో బంజారాహిల్స్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ హరిప్రసాద్‌ కట్టా హాజరై వారికి పూలబొకేలు అందించి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

మధురానగర్‌ ఎస్‌ఐకి ..

వెంగళరావునగర్‌ : మధురానగర్‌ ఎస్‌ఐ షేక్‌ ఇక్బాల్‌ ఉద్యోగ విరమణ చేయగా పోలీసుస్టేషన్‌ ఆవరణలో ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మధురానగర్‌ పీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ మధుసూదన్‌రెడ్డి హాజరై ఇక్బాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు బాల్‌రాజ్‌, సాయినాథ్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1035 మంది విద్యార్థులకు..
6గురే టీచర్లు..!

సీఎం నివాసానికి కూతవేటు దూరంలోని ఫిలింనగర్‌ ప్రభుత్వ పాఠశాల దుస్థితి

- అంతంతమాత్రంగానే అడ్మిషన్లు
- బదిలీపై వచ్చేందుకు ఆసక్తి చూపని టీచర్లు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- కుంటుపడుతున్న బోధన
- ఆందోళనలో తల్లిదండ్రులు



ఫిలింనగర్‌లోని ప్రభుత్వోన్నత పాఠశాల

బంజారాహిల్స్‌: అది సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి కూతవేటు దూరంలోని ఫిలింనగర్‌ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల. అందులో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేక తల్లిదండ్రులను తమ పిల్లలను చేర్పించేందుకు ముందుకు రావడం లేదు. అయినా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చొరవ చూపకపోవడం గమనార్హం. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య జంట నగరాల పరిధిలోనే మూడో స్థానంలో ఉండగా టీచర్ల సంఖ్య మాత్రం అథమ స్థానంలో ఉంది. సుమారుగా ఉన్నత పాఠశాలలో 1035 మంది విద్యార్థులు ఉండగా ఆరుగురు టీచర్లు మాత్రమే ఉన్నారు. ఇక్కడ ఇంకా 30 మంది ఉపాధ్యాయుల కొరత వేధిస్తున్నది. మొన్నటి వరకు ఇద్దరు టీచర్లు మాత్రమే ఉండగా మీడియాలో పాఠశాల దుస్థితిపై కథనాలు ప్రచురితం కాగా నలుగురు ఉపాధ్యాయులను బదిలీపై పంపించారు. అయితే వారు కూడా స్కూల్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. కారణాలు కూడా తెలియరావడం లేదని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. రవాణా సౌకర్యం లేకపోవడం, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి తరగతి గదులు తక్కువగా ఉండడం, తాగునీరు, మరుగుదొడ్ల సమస్య, కిక్కిరిసిపోతున్న తరగతి గదులు, మైదానం లేకపోవడం, శబ్ద కాలుష్యం ఇలా సమస్యలకు తోడు ఒత్తిడితో టీచర్లు బదిలీపై వెళ్లిపోయారు. వారి స్థానంలో కొత్త వారు రావాల్సి ఉండగా ఎవరూ కూడా వచ్చేందుకు ఉత్సాహం చూపడం లేదు. ఫలితంగా సరిపడా టీచర్లు లేక విద్యార్థుల చదువు ముందుకుసాగని పరిస్థితి నెలకొంది.

షిఫ్టు విధానం ఎత్తేశాక..

ఫిలింనగర్‌ ప్రభుత్వ పాఠశాల భవనం నాలుగు అంతస్తుల్లో ఉంది. ఒక్కో అంతస్తులో తొమ్మిది తరగతి గదులు ఉన్నాయి. ఇందులో ఉన్నత పాఠశాలకు ఆఫీసు గది, ప్రైమరీ పాఠశాలకు ఇంగ్లిష్‌, తెలుగు మీడియంలు వేర్వేరుగా రెండు ఆఫీసు గదులు ఉన్నాయి. రెండు కంప్యూటర్‌ క్లాస్‌ రూంలు, డిజిటల్‌ క్లాస్‌ రూం..ఇవన్నీ పోనూ మిగిలిన 26 గదుల్లోనే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. గతేడాది ప్రారంభం వరకు షిఫ్టు పద్ధతిలో ఈ స్కూల్‌ కొనసాగింది. ఉదయం ప్రాథమిక, మధ్యాహ్నం నుంచి ఉన్నత పాఠశాలను నడిపారు. అవి టీచర్లకు కొంత అనుకూలంగానే ఉండేది. అయితే గతేడాది విద్యా సంవత్సరం ఆఖరు నుంచి షిఫ్టు విధానం ఎత్తేశారు. రోటరీ క్లబ్‌ ఆఫ్‌ జూబ్లీహిల్స్‌ కొత్తగా తొమ్మిది గదులు నిర్మించి ఇవ్వగా షిఫ్టు విధానం ఎత్తేసి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నడుపుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లిష్‌, తెలుగు మీడియంలో కలిపి 500 మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థుల సంఖ్య దాదాపు 1500 పైచిలుకు చేరింది. ఫలితంగా పాఠశాల ఇరుకుగా మారి విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ఖాళీ జాగా లేని పరిస్థితి నెలకొంది.

పరిష్కారం సాధ్యమయ్యేనా..

ఫిలింనగర్‌ ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత వేధిస్తోన్నా విద్యార్థులు ఇతర పాఠశాలల్లో చేరేందుకు వెళ్తున్నా ఇటు విద్యాశాఖ అధికారుల్లో గానీ, ప్రజాప్రతినిధుల్లో గానీ చలనం లేకుండాపోయింది. రోటరీ క్లబ్‌ ఆఫ్‌ జూబ్లీహిల్స్‌, మరో రెండు స్వచ్ఛంద సంస్థలు పలు సౌకర్యాలు కల్పించినా సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. ఇన్‌చార్జి డిప్యూటీ డీఈఓ నిర్వాకం వల్లనే పాఠశాలలు సమస్యల్లో కూరుకుపోతున్నాయని, విద్యార్థుల సంఖ్య పెరగకపోగా పదో తరగతి ఫలితాలు కూడా తగ్గాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా డీఈఓ స్పందించి ఖైరతాబాద్‌ జోన్‌కు సమర్థుడైన డిప్యూటీ డీఈఓను నియమించి టీచర్లపై అజమాయిషీ ఉండేలా చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో సర్కార్‌ బడులు మరింత క్షీణించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రజలకు అండగా ఉంటా



మహిళలతో సెల్ఫీ దిగుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్‌: తనను గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్‌ బీజేపీ కన్వీనర్‌ గడ్డం వెంకటస్వామి అధ్యక్షతన ఆ నియోజకవర్గ బీజేపీ బూత్‌ అధ్యక్షులు, కో–ఆర్డినేటర్ల సమావేశం బంజారాహిల్స్‌ లేక్‌ వ్యూ ఫంక్షన్‌ హాల్‌లో ఆదివారం జరిగింది. ఆయన హాజరై మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. వారి సంక్షేమం కోసం పార్టీ ఎప్పుడూ ఆలోచన చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్‌ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నాయకులు బంగారు శృతి, అమర్నాథ్‌, ఎన్‌వీ సుభాష్‌, గౌతంరావు, మెచినేని శ్రీనివాస్‌, ప్రేమరాజ్‌, నగేశ్‌, భోజిరెడ్డి, మహిపాల్‌, వీణారెడ్డి, రాఘవరెడ్డి, వినయ్‌ముదిరాజ్‌, రమేశ్‌, నరహరి పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ కాలనీ కమిటీ ఎన్నిక



భగత్‌సింగ్‌ కాలనీ కార్యవర్గం

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ డివిజన్‌ ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్‌ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రెండువారాల క్రితం జరిగిన బస్తీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎం.సహదేవ్‌ విజయం సాధించారు. దీంతో బస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా లింగాచారి, కోశాధికారిగా ఎం.తిరుపతయ్య, కె.రవిరాజ్‌, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పి.కిశోర్‌తో పాటు ఉపాధ్యక్షులు, ఉప కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు సి.రామచంద్రయ్య, ఎస్పీ.శ్రీను, డి.రామచంద్రయ్య, జి.వెంకటేశ్‌, డి.వెంకటస్వామి పాల్గొన్నారు.

పార్టీల ఫిరాయింపును ప్రోత్సహించొద్దు

లిబర్టీ: పార్టీల ఫిరాయింపులను ప్రోత్సహించడం మంచి సంస్కృతి కాదని లోక్‌దళ్‌ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వరరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక పార్టీ నుంచి గెలుపొందిన సుమారు ఆరుగురు ఎమ్మెల్యేలను స్వయంగా సీఎం చొరవ తీసుకుని ఫిరాయింపులను ప్రోత్సహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, సకాలంలో వేయాలని ప్రతి మహిళకు రూ. 2500 తక్షణమే చెల్లించాలని కోరారు. అలాగే ఉద్యోగాల భర్తీ చేపట్టాలని కోరారు.

ప్యాలటివ్‌ కేర్‌ వైద్య విభాగం కీలకం



ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ ప్యాలటివ్‌ కేర్‌ తెలంగాణ చాప్టర్‌ ప్రారంభోత్సవంలో వక్తలు

బంజారాహిల్స్‌: మరణానికి చేరువలో ఉన్న కేన్సర్‌ రోగులకు ప్రశాంతమైన జీవనాన్ని అందించేందుకు ప్యాలటివ్‌ కేర్‌ వైద్య విభాగం కీలకంగా వ్యవహరించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైద్య నిపుణులతో ఏర్పడిన ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ ప్యాలటివ్‌ కేర్‌ తెలంగాణ చాప్టర్‌ను ఆదివారం ప్రారంభించారు. బసవతారకం ఇండో అమెరికన్‌ కేన్సర్‌ హాస్పిటల్‌ అండ్‌ రీసెర్చ్‌ ఇనిస్టిట్యూట్‌, ఎంఎన్‌జే కేన్సర్‌ హాస్పిటల్‌, పెయిన్‌ రిలీఫ్‌, ప్యాలటివ్‌ కేర్‌ సొసైటీలు సంయుక్తంగా ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ దీనిని ఏర్పాటుచేశాయి. బంజారాహిల్స్‌లోని రాడిసన్‌ బ్లూ హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి బసవతారకం హాస్పిటల్‌ సీఈఓ డాక్టర్‌ కృష్ణయ్య, ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ అంకాలజీ, రీజినల్‌ కేన్సర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీనివాసులు, పెయిన్‌ రిలీఫ్‌ సెక్రటరీ డాక్టర్‌ బీవీ మంజుల, ప్యాలటివ్‌ కేర్‌ సొసైటీకి చెందిన డాక్టర్‌ సుబ్రహ్మణ్యం, స్పర్శ్‌ హాస్పైస్‌ దీర్ఘకాలిక ట్రస్టీ డాక్టర్‌ శ్రీకళ నంబియార్‌తో పాటు ఫుట్‌వేర్‌ డిజైన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ఇనిస్టిట్యూట్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌, మినిస్ట్రీ ఆఫ్‌ కామర్స్‌ డాక్టర్‌ తేజ్‌ లోహిత్‌రెడ్డి హాజరై తెలంగాణ చాప్టర్‌ ఆఫ్‌ ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ ప్యాలటివ్‌ కేర్‌ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ప్రజలు, వైద్యులకు చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ చాప్టర్‌ను ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా ప్యాలటివ్‌ కేర్‌ చికిత్సతో తాము పొందిన అనుభవాలను పలువురు పంచుకున్నారు. అంతకుముందు నూతనంగా ఏర్పడిన ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ ప్యాలటివ్‌ కేర్‌ తెలంగాణ చాప్టర్‌ గవర్నింగ్‌ బాడీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా గాయత్రీ పాలట్‌, కార్యదర్శులుగా డాక్టర్‌ ప్రవీణ్‌ కుమార్‌, డాక్టర్‌ ఆంజనేయులు, గవర్నింగ్‌ బాడీ సభ్యులుగా డాక్టర్‌ బీవీ మంజుల, ప్రియ, డాక్టర్‌ ప్రణీత్‌, డాక్టర్‌ శుభ, అనూష, ఈశ్వర్‌, పద్మ ఎంపికయ్యారు.

ఆడపిల్లలకు కరాటే నేర్పించాలి



కరపత్రం, కప్పును ఆవిష్కరిస్తున్న హీరో సుమన్‌

పంజగుట్ట: కరాటేతో స్వీయ రక్షణ పొందవచ్చని, ఆడపిల్లలకు తప్పకుండా నేర్పించాలని సినీ హీరో డాక్టర్‌ సుమన్‌ తల్వార్‌ అన్నారు. షావలెన్‌ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్‌ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన కోట్ల విజయభాస్కర్‌ రెడ్డి స్టేడియంలో నిర్వహించనున్న మొదటి అంతర్జాతీయ మార్షల్‌ఆర్ట్స్‌ చాంపియన్‌షిప్‌ –2024 పోటీల కరపత్రం, కప్‌ను ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరాటేను ఒలింపిక్స్‌ స్థాయి వరకు తీసుకువెళ్లామని, కానీ కొన్ని గ్రూప్‌ల కారణంగా తొలగించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో కేవలం టాలెంట్‌ ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోటీల నిర్వాహకుడు ఎం.కన్నా గౌడ్‌ మాట్లాడుతూ.. కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో మూడు విభాగాల్లో పోటీలు జరుగుతాయని మొత్తం 4 దేశాల నుంచి సుమారు 1200 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సినీ నిర్మాత రామకృష్ణగౌడ్‌ పాల్గొన్నారు.

భగవద్గీతను ఆచరించాలి



గూడూరి విజయలక్ష్మిని సన్మానిస్తున్న బ్రహ్మకుమారీస్‌

శ్రీనగర్‌కాలనీ: జీవితసత్యాన్ని, జీవనమార్గాన్ని తెలిపే మహత్కర గ్రంథం శ్రీ భగవద్గీత అని రాజయోగిని బీకే వీణ అన్నారు. ఎర్రగడ్డలోని రాయల్‌గార్డెన్‌ ఫంక్షన్‌హాల్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్‌ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సర్వసమస్యలకు సమాధానం శ్రీమద్భగవద్గీత అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బ్రహ్మకుమారి బీకే లక్ష్మి మూడురోజుల పాటు నిర్వహిస్తున్న కవి సమ్మేళనం చివరిరోజు ఆదివారం ఆకట్టుకునేలా సాగింది. రచయిత డాక్టర్‌ బీకే గూడరి విజయలక్ష్మి, బీకే ఇందిరా హిందీలో కవితలను తెలియజేశారు. ఆకట్టుకునేలా కవితలను తెలిపిన బీకే గూడూరి విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. బ్రహ్మకుమారీస్‌ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

‘కళావేదిక ఎన్టీఆర్‌ ఫిల్మ్‌ అవార్డ్స్‌’ ప్రదానం



విద్యార్థులను సన్మానిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

బంజారాహిల్స్‌: ‘కళా వేదిక ఎన్టీఆర్‌ ఫిల్మ్‌ అవార్డ్స్‌’ కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్‌లోని దస్పల్లా హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. అతిథులుగా నందమూరి మోహన్‌ కృష్ణ, నందమూరి మోహనరూప, సినీనటుడు మురళీమోహన్‌, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు కేఎల్‌ దామోదర్‌ ప్రసాద్‌, కార్యదర్శి టి.ప్రసన్నకుమార్‌, మూవీ ఆర్టిస్ట్‌ అసోసియేషన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ మాదాల రవి తదితర ప్రముఖులు హాజరై అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్‌ మాట్లాడుతూ ఎన్టీఆర్‌ పేరిట అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్‌ అధినేత, నిర్మాత గణపతిరెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్‌ పేరిట ఫిలీం అవార్డ్స్‌ ఇవ్వడం, ఈ ఈవెంట్‌లో తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. నందమూరి మోహనరూప మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవం కోసం బతికిన వ్యక్తి ఎన్టీఆర్‌ అని కొనియాడారు. కాగా ఎన్టీఆర్‌ ఫిలీం అచీవ్‌మెంట్‌ అవార్డును మురళీమోహన్‌, నందమూరి మోహన్‌కృష్ణ అందుకున్నారు. ఉత్తమ కథా నాయకుడిగా బేబీ చిత్రం నుంచి ఆనంద్‌ దేవరకొండ, ఉత్తమ దర్శకుడిగా సాయిరాజేశ్‌ (బేబీ చిత్రం), ఉత్తమ నిర్మాతగా సాహు గారపాటి (భగవంతు కేసరి) అవార్డు అందుకున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



అవార్డు అందజేస్తున్న మురళీమోహన్‌

ఖైరతాబాద్‌: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్‌, ఆర్య వైశ్య ఫెడరేషన్‌ జాతీయ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. అవోపా బ్యాంక్‌మెన్‌ చాప్టర్‌ ఆధ్వర్యంలో వాసవి సేవా కేంద్రంలో జేఈఈ, మెయిన్స్‌ అడ్వాన్స్‌ ఎంట్రన్స్‌ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో లక్ష్యాలను చేరుకోవాలంటే సవాళ్లను అధిగమించాలన్నారు. అవోపా బ్యాంక్‌మెన్‌ చాప్టర్‌ ప్రెసిడెంట్‌ వీవీ రమణయ్య, ఉపాధ్యక్షుడు టీఎల్‌వీ రావు, బాబురావు, ప్రధాన కార్యదర్శి బాలాజీ, కోశాధికారి నరేందర్‌, చీఫ్‌ అడ్వైజర్‌ రామానందం,, ఎగ్జిక్యూటివ్‌ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట: బీసీలు బానిసలుగా కాకుండా ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ ఐ.తిరుమలి పిలుపునిచ్చారు. బీసీ సమాజ్‌, బీసీ టైమ్స్‌ ఆధ్వర్యంలో ప్రతీ నెల చివరి ఆదివారం నిర్వహించే బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. బీసీ సమాజ్‌ అధ్యక్షుడు సంగెం సూర్యారావు, ఆల్‌ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌ కుమార్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రొఫెసర్‌ తిరుమలి హాజరై మాట్లాడారు. బీసీల్లో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మార్పు వచ్చినప్పుడే అధికారం మన చేతుల్లో ఉంటుందన్నారు. బీసీలకు అధికారం రావాలంటే గెలుపోటములతో సంబంధం లేకుండా ఎన్నికల్లో పోటీ చేయాలని పిలుపునిచ్చారు. సంగెం సూర్యారావు మాట్లాడుతూ.. తమకు రాజకీయాలతో సంబంధం లేదని కులస్తులు ఏ వృత్తిలో ఉన్నా వారిని ప్రోత్సహించడం, రాజకీయాల్లో గెలుపుకోసం పని చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సమాజ్‌ యువజన విభాగం అధ్యక్షులు పెద్దబుద్దుల సతీశ్‌ సాగర్‌, బి.విజయ రాజు, ఎమ్‌.శ్రీనివాస్‌, జి.వీరన్న, శ్రీనివాస్‌, ఎస్‌.జగదీష్‌, వివేకానంద పాల్గొన్నారు.



25 ఏళ్లకు ఒకే వేదికపై..

ఖైరతాబాద్‌ : ఖైరతాబాద్‌లోని నిషుల్క్‌ ప్రభాత్‌ ప్రభుత్వోన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ కరుణాకర్‌ రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌ కరుణాకర్‌, కిరణ్‌, రాకేష్‌ జీలను సన్మానించారు.

JJ HOSPITAL
Plot No.57, Behind T.B.Hospitals, Phase-I, Kalyan Nagar, Hyderabad-500038.
JJ Hospital
Ph: 23712106, 23704778, 65551163
Doctors Day Greetings to All



SERVICES FACILITY
- Obstetrics & Gynaecology
- Urology
- Orthopaedics
- Peadiatrics
- General Surgery
- General Medicine
- ENT
- Plastic & Cosmetic Surgery
- Infertility & Andrology
- Laparoscopic Surgery
- 24 Hrs. Laboratory
- Radiology
- Pharmacy
- Ultrasound
- Colour Doppler
- 2D Echo
- NICU
- SICU
- Painless Labour
- Physiotherapy
- Endourology (PCNL, URS)
- Gynaec Laparoscopy

- Environmental Reforestation Initiative of J.J.Hospital Website: www.jjprana.com
- 24 Hrs. Emergency Help Line No. Contact: 92463 33162 / 70138 24707
- Cash less Hospitalisation for health cards
- Recognised for State Government Employees & Families

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

ఎన్‌హెచ్‌-44లో ఎన్నాళ్లిలా?



- పాతబస్తీ నుంచి వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ తిప్పలు
- కార్యరూపం దాల్చని సిటీ కాలేజీ చౌరస్తా ఫ్లైఓవర్
- మూసీనదిలో స్కైవే నిర్మిస్తే.. ట్రాఫిక్‌కు చెక్
- ఛాదర్‌ఘాట్, ఎంజీబీఎస్, నయాపూల్, సిటీ కాలేజీ, పురానాపూల్ అప్-డౌన్ ర్యాంప్స్



చార్మినార్: పాతబస్తీ గుండా వెళ్లే జాతీయ రహదారి-44లో ట్రాఫిక్ ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ట్రాఫిక్ సమస్య నివారణకుగాను ఉద్దేశించిన ఫ్లైఓవర్లు నత్తకు నడక నేర్పుతున్నాయి. నయాపూల్-మదీనా సర్కిల్ నుంచి వెళ్లే బెంగళూర్ జాతీయ రహదారిలో ట్రాఫిక్ సమస్యలను నివారించడానికి ఇప్పటికే బహదూర్‌పురా చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ నిర్మించగా.. జూ పార్కు నుంచి ఆరాంఘర్ వరకు మరో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో ఉంది. ఇక సిటీ కాలేజీ చౌరస్తా నుంచి పురానాపూల్ దర్వాజా ద్వారా పురానాపూల్ హిందూ శ్మశాన వాటిక ఆవల బహదూర్‌పురా ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు మరో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. అయితే ఆ పనులు పలు సాంకేతిక కారణాలతో కార్యరూపం దాల్చ లేదు. మదీనా సర్కిల్ నుంచి ఆరాంఘర్ వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా భారీ వాహనాలతోసహా ట్రాఫిక్ సాఫీగా కొనసాగడానికి మూసీనదిలో స్కైవే ఒక్కటే చక్కటి మార్గమని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ అధికారులు భావిస్తున్నారు.

అఫ్జల్‌గంజ్ నుంచి మూసీ నది దాటితే...

అఫ్జల్‌గంజ్ నుంచి మూసీ నది దాటి నయాపూల్‌కు అడుగు పెడితే చాలు.. వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో నరకాన్ని చవి చూడాల్సి వస్తోంది. అసలే బాటిల్ నెక్ రోడ్లు.. దీనికి తోడు అడ్డదిడ్డంగా పార్కింగ్.. ఎవరు ఎటువైపు వెళుతున్నారో తెలియని అయోమయ పరిస్థితులు ఉన్నాయి. బెంగుళూర్ జాతీయ రహదారి- 44పైనే శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటంతో నయాపూల్, మదీనా సర్కిల్ ద్వారానే వాహనాలు వెళ్లాల్సి ఉంది.

జూపార్కు-ఆరాంఘర్ ఫ్లై ఓవర్..

జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు జీహెచ్‌ఎంసీ దాదాపు 4.08 కిలో మీటర్ల అతిపెద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. దీనిని 2023 మార్చి నాటికి పూర్తిచేయాల్సి ఉండగా, ఇంకా పనులు కొనసాగుతున్నాయి. 6 డౌన్ ర్యాంప్స్ తోపాటు 8 అప్ ర్యాంప్స్‌తో నిర్మాణం జరుగుతోంది. దీనికిగాను మొత్తం 163 ప్రాపర్టీలను స్వాధీనం చేసుకోవడానికి రూ.336 కోట్లు ఖర్చు చేసింది. రూ.300 కోట్లతో ఆరులేన్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

మూసీనదిలో స్కై వే...

మూసీ నదిలో స్కై వే నిర్మాణం చేపడితేనే బావుంటుందని ఇంజనీరింగ్ నిపుణులు అంటున్నారు. స్కై వే నిర్మాణమే ఎన్‌హెచ్-44కు సరైన మార్గమంటున్నారు. మూసారంబాగ్ నుంచి పురానాపూల్ వరకు స్కై వే నిర్మాణాన్ని చేపట్టి ఛాదర్‌ఘాట్, ఎంజీబీఎస్, నయాపూల్, సిటీ కాలేజీ, పురానాపూల్ తదితర ప్రాంతాల వారి సౌకర్యార్థం అప్ అండ్ డౌన్ ర్యాంప్స్ ఏర్పాటు చేయవచ్చంటున్నారు. ఇది మూసీ నదిలో దాదాపు 8 కిలో మీటర్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సిటీ కాలేజీ చౌరస్తా వద్ద...

సిటీ కాలేజీ చౌరస్తా. ఇది పాతబస్తీ నుంచి వెళ్లే ఎన్‌హెచ్-44 రోడ్డుకు కీలకం. ఇక్కడి నుంచి బహదూర్‌పురా ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు మరో ఫ్లై ఓవర్ నిర్మించాల్సి ఉంది. అయితే ఈ రోడ్డులో వివాదాస్పదంగా మారే ప్రాపర్టీస్ అధికంగా ఉన్నాయి. అదేవిధంగా పురానాపూల్ హిందూ శ్మశాన వాటిక వద్ద రోడ్డు బాటిల్ నెక్‌గా ఉండటంతో అధికారులు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది.

స్కై వే నిర్మించాలి

పాతబస్తీ మదీనా నుంచి ఆరాంఘర్ ద్వారా వెళ్లే బెంగుళూర్ జాతీయ రహదారి ఎన్‌హెచ్-44 రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తగ్గాలంటే మూసీనదిలో స్కై వే తప్పనిసరిగా నిర్మించాలి. ఇంజనీరింగ్ నిపుణులు కూడా అదే చెబుతున్నారు. - మహ్మద్ అంజద్, పురానాపూల్ కోకాకీ తట్టి



ప్రత్యామ్నాయం అవసరం

మదీనా సర్కిల్ నుంచి హైకోర్టు రోడ్డు ద్వారా సిటీ కాలేజీ, పురానాపూల్ దర్వాజ వరకు ఉన్న రోడ్డు బాటిల్ నెక్‌గా ఉంటుంది. ఈ ఇరుకు ఇరుకు రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణ కొరవడింది. మదీనా సర్కిల్‌లో తప్ప బహదూర్‌పురా చౌరస్తా వరకు ఎక్కడా ట్రాఫిక్ సిగ్నల్స్ లేవు. ఈ రూట్‌లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అవసరం. - కె. సుదర్శన్, దూద్‌బౌలి



డిసెంబర్ కల్లా అందుబాటులోకి...

జూ పార్కు నుంచి ఆరాంఘర్ వరకు నిర్మిస్తున్న 4 కిలో మీటర్లకు పైగా ఉన్న ఫ్లై ఓవర్ డిసెంబర్ నాటికి అందుబాటులోకి వస్తుంది. సిటీ కాలేజీ చౌరస్తా నుంచి బహదూర్‌పురా ఫ్లై ఓవర్ వరకు నిర్మించాల్సిన బ్రిడ్జీ పలు సాంకేతిక సమస్యలతో రూపుదాల్చ లేదు. - దత్తు పంతు, ఎస్ఈ, జీహెచ్‌ఎంసీ



హైదరాబాద్ బోట్ క్లబ్ నూతన కార్యవర్గం


చెన్నాడి సుధాకర్ రావు (అధ్యక్షుడు)


టి.అమరేందర్‌రెడ్డి (సెక్రెటరీ)


ఎ.మురళీధర్‌రెడ్డి (వైస్ ప్రెసిడెంట్)

సాక్షి సిటీబ్యూరో: హైదరాబాద్ బోట్ క్లబ్ నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎనిమిదోసారి అధ్యక్ష, కార్యదర్శులుగా మాజీ ఎమ్మెల్సీ, చెన్నాడి సుధాకర్‌రావు, టి.అమరేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.మురళీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల గురించి ప్రజలను చైతన్యవంతులను చేయడంతోపాటు మురికివాడల్లో హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాల క్లబ్బులతో ఒప్పందం కుదుర్చుకున్నామని, వాటిల్లోని 59 క్లబ్‌లలోని సౌకర్యాలను తమ సభ్యులు పొందవచ్చని పేర్కొన్నారు. 2024-26 సంవత్సరానికిగాను ఎన్నికైన ఈ నూతన కమిటీని ఈ సందర్భంగా ప్రకటించారు. జాయింట్ సెక్రటరీగా బి.నరేందర్ రావు, కోశాధికారిగా కె.ధరణీధర్, బోట్ క్లబ్ మీటింగ్ కమిటీ మెంబర్స్‌గా హెచ్‌వీ సురేందర్ నాథ్, సోమ విజయ్‌ప్రకాష్, శేషగిరిరావు తుమ్మల, టి.శ్రీధర్‌రెడ్డి, వి.సుధీర్‌రెడ్డి, వి.విజయ్‌గోపాల్ రావు ఎన్నికైనట్లు ప్రకటించారు.

వర్గీకరణకు చంద్రబాబు మద్దతు తగదు


మాలమహానాడు సమావేశానికి హాజరైన నాయకులు

మల్కాజిగిరి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఏపీ సీఎం చంద్రబాబు మద్దతు ఉపసంహరించుకోవాలని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి అన్నారు. నేరేడ్‌మెట్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు వైఖరిని మార్చుకోకుంటే ఏపీలోని మాలలు టీడీపీకి మద్దతు ఇవ్వొద్దని కోరారు. తెలంగాణలో మద్దతు ప్రకటించి టీడీపీ నామరూపాలు లేకుండా పోయిందని, అదే గతి ఏపీలో కూడా పడుతుందన్నారు. సమావేశంలో నాయకులు బిక్షం నరహరి, సాదు పరమేష్, మూర్తి, జాషువా, అశుతోష్, సుస్మిత, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రైడ్ మార్చ్



సాక్షి, సిటీబ్యూరో: స్వలింగ సంపర్కుల హక్కులకు మద్దతుగా ముబ్బైరా ఫౌండేషన్‌భాగస్వామ్యంతో మాదాపూర్‌లోని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ సింక్రోనీ క్వీర్ ఫియస్టాను ప్రైడ్ మార్చ్ పేరిట సందడిగా నిర్వహించింది. విధుల నిర్వహణతోపాటు సమానత్వం, పరస్పర గౌరవం ఇవ్వాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ సాగిన ఈ ప్రైడ్ మార్చ్‌లో హైదరాబాద్‌లోని యు.ఎస్. కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడారు. సమాజంలో ప్రతీ ఒక్కరికీ గౌరవం, సమాన హక్కులు అందే దిశగా ఈ తరహా ఈవెంట్లు మరిన్ని జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సింక్రోనీ ప్రొడక్ట్ మేనేజర్, ప్రైడ్ ఈఆర్‌జీ ఇండియా లీడ్ నిర్మల్ మాత్రేజా తదితరులు పాల్గొన్నారు.

‘ధన్వంతరి’ భారీ మోసం

కోట్లాది రూపాయలు మోసం చేసిందని బాధితుల ఆరోపణ

హిమాయత్‌నగర్: ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ పేరుతో బ్రాహ్మణులకు భూములు, అగ్రహారాలు ఆశ చూపి వేల కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేశారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు కమలాకరశర్మ, డాక్టర్ జయశ్రీ దంపతులు బ్రాహ్మణ విద్యార్థుల కోసం కేవలం డాక్టర్ల చేత ఏర్పాటు చేసిన ఈ ట్రస్టులో భారీ అక్రమాలకు పాల్పడుతూ భ్రష్టుపట్టించారని వారు ఆరోపించారు. ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బాధితులతో కలిసి ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్ శర్మ మాట్లాడారు. గత 20 సంవత్సరాలు ధన్వంతరి ఫౌండేషన్ ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 3 లక్షల నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేశారని చెప్పారు. నిందితుడి పాస్‌పోర్ట్, ఆస్తులు అకౌంట్లు అన్ని సీజ్ చేయాలని కోరారు. ఈ కేసును సీబీసీఐడీ చేత విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ధన్వంతరి బాధితుల ఫోరం సభ్యులు దర్శనం శర్మ, (దర్శనం మాసపత్రిక ఎడిటర్), ఆత్రేయ శర్మ, వెలువలి రవిశర్మ, ఇందిరా, సుమతి, ఇతర బాధితులు పాల్గొన్నారు.

వ్యాపారంలోనూ సేవా దృక్పథం పెరగాలి

సాక్షి, సిటీబ్యూరో: వ్యాపార రంగంలో ఉన్న వారు సేవా దృక్పథాన్ని సైతం పెంచుకుంటే పేదలకు ప్రయోజనం చేకూరుతుందని కమ్మ మ్యాచ్ మేకింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మినేని ధనలక్ష్మి అన్నారు. ఆదివారం నగరంలోని కమ్మ సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన వధూవరుల పరిచయ వేదికలో మహిళలు ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు, చేనేత వృత్తి కళాకారులకు సహకారం అందించేందుకు తాము ఏర్పాటు చేసిన వేదికలో ఉచితంగా స్టాల్స్ ఏర్పాటు చేసి ఇచ్చినట్లు తెలిపారు. ఇక్కడి వధూవరుల వేదికకి హాజరయ్యే వారు ఈ స్టాల్స్ లో వివిధ రకాల ఉత్పత్తులు కొనుగోలు చేయడం ద్వారా పలువురు స్వయం సంఘాల మహిళలకి చేయూతని అందించినట్టు తెలిపారు. కమ్మ మ్యాచ్ మేకింగ్ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన వధూవరుల పరిచయ వేదికకి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు తల్లిదండ్రులు హాజరయ్యారని, సుమారు 500 మంది పాల్గొన్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సౌజన్య, మాధవి, సుజాత, రామలక్ష్మి, రుద్రమదేవి, అనురాధ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ ఆదివారం ఆబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ప్రారంభమైంది. మంగళవారం వరకు 3 రోజులు జరిగే ఈ టోర్నీని భారత టీటీ సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు పి.ప్రకాశ్ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టేబుల్ టెన్నిస్ సంఘం ప్రతినిధులు, స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ షాజన్ ఆంటోనీ, బ్రదర్ అపోలియా డిసోజా, బ్రదర్ బాలశౌరి పాల్గొన్నారు.

వీసీల నియామకాలపై కోదండరాం జోక్యం చేసుకోవాలి


బారి అశోక్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని పది యూనివర్సిటీల వైస్ చాన్సలర్ల నియామకాలపై టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ.కోదండరాం జోక్యం చేసుకోవాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్(టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. వీసీల పదవీ కాలం ముగిసి రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు కొత్తవారిని నియమించకపోవడంతో యూనివర్సిటీ పాలన అస్తవ్యస్తంగా మారిందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలు, ఫలితాలు, ప్రవేశాలు జరిగే తరుణంలో శాశ్వత వీసీలు లేనందున 2024-25 విద్యా సంవత్సరం ఆలస్యమవుతోందన్నారు. వెంటనే వీసీలను నియమించేలా సీఎం రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

స్పెల్ బీ పోటీల్లో అచ్యుతరెడ్డికి గోల్డ్ మెడల్



బోడుప్పల్: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన స్పెల్ బీ పోటీల్లో బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థిని ముదిరెడ్డి అచ్యుతరెడ్డి గోల్డ్ మెడల్ సాధించింది. 2023-24 సంవత్సరానికిగాను నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర మొత్తం మీద 24వ ర్యాంక్ సాధించి గోల్డ్ మెడల్ దక్కించుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ రితేష్ బూరెవాలే వెల్లడించారు. అచ్యుతరెడ్డిని ప్రిన్సిపాల్ కస్తూరి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ముగిసిన ఆన్‌లైన్ గేమింగ్

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ గేమింగ్ (గ్లోబల్ ఎస్పోర్ట్స్) ఆదివారం ముగిసింది. భారతదేశపు షూటర్, ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా చివరిరోజు హాజరై విజేతలను అభినందించారు.

గెలిచిన జట్లు ఇవీ..

ప్రథమ స్థానం దక్కించుకున్న జట్టు ఎక్స్‌పార్క్ రూ. 60,00,000, ద్వితీయ స్థానం గ్లోబల్ ఎస్పోర్ట్స్ రూ. 30 లక్షలు, తృతీయ స్థానంలో ఈస్పోర్ట్స్ రూ. 20 లక్షలుగా గెలుచుకున్నాయి. మొత్తం రూ.2 కోట్ల ప్రైజ్‌లలో మూడు రోజులలో 16 చివరి జట్లు 18 మ్యాచ్‌లను ఆడారు. రూ.25 లక్షలను అభినవ్ బింద్రా ఫౌండేషన్‌కు విరాళంగా అందించారు.

అంతర్జాతీయశక్తుల కుట్రలను తిప్పికొట్టాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

కాచిగూడ: దేశంలో ఎన్డీయేకు వ్యతిరేకంగా, దేశానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ శక్తులు చాపకింద నీరులాగా పనిచేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం ముఖ్యనాయకులు, పోలింగ్ బూత్ అధ్యక్షులు, కో ఆర్డినేటర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీని ప్రపంచంలోని వివిధ దేశాధినేతలు ఆదరిస్తున్నారని, దీన్ని రాజకీయంగా జీర్ణించుకోలేని కొన్ని శక్తులు కుట్రలకు తెరలేపాయన్నారు. వికసిత్ భారత్‌గా మన దేశాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత హ్యాట్రిక్ ప్రధానిగా పదవి అలంకరించిన ఘనత నరేంద్రమోదీదేనని అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ గెలవడంలో అంబర్‌పేట నియోజకవర్గం కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందేందుకు తనవంతు కృషి చేస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, మాజీమంత్రి సి.కృష్ణయాదవ్, నాయకులు సి.నందకిషోర్ యాదవ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, శ్యామ్‌రాజ్, ఎ.అజయ్‌కుమార్, అనంద్ గౌడ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఆదివారం ముచ్చింతల్‌లోని సమతామూర్తిని సందర్శించారు. సుమారు మూడు గంటలపాటు ఆయన సమతామూర్తి సన్నిధిలో గడిపారు. స్వర్ణ రామానుజుల వారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం తీసుకుని శ్రీ చినజీయర్ స్వామిని కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.
శంషాబాద్

శెభాష్ వర్ణిక..!

అమెజాన్ సేల్స్‌కు నైన్త్ క్లాస్ విద్యార్థి పుస్తకం



సనత్‌నగర్: వర్ణిక రాసిన పుస్తకం గురించి తెలిస్తే ఎవరైనా ఆమె ప్రతిభను పలు విధాలుగా వర్ణించక మానరు. బేగంపేటకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వర్ణిక పారక్ రాసిన ‘వెన్ ఫీలింగ్ ఫైన్స్ వర్డ్స్’ పుస్తకానికి అరుదైన గౌరవం లభించింది. తన జీవితంలో ఎదురైన అనుభావాల సమ్మేళనంగా సాగిన అంశాలను, ఆలోచనలను, భావాలను పదాల రూపంలో పొందుపరిచిన తీరు అబ్బురపరిచింది. వర్ణిక తొలిసారిగా రాసిన ఈ పుస్తకానికి ఇటీవల ఆన్‌లైన్‌లో జరిగిన పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. దీంతో అమెజాన్ సంస్థ దీన్ని ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టినట్లు వర్ణిక పారక్ ఆదివారం బేగంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపింది. దీనికి విశేష ఆదరణ లభిస్తోందని చెప్పింది. బోల్డన్ పాఠశాలలో వర్ణిక తొమ్మిదో తరగతి చదువుతోంది.

పేదలసేవే జీవ‘నాడి’గా..

పుట్టిన ఊరంటే ఆయనకు పుట్టెడు ప్రేమ. పేదలకు సేవ అందిస్తూ పెద్ద మనసు చాటుకుంటున్నారు. ఒకవైపు రోగుల నాడి పడుతూ మరోవైపు పల్లెల్లో సేవ చేస్తూ ఆదర్శంగా నిలిచారు డాక్టర్ కటకం భూమేష్ కుమార్. సోమవారం వైద్యుల దినోత్సవం సందర్భంగా స్ఫూర్తిదాయకమైన ఆయన వైద్య, సామాజిక సేవలు గురించిన ప్రత్యేక కథనం ఇది. - గాంధీఆస్పత్రి

- పల్లె రుణం తీర్చుకుంటున్న డాక్టర్ కటకం భూమేష్ కుమార్
- ఉచిత వైద్య శిబిరాలు, ఉత్తమ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు
- అంచెలంచెలుగా ఎదుగుతూ గిన్నిస్ రికార్డు సాధన




స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న భూమేష్‌కుమార్, లక్ష్మీ దంపతులు

సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో డెర్మటాలజీ స్పెషలిస్టుగా ఆయనకు మంచి పేరు ఉంది. వ్యవసాయ కుటుంబానికి చెందిన భూమేష్ కుమార్ చిన్నప్పుడు తన ఊరికి ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న గుత్ప గ్రామంలోని స్కూలుకు నడుచుకుంటూ వెళ్లి చదువుకున్నారు. కష్టనష్టాలను ఓర్చుకుంటూ వైద్యవిద్య పూర్తి చేశారు. పల్లెటూరు నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ గిన్నిస్ రికార్డు సాధన వరకు అలుపెరగని పోరాటం చేసి ఆదర్శంగా నిలిచారు. నిజామాబాద్ జిల్లా అలూరు నియోజకవర్గంలోని రామచంద్రపల్లి ఆయన స్వస్థలం. తల్లిదండ్రులు కటకం పెద్ద వెంకన్న, గంగుబాయి. అయితే తన బాబాయ్ చిన్న సాయన్న ఆయనను దత్తత తీసుకున్నారు.

చర్మవ్యాధుల అవగాహనపై గిన్నిస్ రికార్డు

దేశవ్యాప్తంగా చర్మవ్యాధులపై అవగాహన కల్పించే కార్యక్రమంలో ఐఏడీవీఎల్ తరఫున భూమేష్ కుమార్ గిన్నిస్ రికార్డు సాధించారు. ఈ ఏడాది మే 5వ తేదీన దేశవ్యాప్తంగా 9,405 ప్రాంతాల్లో చర్మవ్యాధుల నివారణ అంశంపై ప్రతిజ్ఞ చేయించినందుకు ఈ అవార్డు దక్కింది. కరోనా పాండమిక్ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులకు పీపీ కిట్లు, మాస్కులు, శానిటైజర్లు, ఆక్సిజన్ సిలిండర్లు పంపిణీ చేశారు.

25 ఏళ్లుగా సామాజిక సేవలో...

1999లో గాంధీ మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్‌లో చేరిన భూమేష్‌కుమార్ ఎండీ, డెర్మటాలజీ చైల్డ్ స్పెషలైజేషన్ కూడా ఇక్కడే చేశారు. ఇండియన్ డెర్మటాలజీ, వెనిరాలజీ, లెప్రసీ అసోసియేషన్ (ఐఏడీవీఎల్)లో పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించి ప్రస్తుతం హానరరీ సెక్రటరీ జనరల్‌గా కొనసాగుతున్నారు. ఐఏడీవీఎల్ తరఫున దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చర్మవ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏడాదికి రెండుమార్లు సొంత గ్రామమైన రామచంద్రాపల్లి, గుత్ప, జక్రాన్‌పల్లిలతోపాటు మారుమూల ప్రాంతాలు, గిరిజన తండాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఉత్తమ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ భూమేష్ కుమార్ చురుకైన పాత్ర పోషించారు. ఉద్యమానికి ఆయన అందించిన చేయూతను మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల మన్ననలు పొందారు.



సామాజికసేవలోనే సంతృప్తి

సామాజిక సేవలోనే అంతులేని సంతృప్తి ఉంది. గత రెండున్నర దశాబ్దాలుగా నిరుపేదలకు వైద్యంతోపాటు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. చర్మవ్యాధుల నిర్మూలన, నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక వైద్య విధానాలు వంటి అంశాలపై నేను చేసిన పలు పరిశోధనలు మెడికల్ జర్నల్స్‌లో పబ్లిష్ అయ్యాయి. భార్య లక్ష్మి, కుమారులు సాయిచరణ్, అభిలాష్‌లతో పాటు వైద్య ఉన్నతాధికారులు, మిత్రులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివి.
- భూమేష్‌కుమార్

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, సోమవారం, 1, జూలై, 2024

వారికోసమే నటించా...

ప్రభాస్‌తో పోటీ కాదు.. నాదొక పాత్ర మాత్రమే..

నాగ్, ప్రభాస్ అంటే చాలా ఇష్టం

కల్కితో తెలుగు సినిమా దిశ మారింది

'సాక్షి'తో విజయ్ దేవరకొండ



నాగీ (దర్శకులు నాగ్ అశ్విన్), ప్రభాస్‌ల కోసమే కల్కి సినిమాలో నటించానని.. ఆ ఇద్దరంటే తనకెంతో ఇష్టమని ప్రముఖ సినీనటుడు విజయ్ దేవరకొండ తెలిపారు. ఓ ప్రయివేటు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్.. ఇటీవల విడుదలైన కల్కి సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కల్కి సినిమాతో భారతీయ సినిమాను, ముఖ్యంగా తెలుగు సినిమాను ఎక్కడికో తీసుకెళ్లగలిగామని సంతోషాన్ని వ్యక్తం చేశారు. సినిమా చూస్తూ ఎమోషనల్‌కు లోనయ్యానన్నారు. 'కల్కిలో ప్రభాస్ గొప్పనా, నేను గొప్పనా అనే వాదనలు కాదు... నాగ్ అశ్విన్ సృష్టించిన వినూత్న ప్రపంచంలో తామొక పాత్రలమేనని' వివరించారు. వైజయంతి సంస్థతోనే తన ప్రయాణం మొదలైందని, ఎప్పుడు అడిగినా వారి సినిమాల్లో నటిస్తానన్నారు. నాగ్ ప్రతి సినిమాలో నటిస్తూ లక్కీ చార్మ్‌గా మారారనే ప్రశ్నకు సమాధానంగా.. నాగ్ దర్శకత్వంలో తను అతిథి పాత్రలు పోషించిన మహానటి, కల్కి సినిమాలు బాగున్నాయి కాబట్టే హిట్ అవుతున్నాయని, ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని మరోసారి తన సింప్లిసిటీని నిరూపించుకున్నారు. కల్కి పార్ట్-2లో మీ పాత్ర మరింతగా ఉంటుందని నిర్మాత అశ్వినీదత్ ఓ సమావేశంలో అన్నారనే మరో ప్రశ్నకు సమాధానంగా.. అశ్వినీదత్ అంటే అది కరెక్టేనని సినీ ప్రియులకు హింట్ ఇచ్చారు.

డిజిటల్ బ్యాక్ ప్యాక్



ఇరుకైన రద్దీ ప్రదేశాల్లోనూ క్యాంపెయిన్

చిరువ్యాపారులు, క్లినిక్‌ల కోసం ప్రత్యేకం

వినూత్న పద్ధతిలో వ్యాపార ప్రకటనల ప్రచారం



మార్కెట్లో వ్యాపార ప్రకటనలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. భారీ హోర్డింగ్‌లు, కళ్లు చెదిరే రంగుల్లో కన్పించే దృశ్యాలతో ఆకట్టుకునే వ్యాపార ప్రకటనలు తాజాగా హ్యూమన్ మొబైల్ హోర్డింగ్స్ దర్శనమిస్తున్నాయి. ఎల్ఈడీ స్క్రీన్‌ను వీపుపై ధరించి ఆయా వ్యాపార ప్రకటనలను ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏదైనా ఉత్పత్తి సంస్థ కానీ, షాపింగ్ మాల్, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల వినియోగదారులను ఆకర్షించేందుకు భారీ హోర్డింగ్స్ ఉండేవి.. అయితే వీటితోపాటు ప్రస్తుతం నగరంలో ఓ నయా ట్రెండ్ నడుస్తోంది. అదే బ్యాక్ ప్యాక్.

నగరానికి చెందిన బొల్లం ప్రజ్వల్ కొంత భిన్నంగా ఆలోచించారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా పూర్తిచేశారు. డిజిటల్ అడ్వర్టైజింగ్, యానిమేషన్ రంగంలో విశేష అనుభవం సాధించారు. ఆర్థిక స్థోమత అంతగా లేని చిరువ్యాపారులు, చిన్న చిన్న క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్స్‌కు ప్రచారం కల్పించేందుకు వీలుగా 'డిజిటల్ అడ్వర్టైజింగ్ బ్యాక్ ప్యాక్' సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పర్యాటక ప్రదేశాలు, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన రహదారులు, షాపింగ్‌మాల్స్, ఇతర సందర్శనీయ ప్రదేశాల్లో తమ ఉత్పత్తులకు ప్రచారం కల్పించుకునేందుకు వీలుగా దీన్ని రూపొందించారు.

తక్కువ ఖర్చుతో...

చాలా తక్కువ ఖర్చుతో (రూ.15000) దీన్ని తయారు చేశారు. 24 ఇంచుల ఎల్ఈడీ టీవీకి వీడియోలు అప్‌లోడ్ చేసిన పెన్ డ్రైవ్‌ను అనుసంధానించారు. సాయంత్రం చీకటి పడిన తర్వాత రద్దీ ప్రదేశాల్లో నడుచుకుంటూ వెళ్తూ, కొనుగోలుదారుల దృష్టిని ఆకర్షించే విధంగా దీన్ని తయారు చేశారు. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్ ఒకే చోట ఉంటుంది. అటు వైపు వెళ్లే వారు మాత్రమే దీన్ని చూసే అవకాశం ఉంటుంది. అదే ఈ 'డిజిటల్ అడ్వర్టైజింగ్ బ్యాక్ ప్యాక్' ఏకకాలంలో వేలాది మంది దృష్టిని ఆకర్షించనుంది.

నిరుద్యోగ యువత కోసం..

ఈ తరహా ప్రచారం ఇప్పటికే విదేశాల్లో ఉంది. తాజాగా నగరవాసులకు దీన్ని పరిచయం చేశారు ప్రజ్వల్. ఒక్క రోజుకు అడ్వర్టైజింగ్ చేసినందుకు టారీఫ్ రూ.1500 గా నిర్ణయించినట్లు ప్రజ్వల్ తెలిపారు. నిరుద్యోగ యువతకు ఇది ఉపాధి కల్పించనుందని తెలిపారు.




మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నప్పటికీ కొందరు మహిళలు వివిధ కారణాల రీత్యా ఇంటిగడప దాటలేని పరిస్థితి. కానీ ఏదో ఒక్కటి చేసి కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలని పరితపిస్తూ ఉంటారు. ముఖ్యంగా తమకు తెలిసిన వంటలతో ఎంతో కొంత ఆదాయాన్ని పొందాలని ఎందరో ఆలోచిస్తుంటారు. కానీ వాటిని ఎక్కడ? ఎలా? అమ్మాలో తెలియక సతమతమవుతూ ఉంటారు. అటువంటి మహిళలకు మేము ప్రోత్సాహం అందిస్తామంటూ నాలుగు సంవత్సరాల క్రితం ముందుకొచ్చిన సంస్థే షీరో హోమ్ ఫుడ్స్. దీని పనేంటి? మహిళలకు ఏ విధంగా అండగా నిలుస్తుంది? ఎలాంటి మెళకువలు నేర్పిస్తుంది? తెలుసుకుందాం.. - కాచిగూడ

హోమ్ ఫుడ్స్‌లో.. షీరో..



ఇంటి భోజనానికి పెరుగుతున్న ప్రాధాన్యం

పెట్టుబడి లేకుండా...



షీరో హోమ్ ఫుడ్స్ సంస్థ ప్రస్తుతం రెండు మోడల్స్‌గా వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. పెట్టుబడి లేకుండా ఇంట్లో వుండే స్టవ్, గిన్నెలతో వ్యాపారాన్ని ప్రారంభించే విధానం ఒకటి. ఈ మోడల్‌లో రూ.10 వేల నుంచి లక్ష వరకూ సంపాదించవచ్చు. కొద్దిపాటి పెట్టుబడితో నలుగురు లేదా ఐదుగురు మహిళలు కలిసి ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కమ్యూనిటీ కిచెన్‌ని ప్రారంభించి సంపూర్ణ వ్యాపార మోడల్ మరొకటి. సంపూర్ణ వ్యాపార మోడల్లో రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకూ ఆదాయం పొందే అవకాశం ఉంది. ఈ వ్యాపారం పట్ల ఆసక్తి ఉన్నవారికి ముందుగా ఓ సెమినార్ నిర్వహించి వ్యాపార నమూనాను వివరిస్తారు. తాము ఇందులో వ్యాపారం చేయగలం అని ముందుకొచ్చిన మహిళా మణులకు షీరో కుటుంబంలో భాగస్వామ్యాన్ని కల్పిస్తోంది.

ఆన్‌లైన్‌లో అమ్మకాల జోష్

లక్షలు సంపాదిస్తున్న మహిళలు

స్వయం ఉపాధిగా శిక్షణా తరగతులు

షీరో హోమ్ ఫుడ్స్ కొత్త ప్రయత్నం

వంటగది నుంచే వ్యాపారం



తమ వంట గది నుండే మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించేలా షీరో హోమ్ ఫుడ్ సంస్థ ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ప్రతి మహిళ తాము చేసే వంట రుచికరంగా ఉండాలనే తపన పడుతుంది. అయితే వారు చేసే వంట అమీర్‌పేటలో చేసినా, అనకాపల్లిలో చేసినా, అమెరికాలో చేసినా ఒకే రంగు.. ఒకే రుచితో పాటు.. ఒకేలా కనబడేలా ఉండేందుకు అన్ని రకాల వంటకాలకూ షీరో హోమ్ ఫుడ్స్ ఉచిత శిక్షణను అందిస్తోంది. దీంతో మహిళలు ప్రతి నెలా ఆయా ప్రాంతాన్ని బట్టి రూ.10వేల నుండి లక్ష రూపాయల పైబడి సంపాదిస్తున్నారు.

చెన్నై కేంద్రంగా ప్రారంభం

ప్రపంచ వ్యాప్తంగా కరోన వైరస్ విస్తరిస్తున్న సమయంలో ప్రజలకు ఆన్‌లైన్ ద్వారా మంచి ఆహారం అందించాలన్న ఉద్దేశంతో తిలక్ వెంకటస్వామి, జయశ్రీ తిలక్ దంపతులు చెన్నైలో 2019లో షీరో హోమ్ ఫుడ్స్ సంస్థను ప్రారంభించారు. మహిళలు తమకు తెలిసిన వంట నైపుణ్యానికి షీరో సంస్థ అందించే మెళకువలను జోడించి దక్షిణ, ఉత్తరాది వంటకాలను రుచికరంగా, శుచికరంగా తయారు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నారు.



అందుబాటులో అనేక వంటకాలు

తెలుగు వంటకాలే కాకుండా తమిళనాడు, కేరళ, ఉత్తరాది రుచులతో 150 రకాలకు పైగా వంటలను అవలీలగా నిర్ణీత సమయంలో చేసేలా తర్ఫీదుని ఇస్తోంది. అంతే కాకుండా వారు చేసిన వంటకాలని తమ వెబ్‌సైట్, యాప్‌తో పాటు స్విగ్గీ, జొమాటో, వాయు, ఓఎన్‌డీసీ వంటి అనేక ఫుడ్ డెలివరీ పార్టనర్స్‌తో భాగస్వామ్యాన్ని కల్పించి, చక్కని ఆదాయాన్ని పొందేలా షీరో హోమ్ ఫుడ్స్ మహిళా సాధికారతకు కృషి చేస్తోంది. పప్పు, పచ్చడి, సాంబారు వంటి ఇంటి భోజన వంటకాలనే కాకుండా, వారు నిష్ణాతులుగా ఉన్న తినుబండారాలు, ఇతర అనేక వంటకాలు ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా విక్రయించుకుని స్థిరమైన ఆదాయాన్ని ఆర్జించేలా చేస్తోంది.

ఉచిత సెమినార్ వివరాలు..



ఆసక్తి గల మహిళలు ఉచిత సెమినార్‌లో పాల్గొనేందుకు సెల్ : 6309527444లో తమ పేరు, ఏరియా, సిటీని వాట్సాప్ చేస్తే ఏ తేదీల్లో సెమినార్‌లో పాల్గొనాలో తెలియజేస్తామని ఆ సంస్థ కన్వీనర్ విజయ్ వర్మ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని జిల్లా ప్రధాన నగరాల మొదలు హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లో ఈ కిచెన్‌ని ప్రారంభించి మహిళలు స్వయం ఉపాధికి బాటలు వేసుకోవచ్చు.

స్వయంశక్తితో ఎదుగుతున్న మహిళలు

షీరోలో చేరి ఎందరో మహిళలు తమ స్వయం శక్తితో పిల్లల్ని చదివించుకోగలుగుతున్నారు. పిల్లల ఫంక్షన్లు గర్వంగా చేసుకుంటున్నారు. దీంతోపాటు భర్తలకు చేదోడు వాదోడుగా ఉండగలిగే స్థాయిలో నిలుస్తున్నారు. నలుగురిలో తాము భిన్నమని నిరూపిస్తూ గర్వపడుతున్నారు. మా ఇంట్లో నాన్న హీరో అయితే అమ్మ షీరో అని పిల్లలు తలెత్తుకుని చెప్పేలా చేస్తున్నారు. ఇప్పటికే రెండు వేల మంది మహిళలకు చేయూతగా నిలిచిన షీరో హోమ్ ఫుడ్స్ సంస్థ కొద్ది సంవత్సరాల్లోనే పది లక్షల మంది మహిళలకు చేయూతగా నిలవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

నగరంలో తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యాలయం..



హైదరాబాద్, మెహిదీపట్నం, రేతిబౌలిలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యాలయం ఉంది. ప్రతి వారం మహిళలకు వంటలపై ఉచితంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. వ్యాపార మెళకువలపై అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్‌లో 100 కిచెన్ పార్టనర్స్ ఉండగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 300 మంది కిచెన్ పార్టనర్స్ ఉన్నారు. తెలుగు రాష్ట్రాల మాస్టర్ ఫ్రాంచైజ్ ఓనర్‌గా సువర్ణదేవి పాకలపాటి ఉంటూ మహిళల అభ్యున్నతే ధ్యేయంగా అహర్నిశలూ శ్రమిస్తున్నారు.

ల్యాండ్ మార్క్ చెట్లు



భరతమాత కూడలిగా ఉన్న మర్రిచెట్టు కూడలి..



బటర్‌ఫ్లై కూడలిగా ఉన్న చింతచెట్టు కూడలి..

ఒక్కో గ్రామంలో ఒక్కో భవనం, విగ్రహాలు, చౌరస్తాలు, బావులు లాండ్ మార్క్‌గా నిలవటం సహజం. కానీ రెండు చెట్లు ఈ ప్రాంతంలో దశాబ్దాల కాలం పాటు ల్యాండ్ మార్క్‌గా నిలుస్తున్నాయి. ఈ ప్రాంతం అభివృద్ధి చెందే క్రమం నుంచి ఇప్పటికీ అవి అలాగే కొనసాగుతున్నాయి. వాటి చుట్టు పక్కల మరో ల్యాండ్ మార్క్ ఏర్పాటు చేసినా ప్రజలు వాటిని గుర్తించలేక పాత వాటితోనే పిలుస్తున్నారంటే ప్రజల్లో ఎంతలా నాటుకు పోయాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఆ చెట్లేంటి? వాటి కథేంటి? తెలుసుకుందాం.. - మణికొండ

ఏదైనా కొత్త ప్రాంతానికి వెళ్లాలన్నా.. ఎవరికైనా అడ్రస్ చెప్పాలన్నా.. ముందుగా ఆ ప్రాంతం పేరుతోపాటు అక్కడ ప్రాచుర్యం పొందిన ల్యాండ్ మార్క్ చెప్పడం పరిపాటి.. అయితే అభివృద్ధి చెందే క్రమంలో కొన్ని పేర్లు మారుతుంటాయి.. మరికొన్ని ఏళ్ల తరబడి అవే గుర్తింపుగా మారుతుంటాయి.. అలాంటి గుర్తింపు పొందిన రెండు వృక్షాల కథే ఇది..పూర్తి వివరాల్లోకి వెళితే గతంలో మణికొండకు కొత్తగా వచ్చే వారు మీ ఇంటికి ఎలా రావాలి అంటే ముందుగా మర్రిచెట్టు వద్దకు వచ్చి ఎడమ వైపు, కుడి వైపు, నేరుగా ఇటువైపు రావాలని చిరునామా చెప్పే వారు. దాని కేంద్రంగానే మణికొండకు కొత్తగా వచ్చే వారు గమ్యస్థానాలను చేరేవారు. ఇదే మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ, నెక్నాంపూర్ వాసులు అలకాపూర్ టౌన్‌షిప్ ప్రవేశంలో ఉండే చింత చెట్టును కేంద్రంగా చేసుకుని చిరునామా చెప్పేవారు. అక్కడి నుంచి ఎడమ, కుడి, నేరుగా అనే రోడ్లతో వారి గమ్యస్థానాలకు చేరుకునే వారు. ఆ తరువాతి క్రమంలో గూగుల్ మ్యాప్‌లు, లొకేషన్ పాయింట్లు వచ్చి వాటి ఆదారంగా కొత్త వారు గమ్యస్థానాలను చేరుకుంటున్నా వీటి గుర్తింపు ఏమాత్రం చెక్కు చెదరలేదు. వాటిలో ముందుగా మణికొండ మర్రిచెట్టు, పుప్పాలగూడ, నెక్నాంపూర్ చింతచెట్టు అడ్రస్‌కి కేరాఫ్‌గా మారాయి.

మార్పులు చేసినా...

మణికొండ మర్రిచెట్టు కూడలికి కాల క్రమంలో పేరు మార్చాలనే ఉద్దేశంతో ఓ సంస్థ దాని కింద భరతమాత విగ్రహాన్ని నెలకొల్పింది. అప్పటి నుంచి దాన్ని భరతమాత కూడలిగా పిలవాలని ప్రకటించారు. అది ఏమాత్రం ప్రజల్లోకి ఎక్కకుండా అదే మర్రిచెట్టు కూడలిగానే ప్రసిద్ధి చెందుతోంది. ఇదే తరహాలో పుప్పాలగూడ, నెక్నాంపూర్ వాసులకు ల్యాండ్ మార్క్‌గా ఉన్న చింత చెట్టు పక్కనే మున్సిపాలిటీ నుంచి శోభాయమానంగా సీతాకోకచిలుకలు ఎగురుతున్నట్టుగా కూడలిని అభివృద్ధి చేశారు. దాన్ని బటర్‌ఫ్లై కూడలిగా నామకరణం చేసినా దాన్ని ఎవరూ పట్టించుకోవటం లేదు. అదే చింతచెట్టు సర్కిల్‌గానే దాని పేరు కొనసాగుతోంది. అదే రోడ్డులో అలకాపూర్ టౌన్‌షిప్‌లోకి నేరుగా వెళితే మూల మలుపు వద్ద ఏర్పాటు చేసిన యోగ సర్కిల్(సూర్యనమస్కారాల బొమ్మలు) మాత్రం ఇప్పుడిపుడే ప్రాచుర్యం పొందుతున్నాయి. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన మర్రిచెట్టు, చింతచెట్ల చరిత్ర అవి జీవించినంత కాలం కొనసాగుతుందని స్థానికులు భావిస్తున్నారు. మణికొండలోని అదే మర్రి చెట్టుపై కొత్తగా రావి చెట్టు, దాని కింద వేపచెట్టు పెరుగుతుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

వైజాగ్ వారియర్స్ టైటిల్ స్పాన్సర్స్ వీరే..

ప్రతిష్టాత్మక ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-24లో వైజాగ్ వారియర్స్ జట్టుకు 'ఫన్88 న్యూస్' టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనుందని జట్టు సహ యజమాని, లైఫ్‌స్పాన్ వ్యవస్థాపకుడు డాక్టర్ నరేంద్ర రామ్ ఓ ప్రకటనలో తెలిపారు. బీసీసీఐ గుర్తింపు పొందిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ స్థానిక క్రికెటర్లకు జాతీయ స్థాయి క్రీడా అవకాశాలను అందించడానికి విశేషంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. యువ ప్రతిభను పెంపొందించడంతో పాటు ఆటగాళ్లకు క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించడానికి వేదికను అందించడమే ఈ లీగ్ లక్ష్యమని అన్నారు.

VIZAG WARRIORS

క్లుప్తంగా...

టీమిండియాకు వైఎస్ జగన్ అభినందనలు



సాక్షి, అమరావతి: టీ20 ప్రపంచకప్ గెల్చుకున్న టీం ఇండియాకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. 'టీ20 ప్రపంచకప్‌లో చరిత్రాత్మక విజయం సాధించిన టీం ఇండియాకు అభినందనలు. మీ పట్టుదల, కృషి ఫలించాయి. ఇది ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ క్షణం. జైహింద్' అని ట్వీట్ చేశారు.

మూడు వారాల్లో 7 వేల కోట్ల అప్పులా?

- సంపద సృష్టించడం అంటే ఇదేనా చంద్రబాబూ?
- వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలన అంతా అప్పులమయమని విమర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు వారాల్లోనే రూ.7 వేల కోట్ల అప్పు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు చెబుతున్నట్లుగా సంపద సృష్టించడం అంటే అప్పులు చేయడమేనా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి మంగళవారం అప్పు లేనిదే గడవని పరిస్థితి నెలకొందని వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు ఇప్పుడు ఆయన చేస్తున్నదేంటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పేదలకు రూ.2.70 లక్షల కోట్లు డీబీటీతో నేరుగా అందచేసి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. రవిచంద్రారెడ్డి ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఒక్క పథకం అమలు చేయడానికే రూ.7 వేల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు మిగతా హామీలను నెరవేర్చాలంటే ఇంకెన్ని కోట్లు అప్పు చేయాల్సి ఉంటుందో రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై విచ్చలవిడిగా దాడులకు తెగబడుతున్నా సీఎం చంద్రబాబు ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఆయన ప్రోద్బలంతోనే దాడులు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తోందన్నారు. దివంగత వైఎస్సార్ విగ్రహాన్ని కాల్చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. తోపుడు బండికి బ్లూ రంగు ఉందనే అక్కసుతో చిరు వ్యాపారిపై దాడి చేయడం అత్యంత హేయమన్నారు. సీఎం చంద్రబాబు ఈ దురాగతాలకు అడ్డుకట్ట వేయకుంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్, శ్రీలంక మంత్రి విజయ్ దశ రాజపక్ష, మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వైద్యనాథన్ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్, సినీనటి ప్రియా ఆనంద్‌ఉన్నారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 80,404 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.83 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

6 నుంచి ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జూలై ఆరో తేదీ నుంచి ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఈవో కె.ఎస్.రామారావు ఆదివారం తెలిపారు. ఆగస్టు నాలుగో తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆషాఢంలో తెలుగు రాష్ట్రాల భక్తులు అమ్మవారికి సారెను సమర్పిస్తారని తెలిపారు. ఆరు నుంచి 15వ తేదీ వరకు ఆలయంలో వారాహి నవ రాత్రులను తొలి సారిగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శ్రీమహంకాళీ జాతర బోనాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అమ్మవారికి బోనాలను సమర్పించనుందన్నారు. 26వ తేదీ దుర్గగుడి దేవస్థానం తరపున ఆయా దేవాలయాలకు పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు తెలిపారు.19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు అమ్మవారి సన్నిధిలో శాకంబరీదేవి ఉత్సవాలు జరుగుతాయన్నారు.

పిల్లలపై పిడుగు!

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలకు ఎసరు

- అప్పు చేసైనా కట్టి తీరాల్సిందేనని యాజమాన్యాల ఒత్తిడి
- షెడ్యూల్ ప్రకారం ఇవ్వాల్సిన రూ.1,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- 2023–24 హాస్టల్ ఖర్చులు, మెస్ చార్జీల కింద ఇవ్వాల్సిన మరో రూ.1,100 కోట్లకు మంగళం



సాక్షి, అమరావతి: 'మీరు.. పరీక్షలు రాయాలంటే ముందు ఫీజు కట్టండి. చివరి సంవత్సరం పాసైన వాళ్లకు సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఫీజులు మొత్తం చెల్లించాల్సిందే. మెస్, హాస్టల్ చార్జీలు కడితేనే గదులు కేటాయిస్తాం. ప్రభుత్వం ఇచ్చేవరకు చూద్దామంటే కుదరదు. కొత్త ప్రభుత్వం వచ్చింది. ఇక మీకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని ఆశ పడొద్దు. అప్పో.. సప్పో చేసి బకాయిలు తీర్చండి. లేదంటే మీ చదువులకు కచ్చితంగా ఆటంకాలు తప్పవు. ఆ తర్వాత మాది బాధ్యత కాదు...' ఇదీ ఏపీలో డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా కాలేజీ యాజమాన్యాల బెదిరింపు ధోరణి! ''గత ఐదేళ్లు మా పిల్లల చదువులు సాఫీగా సాగిపోయాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి షెడ్యూల్ ప్రకారం జగనన్న విద్యా దీవెన కింద ఫీజులతోపాటు ఏడాదికి హాస్టల్, మెస్ ఖర్చులు వసతి దీవెనతో మా ఖాతాల్లో పడేవి. వెంటనే మేం కళాశాలలకు చెల్లించేవాళ్లం. మా పిల్లలకు సరిగా చదువు చెప్పకున్నా, హాస్టల్ బాగోలేకున్నా గట్టిగా ప్రశ్నించేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు చూస్తుంటే మళ్లీ అప్పులు చేసి పిల్లలను చదివించుకోవాల్సిన దుస్థితి తప్పదని భయమేస్తోంది''తల్లిదండ్రులు ఆవేదన ఇది!

పేర్లు మార్చడంలో ఉన్న ఉత్సాహం అమలులో ఏది?

రాష్ట్రంలో ఐదేళ్ల పాటు నిశ్చింతగా ఉన్న ఉన్నత విద్యా రంగంలో ఒక్కసారిగా కుదుపు మొదలైంది. ఇన్నాళ్లు ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో చదువుల్లో రాణిస్తున్న పేదింటి బిడ్డల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి ఖర్చులు కలిపి మొత్తం రూ.2,400 కోట్లు బకాయిలు ఇంతవరకు విడుదల కాకపోవడంతో పిల్లల చదువుల పరిస్థితి గాలిలో దీపంలా మారింది. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఫీజుల బకాయిలు విడుదల కాకపోవడం, కోర్సులు పూర్తి చేసిన వారి చేతికి సర్టిఫికెట్లు అందకపోవడంతో ఆదుర్దా చెందుతున్నారు. ఏ కళాశాలలో చూసినా ఫీజుల గోలే వినిపిస్తోంది. ఇంతకాలం ప్రతి మూడు నెలలకు ఒకసారి (త్రైమాసికం) విడుదల చేస్తున్న ట్యూషన్ ఫీజుల చెల్లింపులు నిలిచిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు ఇంటికి దూరంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో(వసతి దీవెన) హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులపై ఒక్కసారిగా అప్పు భారం పడింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ హయాంలో అమలైన పథకాలకు పేర్లు మార్చిందే కానీ వాటి అమలు ఊసే విస్మరించింది. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ (ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్)గా మార్పు చేసింది. షెడ్యూల్ ప్రకారం ప్రతి త్రైమాసికానికి సంబంధించి విడుదల చేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్–మెస్ చార్జీల విషయాన్ని మాత్రం గాలికొదిలేసింది. నిర్ణీత షెడ్యూళ్ల ప్రకారం ఇవ్వాల్సిన ట్యూషన్ ఫీజు రూ.1,300 కోట్లు, హాస్టల్–మెస్ చార్జీల కింద ఏడాది చివరిలో ఇవ్వాల్సిన మరో రూ.1,100 కోట్లు కలిపి మొత్తం రూ.2,400 కోట్లు ప్రభుత్వం నుంచి అందకపోవడంతో లక్షలాది మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

విద్యార్థుల్లో 'ఫీజుల'కలవరం

ప్రతి పేదింటి విద్యార్థికి ఉన్నత స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల ఖాతాల్లోనే నేరుగా ఫీజుల మొత్తాన్ని జమ చేసే విధానాన్ని తెచ్చారు. ప్రతి త్రైమాసికానికి ముందే షెడ్యూల్ ప్రకటించి నిధులు విడుదల చేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి 9.44 లక్షల మంది విద్యార్థులకు రూ.708.68 కోట్లను మార్చిలోనే గత ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపుల ప్రక్రియ నిలిచిపోయింది. పోలింగ్ తర్వాత అనుమతి లభించగా కొంత మంది ఖాతాల్లో నగదు జమైంది. ఇంతలో కూటమి అధికారంలోకి రావడంతో హఠాత్తుగా చెల్లింపులు నిలిపివేశారు.

చదువులపై బాధ్యత లేదా?

పేదింటి విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలు కలిగిన కళాశాలల్లో చదివించి వారి భవిష్యత్తుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఉజ్వల బాటలు వేసింది. చదువుల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించింది. 2017 నుంచి 2019 మధ్య అధికారంలో ఉండగా టీడీపీ ప్రభుత్వం 16.73 లక్షల మంది విద్యార్థులకు రూ.1,778 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది. ఆ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తూ బాధ్యతను మరిచి వ్యవహరిస్తోంది. 2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని ఎగ్గొట్టేందుకు ప్రణాళిక వేస్తున్నట్టు తెలుస్తోంది.

చెల్లింపులపై దుష్ప్రచారం..

వైఎస్సార్ సీపీ హయాంలో 29.65 లక్షల మంది విద్యార్థులకు రూ.12,609.68 కోట్లు జగనన్న విద్యాదీవెన కింద ట్యూషన్ ఫీజులు చెల్లించారు. ఎన్నికలకు ముందు షెడ్యూల్ ఇచ్చి మరీ నిధులు విడుదల చేసినా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ కాకుండా నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కుట్రలు చేసింది. విద్యార్థులకు అన్యాయం జరగకూడదని వైఎస్ జగన్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించడంతో నిధుల విడుదలకు ఒక రోజు సమయం (పోలింగ్‌కు ముందు) ఇచ్చింది. దీనిపైనా మరోసారి టీడీపీ మద్దతుదారులు కోర్టుకు వెళ్లడంతో కేసు విచారణ జరిగేలోపే ఆ ఒక్కరోజు సమయం కాస్తా గడిచిపోయింది. ఫలితంగా ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. అనంతరం కొంత మంది ఖాతాల్లో మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ జమైంది. మిగిలిన మొత్తంతో పాటు జూన్‌లో ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన మొత్తాన్ని చెల్లించే విషయంపై కూటమి ప్రభుత్వం ఇంతవరకూ ఒక్క ప్రకటన కూడా చేయలేదు. కొత్త ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించకపోగా గత ప్రభుత్వంపై నెపం వేసే యత్నం చేస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1,300 కోట్లు, వసతి దీవెనతో రూ.1,100 కోట్లు చెల్లించకుండా దుష్ప్రచారం చేస్తూ ఎగ్గొట్టేలా వ్యవహరిస్తోంది.

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా..

విద్యాసంస్థ	కోర్సు	ఫీజు
ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ	బీటెక్(ఈసీఈ)	రూ.3,05,000
దామోదరం సంజీవయ్య లా వర్సిటీ	ఎల్ఎల్‌బీ(5ఏళ్లు)	రూ.2,45,900
ఎస్‌వీ అగ్రికల్చర్ కాలేజ్ తిరుపతి	ఎంబీఏ(అగ్రి బిజినెస్)	రూ.1,96,460
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్	ఎంబీఏ	రూ.1,83,650
ఏఎన్‌యూ	ఎంఎస్సీ(ఫోరెన్సిక్ కెమిస్ట్రీ)	రూ.1,80,750
శ్రీ కృష్ణదేవరాయ కాలేజీ	బీఎస్సీ(హార్టికల్చర్)	రూ.1,73,090
ఏయూ ఫార్మాస్యూటికల్స్ సైన్స్	ఎంఫార్మా(స్పెషల్)	రూ.1,58,500
చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్	ఫార్మా–డీ	రూ.1,25,000

నేను జగన్‌ను కలవలేదు

- ఆ కథనాలు, వార్తలన్నీ అబద్ధం
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



సాక్షి బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాను కలవలేదని, తాను భేటీ అయినట్లు వస్తున్న వార్తలను నమ్మవద్దని కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. కొద్ది రోజులుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరులోని తన నివాసంలో ఉంటున్నారు. ఈ క్రమంలో డీకే శివకుమార్‌ను వైఎస్ జగన్ కలిశారని, పలు రాజకీయ అంశాలపై చర్చించారని వదంతులు వ్యాపించాయి. డీకే శివకుమార్‌ను వైఎస్ జగన్ కలిసి పుష్పగుచ్ఛం అందించినట్లు మార్ఫింగ్ ఫొటోలు కూడా ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి డీకే శివకుమార్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా స్పందించారు. తాను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయినట్లు కొందరు నకిలీ ఫొటో సృష్టించి ప్రచారం చేస్తున్నారని, తాను ఆయన్ను కలవలేదని చెప్పారు. ఆ కథనాలు, వార్తలన్నీ అబద్ధం అని చెప్పారు. ఇలాంటి వార్తలను నమ్మొద్దని ప్రజలను కోరారు.

పేట్రేగిపోతున్న టీడీపీ



హోంమంత్రి నియోజకవర్గంలోని కోటవురట్లలో మహిళలపై దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా కొనసాగుతున్న దాడులు

- ఆస్తుల విధ్వంసాలు, శిలాఫలకాల తొలగింపు, వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం
- పుంగనూరుకు వెళ్లకూడదంటూ పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిలపై ఆంక్షలు
- టీడీపీ తరఫున వకాల్తా పుచ్చుకుని అడ్డుకున్న పోలీసులు
- హోం మంత్రి సొంత నియోజకవర్గంలో ఇద్దరు మహిళల దుస్తులు చించేసి దాడి
- ఆళ్లగడ్డలో పోలీస్‌స్టేషన్ సాక్షిగా రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు
- సీఐ ఎదుటే ప్రేమికుడిని చితకబాదిన వైనం
- కక్ష సాధింపుతో చూసీచూడనట్లున్న సీఎం చంద్రబాబు.. రాష్ట్రంలో రావణ కాష్టం రగిలించడమే టీడీపీ ఉద్దేశం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన

అంతర్జాతీయ నిపుణులు

- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పరిశీలన
- జలవనరులశాఖ సలహాదారు, సీఈలతో సమీక్ష
- దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్ పరిశీలన నేడు



డ్యామ్ పనులు పరిశీలిస్తున్న అంతర్జాతీయ నిపుణులు

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణులు డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి సిస్కో, రిచర్డ్ డొన్నెల్లీ, సీస్ హించ్‌బెర్గర్, యాఫ్రి సంస్థ ప్రతినిధులు ఆదివారం పరిశీలించారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) డైరెక్టర్ అశ్వనీకుమార్, జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, సీఈ నరసింహమూర్తి, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), వ్యాప్కోస్ అధికారులతో కలిసి అంతర్జాతీయ నిపుణులు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, లీకేజీలను నిశితంగా పరిశీలించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు కట్టడానికిముందు లీకేజీలకు అడ్డుకట్ట వేయడానికి జెట్ గ్రౌటింగ్ చేసిన విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతి గరిష్ఠంగా ఉన్నప్పుడు, కనిష్ఠంగా ఉన్నప్పుడు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో లీకేజీల స్థాయి ఎంత ఉందని అడిగారు. కాఫర్ డ్యామ్‌ల లీకేజీలను తెలుసుకోవడానికి ఇప్పటిదాకా నిర్వహించిన పరీక్షల ఫలితాలపై ఆరా తీశారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను చూసి, మ్యాప్ ద్వారా పనుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పరిస్థితిపై జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, సీఈ నరసింహమూర్తి, అధికారులతో సమీక్షించారు. సోమవారం ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–1, గ్యాప్–2లను పరిశీలించి, కోతకు గురైన ప్రాంతంలో ఇసుకను నింపి వైబ్రోకాంపాక్షన్ ద్వారా యథాస్థితికి తెచ్చిన పనులను తనిఖీ చేయనున్నారు. ఆ తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో కోతకుగురై దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను పరిశీలించనున్నారు.

ఇదేం విష సంస్కృతి!?

- పార్టీ ఆఫీసులు, ప్రభుత్వ భవనాలపై దాడులు సరికాదు
- మాజీమంత్రి బొత్స సత్యనారాయణ



విజయనగరం: పార్టీ ఆఫీసులు, ప్రభుత్వ భవనాలపై దాడులు, యూనివర్సిటీల్లో వీసీలను బెదిరించడం వంటి విషసంస్కృతి తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. దౌర్జన్యాలు, కిరాతక చర్యలకు ప్రజాస్వామ్యంలో తావులేదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలాంటి దుశ్చర్యలు కొనసాగకూడదని హితవు పలికారు. అధికారంలో ఉన్న వారు సంయమనం పాటించాలని సూచించారు. విజయనగరంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ప్రైవేట్ ఆస్తులపై దాడులా?

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు చాలా బాధాకరంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పరిణామాలు ఉండకూడదు. అధికారంలో ఉన్న పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు ఇటీవల విజయనగరంలో వైఎస్సార్‌సీపీ ఆఫీసుకు వచ్చి బెదిరించారు. గతంలో ఇక్కడ ఇలాంటి సంస్కృతి ఎప్పుడూలేదు. చట్టానికి విరుద్ధంగా ఉన్నాయంటే చట్టపరంగానే చర్యలు తీసుకోవాలి. పార్టీ ఆఫీసులను కూల్చేయడం, బెదిరించడం నా ముప్పై ఏళ్ల రాజకీయ జీవితంలో చూడలేదు. పార్టీ ఆఫీసుల లోపలికి వెళ్లి బెదిరించడం ప్రజాస్వామ్యంలో ఎప్పుడూ జరగలేదు. ఇదిలాగే కొనసాగితే సివిల్ వార్‌గా మారే ప్రమాదముంది.

వీసీలను బెదిరిస్తారా?

యూనివర్సిటీల వీసీలను రాజీనామాలు చేయాలంటూ రాజకీయ ఒత్తిళ్లు చేయడం అస్సలు సమంజసం కాదు. వీసీగా నామినేట్ అయిన వ్యక్తి పనితీరు బాగా లేదనిపిస్తే విచారణ చేసుకోవాలి. ఎన్నికైన నేతలు 200–300 మందిని తీసుకుని ఆఫీసులకెళ్లి బెదిరింపులకు పాల్పడడం తప్పు. ఇక మా ప్రభుత్వంలో 6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించాం. టెట్ కూడా నిర్వహించాం. ఆ సమయంలో 50 వేల పోస్టులు ఖాళీ ఉన్నాయని వారే చెప్పారు. మెగా డీఎస్సీ అని 25 వేల పోస్టులైనా ఇస్తారనుకున్నాం.. కానీ, 16 వేల పోస్టులకే ఎందుకు పరిమితమయ్యారో తెలీడంలేదు. మా ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ ఉద్యోగం కూడా ఇవ్వలేదనడం తప్పు. 15 వేల పోస్టుల వరకు ఇచ్చాం.

రుషికొండలోవి పూర్తిగా ప్రభుత్వ భవనాలే..

అలాగే, విశాఖ రుషికొండలో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఎలా ఉపయోగించుకుంటారో ప్రభుత్వంలో ఉన్న వారి ఇష్టం. రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్ విడిది కోసం వాటిని వాడుకోవచ్చు. అవి పూర్తిగా ప్రభుత్వ భవనాలే. ఇంతకుముందు ఉన్న భవనాల స్థానంలోనే అత్యాధునికంగా నిర్మించాం. ప్రస్తుత ప్రభుత్వం రూ.4,000 పింఛన్ పథకాన్ని అమలుచేయడాన్ని స్వాగతిస్తున్నామని, మిగిలిన ఐదు గ్యారంటీలు అమలుచేసే శక్తిని ఆ భగవంతుడు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని కోరుకుంటున్నాం. సంక్రాంతి వరకు పాలన చూసిన తరువాత స్పందిస్తాం.

పుంగనూరుకు వెళ్లొద్దు

ఎంపీ మిథున్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డిలపై ఆంక్షలు

- నియోజకవర్గంలో పర్యటించడానికి వీల్లేదన్న పోలీసులు
- పెద్దిరెడ్డి నివాసం గోడలు దూకి హడావుడి
- వకుళామాత ఆలయానికి కూడా వెళ్లనివ్వని వైనం
- ఇది కక్ష సాధింపు: ఎంపీ మిథున్‌రెడ్డి

సాక్షి, తిరుపతి టాస్క్‌ఫోర్స్: రాజంపేట పార్లమెంట్ పరిధిలోని పుంగనూరు ఎమ్మెల్యేగా గెలిచిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని ఆ నియోజకవర్గంలో పర్యటించకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. శాంతి భద్రతల పేరుతో వారి పర్యటనలకు అడ్డు చెబుతున్నారు. కార్యకర్తల సమావేశంలో పాల్గొనడంతో పాటు కూటమి నేతల దాడుల్లో నష్టపోయిన వారిని పరామర్శించి, భరోసా కల్పించాలని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిర్ణయించారు. ఆదివారం పార్లమెంట్ సమావేశాలు ఉండవు కాబట్టి ఢిల్లీ నుంచి తిరుపతి చేరుకున్నారు. ఇక్కడి నుంచి పుంగనూరుకు వెళ్లే సమయంలో పోలీసులు ఆదివారం ఆయన నివాసానికి చేరుకుని అక్కడికి వెళ్లడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. ఎంపీకి నోటీసులు ఇచ్చేందుకు గోడలు దూకి హడావుడి చేశారు. తిరుపతిలోని వకుళామాత ఆలయానికి కూడా వెళ్లడానికి వీలు లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. పర్యటిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని సాకు చెప్పారు. అంతటితో ఆగని పోలీసులు.. ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలిసేందుకు వచ్చిన నియోజకవర్గ ప్రజలను సైతం లోనికి రానివ్వకుండా అడ్డుకున్నారు. వంద మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి, పెద్దిరెడ్డి నివాసంలోకి ఎవరూ వెళ్లేందుకు లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలను కలిసేందుకు కూడా ఒప్పుకోలేదు. ఇదే సమయంలో పుంగనూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. తమ ఆదేశాలను పాటించకపోతే కేసులు పెడతామని బెదిరించారు.

నా నియోజకవర్గానికి నేను వెళ్లకూడదా?

ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి నేతలు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని, గతంలో ఎన్నడూ లేని సంస్కృతికి తెరలేపారని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మండిపడ్డారు. తిరుపతిలోని తన నివాసంలో ఆదివారం ఉదయం ఆయన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగిందన్నారు. నియోజకవర్గంలో ఎలక్ట్రికల్ బస్సు కంపెనీ రాకుండా, పెట్టుబడులు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇన్ని గొడవల నేపథ్యంలో ఎలక్ట్రిక్ బస్సుల ఫ్యాక్టరీ యాజమాన్యం సందిగ్ధంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పుంగనూరుకు ఏ పరిశ్రమలు రాకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తన నియోజక వర్గంలో పర్యటించకుండా, ప్రజల్ని కలవకుండా అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పేదల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. జేసీబీలు తీసుకొచ్చి వైఎస్సార్‌సీపీ నాయకుల మామిడి తోటలు, ఆస్తులు, కుటుంబ సభ్యుల వాహనాలను ధ్వంసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పేదల ఆవులు కూడా ఎత్తుకెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఎన్నికల సమయంలో రాజకీయంగా పోరాడితే అందరం స్వాగతిస్తాం. కానీ పేదల ఇళ్లపై దాడులు చేయడం దారుణం. మా వారిని పరామర్శించడానికి వెళుతుంటే పోలీసులు అడ్డుకోవడం ఏమిటి? నా నియోజకవర్గంలో నేను పర్యటించకూడదా? ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్తా. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. వైఎస్సార్‌సీపీకి 40 శాతం మంది ఓటేశారని, వారందరినీ రాష్ట్రం నుంచి తరిమేస్తారా?' అని నిప్పులు చెరిగారు.

అరెస్టుకైనా, ప్రాణ త్యాగానికైనా సిద్ధం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని ఎంపీ మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ మారాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తాను బీజేపీలోకి వెళ్తున్నానని బుద్ధి లేని వారు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చల్లా బాబును అనేక సంవత్సరాల నుంచి చూస్తున్నప్పటికీ, ఇలాంటివి ఎప్పుడూ లేవని, బాబు ట్రాప్‌లో పడొద్దని హితవు పలికారు. గతంలో పోలీసులపై దాడి చేసిన చల్లా బాబు జైలుకు వెళ్లారన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల కోసం తాను అరెస్టుకైనా, ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. మంత్రి పదవిని కాపాడుకోవడానికే రాంప్రసాద్ తమపై విమర్శలు చేస్తున్నారని చెప్పారు.

పుంగనూరులో ఉద్రిక్తత



పుంగనూరులో ఆందోళన చేస్తున్న కూటమి నేతలు

పుంగనూరు: ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే, ఎంపీలు తమ సొంత నియోజకవర్గాలలో తిరగరాదని హెచ్చరికలు చేస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్న ఘటనలు ప్రజలను విస్మయానికి గురిచేస్తున్నాయి. ఆదివారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి పుంగనూరులో కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కూటమి నేతలు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా చేపట్టి, నల్లజెండాలతో నిరసనకు దిగారు. ఎమ్మెల్యే, ఎంపీలు రాకూడదంటూ దూషణల పర్వం కొనసాగించారు. సుమారు రెండు గంటల సేపు హైడ్రామా సాగింది. ఈ నెల 15న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పుంగనూరు పర్యటన సమయంలో కూడా కూటమి నేతలు ఇలాగే అడ్డుకున్నారు. కూటమి నేతల తీరుతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు ఎంపీ మిథున్‌రెడ్డిని తిరుపతిలో హౌస్ అరెస్ట్ చేశామని తెలపడంతో కూటమి శ్రేణులు శాంతించారు.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 1-7-2024



మంచి మాట

సౌశీల్యం అంటే,,?

రాముడి పదహారు గుణాలలో ప్రత్యేక గుణం అని చెప్పదగినది సౌశీల్యం. శ్రీరామచంద్రుడు అరణ్య వాసానికి బయలుదేరి వెడుతున్నప్పుడు గుహుడి రాజ్యంలో ప్రవేశించాడు. అప్పుడు గుహుణ్ణి ''ఆత్మవత్సఖః'' అంటాడు. అంటే గుహుడు రాముడికి ఎంత అంటే తనతో సమానమైన వాడు. అరమరికలు లేకుండా ఎవరితో ఉండ గలడో అతడు. రాముడు వస్తున్నాడని తెలిసి గుహుడు వద్దులైన మంత్రులతో కలిసి రాముడికి ఎదురు వెళ్ళాడు స్వాగతం చెప్పటానికి. రాముడు తానే ముందుగా అతడిని పలుకరించి కౌగిలించుకున్నాడు. రాముడు చక్రవర్తి కుమారుడు. గుహుడు సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఒక సామాన్యమైన వనచర రాజ్యానికి అధిపతి మాత్రమే. రాముడికి అటువంటి భేదాలు లేవు.

రాముడికి పట్టాభిషేకం అని ప్రకటించిన తరువాత సుమంత్రుడు రాముడి అంతఃపురంలో ప్రవేశించటానికి అనుమతి అడుగుతుంటే అటువంటిది అవసరం లేదు అంటాడు. తాను కాబోయే రాజు అయినా చిన్నతనం నుండి ఎత్తుకుని ఆడించిన వాడు కనుక తారతమ్యం చూపించ లేదు.

జటాయువుని పక్షి అని చూడకుండా అంత్యక్రియలు నిర్వర్తించాడు. దశరథుడు కూడా అటువంటి సౌశీల్యం కల వాడు కనుకనే జటాయువుతో మైత్రి నెరపాడు. దేవతలు దశరథుడితో మైత్రి కలిగి ఉండటానికి ఈ గుణమే కారణమేమో!

"మహతః మందై స్సహ నీరంధ్రేణ సంశ్లేషః సౌశీల్యం"
జాతి చేత విద్య చేత ఐశ్వర్యం చేత చాలా గొప్ప వాడైనా తన కంటే తక్కువ వారితో అరమరికలు లేక కలిసి ఉండటం సౌశీల్యం.

కృష్ణ సుధాముల మైత్రి కూడా ఇటువంటిదే. పైగా కుచేలుడుగా ప్రఖ్యాతి పొందిన సుధాముడు కృష్ణుడి ఐశ్వర్యాన్ని చూసి చనువుగా ఉండటానికి కొంచెం సందేహిస్తుంటే, తానే ఎదురు వెళ్ళి, తీసుకు వచ్చి, కాళ్ళు కడిగి, సకల మర్యాదలు చేసి, అతడిలో ఉన్న ఆ కాస్త బెరుకుని పోగొట్టటానికి గురుకులంలో గడిపిన కాలాన్ని గుర్తు చేస్తాడు. పైగా అతడికి ఏమీ ఇచ్చి పంపలేదు వెళ్లేటప్పుడు. అతడి లేమిని ఎత్తి చూపి, తన ఆధిక్యం చూపించుకున్నట్టు అవుతుంది అని. ఇంటికి చేరే సరికి గుట్టు చప్పుడు కాకుండా అన్నీ సమకూర్చాడు. ఎంతటి సౌశీల్యం!

దీనికి భిన్నమైన ఉదాహరణలు కూడా ఉన్నాయి. ద్రుపదుడు విద్యాభ్యాస సమయంలో ఇచ్చిన మాట తప్పి తనను చూడటానికి వచ్చిన ద్రోణుణ్ణి అవమాన పరుస్తాడు. తగిన ఫలం అనుభవించాడు. లోకంలో తరచుగా ఇటువంటివారే ఎక్కువగా కనపడుతూ ఉంటారు. స్నేహానికి కూడా అంతస్తు చూస్తారు. అవసరానికి స్నేహం నటించటం ఉంటుంది. పని అయిపోయిన తరువాత అంతకు ముందు ఉన్న సుహద్భావం కనపడదు. అవసరం వచ్చి నప్పుడు అడ్డు రాని అంతస్తులు, హోదాలు, పదవులు, ఆర్థిక వ్యత్యాసాలు అప్పుడు కనపడతాయి.

ఒక్కసారి మైత్రి ఏర్పడిన తరువాత అది జిడ్డు లాగా అంటుకు పోతుంది. అందుకే దానిని స్నేహం అన్నారు. స్నేహం అంటే నూనె, పట్టుకుంటే వదలని జిడ్డు అని అర్థం. చిన్నతనంలో ఇటువంటి తేడాలు తెలియవు కనుక అందరితో కలిసి మెలిసి ఉంటారు. ఎదుగుతున్న కొద్ది దూరం జరగుతూ ఉంటారు. కానీ, సజ్జనులు అటువంటి భావాలని దారికి రానీయరు.

మరొక ప్రధానమైన గుణం – మిత్రులు తక్కువ స్థాయిలో ఉన్నారు కనుక వారిని తమ స్థాయికి తీసుకు రావటానికి ప్రయత్నం చేయరు. అంటే, వారి స్థాయిని గుర్తించినట్టే కదా! అది వారిని అవమానించినట్టే అవుతుంది. వారు ఉన్న స్థితి వారికి నచ్చినది, తృప్తి కలిగించేది. వారికి కావలసినది ప్రేమ, ఆత్మీయత, ఆదరణ. దానిని చూపించటమే సౌశీల్యం. ఈ లక్షణం ఎంత అపురూపమో కదా!

– డా. ఎన్. అనంత లక్ష్మి

బౌద్ధవాణి

ఇంద్రియాలతో జాగ్రత్త !

ఋషిరుణం తీరడానికి బ్రహ్మచర్య ఆశ్రమం సరిపోతుంది. కానీ పితృ రుణం, దేవరుణం తీరాలంటే గృహస్థాశ్రమ స్వీకారం తప్పదు. పితరుణం అంటే... తండ్రి మనకు ఒక జన్మనిచ్చాడు... సరే... దీని వెనుక ఉన్న తాత్త్వికత ఏమిటి ? ఇప్పుడు మన శరీరానికి ఒక పేరుంది. వచ్చేటప్పుడు ఆ పేరుతో భూమి మీదకు రాలేదు. వచ్చిన తరువాత పెద్దలు పేరు పెట్టారు. కానీ ఈ జీవుడు ఇప్పుడు కాదు సనాతనంగా అలా వస్తూనే ఉన్నాడు. ఎన్ని శరీరాలు పొందాడో!!! ఎన్ని వదిలాడో !!! పునరపి జననం పునరపి మరణం/పునరపి జననీ జఠరే శయనం/ఇహ సంసారే బహుదుస్తారే/కృపయా పారే పాహి మురారే. ఇలా మారిపోతున్నప్పుడు ఒక్కొక్క జన్మలో ఒక్కొక్క అనుబంధం.. తల్లిదండ్రులు, భార్య, పిల్లలు... ఒక్కొక్క జన్మలో ఒక్కొక్కరు తల్లిదండ్రులు...అలా మారిపోతుంటారు.

కానీ చేసిన పాపాలు న్నాయి. అవి అనుభవం చేత పోతాయి. అనుభవం దుఃఖమయం కావాలి. పుణ్యం సుఖ రూపంలో పోవాలి. నిజానికి సుఖదుఃఖాలు రెండూ కూడా అనుభవాలే..ఒకటి బాగున్నట్లు ఉంటుంది, మరొకటి బాధపెట్టినట్లుంటుంది. మొత్తానికి పుణ్యమో పాపమో క్షయమయిపోతుండాలి. అది మానసికంగా అనుభవించడం కుదరదు. శరీరం ఉంటే తప్ప దుఃఖాన్ని అనుభవించడం కుదరదు. అలాగే సుఖాన్ని కూడా అనుభవించడం వీలు కాదు. కాబట్టి ధర్మానుష్ఠానం చేయాలి అంటే శరీరం ఉండాలి. కాళిదాస మహాకవి అంతటి వాడు 'శరీరమాద్యం ఖలు ధర్మ సాధనమ్' అన్నాడు. జీవుడు ఈ శరీరాన్ని తొడుక్కుని రాలేదనుకోండి. అప్పుడు ఆ జీవుడికి పాపపుణ్యాలు పోగొట్టుకోవడం కుదరదు. అసలు పాపపుణ్యాలు లేవనుకోండి. ఇక శరీరం పొందాల్సిన అవసరమే ఉండదు. పాపం క్షయమైపోయి పుణ్యం బాగా సంపాదించుకోవాలి, సుఖంగా ఉండాలనుకుంటే దానికి శరీరం తప్పనిసరి.

కాబట్టి శరీరం అనేది అత్యంత ప్రధానం. దీనిని జీవుడు పొందాడు అంటే... అది తల్లిదండ్రుల మహోపకారం. వాళ్ళిద్దరి అనుగ్రహంగా ఈ శరీరం లభించింది. అంటే తండ్రి ఏబాటలో ప్రయాణించాడో కొడుకు కానీ, కూతురు కానీ అదేబాటలో ప్రయాణించాలి. అంటే వేరొకరికి జన్మనివ్వాలి. సంతానం పెరగాలి. అయితే ఇక్కడ ఒక ధర్మసంక్లిష్టత వస్తుంది. సంతానాన్ని పొందడం.. అన్నప్పుడు కామం సహజంగా శరీరంలో పొటమరిస్తుంది. ఈ విషయంలో విశంఖలత్వం పనికిరాదు. అది ధర్మంచేత కట్టుబడాలి. అది చేయనప్పుడు ఇంద్రియాలు ఎప్పుడు కాటేస్తాయో తెలియదు.

గడ్డిలో నడుచుకుంటూ పోతున్నాం. అనుకోకుండా కాలు అక్కడున్న పాము పడగపై పడింది. మిగిలిన శరీరంతో అది కాలును చుట్టేసింది. అది మనల్ని కాటువేయలేదు..కారణం ...దాని తల మన కాలి కింద ఉంది కనుక. కాటువేయలేదు కాబట్టి మనం సురక్షితంగా ఉన్నాం ...అనుకుంటూ ప్రశాంతంగా ఉండగలమా ? ఎప్పుడు పాదం తొలిగితే అప్పుడు కాటేయడానికి పాము కాచుకుని ఉంటుంది. దీని బారినుంచి ఎప్పుడు తప్పుకుందామా అని మనం చూస్తుంటాం. మనం కానీ, అది కానీ క్షేమంగా మాత్రం లేము, ఉత్కంఠ అటూ ఉంది.. ఇటూ ఉంది. మన ఇంద్రియాలు కూడా అంతే. కాలుకింద పాము తల అణిగి ఉన్నట్లు అణిగి ఉంటాయి. సమయం చూసి కాటేస్తాయి. వాటిని నిగ్రహించడం అంత తేలిక కాదు.





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఆధ్యాత్మికథ

శేషాచలంలో సాగర ఘోష!

ఉత్తర భారతదేశంలోని సంగీత సాధకులు కొందరు తిరుమలకు వెళ్ళి స్వామి వారి దర్శనం చేసుకోదలిచారు. అదే విషయం తమ సంగీత విద్వాంసుడికి చెప్పారు. ఆ విద్వాంసుడు చాలా సంతోషించి 'అలాగే, అక్కడి శేషాచలం కొండల్లోని సముద్రాన్ని చూసి రమ్మని' చెప్పి పంపాడు.

ప్రయాణం మొదలైనప్పటినుంచీ ఆ సాధకుల్లో ఓ సందేహం మొదలయ్యింది. 'తిరుమల శేషాచలం కొండల దగ్గర సముద్రం ఉందని ఎన్నడూ వినలేదు, మరి గురువు ఎందుకు అలా చెప్పాడో...' అని. ఎన్ని పుస్తకాలు తిరగేసినా, ఎందరో పండితులను విచారించినా తిరుమల కొండ సమీపంలో సముద్రం ఏదీ లేదని తెలుసుకున్నారు. 'అయినా గురువు తప్పు చెప్పడు కదా!' అని ఆలోచించారు. 'ఎలాగూ వెళ్తున్నాము కదా, కొండ పరిసరాల్లో వెదికి చూద్దాం!' అనుకున్నారు.

అలిపిరి మెట్ల నుంచి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. గుండు గీయడమంటే పాపాలు పోగొట్టుకోవడమే అని నమ్మిన ఆ సాధకులు స్వామికి తల నీలాలు సమర్పించారు. పుష్కరిణిలో స్నానం చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. లడ్డు ప్రసాదం స్వీకరిస్తూ ఉంటే, వారికి గురువు చెప్పింది గుర్తుకొచ్చింది. కనిపించిన భక్తులతో సముద్రం గురించి ఆరా తీశారు. వారు సమాధానం ఇవ్వకపోగా వీరి వైపు వింతగా చూశారు.



'తిరుమల కొండల పైన సముద్రం కాకపోయినా, సముద్రం లాంటిదేమైనా ఉంటుందేమో చూద్దామని' బయలుదేరారు. ఆకాశ గంగ, పాపవినాశనం, జాపాలి, పాండవ తీర్థం లాంటి ప్రదేశాలన్నీ గాలించారు. వారికెక్కడా సముద్రం ఆనవాలు కనిపించలేదు. గురువు పొరపాటుగా చెప్పినట్లున్నారని తీర్మానించుకుని కొండ దిగడం ప్రారంభించారు.

వారికి దారిలో ఏడవ మైలు వద్ద ఆకాశం ఎత్తు శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం కనిపించింది. భక్తితో నమస్కరించి కళ్ళు మూసుకుని, ప్రశాంతంగా కూర్చున్నారు.

వారి చెవులకు... లీలగా... మైకులో నుంచి 'అదివో అల్లదివో శ్రీహరి వాసము... పదివేల శేషుల పడగల మయము' అనే అన్నమాచార్య కీర్తన వినిపించింది. వారి ఒళ్ళు పులకరించింది. ముఖాల్లో నేతి దీపాల మెరుపు మొదలయ్యింది. గురువు చెప్పిన 'సముద్రం' లోతు తెలిసింది. ఏడు స్వరాలు ఏడు కొండలై అన్నమయ్య సంగీత స్వరంతో ప్రవహించడం గమనించారు.

'మనమనుకునే ఉప్పు నీటి సముద్రం శేషాచలం కొండల్లో లేదు కానీ అన్నమయ్య గానామృత సముద్రం ఈ కొండల దగ్గర ఉంది' అని తెలుసుకున్నారు. పండితులను, పామరులను సైతం ఓలలాడించే ముప్పది రెండువేల సంకీర్తనలు తెలుగులో అందించిన ఆ పదకవితా పితామహుడికి మనస్సులోనే ధన్యవాదాలు తెలిపారు. గోవింద నామస్మరణలు చేస్తూ కొండ దిగారు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా



ప్రభాస్

అక్టోబరులో ఆరంభం

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ మూవీ నిర్మించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్లుగా మృణాల్ ఠాకూర్, రష్మికా మందన్న పేర్లు వినిపిస్తున్నాయి. వివేక్ సాగర్ ఈ మూవీకి సంగీతం అందించనున్నారు. వార్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే ఈ లవ్‌స్టోరీ మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ చివరి దశకు చేరుకున్నాయి. దీంతో ఈ ఏడాది అక్టోబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారట హను రాఘవపూడి. ప్రస్తుతం వెకేషన్‌లో భాగంగా ప్రభాస్ విదేశాల్లో ఉన్నారు. ఆయన తిరిగొచ్చిన తర్వాత 'రాజాసాబ్' సినిమా చిత్రీకరణలో పాల్గొంటారు. ఆ సినిమా పూర్తయిన తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహించే సినిమా షూటింగ్‌లో ప్రభాస్ పాల్గొంటారనే టాక్ వినిపిస్తోంది. అయితే సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో 'స్పిరిట్' అనే సినిమాకి కమిట్ అయ్యారు ప్రభాస్. ఈ సినిమా చిత్రీకరణ కూడా ఈ ఏడాది చివర్లోనే ప్రారంభం కానుందట. మరి.. హను రాఘవపూడి, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వాల్లోని సినిమాల చిత్రీకరణలో ప్రభాస్ ఏకకాలంలో పాల్గొంటారా? లేదా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

అందుకే వెనకడుగు వేశా!

విలక్షణ నటుడు కమల్ హాసన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'భారతీయుడు 2'. కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబోలో 1996లో వచ్చిన హిట్ మూవీ 'భారతీయుడు'కి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' రూపొందింది. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ మూవీ తెలుగులో 'భారతీయుడు 2', తమిళంలో 'ఇండియన్ 2', హిందీలో 'హిందుస్థానీ 2' పేరుతో ఈ నెల 12న విడుదల కానుంది. రిలీజ్ డేట్‌కి సమయం దగ్గరపడటంతో జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు మేకర్స్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కమల్ హాసన్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ''ఐ–రోబో' అనే ఇంగ్లిష్ నవలను సినిమాగా తెరకెక్కిస్తే బాగుంటుందని నేను, శంకర్, రచయిత సుజాత (ఎస్. రంగరాజన్) 90ల్లోనే అనుకున్నాం. నా పాత్ర లుక్ టెస్ట్ కూడా పూర్తయింది. కానీ, ఆ ప్రాజెక్టు పట్టాలెక్కలేదు. ఇండస్ట్రీలో బడ్జెట్, పారితోషికం, డేట్స్, మార్కెట్.. ఇలా ఎన్నో లెక్కలు ఉంటాయి. అప్పటి మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ సినిమా చేయకపోవడమే మంచిదనిపించింది. అందుకే నేను వెనకడుగు వేశా. కానీ, నా స్నేహితుడు శంకర్ మాత్రం వదల్లేదు. సరైన సమయంలో రజనీకాంత్‌తో 'రోబో' సినిమా తీసి, బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. అలాగే '2.0' మూవీలో విలన్ పాత్ర కోసం నన్ను సంప్రదించారు శంకర్. అయితే కొన్నాళ్ల పాటు నేను హీరోగా ఉండాలనుకుంటున్నానంటూ నవ్వుతూ శంకర్‌కు చెప్పాను'' అన్నారు కమల్ హాసన్. అయితే రజనీకాంత్ హీరోగా నటించిన '2.0' మూవీలో విలన్‌గా అక్షయ్ కుమార్ నటించారు.



కమల్ హాసన్

కథ విన్నారా?

హీరో వెంకటేష్ నుంచి మరో కొత్త సినిమా కబురు వినే సమయం ఆసన్నమైందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం 'రానా నాయుడు' అనే వెబ్‌సిరీస్ నెక్ట్స్ సీజన్స్ చిత్రీకరణతో బిజీగా ఉన్నారు వెంకటేష్. ఈ సిరీస్ షూటింగ్‌ను పూర్తి చేసుకున్న తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న సినిమా సెట్స్‌లో ఆయన జాయిన్ అవుతారని తెలుస్తోంది. కాగా 'సామజవరగమన' వంటి హిట్ మూవీకి రైటింగ్ టీమ్‌లో పనిచేసిన నందు అనే వ్యక్తి ఓ కథను వెంకటేష్‌కి వినిపించడంతో, ఆయన సానుకూలంగా స్పందించారట. దీంతో ఈ కథకు తుది మెరుగులు దిద్ది మళ్లీ వెంకటేష్‌కి వినిపించనున్నారట నందు. అన్నీ కుదిరితే ఈ సినిమాపై అధికారిక ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశం ఉందని ఫిల్మ్‌నగర్ భోగట్టా.



వెంకటేశ్

హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్‌ది చిత్ర పరిశ్రమలో దాదాపు పదిహేనేళ్ల ప్రయాణం. 2009లో 'జిల్లీ' అనే కన్నడ సినిమాతో కథానాయికగా పరిచయమయ్యారు ఈ బ్యూటీ. ఆ తర్వాత తెలుగు, తమిళ్, హిందీ సినిమాలు చేసి స్టార్ హీరోయిన్లలో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. తాజాగా రకుల్‌ప్రీత్ నటించిన చిత్రం 'భారతీయుడు 2'. కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన 'భారతీయుడు 2' మూవీలో కీలక పాత్ర పోషించారామె. ఈ నెల 12న ఈ మూవీ పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అవుతోంది. కాగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో **రకుల్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ–**

ఆయన నుంచి చాలా నేర్చుకున్నా – రకుల్ ప్రీత్ సింగ్

''భారతీయుడు 2' సినిమాలో నటించడం గౌరవంగా భావిస్తున్నా. ఈ చిత్రం కోసం విలక్షణ నటులు కమల్ హాసన్ సర్‌తో, గొప్ప దర్శకుడైన శంకర్ సర్‌తో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. షూటింగ్ సమయంలో శంకర్ సర్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. ఆయన ఎంతో ప్రతిభ ఉన్న దర్శకుడు. తెరపై కథలని, పాత్రలను ఆయన చూపించే విధానం అద్భుతం. శంకర్‌సర్ ఆలోచనా విధానం, సృజనాత్మకత గురించి ఎంత చెప్పినా తక్కువే'' అన్నారు. ఇదిలా ఉంటే.. రకుల్ ప్రస్తుతం హిందీలో 'మేరీ పత్నీకా రీమేక్, దే దే ప్యార్ దే 2' వంటి సినిమాల్లో నటిస్తున్నారు. కాగా నటుడు, నిర్మాత జాకీ భగ్నానీతో రకుల్ వివాహం ఈ ఫిబ్రవరి 21న జరిగిన విషయం తెలిసిందే. అటు వ్యక్తిగత జీవితం, ఇటు సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు రకుల్‌ప్రీత్.



జెట్ స్పీడ్‌తో...

తమిళంలో మరో కొత్త సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్. ఇప్పటికే ఈ యంగ్ బ్యూటీ ప్రస్తుతం 'బైసన్', 'లాక్‌డౌన్' అనే రెండు తమిళ చిత్రాలతో బిజీగా ఉన్నారు. తాజాగా 'లవ్‌టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న తమిళ సినిమా 'డ్రాగన్'లో ఓ హీరోయిన్‌గా అనుపమ నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ కాలేజీలో ప్రదీప్–అనుపమల మధ్య చిత్రీకరిస్తున్న రొమాంటిక్ సన్నివేశాల విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఈ సినిమా నిర్మిస్తోంది. ఇదిలా ఉంటే.. అనుపమ నటించిన 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ, ది పెట్ డిటెక్టివ్, పరదా' చిత్రాలు విడుదలకు సిద్ధం అవుతున్నాయి. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో 'ఆక్టోపస్' (ప్రచారంలో ఉన్న టైటిల్), బెల్లకొండ సాయిశ్రీనివాస్ 'కిష్కింధపురి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాల్లో ఆమె నటిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇలా అరడజనుకుపైగా సినిమాలతో అనుపమా జెట్ స్పీడ్‌తో దూసుకెళుతున్నారు.



అనుపమ

సాహసాల సారా

ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ మూవీ 'షణ్ముఖ'. ఈ చిత్రంలో అవికా గోర్ కథానాయికగా నటిస్తున్నారు. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఆదివారం(జూన్ 30) అవికా గోర్ బర్త్ డే. ఈ సందర్భంగా 'షణ్ముఖ' చిత్రంలో ఆమె సారా పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించి, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ''సినిమాలో కథ రీత్యా లక్ష్య సాధనలో ఉన్న హీరో ఆదికి సపోర్ట్ చేసే పాత్రలో అవిక నటించారు. సాహసోపేతమైన పనులు చేసే శక్తివంతమైన సారాగా ఆమెను చూస్తారు ప్రేక్షకులు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. గ్రాఫిక్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఆడియన్స్‌కు ఈ చిత్రం విజువల్ వండర్‌లా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



అవికా గోర్

ఎవడి కోసం తగ్గాలి!

'ఏయ్.. ఎవడి కోసం తగ్గాలి... ఎందుకు తగ్గాలి' అంటున్నారు హీరో 'అల్లరి' నరేష్. ఆదివారం (జూన్ 30) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా నరేష్ నటిస్తున్న 'బచ్చల మల్లి' మూవీ నుంచి గ్లింప్స్ విడుదల చేశారు మేకర్స్. అలాగే నరేష్ నటించనున్న 63వ సినిమా ప్రకటన కూడా వచ్చింది. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో 'అల్లరి' నరేష్, అమృతా అయ్యర్ జంటగా నటిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్నారు. కాగా ఆదివారం నరేష్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేసింది యూనిట్. 'ఏయ్.. ఎవడి కోసం తగ్గాలి... ఎందుకు తగ్గాలి' అంటూ నరేష్ చెప్పిన డైలాగ్ గ్లింప్స్‌లో ఉంది. ఈ సినిమా సెప్టెంబర్‌లో విడుదలకానుంది.

తప్పించుకోలేరు...

'అల్లరి' నరేష్ హీరోగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ 'ఏ ఎన్ 63'(వర్కింగ్ టైటిల్) అనే నూతన చిత్రాన్ని ప్రకటించింది. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'మీరు అతని కంటి నుండి తప్పించుకోలేరు' అంటూ విలక్షణమైన కాన్సెప్ట్ పోస్టర్‌తో 'ఏ ఎన్ 63' మూవీ ప్రకటన చేశారు మేకర్స్.



'అల్లరి' నరేష్



'జీవితకాలపు జ్ఞాపకమిది'

'నా ఆనందాన్ని వ్యక్తపరిచేందుకు మాటలు రావడం లేదు. కఠిన పరిస్థితుల్లో పోరాడిన ఈ జట్టు పట్ల గర్వంగా ఉన్నా. 6 ఓవర్లలోపు 3 వికెట్లు కోల్పోయిన స్థితి వారికి పరీక్ష పెట్టింది. కానీ ఆటగాళ్లు తమపై తాము నమ్మకం ఉంచారు. నేను పూర్తి స్థాయిలో ప్రయత్నించినా సరే ఆటగాడిగా ట్రోఫీ గెలిచే అదృష్టం దక్కలేదు. ఇదంతా క్రీడల్లో భాగం. అయితే వెస్టిండీస్‌లోనే 2007 వన్డే వరల్డ్ కప్ పరాజయానికి ఇలా ఊరట దక్కిందనేది సరైంది కాదు. అసలు అలాంటి మాటలను నేను విశ్వసించను. నాకు తెలిసి ఎంతో మంది గొప్ప ఆటగాళ్లు ట్రోఫీ నెగ్గలేకపోయారు. కోచ్‌గా నాకు దక్కిన అవకాశంతో కుర్రాళ్లకు మార్గనిర్దేశనం చేశా. కోచ్‌గా నా ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించానంతే. ఈ ప్రయాణం చాలా గొప్పగా సాగింది. రెండేళ్ల శ్రమ తర్వాత దక్కిన ఈ గెలుపు జీవితకాల జ్ఞాపకం. మాకు ఈ విజయంలో కొంత అదృష్టం కూడా కలిసొచ్చింది. జట్టు సాధించిన ఘనత పట్ల ఆనందంగా ఉన్నా. వచ్చే వారంనుంచి నేను నిరుద్యోగిగా మారిపోతున్నా. ఏమైనా ఆఫర్‌లు ఉంటే చెప్పండి.'


-రాహుల్ ద్రవిడ్, భారత హెడ్ కోచ్

జడేజా కూడా...

అంతర్జాతీయ టి20లకు గుడ్‌బై



బ్రిడ్జ్‌టౌన్: వరల్డ్ కప్ విజయం తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల బాటలోనే భారత జట్టులో మరో సీనియర్ సభ్యుడు రవీంద్ర జడేజా కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు. అంతర్జాతీయ టి20లనుంచి తప్పుకుంటున్నట్లు అతను వెల్లడించాడు. 'టి20 ప్రపంచ కప్ గెలవాలనే కల నెరవేరింది. నా అంతర్జాతీయ టి20 కెరీర్‌లో ఇది అత్యుత్తమ క్షణం. ఎన్నో మధుర జ్ఞాపకాలు నా వెంట ఉన్నాయి. జట్టు కోసం నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించా. ఇకపై ఇతర ఫార్మాట్‌లలో దానిని కొనసాగిస్తా' అని జడేజా పేర్కొన్నాడు. ఈ మెగా టోర్నీలో భారత్ తరఫున అన్ని మ్యాచ్‌లూ (8) ఆడిన జడేజా పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. 5 ఇన్నింగ్స్‌లలో కలిపి 22 బంతులే ఎదుర్కొన్న అతను 35 పరుగులు చేశాడు. 14 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి 7.57 ఎకానమీతో ఒకే ఒక వికెట్ పడగొట్టాడు. 2009లో భారత్ తరఫున తొలి అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడిన జడేజా 74 మ్యాచ్‌లలో 127.16 స్ట్రయిక్‌రేట్‌తో 515 పరుగులు చేశాడు. 7.13 ఎకానమీతో 54 వికెట్లు పడగొట్టాడు.



'హార్దికానందం'

వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌లో గాయంతో ఆటకు దూరం... తిరిగొచ్చాక ఐపీఎల్‌లో ఎక్కడికి వెళ్లినా హేళనలు... వ్యక్తిగత జీవితంలో ఆటుపోట్లు... గత ఆరు నెలల కాలంలో హార్దిక్ పాండ్యా అన్ని విధాలుగా తీవ్ర వేదన అనుభవించాడు. కానీ మళ్లీ పైకి లేచేందుకు జీవితం మరో అవకాశాన్ని ఇస్తుంది. హార్దిక్‌కు టి20 వరల్డ్ కప్ రూపంలో అలాంటి చాన్స్ దక్కింది. ఐపీఎల్ సమయంలో అతడిని వెంటాడి, మాటలతో వేధించిన వారి ఇప్పుడు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'లీగ్‌లో మీరు మరో జట్టుకు మద్దతు ఇవ్వడంలో తప్పు లేదు. కానీ చూడండి ఇదే హార్దిక్ రేపు టీమిండియాను గెలిపిస్తాడు' అని అండగా నిలిచిన వారంతా గర్వపడేలా అతను ఆడి చూపించాడు. అటు బ్యాటింగ్‌లో, ఇటు బౌలింగ్‌లో తన విలువను ప్రదర్శించాడు. ఫైనల్లోనైతే దక్షిణాఫ్రికాను గెలుపు దిశగా తీసుకెళుతున్న క్లాసెన్, మిల్లర్‌లను అవుట్ చేసి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాడు. అందుకే విజయానంతరం అతను కన్నీళ్లు ఆపుకోలేకపోయాడు. ముఖ్యంగా రోహిత్ తనను ఎత్తుకొని గుండెలకు హత్తుకున్నప్పుడు వాటిని నియంత్రించుకోవడం అతనికి సాధ్యం కాలేదు. చివరకు తనలో గూడుకట్టుకున్న బాధను అతను బయటకు చూపించాడు. 'ఆ ఆరు నెలలు... నేను కోల్పోయిన ఆ ఆరు నెలలు నాకు కావాలి. అసలు ఏం జరిగిందో కూడా నేను గుర్తించలేకపోయా. నన్ను నేను ఎంతో నియంత్రించుకున్నా. ఒక దశలో ఏడవాలని అనుకున్నా ఏడవలేకపోయాను. నా బాధను చూసిన సంతోషించిన వారికి మరింత ఆనందం ఇవ్వరాదని అనుకున్నా. ఇప్పుడు అదృష్టం చూడండి. నేను ఊహించని విధంగా చివరి ఓవర్లో అలాంటి అవకాశం వచ్చింది. నా గురించి ఒక్క శాతం కూడా తెలియనివారు ఏవేవో మాట్లాడారు. కష్టకాలం ఎప్పుడూ ఉండదు. గెలిచినా, ఓడినా ఒకేలా ఉండటం ముఖ్యం. నా ఆటనే నమ్ముకున్నా. ఇలాంటి ప్రదర్శన, గెలుపు రాసిపెట్టి ఉన్నాయి' అని పాండ్యా వ్యాఖ్యానించాడు. రోహిత్ రిటైర్మెంట్ నేపథ్యంలో మున్ముందు భారత టి20 జట్టుకు పాండ్యానే నాయకత్వం వహించే అవకాశాలు ఉన్నాయి.

క్వార్టర్ ఫైనల్లో జర్మనీ



దార్ట్‌మండ్: యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఆతిథ్య జర్మనీ జట్టు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జర్మనీ 2-0 గోల్స్ తేడాతో డెన్మార్క్ జట్టును ఓడించింది. ఆట 53వ నిమిషంలో హావెట్జ్ గోల్‌తో ఖాతా తెరిచిన జర్మనీ... 68వ నిమిషంలో ముసియాలా గోల్‌తో తమ ఆధిక్యాన్ని 2-0కు పెంచుకుంది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని ఈ టోర్నీలో పదోసారి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ ఇటలీ జట్టు కథ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. స్విట్జర్లాండ్ 2-0తో ఇటలీ జట్టును బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

'అద్భుత క్షణాలివి'



పదిహేడేళ్ల క్రితం... 20 ఏళ్ల కుర్రాడిగా రోహిత్ శర్మ తొలి టి20 వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్‌లో సభ్యుడిగా సంబరాలు చేసుకున్నాడు. అనంతరం ఇంతింతై... భారత జట్టులో కీలక సభ్యుడిగా ఎదిగాడు. ఆ తర్వాత టీమిండియా ఆడిన ఏడు నాకౌట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లలో సభ్యుడిగా ఉన్నాడు. కానీ ప్రతీసారి ఓటమి బాధే. అందులో చివరిదైతే మరింత గుండెకోతను మిగిల్చింది. ఇప్పుడు మరోసారి అలాంటి అవకాశం రావడంతో సహజంగానే ఆ 'ఒక్క విజయం' కోసం ఎంతో కోరుకున్నాడు. చివరకు దానిని సాధించగలిగాడు... 37 ఏళ్ల వయసులో రోహిత్ చిన్న పిల్లాడిగా మైదానంలో నేలపై పంచ్‌లతో తన భావోద్వేగాన్ని ప్రదర్శించాడు. తనకు ఈ విజయం అందించిన ఆనందం ఎలాంటిదో చూపించాడు. సగర్వంగా ట్రోఫీని అందుకొని మైమరచిపోయిన అతను తన తీపి విజయాన్ని అందరితో పంచుకున్నాడు. ఈ గెలుపుతో అంతర్జాతీయ టి20లనుంచి తప్పుకుంటున్నట్లుగా కూడా రోహిత్ ప్రకటించాడు.

టి20 వరల్డ్ కప్ విజయంపై రోహిత్ శర్మ భావోద్వేగం

- గెలవాలని ఎంతో కసిగా కోరుకున్నామని వ్యాఖ్య
- కెరీర్‌లోనే అది పెద్ద ఘనతగా అభివర్ణించిన కెప్టెన్
- అంతర్జాతీయ టి20లకు వీడ్కోలు

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): సారథిగా టి20 వరల్డ్ కప్‌ను గెలుచుకోవడం తన కెరీర్‌లో అతి పెద్ద ఘనతగా భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు. ఈ విజయాన్ని ఎంతగానో కోరుకున్నామని, అందుకే ఇది మరింత ఆనందాన్ని పంచుతోందని అతను అన్నాడు. వ్యక్తిగతంగా తాను సాధించిన పరుగులు, రికార్డులకు విలువ లేదని, జట్టు ట్రోఫీలు గెలవడమే అన్నింటికంటే ముఖ్యమని అతను అన్నాడు. 'టైటిల్ గెలవాలని నేను ఎంతో కోరుకున్నాను. అందుకే కావచ్చు ఈ ఫలితం చాలా గొప్పగా అనిపిస్తోంది. ఇవి అద్భుత క్షణాలని చెప్పగలను. ఇన్నేళ్లలో నేను చేసి పరుగులు పెద్ద విషయం కాదు. నేను గణాంకాలను కూడా పట్టించుకునే వ్యక్తిని కాను. ప్రతీసారి జట్టుకు ట్రోఫీని గెలిపించేందుకే చూశాను. ఇప్పుడు అది నా పక్కనే ఉంది. నా దృష్టిలో ఇది కచ్చితంగా అన్నింటికంటే గొప్ప ఘనత' అని రోహిత్ చెప్పాడు.

మాటల్లో చెప్పలేను...

మైదానంలో కింద పడిపోయి తాను చేసుకున్న సంబరాల గురించి చెప్పమంటే రోహిత్ ఉద్వేగంగా స్పందించాడు. 'దీనిని నేను ఎంతో కోరుకున్నాను. ఆ ఆనందాన్ని వర్ణించేందుకు తగిన మాటలు నా వద్ద లేవు. సరిగ్గా ఆ సమయంలో నా మనసులో ఏమనిపించిందో చెప్పలేను కానీ చాలా భావోద్వేగ సమయమది. ఆ క్షణాలను నేనే ఫొటోలో స్వయంగా బంధించగలిగితే బాగుండేదేమో. అది సాధ్యం కాదని తెలుసు కానీ దానిని ఎప్పటికీ మరచిపోలేను. ఇలాంటివాటి కోసమే ఎంతగానో ఎదురు చూస్తాం. దీనికి సన్నద్ధత అంటూ ఉండదు. అలా జరిగిపోతాయంతే. జీవితంలో కొన్ని కావాలని ఎంతో తపిస్తాం. ఇదీ అలాంటిదే. ఎట్టకేలకు గెలుపు గీత దాటడం చాలా ఆనందంగా ఉంది' అని 'హిట్ మ్యాన్' తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

రిటైర్ కావాలనుకోలేదు కానీ...

అంతర్జాతీయ టి20లకు గుడ్‌బై చెబుతున్నట్లు ఫైనల్ తర్వాత రోహిత్ ప్రకటించాడు. నిజానికి తాను ఇది ముందుగా అనుకోలేదని అతను వెల్లడించాడు. 'నా భవిష్యత్తు గురించి ఇలాంటి నిర్ణయాలు ముందుగా తీసుకోను. ఆ సమయంలో మనసులో ఏది అనుకుంటే అది చేస్తా. వన్డే వరల్డ్ కప్ తర్వాత కూడా ఈ వరల్డ్ కప్ ఆడతానా లేదా అని ఆలోచించలేదు. అంతర్జాతీయ టి20ల నుంచి అప్పుడే రిటైర్ కావాలనుకోలేదు. అయితే ఇప్పుడు పరిస్థితి అలాంటిది వచ్చింది. ఇది సరైన సమయంగా అనిపించింది. వరల్డ్ కప్ గెలిచి తప్పుకోవడంకంటే సరైన సమయం ఏముంటుంది' అని రోహిత్ అన్నాడు.

అంతా రాసి పెట్టి ఉంది...

ఇంతటి విజయం దక్కాలంటే అన్ని కలిసి రావాలని రోహిత్ వ్యాఖ్యానించాడు. 17 ఏళ్ల కెరీర్‌లో ఎంతో నేర్చుకున్నానని అతను చెప్పుకొచ్చాడు. 'ఏది రాసిపెట్టి ఉంటే అది జరుగుతుంది. ఇది మాకు రాసిపెట్టి ఉందని మాత్రం తెలుసు. అయితే అది ఎప్పుడు జరుగుతుందో తెలీదు. అందుకే ప్రయత్నం చేస్తాం. లేదంటే మాకు రాసి పెట్టి ఉంది కాబట్టి జరుగుతుంది అని కూర్చుండిపోయే వాళ్లం. ఫైనల్లో అన్నీ సరిగ్గా సరిపోయాయి. ఒకదశలో వారు సునాయాసంగా గెలుస్తున్నారని అనిపించింది. 2007లో టి20 వరల్డ్ కప్ విజయంతోనే నా ప్రయాణం మొదలై ఇప్పుడు టి20 వరల్డ్ కప్‌తోనే ముగియడం చాలా బాగుంది' అని అతను గుర్తు చేసుకున్నాడు.

రోహిత్ అంతర్జాతీయ టి20 కెరీర్ గ్రాఫ్

ఆడిన మ్యాచ్‌లు: 159	స్ట్రయిక్‌రేట్: 140.89
చేసిన పరుగులు: 4231	మొత్తం ఫోర్లు: 383
అత్యధిక స్కోరు: 121	మొత్తం సిక్స్‌లు: 205
సెంచరీలు: 5	క్యాచ్‌లు: 65
అర్ధ సెంచరీలు: 32	తీసిన వికెట్లు: 1

62 రోహిత్ 2017 నుంచి 2024 మధ్య 62 మ్యాచ్‌ల్లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ నాయకత్వంలో టీమిండియా 49 మ్యాచ్‌ల్లో గెలిచి, 12 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. వర్షం కారణంగా ఒక మ్యాచ్ రద్దయింది.

హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌పై...

వరల్డ్ కప్ విజయంలో కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ ఎంతో కీలక పాత్ర పోషించాడని రోహిత్ ప్రశంసించాడు. అతను జట్టు కోసం గత మూడేళ్లుగా ఎంతో కష్టపడ్డాడని కెప్టెన్ అభిప్రాయపడ్డాడు. 'మా అందరి కంటే కూడా ఈ ట్రోఫీని అందుకోగల అర్హత ద్రవిడ్‌కే ఉంది. ఆటగాడి రోజుల నుంచి జట్టు కోసం ఎంతో చేసిన ద్రవిడ్ కోసం టైటిల్ గెలవడం మా అందరికీ సంతోషంగా ఉంది. కొన్నిసార్లు ఆయన ఆలోచనను ఆటగాళ్లు అర్థం చేసుకోలేని పరిస్థితి వచ్చినప్పుడు ఎలాంటి భేషజాలు లేకుండా తనే వెనక్కి తగ్గి ప్లేయర్ల మాటకే విలువిచ్చాడు. ఆటగాళ్లకు వారి పాత్రపై చాలా స్పష్టతనిచ్చాడు. టీమ్‌లోని లేని ప్లేయర్లతో కూడా ఆయన మాట్లాడుతూ ఉండేవాడు. మళ్లీ జట్టులోకి వస్తే ఏం చేయాలో సూచించేవాడు' అని కోచ్‌పై రోహిత్ గౌరవం ప్రదర్శించాడు. అయితే కొన్నిసార్లు అభిప్రాయ భేదాలు సహజమన్న రోహిత్... ఫైనల్లో టాస్ గెలిస్తే బ్యాటింగ్ తీసుకోవాలని తానే పట్టుబట్టి తన మాటను చెల్లించుకున్నానని మాత్రం వెల్లడించాడు.

అందరి దృష్టి జొకోవిచ్‌పైనే

- 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురి
- నేటి నుంచి వింబుల్డన్ టోర్నీ



లండన్: టెన్నిస్ చరిత్రలోనే అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించేందుకు సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరోసారి ప్రయత్నించనున్నాడు. ఇప్పటికే కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన జొకోవిచ్ ఆస్ట్రేలియా క్రీడాకారిణి మార్గరెట్ కోర్ట్ (24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్) పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. నేడు మొదలయ్యే సీజన్ మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నీ వింబుల్డన్‌లో జొకోవిచ్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. ఇటీవల మోకాలి గాయం నుంచి కోలుకున్న జొకోవిచ్‌కు ప్రస్తుత ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ), డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) నుంచి గట్టిపోటీ ఎదురుకానుంది. ఏడుసార్లు వింబుల్డన్ టైటిల్ నెగ్గిన జొకోవిచ్, రెండుసార్లు రన్నరప్‌గా నిలిచాడు. ఈసారి తొలి రౌండ్‌లో క్వాలిఫయర్, ప్రపంచ 123వ ర్యాంకర్ విట్ కొప్రివా (చెక్ రిపబ్లిక్)తో జొకోవిచ్ తలపడతాడు. మరోవైపు భారత నంబర్‌వన్, ప్రపంచ 72వ ర్యాంకర్ సుమిత్ నగాల్ సోమవారం జరిగే తొలి రౌండ్‌లో కెచ్‌మనోవిచ్ (సెర్బియా)తో ఆడతాడు.



ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి విజేత రసెల్

స్పీల్‌బర్గ్: ఫార్ములావన్ తాజా సీజన్‌లో జోరు మీదున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్‌కు చుక్కెదురైంది. ఆదివారం జరిగిన ఆస్ట్రియా గ్రాండ్‌ప్రిలో 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. నిర్ణీత 71 ల్యాప్‌ల రేసును మెర్సిడెస్ జట్టు డ్రైవర్ జార్జి రసెల్ అందరికంటే ముందుగా ఒక గంటా 24 నిమిషాల 22.798 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో మెర్సిడెస్ జట్టుకిది తొలి విజయంకాగా, రసెల్ కెరీర్‌లో ఇది రెండో టైటిల్. ఆస్కార్ పియాస్ట్రి (మెక్‌లారెన్) రెండో స్థానంలో, కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) మూడో స్థానంలో, హామిల్టన్ (మెర్సిడెస్) నాలుగో స్థానంలో నిలిచారు. 24 రేసుల ఈ సీజన్‌లో 11 రేసులు ముగిశాక వెర్‌స్టాపెన్ 237 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. సీజన్‌లోని తదుపరి రేసు బ్రిటిష్ గ్రాండ్‌ప్రి ఈనెల 7న జరుగుతుంది.

రూ. 125 కోట్ల నజరానా

భారత జట్టుకు నగదు పురస్కారం ప్రకటించిన బీసీసీఐ

ముంబై: టి20 వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టుపై బీసీసీఐ కనకవర్షం కురిపించింది. అసాధారణ రీతిలో ఏకంగా రూ. 125 కోట్ల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఈ విషయాన్ని బోర్డు కార్యదర్శి జై షా వెల్లడించారు. తమ స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఆటగాళ్లు 140 కోట్ల భారతీయుల ఆకాంక్షను నెరవేర్చారని జై షా ప్రశంసించారు. 'రోహిత్ శర్మ అద్భుత నాయకత్వంలో అజేయంగా వరల్డ్ కప్ గెలిచి భారత్ చరిత్ర సృష్టించింది. విమర్శకులకు క్రికెటర్లు తగిన రీతిలో తమ ఆటతోనే సమాధానామిచ్చారు. ఈ ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకం. ప్రతిభ, పట్టుదల, పోరాటస్ఫూర్తితో ఈ జట్టు మనందరం గర్వపడేలా చేసింది. జట్టు సభ్యులు, ఇతర సహాయక సిబ్బందికి నా అభినందునలు. ఈ గెలుపు సందర్భంగా భారత జట్టుకు రూ. 125 కోట్ల ప్రైజ్‌మనీని బహుమతిగా ప్రకటిస్తున్నాం' అని జై షా పేర్కొన్నారు.

ప్రధాని మోదీ సంభాషణ...

మరోవైపు ఫైనల్ అనంతరం భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కోచ్ రాహుల్ ద్రవిడ్‌లతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో ప్రత్యేకంగా సంభాషించారు. గొప్ప విజయాన్ని సాధించినందుకు వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు. రోహిత్ దూకుడైన ఆటతీరు భారత్ క్రికెట్‌కు కొత్త దిశను చూపించిందని ప్రశంసించిన మోదీ... ఫైనల్ తరహాలోనే ఇన్నేళ్లుగా భారత బ్యాటింగ్‌ను నడిపించిన విరాట్ కోహ్లి ఇకపై కూడా కొత్త తరం క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలుస్తాడని అన్నారు. కోచ్‌గా ద్రవిడ్ అంకితభావం, వ్యూహాలు, కుర్రాళ్లను ప్రోత్సహించిన తీరు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాయని కూడా వ్యాఖ్యానించారు.

విరామం లేని సంబరాలు







వరల్డ్ కప్ విజయం తర్వాత భారత ఆటగాళ్ల ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆఖరి బంతి పడిన తర్వాత మొదలైన సంబరాలు దాదాపు నాలుగు గంటల పాటు సాగాయి. పాటలు, నృత్యాలతో ఆటగాళ్లంతా తమ ఆనందాన్ని ప్రదర్శించారు. ఒకదశలో జట్టు సహచరులే కాదు అక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న అభిమానులతోనూ ఆడిపాడి క్రికెటర్లు తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఒక ఫ్యాన్‌కు పంత్ తన షూస్‌ను బహుమతిగా ఇచ్చాడు. గ్రౌండ్ నుంచి డ్రెస్సింగ్ రూమ్‌లో, ఆ తర్వాత హోటల్‌లో కూడా ఈ వేడుకలు కొనసాగాయి. టీమిండియా సంప్రదాయంగా మార్చుకున్న 'బెస్ట్ ఫీల్డర్' అవార్డు కార్యక్రమంలో డ్రెస్సింగ్ రూమ్‌లో ఆహ్లాదంగా సాగింది. బౌండరీ వద్ద అసాధారణ క్యాచ్ అందుకున్న సూర్యకుమార్ మరో మాటకు తావు లేకుండా బెస్ట్ ఫీల్డర్‌గా నిలవగా... సంబరాల మధ్య జై షా చేతుల మీదుగా అతను ఈ మెడల్‌ను స్వీకరించాడు. సాధారణంగా ఎలాంటి భావాలు కనిపించకుండా ప్రశాంతంగా ఉంటే రాహుల్ ద్రవిడ్ కూడా ఈ ఆనందపు క్షణాల్లో అంతే ఉత్సాహంతో పాల్గొనడం విశేషం. జట్టు సభ్యులంతా తమ హెడ్ కోచ్‌ను ఎత్తుకొని తమ సంతోషాన్ని మరింత జోరుగా ప్రదర్శించారు. వరల్డ్ కప్ ట్రోఫీని తమ బెడ్ వద్దే ఉంచుకొని పడుకున్న చిత్రాలను కూడా రోహిత్ శర్మ, సూర్యకుమార్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. మరోవైపు బార్బడోస్‌ను పెను తుఫాన్ 'బెరిల్' ముంచెత్తింది. దాంతో బ్రిడ్జ్‌టౌన్ నుంచి బయటకు వెళ్లే అన్ని విమానాలు రద్దు అయ్యాయి. టీమిండియా ఆటగాళ్లు ముందుగా న్యూయార్క్‌కు వెళ్లి అక్కడి నుంచి భారత్‌కు రావాల్సి ఉంది. తుఫాన్ కారణంగా జట్టు బయలుదేరడం ఆలస్యం కావచ్చు.

స్నేహ్ రాణాకు 8 వికెట్లు

- పోరాడుతున్న దక్షిణాఫ్రికా
- సునె లుస్ సెంచరీ



చెన్నై: భారత మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్టులో ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవడానికి దక్షిణాఫ్రికా జట్టు పోరాడుతోంది. ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 232 పరుగులు సాధించింది. ఇన్నింగ్స్ పరాజయం తప్పించుకోవాలంటే దక్షిణాఫ్రికా మరో 105 పరుగులు వెనుకబడి ఉంది. నేడు మ్యాచ్‌కు చివరి రోజు. టాప్ ఆర్డర్ బ్యాటర్లు సునె లుస్ (109; 18 ఫోర్లు) సెంచరీ చేయగా... కెప్టెన్ లౌరా వోల్‌వార్ట్ (93 బ్యాటింగ్; 12 ఫోర్లు) శతకానికి చేరువైంది. వీరిద్దరు రెండో వికెట్‌కు 190 పరుగులు జోడించారు. లౌరాకు జతగా మరిజన్ కాప్ (15 బ్యాటింగ్) క్రీజులో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 236/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా జట్టు స్నేహ్ రాణా ఆఫ్ స్పిన్ వలలో చిక్కుకుంది. మరో 30 పరుగులు జోడించి మిగతా 6 వికెట్లు కోల్పోయి 266 పరుగులవద్ద ఆలౌటైంది.



30 ఏళ్ల స్నేహ్ రాణా 25.3 ఓవర్లలో 77 పరుగులిచ్చి 8 వికెట్లు పడగొట్టింది. తద్వారా మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా, భారత్ నుంచి రెండో బౌలర్‌గా స్నేహ్ గుర్తింపు పొందింది. 1995లో జంషెడ్‌పూర్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో భారత స్పిన్నర్ నీతూ డేవిడ్ 53 పరుగులిచ్చి 8 వికెట్లు... గత ఏడాది నాటింగ్‌హామ్‌లో ఇంగ్లండ్ జట్టుతో జరిగిన టెస్టులో యాష్లే గార్డ్‌నర్ 66 పరుగులిచ్చి 8 వికెట్లు తీసుకున్నారు.

జ్యోతి, నందినిలకు స్వర్ణాలు





పంచ్‌కులా (హరియాణా): జాతీయ సీనియర్ ఇంటర్ స్టేట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో చివరి రోజు తెలంగాణకు ఒక స్వర్ణం, ఆంధ్రప్రదేశ్‌కు ఒక స్వర్ణం, ఒక రజతం లభించాయి. మహిళల విభాగంలో ఏడు క్రీడాంశాల (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్లు) సమాహారమైన హెప్టాథ్లాన్‌లో తెలంగాణ క్రీడాకారిణి నందిని అగసార పసిడి పతకాన్ని దక్కించుకుంది. నందిని ఓవరాల్‌గా 5806 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో అంతర్జాతీయ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి యర్రాజీ విజేతగా నిలిచింది. వైజాగ్‌కు చెందిన జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును 13.06 సెకన్లలో ముగించి విజేతగా నిలిచింది. పురుషుల 200 మీటర్ల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన నలుబోతు షణ్ముగ శ్రీనివాస్ రజత పతకాన్ని సాధించాడు. ఫైనల్లో షణ్ముగ 20.95 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానాన్ని పొందాడు.

సింగిల్స్ ఫైనల్లో సహజ



లాస్ ఏంజెలిస్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ15 టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి ఫైనల్లోకి దూసుకెళ్లింది. రాచెల్ గైలిస్ (అమెరికా)తో జరిగిన సెమీఫైనల్లో సహజ 6-4, 6-0తో గెలుపొందింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో సహజ 6-1, 6-1తో కేట్ ఫాకి (అమెరికా)పై, రెండో రౌండ్‌లో 6-2, 6-4తో క్లారా కొసాన్ (అమెరికా)పై, తొలి రౌండ్‌లో 7-6 (7/1), 7-6 (7/4)తో ఎలైస్ వాగ్లే (అమెరికా)పై విజయం సాధించింది.

సెమీస్‌లో మాళవిక ఓటమి



టెక్సాస్: యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో బరిలో మిగిలిన భారత రైజింగ్ స్టార్ సెమీఫైనల్లో నిష్క్రమించింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో మాళవిక 16-21, 13-21తో నాత్సుకి నిదైరా (జపాన్) చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 17-21, 21-17, 19-21తో ఆరో సీడ్ రుయ్ హిరోకామి-యునా కాటో (జపాన్) జంట చేతిలో పరాజయం పాలైంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	210	79,033
నిఫ్టీ ▽	34	24,011

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,733	▽	126
డోజోన్స్	39,119	▽	45
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,164	▽	16
డాక్స్	18,235	△	16
షాంఘై	2,946	▽	27
నికాయ్	39,342	▽	326

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.09	84.11
£	బ్రిటన్ పౌండ్		104.84	107.40
€	యూరో		88.58	90.54
¥	జపాన్ ఎన్ (100)		51.88	53.01
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.71	56.65
S$	సింగపూర్ డాలర్		59.25	63.94
SAR	సౌదీ రియాల్		21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్		21.83	23.61
¥	చైనా యువాన్		10.37	12.44


ఐటీ రిటర్న్స్.. చలో ఆన్‌లైన్!

రిటర్నుల దాఖలు ఎంతో ఈజీ

- అందుబాటులో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు
- ఆదాయపన్ను శాఖ నుంచి వీటికి అనుమతి
- కొంత చార్జీతో నిపుణుల సలహా సూచనలు
- పెట్టుబడుల విషయంలోనూ మార్గనిర్దేశం

ఆదాయపన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేయాల్సిన తరుణం ఆసన్నమైంది. జూలై 31 తుది గడువు. చివరి రోజు వరకు ఆగకుండా ముందుగా రిటర్నులు దాఖలు చేయడం సూచనీయం. చాలా మందికి రిటర్నుల విషయంలో ఎన్నో సందేహాలు వస్తుంటాయి. వేరొకరి సాయం తీసుకుంటుంటారు. కానీ, ఎవరికివారే ఆదాయపన్ను శాఖ ఈ–ఫైలింగ్ పోర్టల్ ద్వారా రిటర్నులను ఎలక్ట్రానిక్ రూపంలో సమర్పించొచ్చు. ఈ–ఫైలింగ్ పోర్టల్‌ను యూజర్లకు అనుకూలంగా మార్చేందుకు ఆదాయపన్ను శాఖ ఎన్నో చర్యలు చేపట్టినప్పటికీ, ఐటీఆర్ దాఖలు ప్రక్రియ అర్థం కాని వారు చాలా మందే ఉంటారు. ఇలాంటి వారికి ఉన్న మెరుగైన ప్రత్యామ్నాయ మార్గం.. మధ్యవర్తిత్వ సంస్థల సాయం తీసుకోవడం. వీటి ద్వారా చాలా సులభంగా రిటర్నులు దాఖలు చేయవచ్చు. ఈ విషయంలో ఇవి మెరుగైన సేవలను అందిస్తున్నాయి. వీటి గురించి తెలియజేసే ప్రయత్నమే ఈ వారం ప్రాఫిట్ ప్లస్ కథనం.

ఈఆర్‌ఐలు



ఈ–రిటర్న్ ఇంటర్‌మీడియరీలు (ఈఆర్‌ఐలు) ఎలక్ట్రానిక్ రూపంలో పన్ను రిటర్నులు వేసేవారికి కావాల్సిన అన్ని రకాల సేవలు అందిస్తున్నాయి. ఇవి అనుసంధానకర్తగా వ్యవహరిస్తాయి. సాఫ్ట్‌వేర్ ఆధారితంగా నడిచే ప్లాట్‌ఫామ్‌లు. వీటి ద్వారా ఎవరైనా రిటర్నులు సమర్పించొచ్చు. పన్ను చెల్లింపుదారుల తరఫున పన్ను రిటర్నుల దాఖలుకు ఐటీ శాఖ నుంచి వీటికి అనుమతి ఉంది. క్లియర్‌ట్యాక్స్, క్వికో, ట్యాక్స్‌బడ్డీ, మైఐటీ రిటర్న్, ఈజెడ్‌ట్యాక్స్, ట్యాక్స్2విన్ ఇవన్నీ ఈఆర్‌ఐలే. రిటర్నుల ఆటోఫిల్, రివ్యూ, ఈ–ఫైల్.. ఇలా మూడంచెల్లోనే రిటర్నులను సమర్పించొచ్చు. పన్ను రిటర్నులు వేయడం ఇంత సులువా? అనేలా ఇవి సేవలు అందిస్తున్నాయి.

సౌకర్యం..



ఇవి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు కావడంతో పన్ను చెల్లింపుదారులు తమ ఇంటి నుంచే ఖాళీ సమయంలో సులభంగా రిటర్నులు దాఖలు చేయవచ్చు. వీటి యూజర్ ఇంటర్‌ఫేస్ అర్థం చేసుకునేందుకు సులభంగా, సమకాలీనంగా ఉంటుంది. అందుకే ఇటీవలి కాలంలో ఈ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించుకునే వారు పెరుగుతున్నారు. మొబైల్ యాప్‌ల నుంచి రిటర్నులు వేసే సౌకర్యాన్ని సైతం అందిస్తున్నాయి. క్వికో అయితే యూపీఐ ద్వారా పన్ను చెల్లించే సదుపాయాన్ని ఆఫర్ చేస్తోంది. పాన్, ఆధార్, బ్యాంక్ స్టేట్‌మెంట్, ఫామ్ 16 పత్రాల కాపీలను దగ్గర ఉంచుకుంటే, రిటర్నులు వేగంగా సమర్పించొచ్చు. ఈ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపై మూలధన లాభాలు ఉన్న వారూ ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా రిటర్నులు సులభంగానే దాఖలు చేసుకోవచ్చు. ప్రముఖ స్టాక్ బ్రోకర్లతో వీటికి ఒప్పందం ఉంది. కనుక పన్ను చెల్లింపుదారుల సమ్మతితో వారికి సంబంధించి క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ వివరాలను బ్రోకర్ల సర్వర్ల నుంచి సెకన్ల వ్యవధిలో తీసుకుని రిటర్నుల పత్రంలో నమోదు చేస్తాయి. కనుక వీటిని విడిగా నమోదు చేయాల్సిన ఇబ్బంది ఉండదు. అందుకే తమ స్టాక్ బ్రోకర్‌తో టైఅప్ ఉన్న ఈఆర్‌ఐని ఎంపిక చేసుకోవాలి. లేదంటే విడిగా ప్రతీ పెట్టుబడికి సంబంధించిన కొనుగోలు తేదీ, ధర, విక్రయం తేదీ, ధర తదితర వివరాలు నమోదు చేయాల్సి వస్తుంది.

సేవలకు చార్జీలు...

ఈ ప్లాట్‌ఫామ్‌లు రిటర్నుల దాఖలుకు కొంత చార్జీ వసూలు చేస్తున్నాయి. నిపుణుల సహకారం లేకుండా సొంతంగా రిటర్నుల ఫైలింగ్‌కు చార్జీ రూ.200 నుంచి రూ.1,600 వరకు ఉంది. ఆదాయస్థాయికి అనుగుణంగా ఈ చార్జీ మారుతుంది. కొన్ని ప్లాట్‌ఫామ్‌లు పన్ను చెల్లింపుదారులు సొంతంగా రిటర్నులు దాఖలు చేసుకుంటే ఎలాంటి చార్జీ తీసుకోవడం లేదు. నిపుణుల సాయం తీసుకుని, రిటర్నులు వేయాలనుకుంటే చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఈఆర్‌ఐ సంస్థలకు యూట్యూబ్ చానళ్లు ఉన్నాయి. ప్లాట్‌ఫామ్ సేవలను ఎలా వినియోగించుకోవచ్చన్న దానిపై వీడియోలు చూసి తెలుసుకోవచ్చు. వ్యక్తిగత ఆర్థిక అంశాలపై సమాచారం అందించే వీడియోలు సైతం అక్కడ లభిస్తాయి.

డేటా భద్రత సంగతి?



ఈఆర్‌ఐలు అన్నీ కూడా పన్ను చెల్లింపుదారులకు సంబంధించి సున్నితమైన వ్యక్తిగత డేటాను పెద్ద మొత్తంలో కలిగి ఉంటాయి. కనుక ఆయా ప్లాట్‌ఫామ్‌ల భద్రత ఎంతన్నది ముందే విచారించుకోవాలి. పన్ను చెల్లింపుదారుల సమాచారాన్ని మరొకరితో పంచుకోవడం లేదా విక్రయించడం చేయబోమని ఈ వేదికలు హామీ ఇస్తున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లు టెక్నాలజీ, భద్రత కోసం తగినంత ఖర్చు చేయాల్సి వస్తుంది. వీటి విషయంలో రాజీకి అవకాశం లేదు.

అన్ని విధాలా సహకారం

పన్ను అంశాల్లో పూర్తి సహకారం అందించేందుకు ఇవి సిద్ధంగా ఉంటాయి. పాత, కొత్త పన్ను విధానాల్లో ఏది అనుకూలం? వ్యక్తి ఆదాయ వనరుల ఆధారంగా దాఖలు చేయాల్సిన ఐటీఆర్ పత్రాన్ని ఈఆర్‌ఐ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఎంపిక చేస్తుంది. కేవలం వేతనమే కాదు, ఈక్విటీలు, ఎఫ్ అండ్‌వో ఆదాయం, విదేశీ ఆస్తుల ద్వారా ఆదాయం ఇలా భిన్న రూపాల్లో ఆదాయ వనరులు ఉన్న వారికి ఐటీఆర్ పత్రం ఎంపికను ఇవి సులభతరం చేస్తాయి. రిటర్నులు దాఖలు చేయడమే కాదు, ఈ వెరిఫికేషన్‌ను కూడా అక్కడే పూర్తి చేయవచ్చు. ట్యాక్స్‌బడ్డీ ప్లాట్‌ఫామ్ ద్వారా రిటర్నులు వేసినట్టయితే.. ఒకవేళ ఆదాయపన్ను శాఖ నుంచి నోటీసులు వస్తే, పన్ను చెల్లింపుదారులకు తెలియజేయడం, నోటీసుకు ఇవ్వాల్సిన సమాధానం విషయంలోనూ సహకారం లభిస్తుంది. ఈఆర్‌ఐ ప్లాట్‌ఫామ్‌లపై రిటర్నుల దాఖలుకు సంబంధించి రెండు స్కీమ్‌లు ఉంటాయి. ఒకటి సొంతంగా దాఖలు చేసుకోవడం. రెండోది నిపుణుల సహకారంతో దాఖలు చేసుకోవడం. కొంత చార్జీ చెల్లించి పన్ను నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్ల సహకారాన్ని రిటర్నుల విషయంలో తీసుకోవచ్చు. వర్చువల్‌గా నిపుణులతో సమావేశమై సందేహాలు తీర్చుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ ట్యాక్స్ విషయంలోనూ ఈ ప్లాట్‌ఫామ్‌లు సాయం అందిస్తున్నాయి.. అంతే కాదు ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద పన్ను మినహాయింపులు, పన్ను తగ్గింపు ప్రయోజనాలు పొందడానికి వీలుగా పెట్టుబడుల విషయంలోనూ సలహాలు తీసుకోవచ్చు. జీవిత బీమా, ఆరోగ్య బీమా, ఎన్‌పీఎస్, ఈఎల్‌ఎస్‌ఎస్, పన్ను ఆదా డిపాజిట్లలో పెట్టుబడులపై సహకారం లభిస్తుంది.



రిటర్నులు ఎవరు వేయాలి?

వార్షిక ఆదాయం రూ.2,50,000 వరకు ఉన్న వారు పన్ను పరిధిలోకి రారు. పాత పన్ను విధానంలో ప్రాథమిక మినహాయింపు ఆదాయ పరిమితి రూ.2,50,000. అదే కొత్త పన్ను విధానంలో అయితే వార్షికాదాయం రూ.3,00,000 మించని వారు పన్ను రిటర్నులు దాఖలు చేయనవసరం లేదు. ఇంతకు మించి ఆదాయం కలిగిన ప్రతి ఒక్కరూ రిటర్నులు విధిగా దాఖలు చేయాల్సిందే. అయితే పన్ను చెల్లించే ఆదాయం లేకపోయినప్పటికీ, కొన్ని సందర్భాల్లో రిటర్నులు దాఖలు చేయాలని చట్టంలోని సెక్షన్ 139 స్పష్టం చేస్తోంది.

ఏ సందర్భాల్లో రిటర్నులు వేయాలి..? (సెక్షన్ 139)

- → విదేశీ కంపెనీల్లో పెట్టుబడులు (షేర్లు) కలిగి ఉన్న వారు రిటర్నులు దాఖలు చేసి, అందులో ఆ వివరాలు పేర్కొనాలి. విదేశీ కంపెనీల్లోని వాటాల ద్వారా వచ్చే డివిడెండ్ వివరాలను సైతం వెల్లడించాలి. విదేశీ కంపెనీల బాండ్లు, విదేశాల్లో ఇల్లు, ఆ ఇంటి నుంచి అద్దె ఆదాయం వస్తున్న ప్రతి ఒక్కరూ రిటర్నులు దాఖలు చేయాలని సెక్షన్ 139(1) చెబుతోంది. భారత్‌కు వెలుపల ఏ దేశంలో అయినా అకౌంట్‌కు సంతకం చేసే అధికారం కలిగి ఉన్న వారు కూడా రిటర్నులు వేయాలి. తన పేరు మీద ఇన్వెస్ట్ చేసినా లేదా తల్లిదండ్రుల పేరు మీద విదేశాల్లో ఇన్వెస్ట్ చేసినా సరే.. రిటర్నుల దాఖలు తప్పదు.
- → ఒక వ్యక్తి తాను, తన జీవిత భాగస్వామి, లేదా ఇతరుల (తల్లిదండ్రులు తదితర) విదేశీ పర్యటనల కోసం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షలు, అంతకుమించి ఖర్చు చేసినట్టయితే రిటర్నులు వేయాల్సి ఉంటుంది.
- → ఒక ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ బిల్లుల మొత్తం రూ.లక్ష దాటినా సరే రిటర్నుల దాఖలు తప్పనిసరి.
- → మూలధన లాభాలపై పన్ను మినహాయింపు కోరుకునే వారు రిటర్నులు దాఖలు చేయాలి.
- → మూలం వద్దే పన్ను కోత (టీడీఎస్), మూలం వద్దే పన్ను వసూళ్లు (టీసీఎస్) ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.25,000, అంతకుమించి ఉంటే రిటర్నులు వేయాలని ఆదాయపన్ను శాఖ 2022 ఏప్రిల్ నాటి నోటిఫికేషన్ స్పష్టం చేస్తోంది. ఇదే నోటిఫికేషన్ ప్రకారం.. ఒక ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలో రూ.50లక్షలు అంతకుమించి డిపాజిట్ చేసిన సందర్భాల్లో, వ్యాపార టర్నోవర్ లేదా వ్యాపారం నుంచి రావాల్సిన మొత్తం రూ.60లక్షలు మించి ఉన్నా రిటర్నులు దాఖలు చేయాల్సిందే.
- → స్వయం ఉపాధిలోని వారు కరెంట్ ఖాతా కలిగి, అందులో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి డిపాజిట్ చేసిన సందర్భంలోనూ రిటర్నులు వేయాలి.
- → వడ్డీ ఆదాయం, డివిడెండ్లపై టీడీఎస్ అమలు చేస్తుంటారు. పన్ను చెల్లించేంత ఆదాయం లేని వారు, ఇలా టీడీఎస్ రూపంలో మినహాయించినది తిరిగి పొందాలంటే (రిఫండ్), ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది.

గడువులోపు రిటర్నులు వేయకపోతే?

జూలై 31 తర్వాత రిటర్నులు దాఖలు చేసే వారు సెక్షన్ 234ఎఫ్ కింద పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉన్న వారికి రూ.1,000, రూ.5 లక్షలు మించి ఆదాయం ఉంటే రూ.5,000 పెనాల్టీ కింద చెల్లించాలి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-7-2024	
విశాఖ	545–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525–00
వరంగల్	527–00
రిటైల్ ధర	5.85

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ ఎనర్జీ ఆపర్చునిటీస్ ఫండ్



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ తాజాగా ఎనర్జీ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఎన్‌ఎఫ్‌వో జూలై 2న ప్రారంభమై 16తో ముగుస్తుంది. ఇది సంప్రదాయ, కొత్త తరహా ఇంధన పరిశ్రమలకు చెందిన సంస్థలు, అనుబంధ వ్యాపారాల్లోని కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేస్తుందని సంస్థ ఈడీ శంకరన్ నరేన్ తెలిపారు. తద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు అందించడంపై ఈ ఫండ్ దృష్టి పెడుతుందన్నారు. ప్రస్తుతం అంతా పునరుత్పాదక విద్యుత్ వైపు మళ్ళుతున్న నేపథ్యంలో ఈ విభాగంలో పెట్టుబడుల వృద్ధికి గణనీయంగా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

యాక్సిస్ ఎంఎఫ్ నుంచి నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్



యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జూలై 9తో ముగుస్తుంది. ఇది ఎన్‌ఎస్‌ఈలో లిస్టయిన టాప్–500 కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని కల్పిస్తుంది. కనీసం రూ. 100 నుంచి ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. లార్జ్ క్యాప్ స్టాక్స్‌లో 73%, మిడ్ క్యాప్‌లో 17%, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో 10% వరకు ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ క్యాప్‌లవ్యాప్తంగా డైవర్సిఫికేషన్ కోరుకునే దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు, తక్కువ వ్యయాలతో కూడుకున్న ప్యాసివ్ పెట్టుబడి వ్యూహాన్ని అనుసరించదల్చుకున్నవారికి, సరళమైన పెట్టుబడి సాధనం కావాలనుకునే కొత్త ఇన్వెస్టర్లకు ఈ ఫండ్ అనువైనదని యాక్సిస్ ఏఎంసీ ఎండీ బి. గోపకుమార్ తెలిపారు.


ఈ వారం 2 లిస్టింగ్‌లు, 2 ఐపీవోలు

- 2న అలైడ్ బ్లెండర్స్, 3న వ్రజ్ ఐరన్ లిస్టింగ్
- 3నే ఎమ్‌క్యూర్ ఫార్మా, బన్సల్ వైరింగ్ ఇష్యూలు షురూ



న్యూఢిల్లీ: ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో 4 ఐపీవోలు హడావిడి చేయనున్నాయి. గత వారమే ఇష్యూలు పూర్తి చేసుకున్న అలైడ్ బ్లెండర్స్ 2న, వ్రజ్ ఐరన్ 3న స్టాక్ ఎక్స్చేంజీలలో లిస్టకానున్నాయి. ఇక మరోపక్క ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్, బన్సల్ వైరింగ్ పబ్లిక్ ఇష్యూలు 3నే ప్రారంభంకానున్నాయి. ఆఫీసర్స్ చాయిస్ విస్కీ బ్రాండ్ కంపెనీ అలైడ్ బ్లెండర్స్ రూ. 281 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 1,500 కోట్లు అందుకుంది. స్పాంజ్ ఐరన్, టీఎంటీ బార్ల తయారీ కంపెనీ వ్రజ్ ఐరన్ అండ్ స్టీల్ షేరుకి రూ. 207 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 171 కోట్లు అందుకుంది. జూలై 5న ముగియనున్న స్టీల్ వైర్ల తయారీ కంపెనీ బన్సల్ వైర్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 243–256 ధరల శ్రేణిని ప్రకటించింది. మొత్తం రూ. 745 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయడం ద్వారా రూ. 745 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. రిటైలర్లు కనీసం 58 షేర్లకు దరఖాస్తు చేయవలసి ఉంటుంది. హెల్త్‌కేర్ రంగ కంపెనీ ఎమ్‌క్యూర్ ఫార్మా పబ్లిక్ ఇష్యూకి రూ. 960–1008 ధరల శ్రేణిని ప్రకటించింది. 5న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.14 కోట్ల షేర్ల(రూ. 1,152 కోట్ల విలువ)ను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 1,952 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. రిటైలర్లు కనీసం 14 షేర్లకు దరఖాస్తు చేయవలసి ఉంటుంది.

ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోలు.. లిస్టింగ్ లాభాలొస్తాయా?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ 65 శాతం నుంచి 85 శాతం వరకు ఈక్విటీలలో, మిగిలినది ఫిక్స్‌డ్ ఇన్‌కమ్‌లో ఇన్వెస్ట్ చేయడం తప్పనిసరి అని విన్నాను. అలాంటప్పుడు ఈక్విటీ పెట్టుబడులను వివిధ మార్కెట్ విలువల పరిధిలోని స్టాక్స్‌లోనూ ఇన్వెస్ట్ చేయడం కూడా తప్పనిసరా? లేక ఫ్లెక్సీక్యాప్ మాదిరిగా పెట్టుబడుల విషయంలో ఫండ్ మేనేజర్‌కు స్వేచ్ఛ ఉంటుందా? అలాగే, డెట్ పెట్టుబడులకు సంబంధించి తప్పనిసరి నిర్బంధం ఏదైనా ఉందా?

– గౌరవ్ గుప్తా

అగ్రెస్సివ్ హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్ పథకాలకు సంబంధించి ఈక్విటీ పెట్టుబడుల పరంగా మార్కెట్ విలువ విషయంలో ఎలాంటి నిర్బంధాలు లేవు. అందుకే ఈ పథకాలు ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. కాకపోతే అధిక శాతం పెట్టుబడులను లార్జ్‌క్యాప్ కంపెనీలకు కేటాయిస్తుంటాయి. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ ఈక్విటీకి కేటాయించే మొత్తం పెట్టుబడుల్లో 76 శాతాన్ని లార్జ్‌క్యాప్‌లోనే ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఇక మిడ్‌క్యాప్ కంపెనీలకు 15 శాతం వరకు, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 8 శాతం వరకు కేటాయిస్తుంటాయి. అదే ఫ్లెక్సీక్యాప్ పథకాలను గమనించినట్టయితే అవి సగటున 71 శాతం వరకు లార్జ్‌క్యాప్ కంపెనీలకు, 19 శాతం మిడ్‌క్యాప్ కంపెనీలకు, 10 శాతం వరకు స్మాల్‌క్యాప్ కంపెనీలకు కేటాయిస్తుంటాయి. ఇక అగ్రెస్సివ్ హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్ పథకాలు డెట్ సాధనాలకు సంబంధించి ఫలానా విధంగా ఇన్వెస్ట్ చేయాలన్న నిర్బంధం కూడా లేదు. కాకపోతే ఇవి డెట్ పెట్టుబడుల్లోనూ నాణ్యతకే ప్రాధాన్యం ఇస్తుంటాయి. 80 శాతం వరకు అధిక రేటింగ్ సాధనాలైన ఎస్‌వోవీలు, ఏఏఏ, ఏప్లస్, ఏఏప్లస్ వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. మీరు ఇన్వెస్ట్ చేసిన, చేయాలనుకుంటున్న పథకానికి సంబంధించి అసెట్ అలోకేషన్ (పెట్టుబడుల కేటాయింపులు) వివరాలను వ్యాల్యూరీసెర్చ్ వెబ్‌సైట్ నుంచి చూసి తెలుసుకోవచ్చు.



ఐపీవో అనంతరం లిస్టింగ్‌లో కంపెనీలు ఇస్తున్న బంపర్ లాభాల మాదిరే.. ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోల్లోనూ లిస్టింగ్ లాభాలు సాధ్యమేనా?

– వరుణ్ ప్రకాశ్

ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోలూ లిస్టింగ్‌లో లాభాలు ఇవ్వొచ్చు. కానీ, గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) మార్కెట్లో చూస్తున్నంత లిస్టింగ్ లాభాలు వీటిల్లో ఉండవు. పరాస్ డిఫెన్స్ కంపెనీని గుర్తు తెచ్చుకోండి. లిస్టింగ్ రోజే 185 శాతం లాభాలను ఇచ్చింది. టాటా టెక్నాలజీస్ కూడా 162.85 శాతం లాభంతో లిస్ట్ అయింది. ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోలలో అంత లాభాలు ఉండకపోవడానికి కారణం వాటి నిర్మాణం స్టాక్స్‌తో పోల్చితే పూర్తి భిన్నంగా ఉండడం వల్లే. ఈటీఎఫ్‌లు (ప్యాసివ్ ఫండ్స్) కేవలం అవి ఇన్వెస్ట్ చేసే సూచీల పనితీరునే ప్రతిబింబించగలవు. సూచీల నిర్మాణానికి తగినట్టుగానే వాటి యూనిట్ల పనితీరు ఉంటుంది. అందుకే వాటి లిస్టింగ్ లాభాలు సాధారణంగానే ఉంటాయి. ఈటీఎఫ్‌లకు అధిక డిమాండ్ ఉన్నప్పటికీ లిస్టింగ్ రోజున లాభాలు గణనీయంగా ఉండవు. 2002 నుంచి 2024 మధ్యకాలంలో 150 ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోలు మార్కెట్లోకి వచ్చాయి. వీటిని పరిశీలించినప్పుడు.. 90 ఈటీఎఫ్ యూనిట్లు లిస్టింగ్ రోజు ముగింపు ప్రీమియంతోనే ఉంది. చాలా వరకు 0–5 శాతం మధ్య ప్రీమియంతో ముగిశాయి. కేవలం 11 ఈటీఎఫ్‌లే లిస్టింగ్ రోజున ఇష్యూ ధరకంటే 5 శాతానికి పైగా లాభంతో ముగిశాయి. లిస్టింగ్ రోజున గణనీయమైన లాభాలు ఆశించే వారికి ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోలు తగినవి కావు.

వెస్ట్ కోస్ట్ పేపర్	ఏయూఎం క్యాపిటల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 670
టార్గెట్: రూ. 859



ఎందుకంటే: ప్రింటింగ్, రైటింగ్ పేపర్ దిగ్గజం వెస్ట్‌కోస్ట్ పేపర్ మిల్స్ డైవర్సిఫైడ్ ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. అత్యంత నాణ్యమైన రైటింగ్, ప్రింటింగ్ పేపర్‌ను 52 నుంచి 140 జీఎస్‌ఎం వరకూ తయారు చేస్తోంది. ఆధునిక ప్రింట్ సంస్థలకు అనుకూలమైన పేపర్‌ను అందిస్తోంది. కమర్షియల్ నుంచి ప్రీమియం ప్రింటింగ్ వరకూ వీటికి అందుబాటు ధరల్లో నాణ్యమైన పేపర్ కావలసి ఉంటుంది. హైఎండ్ అప్లికేషన్స్‌లో వినియోగించే ఉత్పత్తుల విలువ జోడింపుతోపాటు, కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన(కస్టమైజ్‌డ్), ప్రత్యేకత కలిగిన ప్రొడక్టులను రూపొందించడంలో పటిష్టతను ప్రదర్శిస్తోంది. అంతేకాకుండా సమయానుగుణంగా చేపడుతున్న ఇతర సంస్థల వ్యూహాత్మక కొనుగోళ్ల ద్వారా దేశీ పేపర్ మార్కెట్లో బలపడుతూ వస్తోంది. ఇంతక్రితం అంటే 2020లో ఆంధ్రా పేపర్‌లో మెజారిటీ వాటాను సొంతం చేసుకుంది. పేపర్ తయారీలో 2,41,000 ఎంటీపీఏ సామర్థ్యంగల ఆంధ్రా పేపర్‌లో ప్రస్తుతం వెస్ట్ కోస్ట్ వాటా 72 శాతానికి చేరింది. 2023 సెప్టెంబర్‌లో యూనిప్లై డెకార్‌ను కొనుగోలు చేసేందుకు జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) నుంచి అనుమతిని పొందింది. ఇతర సంస్థల కొనుగోళ్లసహా ఉత్పత్తికి అవసరమయ్యే ముడిసరుకుల సరఫరాలు తదితరాలను సొంతంగా(బ్యాక్‌వార్డ్ ఇంటిగ్రేషన్) సమకూర్చుకోవడం ద్వారా కార్యకలాపాలను పూర్తిస్థాయిలో సమీకృతం చేసింది. తద్వారా మార్కెట్లో తన పొజిషన్‌ను మరింత పటిష్టపరచుకుంటోంది. అవసరమైన ముడిసరుకులను పూర్తిగా దేశీయంగానే సమకూర్చుకుంటూ వ్యయాలను క్రమబద్ధీకరించింది. కొత్త జాతీయ విద్యా విధానం, ఈకామర్స్‌లో భారీ వృద్ధి పేపర్ పరిశ్రమకు అన్నివిధాల సానుకూల అంశాలుగా నిలవనున్నాయి.

నియోజెన్ కెమికల్స్	హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,588
టార్గెట్: రూ. 1,936



ఎందుకంటే: బ్రోమైన్, లిథియం ఆధారిత స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ నియోజెన్ కెమికల్స్ అధిక వృద్ధి బాటలో సాగనుంది. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం 2024–2030 మధ్య కాలంలో కంపెనీ లాభార్జన వార్షిక ప్రాతిపదికన 43 శాతం చొప్పున జంప్ చేయనుంది. రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్‌వోఈ) 2024లో నమోదైన 6 శాతం నుంచి 2030కల్లా 23 శాతం మెరుగుపడనుంది. కంపెనీకిగల బ్యాటరీ మెటీరియల్ బిజినెస్ నుంచి కొత్తతరం(న్యూఏజ్) కెమికల్స్ వేగవంత వృద్ధికి దోహదం చేయనున్నాయి. ఇందుకు ప్రధానంగా మిత్సుబిషి ఐయానిక్ సొల్యూషన్స్(ఎంయూఐఎస్) తోడ్పాటు నివ్వనుంది. 2026 ద్వితీయార్ధానికల్లా టెక్నాలజీ ఆధారిత ఎలక్ట్రోలైట్ తయారీ ప్లాంటు కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశముంది. దీంతో ఎలక్ట్రోలైట్ తయారీలో నియోజెన్ కెమికల్స్ సామర్థ్యం 16 రెట్లు దూసుకెళ్లనుంది. 32,000 ఎంటీపీఏకు చేరనుంది. గతేడాది(2023–24) దేశీయంగా ఎలక్ట్రోలైట్‌కు 10,600 ఎంటీపీఏ డిమాండ్ నమోదైంది. ఇది పూర్తిస్థాయిలో బ్యాటరీ ప్యాక్‌ల ద్వారా ప్రత్యక్షంగా దిగుమతుల ద్వారా లభ్యమైంది. 2030కల్లా ఎలక్ట్రోలైట్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 39 శాతం చొప్పున పుంజుకోనున్నట్లు అంచనా. వెరసి 2030కల్లా 77,000 ఎంటీపీఏను తాకనుంది. ఫలితంగా న్యూఏజ్ కెమికల్స్ పరిశ్రమలో ముందస్తు తయారీ కంపెనీగా నిలవనున్న నియోజెన్ కెమికల్స్‌కు అదనపు ప్రయోజనం చేకూరనుంది. అంతేకాకుండా ఎలక్ట్రోలైట్ తయారీలో దేశీయంగా అతిపెద్ద కంపెనీగా అవతరించనుంది. ఈ బాటలో 2030కల్లా బ్యాటరీ మెటీరియల్స్ బిజినెస్ నుంచి రూ. 3,000 కోట్ల అమ్మకాలు సాధించనుంది. అంటే ఆదాయంలో 72 శాతం వాటా సమకూరనుంది. దీంతో వర్కింగ్ క్యాపిటల్ సైకిల్ ప్రస్తుత 210 రోజుల నుంచి 32 రోజులకు దిగిరానుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

యాదాద్రిలో జస్టిస్ ప్రియదర్శిని



హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రియదర్శినికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రియదర్శిని కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ట అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తుల వద్ద అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. జడ్జి జస్టిస్ ప్రియదర్శిని, కుటుంబ సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

సాక్షి, హైదరాబాద్: యూపీఎస్సీ నిర్వహించనున్న సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎస్టీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షలు మించరాదని, రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 7వ తేదీ వరకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు గిరిజన సంక్షేమ శాఖ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, ఫోన్ 6281766534 నంబర్‌లో ప్రభుత్వ కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

పాలిటెక్నిక్‌లో 20,890 మందికి సీట్లు

సాక్షి, హైదరాబాద్: పాలిసెట్‌లో అర్హత పొందిన వారిలో ఆదివారం తొలి దశ కౌన్సెలింగ్‌లో 20,890 మందికి సీట్లు కేటాయించారు. ఈ ఏడాది మొత్తం 60,728 మంది పాలిసెట్ అర్హత సంపాదించారు. కౌన్సెలింగ్‌లో 23,991 మంది పాల్గొనగా 5,45,679 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఆప్షన్లు ఇచ్చిన వారిలో 20,890 మందికి సీట్లు కేటాయించగా.. ఇంకా 8,041 సీట్లు మిగిలిపోయాయి. సీట్లు వచ్చిన విద్యార్థులు జూలై 4వ తేదీలోగా ఫీజు చెల్లించి, 13వ తేదీలోగా కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని అధికారులు సూచించారు.

ఫీజు బకాయిలు చెల్లించండి

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దాదాపు నాలుగేళ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేయలేదని, ఉపకార వేతనాల బకాయిలు సైతం ఉన్నాయని వివరించారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

నేటినుంచి పూర్తిస్థాయి డిజిటల్ పాఠాలు

- టి–సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తిస్థాయి డిజిటల్ పాఠాలు అందించనున్నట్లు టి–సాట్ సీఈవో బి.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఒకటి నుండి 10వ తరగతి విద్యార్థులకు పూర్తి స్థాయి పాఠ్యాంశాలను ప్రసారం చేసేందుకు ఖరారైన షెడ్యూల్‌ను ఆయన విడుదల చేశారు. పదిహేను రోజులుగా బ్రిడ్జ్ కోర్స్ పాఠ్యాంశాలు ప్రసారం చేసిన టి–సాట్.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 223 పాఠశాలల పని రోజుల్లో 749 గంటల కంటెంట్‌ను 1,498 పాఠ్యాంశ భాగాలుగా విద్యా చానల్లో ప్రసారం చేస్తున్నట్లు సీఈవో వివరించారు. పాఠశాలల పని రోజుల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు టి–సాట్ విద్య చానల్‌లో విద్యార్థులకు అనుగుణంగా పాఠ్యాంశ ప్రసారాలుంటాయని వివరించారు. పాఠశాలల్లో ప్రత్యక్షంగా పాఠాలు వినలేని విద్యార్థులు ఆన్‌లైన్ పాఠాలు వినేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. పాఠ్యాంశాలు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 29,478 ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 58,98,685 మంది విద్యార్థులు ఈ డిజిటల్ పాఠాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠ్యాంశాల కంటెంట్ టి–సాట్ శాటిలైట్ చానల్ విద్యతో పాటు టి–సాట్ యాప్, యూట్యూబ్‌లోనూ అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సీట్లు పెరిగినా... సీఎస్ఈకే డిమాండ్

జాతీయ కాలేజీల్లో పెరిగిన 2,765 ఇంజనీరింగ్ సీట్లు

- ఎన్ఐటీల్లో కొత్త కంప్యూటర్ కోర్సులు... ఐఐటీల్లో స్వల్పంగా సీట్ల పెంపు
- అన్నిచోట్ల సీఎస్ఈకే విద్యార్థుల మొగ్గు... ఓపెన్ కేటగిరీలో ర్యాంకర్ల మధ్య పోటీ
- ఈశాన్య రాష్ట్రాల్లో పోటీ అంతంత మాత్రమే

సాక్షి, హైదరాబాద్

జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈసారి సీట్లు భారీగా పెరిగాయి. ఇప్పటివరకూ రెండు దశల కౌన్సెలింగ్ చేపట్టారు. వీటిల్లో 59,917 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. గత ఏడాది 57,152 సీట్లు మాత్రమే ఉన్నాయి. దీంతో పోలిస్తే ఈ సంవత్సరం 2,765 సీట్లు పెరిగాయి. ఐఐటీల్లో స్వల్పంగా సీట్లు పెరిగితే, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ప్రభుత్వ నిధులతో నడిచే జాతీయ కాలేజీల్లో కొత్త కోర్సులను చేర్చారు. వీటిల్లోనూ ఎక్కువగా కంప్యూటర్ సైన్స్ కోర్సులే ఉన్నాయి. మరికొన్ని కోర్సులకు అనుమతి రావాల్సి ఉంది. కొన్ని జాతీయ కాలేజీల్లో కొత్త కోర్సులతో ప్రత్యేక సెక్షన్లు ఏర్పాటు చేసే వీలుంది. దీంతో ఆఖరి దశ కౌన్సెలింగ్ నాటికి మరికొన్ని సీట్లు అందుబాటులోకి వచ్చే వీలుంది. దీనిపై త్వరగా నిర్ణయం వెల్లడించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒకవైపు సీట్లు పెరిగినా... ప్రధాన కాలేజీల్లో డిమాండ్ మాత్రం తగ్గలేదు. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోసం అన్ని ప్రాంతాల్లోనూ విద్యార్థులు పోటీ పడుతున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సంపాదించిన వారి మధ్య కూడా ఈసారి పోటీ కన్పిస్తోంది.



జాతీయ స్థాయిలో డిమాండ్

జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో,కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ)కు భారీగా డిమాండ్ కన్పిస్తోంది. జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్‌లో ఇది స్పష్టంగా కన్పిస్తోంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ఎక్కువ మంది సీఎస్ఈకే దరఖాస్తు చేశారు. గత ఏడాది కన్నా కటాఫ్ పెరిగినప్పటికీ టాప్ కాలేజీల్లో పోటీ మాత్రం ఈసారి కాస్త ఎక్కువగానే కనిపిస్తోంది. వాస్తవానికి దేశంలోని 23 ఐఐటీల్లో గత ఏడాది 17,385 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, ఈ సంవత్సరం 17,740 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. జాతీయ కాలేజీల్లోనూ ఈసారి కొన్ని కొత్త కోర్సులను ప్రవేశ పెడుతున్నారు. వీటిల్లో కొన్నింటికి అనుమతులు రాగా.. మరికొన్నింటికి రావాల్సి ఉంది. ఆఖరి దశ కౌన్సెలింగ్ వరకూ ఎన్ఐటీల్లో సీట్లు పెరిగే వీలుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం 121 విద్యాసంస్థల్లో ఈ ఏడాది 59,917 సీట్లు భర్తీ చేయబోతున్నారు. ఇప్పటికే రెండు దశల కౌన్సెలింగ్ పూర్తికాగా, మరో మూడు దశలు ఉంది.

ప్రధాన ఐఐటీల్లో ఓపెన్ కేటగిరీలో సీఎస్ఈలో సీట్లు వచ్చిన గరిష్ట ర్యాంకులు

ఐఐటీ	సీట్లు వచ్చిన బాలురు	ర్యాంకులు బాలికలు
భువనేశ్వర్	3454	7457
బాంబే	68	421
ఢిల్లీ	116	556
ఖరగ్‌పూర్	414	1579
హైదరాబాద్	652	1809
మద్రాస్	159	757
గువాహటి	612	2095
పాలక్కాడ్	5556	9127
తిరుపతి	4522	6324
ఎన్ఐటీలు		
జలంధర్	16090	19732
అలహాబాద్	5787	9060
అగర్తలా	18974	32956
ఢిల్లీ	10950	16763
మేఘాలయ	31545	198857
మిజోరం	548303	544345
రూర్కెల	2824	4593
ఏపీ	14707	16697

టాప్ కాలేజీల్లోనూ...



దేశంలోని ప్రధాన ఐఐటీలు, ఎన్ఐటీల్లో కంప్యూటర్ సైన్స్‌కు పోటీ ఎక్కువగా ఉంది. అయితే, దూర ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లోని జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో పెద్దగా పోటీ కన్పించలేదు. ఈ ప్రాంతాల్లో లక్షల్లో ర్యాంకులు వచ్చిన వాళ్లకూ సీట్లు దక్కుతున్నాయి. తిరుపతి ఐఐటీలో సీట్లు ఈసారి 244 నుంచి 254కు పెరిగాయి. అయితే, సీఎస్ఈ ఓపెన్ కేటగిరీలో బాలురకు 4,522, బాలికలకు 6,324 ర్యాంకు వరకే సీట్లు వచ్చాయి. ఈసారి ఇక్కడ నాలుగేళ్ల ఇంజనీరింగ్ ఫిజిక్స్ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. అయినప్పటికీ సీఎస్ఈ వైపే పోటీ కన్పించింది. వరంగల్ ఎన్ఐటీలో కూడా సీట్లు 989 నుంచి 1049కు పెరిగాయి. ఇక్కడ 60 సీట్లతో ఏఐ అండ్ డేటా సైన్స్ కోర్సును ప్రవేశ పెట్టారు. అయితే, సీఎస్ఈకి ఇక్కడ బాలురకు ఓపెన్ కేటగిరీలో 201, బాలికలకు 3,527 ర్యాంకు వరకే సీట్లు వచ్చాయి. ఐఐటీ గాంధీనగర్‌లో 288 నుంచి 370కు గత ఏడాదే పెంచారు. ఈసారి కొత్తగా 30 సీట్లు అదనంగా ఇచ్చారు. ఇక్కడ కూడా 90 శాతం మంది సీఎస్ఈకే దరఖాస్తు చేశారు. ఐఐటీ బాంబే 1,358 నుంచి 1,368కి, ధార్వాడ్‌లో 310 నుంచి 385కు, భిలాయ్‌లో 243 నుంచి 283కు, భువనేశ్వర్‌లో 476 నుంచి 496కు, ఖరగ్‌పూర్‌లో 1,869 నుంచి 1,889కి, జోథ్‌పూర్‌లో 550 నుంచి 600కు, పట్నాలో 733 నుంచి 817కు, గువాహటిలో 952 నుంచి 962కు సీట్లు పెరిగాయి. ఈ పెరిగిన సీట్లతో పోలిస్తే సీఎస్‌సీ కోసం పోటీ పడిన విద్యార్థుల సంఖ్య రెట్టింపు కన్పిస్తోంది.

జాతీయ ఇంజనీరింగ్ సంస్థల్లో సీట్లు ఇలా...

సంస్థ	2022	2023	2024
ఐఐటీలు	16,598	17,385	17,740
ఎన్ఐటీలు	23,94	17,385	17,740
ట్రిపుల్ ఐటీలు	7,126	7,746	8,546
కేంద్ర నిధులతో			
నడిచే సంస్థలు	6,759	8,067	9,402
మొత్తం సీట్లు	54,477	57,152	59,917

సీఎం ఇంటికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



సాక్షి, హైదరాబాద్: భాగ్యనగర పర్యటనకు వచ్చిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి చేరుకొని ఆయనతో సమావేశమయ్యారు. తన ఆహ్వానం మేరకు ఇంటికి వచ్చిన కేంద్ర మంత్రికి రేవంత్ ఘన స్వాగతం పలికారు. ఈ భేటీలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

స్మార్ట్ సిటీ మిషన్ గడువు పెంపు

- వివిధ రాష్ట్రాల్లోని నగరాల్లో పూర్తికాని స్మార్ట్ సిటీల పనులు
- విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: స్మార్ట్ సిటీ మిషన్ గడువును వచ్చే ఏడాది మార్చి వరకు పొడిగించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఆమోదించి, నిధులు కేటాయించిన పనులను కొనసాగించాలని రాష్ట్రాలకు సూచించింది. అయితే కొత్త పనుల మంజూరు ఉండదని స్పష్టం చేసింది. జరుగుతున్న పనులకు సంబంధించిన నిధులను ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఫస్ట్ కమ్ ఫస్ట్ పద్ధతిన విడుదల చేస్తామని.. అందువల్ల వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితోపాటు వివిధ రాష్ట్రాలు చేసిన విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించింది.

ఈ నెలాఖరులోనే గడువు ముగుస్తుండటంతో

నిజానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం.. స్మార్ట్ సిటీ మిషన్ కాలపరిమితి ఈ నెలాఖరుతో ముగియాల్సి ఉంది. ఆ మిషన్ కింద రాష్ట్రంలోని వరంగల్, కరీంనగర్‌నగరాల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టారు. వరంగల్‌లో ఇప్పటి వరకు 45 పనులు పూర్తికాగా.. రూ.518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయి. కరీంనగర్‌లో 25 పనులు పూర్తవగా.. రూ.287 కోట్లతో చేపట్టిన 22 పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్.. గత నెల 24న కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిశారు. స్మార్ట్ సిటీ మిషన్ కాలపరిమితిని వచ్చే ఏడాది జూన్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. తాజాగా కేంద్రం 2025 మార్చి 31 వరకు పొడిగిస్తూ శనివారం రాష్ట్రాలకు లేఖ రాసింది.

విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా టీచర్లు

బదిలీల్లో సర్కార్ సరికొత్త నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి అవసరమైన కసరత్తు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ క్రమంలో గతంలో తీసుకున్న నిర్ణయాల్లో పలుమార్పులు చేస్తున్నారు. గతంలో 0–19 వరకు విద్యార్థులున్న పాఠశాలకు ఒకరు, 20 నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఇద్దరు, 61 నుంచి 90 వరకు విద్యార్థులున్న పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేలా 2015, 2021లో జీఓలు జారీ చేశారు. ఇప్పుడు దీనిని మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1–10 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒకటి, 11 నుంచి 40 వరకు విద్యార్థులున్న పాఠశాలకు రెండు, 41 నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకు మూడు, 61పైన విద్యార్థులున్న పాఠశాలకు, అక్కడ మంజూరైన అన్ని పోస్టులు భర్తీ చేసేలా వెబ్ ఆప్షన్ల కేటాయింపు ఇవ్వాలని నిర్ణయించారు. ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించలేదు. ప్రస్తుతమున్న విద్యార్థులకన్నా ఎక్కువమంది విద్యార్థులు పాఠశాలలో చేరితే పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపు చేపట్టాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.



జనసంద్రానికి దూరంగా.. జల సంద్రం మధ్య..

ప్రపంచంలో మనుషులు నివసించే ప్రాంతాల్లో అత్యంత దూరంగా ఉన్న దీవి 'ట్రిస్టాన్ ద కున్హా'. అటు దక్షిణ అమెరికా ఖండానికి, ఇటు ఆఫ్రికా ఖండానికి దాదాపు మధ్యలో ఉండే దీవి ఇది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ల్యాండ్‌శాట్ ఉపగ్రహం ఇటీవల ఈ దీవిని ఫొటో తీసింది. నాసా తమ ఇన్‌స్టాగామ్ అకౌంట్లో ఈ ఫొటోను పోస్ట్ చేసింది. 207 చదరపు కిలోమీటర్ల వైశాల్యమున్న ఈ దీవిలో చాలా భాగం పెద్ద పర్వతమే. దాని శిఖరమంతా మంచుతో కప్పబడి ఉంటుంది. మిగతా దీవి అంతా పచ్చదనంతో నిండి ఉంటుంది. ఇక్కడ జనాభా 300 మంది లోపే. దీనికి దగ్గరగా కొన్ని దీవులున్నా.. అవేవీ మనుషులు నివసిస్తున్న ప్రాంతాలు కాదు. ట్రిస్టాన్ దీవికి మనుషులు నివసించే దగ్గరి ప్రాంతం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్. దాని దూరం 2,787 కిలోమీటర్లు. అందుకే ప్రపంచంలోనే అత్యంత దూర ప్రాంతంగా ట్రిస్టాన్‌ను చెబుతారు.

- సాక్షి సెంట్రల్ డెస్క్

సోషల్ మీడియాకు ఒక ప్లాట్‌ఫామ్ ఏర్పాటుపై ఆలోచిస్తాం

- టెక్నాలజీ, సోషల్‌మీడియా వంటి వాటిని సక్రమంగా వినియోగించాలి : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో నిర్వహించిన సోషల్‌వుడ్–2024 సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం: సోషల్ మీడియాకు ఒక ప్రత్యేక ప్లాట్‌ఫామ్ ఏర్పాటుపై ఆలోచిస్తామని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ఆదివారం ది సోషల్ వుడ్–2024 సమ్మిట్‌ను ఎండ్ నౌ ఫౌండేషన్ నిర్వాహకుడు అనిల్ రాచమల్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ వినూత్న ఆవిష్కరణల కోసం ఏర్పాటు చేసిన టీహబ్, వీహబ్, టీవర్క్స్ తరహాలో సోషల్‌వుడ్ హబ్ తరహాలో ఒక దానిని ఏర్పాటు చేసే విషయంలో సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. ప్రస్తుత సమాజాన్ని ప్రభావితం చేయడంలో సోషల్ మీడియా పాత్ర ఎంతో ఉందన్నారు. సెల్‌ఫోన్లు, టెక్నాలజీ, సోషల్ మీడియాను సక్రమమైన మార్గంలో వినియోగించి సమాజానికి అవసరమైన రీతిలో పనిచేసేలా చూడాలని చెప్పారు. ఇటీవలి కాలంలో సైబర్ క్రైమ్స్ విపరీతంగా పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడానికి అందరూ సహకరించాలన్నారు. టెక్నాలజీలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో కూడా అనేక సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం కలుగుతోందని తెలిపారు. హైదరాబాద్ అన్ని రకాలుగా ఒక కేంద్రంగా మారిపోతోందని, దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రగతిని చూసి అమెరికా, ఇంగ్లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లిన మనవారు తిరిగి హైదరాబాద్ వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు. అనంతరం సైబర్ సెక్యూరిటీ అవార్డులు, సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్ అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత దిల్‌రాజు, టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు, విజయభాస్కర్, కృష్ణ, అశ్విన్‌వీరరాజు, వివిధ రాష్ట్రాలకు చెందిన సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్స్ పాల్గొన్నారు.



ఇంటి స్థలం చదరపు మీటర్‌కు 8 రూపాయలే..

భూములు, స్థలాల విలువలు అడ్డగోలుగా పెరిగిపోయాయి. కనీసం వంద గజాల ఇంటి స్థలం కొనాలన్నా.. లక్షలకు లక్షలు కావాల్సిందే. కానీ ఒక చోట మాత్రం ఇంటి స్థలాన్ని చదరపు మీటర్‌కు ఎనిమిది రూపాయల లోపు ధరకే అమ్ముతున్నారు. అంటే రూ.800 పెడితే చాలు.. ఇంటి స్థలం వచ్చేస్తుందన్న మాట. కాకపోతే అలా కొనుక్కోవడానికి మనం స్వీడన్ దాకా వెళ్లాల్సి వస్తుంది మరి. స్వీడన్‌లోని గోటెన్ నగర అధికారులు ఇలా ఇళ్ల స్థలాలను అమ్మకానికి పెట్టారు. స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌కు 321 కిలోమీటర్ల దూరంలో ఈ సిటీ ఉంటుంది.

పాపులేషన్ తగ్గడం, ఆర్థిక సమస్యలతో..

స్వీడన్‌లోని రూరల్ ప్రాంతమైన గోటెన్ సిటీలో సుమారు 13 వేల మంది నివసిస్తుంటారు. ఇటీవల అక్కడ పాపులేషన్ తగ్గడానికి తోడు సిటీకి కాస్త ఆర్థిక సమస్యలు మొదలయ్యాయి. దీనితో హౌజింగ్ మార్కెట్‌కు డిమాండ్ పెంచడం కోసం అతి తక్కువ ధరకే ఇళ్ల స్థలా లను అమ్మకానికి పెట్టినట్టు గోటెన్ సిటీ మేయర్ జోహన్ మాన్సన్ ప్రకటించారు. ఒక చదరపు మీటరుకు ఒక క్రోనా రేటుతో.. మన కరెన్సీలో రూ.7.86 రేటుతో 29 ప్లాట్లను విక్రయించనున్నట్టు తెలిపారు.

నిర్మానుష్యంగా శాపల్లి గ్రామ వీధులు



రోజంతా ఊరికి దూరంగా..

గ్రామానికి కీడు వచ్చిందని..

నార్కట్‌పల్లి: వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో గ్రామానికి కీడు వచ్చిందేమోనని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం శాపల్లి గ్రామ పెద్దలు ఒక్కరోజు మొత్తం గ్రామంలో ఎవరూ పొయ్యి ముట్టించరాదని నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం గ్రామస్తులంతా ఊరికి దూరంగా తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి.. అక్కడే వండుకొని సాయంత్రం గ్రామానికి చేరుకున్నారు. సాయంత్రం ఇంటికి వచ్చాక ఇతర పనులు చేసుకున్నారు.

25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలి

- ప్రిపరేషన్‌కు అభ్యర్థులకు మూడు నెలలు గడువివ్వాలి: ఆర్.కృష్ణయ్య



ఇందిరాపార్కు వద్ద జరిగిన నిరుద్యోగుల ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణయ్య

కవాడిగూడ (హైదరాబాద్): 25 వేల పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీని ప్రకటించి ప్రిపరేషన్‌కోసం అభ్యర్థులకు మూడు నెలల గడువు ఇవ్వాలని, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 25 శాతం మాత్రమే ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసి మిగతా 75 శాతం పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఈడీ అభ్యర్థులకు ఎస్జీటీ పోస్టులకు అర్హత లేకుండా చేయడం వల్ల వారికి అన్యాయం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో బీసీ యువజన సంఘం అధ్యక్షుడు, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ అధ్యక్షతన నిరుద్యోగుల భారీ ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ, ప్రస్తుతం 11వేల టీచర్ పోస్టులకు డీఎస్సీ ప్రకటించాలని, టీచర్ పోస్టుల ఖాళీల విషయంలో నిరుద్యోగ సంఘాలు ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి పీఆర్‌సీ కమిటీ రిపోర్టు ప్రకారం పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 22వేల స్పెషల్ టీచర్ల నియామకానికి ఆర్థిక శాఖ ఐదు నెలల క్రితమే ఆమోదం తెలిపిందని, వాటి నియామకానికి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. టీచర్ పోస్టులను గత పదేళ్లుగా భర్తీ చేయకపోవడంతో 16 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్, గణితం, సైన్స్ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరిపి సరైన ఖాళీలను గుర్తించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను, ఉధృతం చేస్తామని కృష్ణయ్య హెచ్చరించారు.

గూడూరులో అరుదైన జైన పద్మావతి శిల్పాలు



గూడూరులో జైన యక్షిణి పద్మావతిదేవి



పాటిగడ్డ మీద పద్మావతీదేవి విగ్రహం వద్ద రత్నాకర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్ (జనగామ): జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో అరుదైన రాష్ట్ర కూటుల కాలం నాటి రెండు జైన యక్షిణి శిల్పాలను గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ శిల్పాల్లో ఒకటి గ్రామంలో పోచమ్మగుడి చెట్టు కింద 'కోమటోళ్ల బొమ్మలు'అని స్థానికులు పిలిచే శిల్పాలలో ఉందన్నారు. నడుము నుంచి పైభాగం వరకు మానవ స్త్రీ రూపం, దిగువ భాగం మెలితిరిగిన పాము తోకతో ఉందని, ఆభరణాలు మందంగా ఉన్నాయని తెలిపారు. మధ్య నుంచి పుట్టినట్లుగా నడుము భాగంలో పద్మం ఉంది. ముఖ భాగం, చేతులు ధ్వంసమై ఉన్నాయని చెప్పారు. ఇక్కడే చేతిలో ఇమిడే చిన్న పరిమాణంలో ఆసీనుడై ధ్యాన ముద్రలో ఉన్న తీర్థంకర శిల్పం ఉన్నట్లు వివరించారు. మరో శిల్పం పాటిగడ్డ మీద గుర్తించినట్లు చెప్పారు. నల్లని పొడవైన గ్రానైట్ శిలపై నర నాగదేవత రూపంలో ఉందని, తలపై తొమ్మిది పడగల సర్పం గొడుగు పట్టి, రెండు చేతుల్లో తామర మొగ్గలు ఉన్నట్లు పేర్కొన్నారు. మనకు కనిపించే నాగదేవత విగ్రహాలన్నీ ఒకటి కాదు..అందులో జైనయక్షిణి పద్మావతిదేవి శిల్పాలు ఉంటాయని చెప్పారు. 'పద్మావతి అనేది సంస్కృత పేరు. దీని అర్థం కమలం నుంచి ఉద్భవించినది. ఈమె ఒక యక్షిణి. అపూరూపమైన సౌందర్యం ఆమె సొంతం. 23వ తీర్థాంకరుడైన పార్శ్వనాథుడి శాసన దేవత'అని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.